www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 4

బుధవారం | 3-4-2024

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: నవమి రా. 6.31 తదుపరి దశమి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 9.48 తదుపరి శ్రవణం వర్జ్యం: ఉ. 6.29-8.01, రా. 1.32-3.01; దుర్ముహూర్తం: ఉ. 11.55-12.43; అమృతఘడియలు: మ. 3.40-5.12; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.12; సూర్యాస్తమయం: 6.26

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



కేసీఆర్‌ను చూస్తే జాలేస్తోంది

అధికారం పోయింది, కూతురు జైలుకు పోయింది

ఎన్నికలు ఉన్నందునే రైతులపై కపట ప్రేమ.. లేకపోతే బయటకు వచ్చే వారే కాదు

మీ పాపాలకు భయపడే నాడు వరుణుడు పారిపోయాడు.. అందుకే కరువు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మమ్మల్ని నిర్బంధించారు.. కానీ, మేం కేసీఆర్ పర్యటనకు ఏర్పాట్లు చేశాం

జూన్ 9న ఢిల్లీ రాంలీలా మైదానంలో ఇండియా కూటమి ప్రమాణ స్వీకారం

తుక్కుగూడ సభలో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల.. సీఎం రేవంత్ వెల్లడి.. సభ ఏర్పాట్ల పరిశీలన

రంగారెడ్డి అర్బన్, మహేశ్వరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయినందుకు, కవిత జైలుకు పోయినందుకు కేసీఆర్‌ను చూస్తుంటే జాలేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసమే కేసీఆర్ రైతులపై కపట ప్రేమ చూపుతూ నక్కజిత్తుల వేషాలు వేస్తున్నారని విమర్శించారు. పొగ పెట్టగానే కలుగులోంచి ఎలుకలు బయటకు వచ్చినట్లు... ఎన్నికలు అనే పొగ పెట్టడంతో కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి బయటకు వచ్చాడని ఎద్దేవా చేశారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఈ నెల 6న భారీ ఎత్తున నిర్వహించనున్న కాంగ్రెస్ బహిరంగసభ

మిగతా 13వ పేజీలో...

ఫోన్ ట్యాపింగ్‌తో..



కారు సీట్లకే ఎసరు?

ప్రత్యర్థుల కదలికలు, సంభాషణలపై పోలీసులతో బీఆర్ఎస్ పార్టీ నిఘా



టాస్క్‌ఫోర్స్ వాహనాల్లో డబ్బు తరలింపు

పోలీసుల రిమాండ్ రిపోర్టులో వెల్లడి

ఈ చర్యలన్నింటితో ఎన్నికల్లో విపక్షాలకు సమానావకాశాలు లేకుండా చేసిన వైనం

అధికార దుర్వినియోగంతో.. గెలిచే కుట్ర

గతంలో ఇలాంటి ఆరోపణలతోనే ఇందిరపై అనర్హత వేటు వేసిన అలహాబాద్ హైకోర్టు

బీఆర్ఎస్ గెలిచినచోట ప్రత్యర్థులు కోర్టును ఆశ్రయిస్తే అదే తరహా తీర్పులు వచ్చే చాన్స్!

పలువురు రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం

చట్టవిరుద్ధంగా విపక్ష నేతల ఫోన్ ట్యాపింగ్.. తద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా వారి కదలికలపై నిఘా పెట్టడం, వారి ఆర్థికమూలాలపై దాడి చేయడం(ఇల్లీగల్ ప్రాక్టీసెస్).. ఎన్నికల్లో గెలుపు కోసం అధికార యంత్రాంగాన్ని వాడుకోవడం, సొంతపార్టీ నేతల నగదు రవాణాకు టాస్క్‌ఫోర్స్ వాహనాలను వినియోగించడం (కరప్ట్ ప్రాక్టీసెస్).. ఎన్నికల్లో ప్రత్యర్థులకు సమానావకాశాలు లేకుండా చేయడం..

..2014 నుంచి రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ చేసిన నిర్వాకాలివి. ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు సాక్షాత్తూ కోర్టుకు సమర్పించిన పత్రాల్లో పేర్కొన్న వివరాలు. ఇవన్నీ చేసింది దేనికి? ఎన్నికల్లో గెలవడానికి. అధికారం చేజిక్కించుకోవడానికి. కానీ.. ఇంత చేసినా వచ్చింది 39 సీట్లు. గెలిచినవారిలో ఇద్దరు ఇప్పటికే పార్టీ ఫిరాయించారు. ఒక ఎమ్మెల్యే చనిపోయారు. మిగిలినవి 36 సీట్లు. ఇప్పుడు ఫోన్ ట్యాపింగ్ కేసులో బయటపడుతున్న వాస్తవాల ఆధారంగా.. ఆయా సీట్లలో ఓడిపోయిన అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం చాలా మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఎన్నికే చెల్లకుండా పోయే అవకాశం ఉందని రాజకీయ, న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో అక్రమాలు అంటే.. కేవలం ఓటర్లకు డబ్బులు పంచడం, ప్రలోభాలకు గురిచేయడం, రిగ్గింగ్ వంటివే కాదు! అధికార దుర్వినియోగమూ దానికిందికే వస్తుంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా.. అధికారులను ప్రభావితం చేసి ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేయడం, మళ్లీ గెలిచేందుకు అధికారయంత్రాంగాన్ని ఇష్టం వచ్చినట్టు వాడుకోవడం.. ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘించడమే. రాష్ట్రంలో గత ఎన్నికలకు ముందు.. అంతకన్నా ముందు దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికల సమయంలో.. జరిగింది ఇదేనని ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో తాజాగా బయటపడిన

మిగతా 14వ పేజీలో...

ఫోన్ ట్యాపింగ్ గుట్టు..
ప్రభాకర్‌రావుకే ఎరుక!

ఆయన శాసిస్తే.. పాటించామన్న నిందితులు

ప్రభాకర్‌రావును శాసించిందెవరు??

ఆయన వాంగ్మూలమే అత్యంత కీలకం

ముగిసిన భుజంగరావు, తిరుపతన్న కస్టడీ

రాధాకిషన్‌రావు కస్టడీపై తీర్పు నేటికి వాయిదా

14



లీగల్ నోటీసులు పంపిస్తా!

నాపై సిగ్గులేని, నిరాధార ఆరోపణలు చేస్తున్నారు

క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు

మంత్రి కొండా సురేఖ, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కేకే మహేందర్‌రెడ్డికి కేటీఆర్ హెచ్చరిక

నిజానిజాలు తెలుసుకోని మీడియా సంస్థలకూ నోటీసులు పంపుతానని వెల్లడి

12

కేటీఆర్‌కు భయమెందుకు?

ఫోన్‌ట్యాపింగ్‌లో ఆయన ప్రమేయమే లేకపోతే అంత కలవరం దేనికి?

నోటీసులిస్తే జవాబిచ్చేందుకు సిద్ధం

జైలులో ఉన్న కవిత రుద్రాక్షమాల కావాలని అడుగుతున్నారు

పదేళ్లలో ఆమె మెడలో తాళి బొట్టు ఎన్నడూ చూడలేదు

జైలుకు వెళ్లాక తాళి గుర్తుకొచ్చిందా?

12

మంత్రి కొండా సురేఖ విమర్శలు

అసలు మీకు పరువు ఉందా?

ట్యాపింగ్ దేశద్రోహం.. పోలీసులను ప్రైవేటు సైన్యంలా మార్చుకున్నారు

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

బీజాపూర్ అడవుల్లో
ఎన్‌కౌంటర్

11 మంది మావోయిస్టుల మృతి

మృతుల్లో ఒకరు మహిళా నక్సల్

ఘటనా స్థలంలో అధునాతన మెషీన్‌గన్

20 రోజుల వ్యవధిలో నాలుగో ఎన్‌కౌంటర్

సుకుమా, బీజాపూర్ బంద్‌కు నక్సల్స్ పిలుపు

చర్ల/చింతూరు, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల వేళ కాల్పుల మోతతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ దద్దరిల్లింది. బస్తర్ డివిజన్ గంగలూరు, లేంద్ర అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళానక్సల్ సహా.. 11 మంది మావోయిస్టులు మృతిచెందారు. ఘటనాస్థలంలో నక్సల్స్ అధునాతన ఆయుధాలు, కిట్ బ్యాగులను సీజ్ చేసినట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. ఈ నెల 19న తొలిదశ లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న బస్తర్‌లో మావోయిస్టుల అలజడితో.. భద్రత బలగాలు అప్రమత్తమయ్యాయి. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి బస్తర్‌లో అలజడి తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. మంగళవారం నాటి ఘటనతో కలుపుకొని.. గడిచిన 20 రోజుల వ్యవధిలో వేర్వేరు చోట్ల జరిగిన ఎన్‌కౌంటర్లలో 21 మంది నక్సల్స్ మృతిచెందారు. గడ్చిరోలి జిల్లాలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ మావోయిస్టు పార్టీకి చెందిన

మిగతా 2వ పేజీలో...



తవ్వి వెలికి తీసిన బూడిద వాగు పైపులైన్ పైపులు



ప్లాంటులో భూమి లోపల తవ్వకాలు చేస్తున్న దృశ్యం

100 కోట్లు హాంఫట్!

తుక్కు పేరిట తినేశారు

కేటీపీఎస్‌లోని పాత విద్యుత్తు ప్లాంట్ల తొలగింపు పనుల్లో భారీ కుంభకోణం

నిబంధనలు పట్టించుకోని అధికారులు.. టెండరు పొందిన సంస్థదే ఇష్టారాజ్యం

8 కిలోమీటర్ల మేర పైపు లైన్లు మాయం.. విలువైన కేబుళ్లను తరలించేసిన సంస్థ

కీలక అధికారికి రూ.15కోట్లు ముడుపులు.. ఇందులో మరో నలుగురు అధికారుల పాత్ర

2030దాకా పాత ప్లాంట్లను కూల్చొద్దని కేంద్రం ఆదేశించినా హడావుడిగా ఉత్తర్వులు

హైదరాబాద్/కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన విద్యుత్తు ప్లాంట్లను మూసేయాలన్న కేంద్రం ఆదేశాలు.. అక్రమార్కులకు వరంగా మారాయి. తుక్కు కింద ఏకంగా రూ.100కోట్లకుపైగా చేతులు మారగా.. ఓ కీలక అధికారికి రూ.15కోట్లదాకా ముట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో సదరు అధికారితోపాటు మరో నలుగురు కీలక పాత్ర పోషించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్(కేటీపీఎస్)లో

మిగతా 12వ పేజీలో...

కర్షకులకు
తీన్‌మార్

ఖరీఫ్ సీజన్‌లో రైతు భరోసా, పంటల బీమా, వరికి రూ. 500 బోనస్

3 పథకాలకు వానాకాలం పంట నుంచే శ్రీకారం

విధివిధానాలపై కసరత్తు చేస్తున్న వ్యవసాయ శాఖ

'కోడ్' ముగియగానే పట్టాలెక్కనున్న పథకాలు




హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలకు తీన్‌మార్ తీపి కబురు అందనుంది. రైతులకు భరోసాగా ఉండేందుకు కాంగ్రెస్ ప్రకటించిన మూడు కీలక హామీలను వానా కాలం నుంచి అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. ఇందులో భాగంగా రైతు భరోసా, పంటల బీమా, వరికి రూ.500 బోనస్ పథకాలను జూన్ నుంచి ప్రారంభించాలని సర్కారు భావిస్తోంది. ఇందుకు

మిగతా 13వ పేజీలో...

బిల్లుల మంజూరు కోసం
'బీ' ట్యాక్స్

- 8-9 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు
- ధరణి పోర్టల్‌లో 2 లక్షల కోట్ల కుంభకోణం
- ఈ అంశాన్ని నీరుగార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నం
- కేసీఆర్, కేటీఆర్‌ను రక్షిస్తున్నదెవరో సీఎం చెప్పాలి
- బీజేపీ నేత మహేశ్వర్‌రెడ్డి

12



నా అనుకున్న వాళ్లను
నాశనం చేశాడు!

చిన్నాన్నను చంపినవాళ్లకే ఎంపీ టికెట్ ఇచ్చాడు

3

హత్యను రాజకీయానికి వాడుకున్నారు.. జగన్‌పై షర్మిల ఫైర్

చిన్నాన్నకే న్యాయం జరగలేదు.. ఇక ప్రజలకు ఏం జరుగుతుంది?

అప్పుడు చెల్లి కాదు, బిడ్డవన్నాడు.. సీఎం అయ్యాక మారాడు

హంతకుడు, హత్య చేయించిన వాళ్లు చట్టసభల్లోకి వెళ్లకూడదు

అందుకే కడప నుంచి పోటీచేస్తున్నానన్న ఏపీసీసీ అధ్యక్షురాలు

ఏపీలో 5 లోక్‌సభ, 114 అసెంబ్లీ అభ్యర్థులతో కాంగ్రెస్ జాబితా

వివేకాను హత్య చేసిన వాళ్లకు ఈరోజు వరకు శిక్ష పడలేదు. హత్య చేసిన వాళ్లు, చేయించిన వాళ్లు తప్పించుకుని తిరుగుతూనే ఉన్నారు. అన్ని సాక్ష్యాలూ ఉన్నా, ఎన్ని వాంగ్మూలాలు ఉన్నా.. జగన్ వారిని రక్షించడమే కాకుండా అవినాశ్‌రెడ్డికే టికెట్ ఇవ్వడం తట్టుకోలేకపోయా. నేను ఎంపీగా నిలబడాలన్నదే చిన్నాన్న చివరి కోరిక. ఆయన ఆరోజు ఎందుకు అంతగా అడిగారో అర్థం కాలేదు. ఇప్పుడు అర్థమవుతోంది.

\- వైఎస్ షర్మిల

జగనన్నా.. ఎందుకు భయం?

అవినాశ్‌రెడ్డిని ఎందుకు కాపాడుతున్నారు?

ముఖ్యమంత్రిగానైనా నా ప్రశ్నలకు బదులివ్వాలి

జగన్ చానల్‌లో చర్చకూ రెడీ

వివేకా కుమార్తె సునీత

3



ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతున్న ఆతిశీ

త్వరలో నలుగురి అరెస్టు!

నాతో పాటు మంత్రి సౌరభ్, ఎమ్మెల్యే దుర్గేశ్, ఎంపీ రాఘవ్ చద్దాను అదుపులోకి తీసుకునే చాన్స్

ఆప్ మంత్రి ఆతిశీ సంచలన వ్యాఖ్యలు

2

కరడుగట్టిన నేరగాళ్ల మధ్య కేజ్రీ

పక్క సెల్‌లో చోటా రాజన్, ముజాహిదీన్ ఉగ్రవాది రహ్మాన్

తిహాడ్ జైల్లో సెల్‌లోనే ఢిల్లీ ముఖ్యమంత్రి ధ్యానం, యోగా

రోజుకు 5 నిమిషాలు ఫోన్లో మాట్లాడేందుకు అవకాశం

పడిపోయిన కేజ్రీవాల్ షుగర్ లెవల్స్

ఇంటి నుంచి మధ్యాహ్నం, రాత్రి భోజనాలకు అనుమతి

కల్వకుంట్ల కన్నారావు అరెస్టు



పోలీసుల అదుపులో కన్నారావు

భూ వివాదంలో జోక్యం.. నెల రోజులుగా పరారీ

ఢిల్లీ, బెంగళూరుల్లో మకాం.. మధ్యలో మాల్దీవ్స్ ట్రిప్

అరెస్టు చేయలేదు.. నేనే లొంగిపోయా: కన్నారావు

14

గజ్వేల్‌లో హరీశ్‌ను అడ్డుకున్న
'డబుల్' లబ్ధిదారులు



ఇళ్ల సర్టిఫికెట్లు ఇప్పించాలంటూ ఆందోళన

హాల్‌లో బీఆర్ఎస్ మీటింగ్.. గేట్లు మూసివేత

ఏడాది క్రితం వీరంతా లక్కీడ్రా ద్వారా ఎంపిక

లబ్ధిదారులతో కలిసి ఆర్డీవో ఆఫీసుకు హరీశ్

వారంలోగా సర్టిఫికెట్లు ఇవ్వాలని డిమాండ్

12

21 వేల కోట్లు దాటిన రక్షణ ఎగుమతులు

» భారత చరిత్రలో ఇదే తొలిసారి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: భారత రక్షణ రంగ ఎగుమతులు దేశ చరిత్రలోనే తొలిసారిగా రూ.21వేల కోట్ల మార్కుని దాటేశాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ.21,083 కోట్లకు పెరిగాయి. గత ఆర్థిక సంవత్సరం (రూ.15,920 కోట్లు)తో పోలిస్తే ఇది 32.5 శాతం అధికం కావడం విశేషం. 2013-24 ఆర్థిక సంవత్సరం నుంచి పరిశీలిస్తే ఈ దశాబ్ద కాలంలో రక్షణ రంగ ఎగుమతులు 31 రెట్ల వృద్ధిని సాధించాయి. రక్షణ రంగ ఎగుమతుల్లో గణనీయ పెరుగుదల పట్ల రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. "భారత రక్షణ రంగ ఎగుమతులు గొప్ప వృద్ధిని నమోదు చేశాయి. స్వతంత్ర్య భారత చరిత్రలో తొలిసారిగా రూ.21 వేల కోట్ల మార్కును దాటాయని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను" అని రాజ్‌నాథ్ ఎక్స్ (ట్విటర్)లో ట్వీట్ చేశారు.

ఎన్నికల బాండ్లను నగదుగా ఎలా మార్చుకోవాలి?

» ఆర్టీఐలో దరఖాస్తు.. వెల్లడించబోమన్న ఎస్‌బీఐ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: ఎన్నికల బాండ్ల విక్రయాలు, వాటిని నగదుగా మార్చుకోవడానికి సంబంధించిన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని (ఎస్‌వోపీ) వెల్లడించబోమని ఎస్‌బీఐ స్పష్టం చేసింది. బాండ్ల విక్రయాలకు సంబంధించిన ఎస్‌వోపీని వెల్లడించాలంటూ సామాజిక కార్యకర్త అంజలి భరద్వాజ్ ఆర్టీఐ చట్టం కింద దరఖాస్తు చేశారు. ఎన్నికల బాండ్ల విక్రయాలు, వాటిని నగదుగా మార్చుకోవడం కోసం తమ అధీకృత శాఖలకు ఎస్‌బీఐ జారీ చేసిన ఎస్‌వోపీ వివరాలను తెలియజేయాలని కోరారు. అయితే, ఎస్‌వోపీ వివరాలను వెల్లడించేందుకు ఎస్‌బీఐ నిరాకరించింది. "అది మా అంతర్గత మార్గదర్శకాల కిందకు వస్తుంది. వాణిజ్య, వ్యాపార రహస్యాలు, మేధోపరమైన సంపదకు సంబంధించిన సమాచారాన్ని వెల్లడించకుండా చట్టంలో మినహాయింపులు ఉన్నాయి" అని స్పష్టం చేసింది.

మహువాపై ఈడీ మనీలాండరింగ్ కేసు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు, మాజీ ఎంపీ మహువా మొయిత్రాపై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు బహుమతులు తీసుకున్నారన్న ఆరోపణలు ఇప్పటికే ఆమెపై ఉండగా, ప్రస్తుతం ఆ వ్యవహారంలో నగదు అక్రమ చలామణికి పాల్పడ్డారంటూ కేసు పెట్టింది. విదేశీ మారక ద్రవ్య నియంత్రణ చట్టాన్ని ఉల్లంఘించినట్టు ఆరోపించింది. వీటిపై విచారణ నిమిత్తం ఢిల్లీలోని కార్యాలయానికి రావాలంటూ ఆమెతో పాటు వ్యాపారవేత్త దర్శన్ హీరనందానికి నోటీసులు పంపించింది. ఇప్పటికే దీనిపై సీబీఐ కేసు పెట్టగా దాన్ని ఆధారం చేసుకొని ఈడీ ఈ కేసు పెట్టింది. లోక్‌పాల్ ఆదేశాల మేరకు సీబీఐ ఆమె నివాసాల్లో సోదాలు చేసింది కూడా.

భారత టెకీలపై యూఎస్ వీసా భారం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: అమెరికా వీసా ఫీజులు భారీగా పెరిగాయి. ఐటీ ఉద్యోగాల కోసం అమెరికా వెళ్లాలనుకునే భారతీయులపై ఇది ప్రభావం చూపుతుంది. కొలరాడో జిల్లా కోర్టు జడ్జి షార్లెట్ ఎన్ స్వీనీ మార్చి 29న ఓ కేసులో తీర్పు చెపుతూ 'కొత్త ఫీజుల అమలును అడ్డుకోవద్దు' అంటూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తీర్పు అనంతరం యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ ప్రాసెస్(యూఎస్‌సీఐఎస్) వివిధ రకాల వీసాల ఫీజులను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీ ఉద్యోగులకు కంపెనీలు స్పాన్సర్ చేసే హెచ్ 1బీ వీసా ఫీజు గతంలో 460 యూఎస్ డాలర్లు (రూ.38 వేలు) ఉండేది. ఇప్పుడు అది 780 యూఎస్ డాలర్లకు (రూ.64,000) పెరిగింది. అలాగే దరఖాస్తు ఫీజు 10 యూఎస్‌డీ(రూ.829) నుంచి ఏకంగా 215(రూ.17,000) యూఎస్‌డీలకు పెరిగింది.

గాజాపై ఇజ్రాయెల్ దాడిలో 71 మంది మృతి

» స్వచ్ఛంద సేవలు అందిస్తున్న ఆరుగురు విదేశీయులు కూడా

జెరూసలేం, ఏప్రిల్ 2: గాజాపై మంగళవారం ఇజ్రాయెల్ జరిపిన దాడిలో కనీసం 71 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో స్వచ్ఛంద సేవలు అందిస్తున్న ఆరుగురు విదేశీయులు కూడా ఉన్నారు. ప్రముఖ చెఫ్ జోస్ ఆండ్రెస్ గాజాలో వరల్డ్ సెంట్రల్ కిచెన్ పేరిట ఉచితంగా ఆహారం అందజేస్తున్నారు. ఈ కేంద్రంపైనా ఇజ్రాయెల్ ఆయుధాలతో దాడులు చేసింది. ఇక్కడ పనిచేస్తున్న పాలస్తీనా వ్యక్తితో పాటు, ఆరుగురు.. ఆస్ట్రేలియా, పోలాండ్, అమెరికా, కెనడా, బ్రిటన్ పౌరులు మొత్తం కలిపి ఏడుగురు మరణించినట్టు నిర్వాహకులు వివరించారు. దాంతో తమ సహాయ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. సోమవారం సముద్ర మార్గం ద్వారా అందిన ఆహార పదార్థాలను పింపిణీ చేసే పనిలో ఉండగా దాడి జరిగినట్టు చెప్పారు. దీనిపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ స్పందిస్తూ అనుకోకుండా ఈ దాడి జరిగిందని చెప్పారు. యుద్ధంలో ఇలాంటివి మామూలే అని అన్నారు. దీనిపై విచారణ వ్యక్తం చేసిన ప్రధాని దర్యాప్తు చేయిస్తామని తెలిపారు. గత అయిదు నెలలుగా జరుగుతున్న యద్ధంలో 33వేల మంది మరణించగా, 75 వేల మంది గాయపడ్డారు.

త్వరలో నలుగురి అరెస్టు

» ఆప్ మంత్రి ఆతిశీ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్2: ఆప్ మంత్రి ఆతిశీ మంగళవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. తనతో సహా నలుగురు ఆప్ సీనియర్ నాయకులను నెల రోజుల్లోగా అరెస్టు చేసే అవకాశం ఉందన్నారు. తనతో పాటు మంత్రి సౌరభ్ భరద్వాజ్, ఎమ్మెల్యే దుర్గేశ్ పాథక్, రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దాలను అదుపులోకి తీసుకోవచ్చని ఆమె తెలిపారు. కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా, సత్యేంద్రజైన్ అరెస్టు తర్వాత కూడా ఆప్ ఐక్యంగా ఉండటంతో మిగిలిన బలమైన నేతల్ని అరెస్టు చేసేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం కేజ్రీ కేసు విచారణలో భాగంగా ఈడీ తన పేరును సౌరభ్ పేరును ప్రస్తావించడం ఇందుకు బలాన్నిస్తుందని ఆమె పేర్కొన్నారు. మరోవైపు బీజేపీ నాయకులు ఒక సన్నిహిత వ్యక్తి ద్వారా తనను సంప్రదించి ఆ పార్టీలో చేరాల్సిందిగా కోరారని లేకపోతే అరెస్టుకు సిద్ధంగా ఉండాల్సిందిగా హెచ్చరించారని పేర్కొనారు. కాగా, ఆతిశీ వ్యాఖ్యల్ని బీజేపీ నాయకులు ఖండించారు. తమ పార్టీలో ఆమెకు అసలు చోటులేదని స్పష్టం చేశారు.

కర్ణాటకపై కమలం భారీ ఆశలు

మోదీ మేనియా, రామ మందిరం రక్షణ కవచాలంటున్న కాషాయ దళం

» 28 స్థానాలూ దక్కించుకునే ప్లాన్

» జేడీఎస్‌తో చేతులు కలిపిన బీజేపీ

» సిద్దూ సర్కార్ గ్యారెంటీలతో పుంజుకున్న కాంగ్రెస్ ఓటు బ్యాంక్

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ దక్షిణాదిలో కర్ణాటకపై భారీగా ఆశలు పెట్టుకుంది. 2019లో రాష్ట్రంలో సాధించిన ఘన విజయాన్ని కొనసాగించాలని భావిస్తోంది. గత 2019లో ఆయా దక్షిణాది రాష్ట్రాల్లో 30 సీట్లలో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. వీటిలో 25 ఒక్క కర్ణాటకలోనే దక్కించుకున్నారు. దక్షిణాదిలో బలంగా ఉన్నామని చెప్పుకొనే కాంగ్రెస్ కంటే కూడా బీజేపీ అధిక సంఖ్యలో సీట్లు కైవసం చేసుకుని ఆ పార్టీకి సవాల్ రువ్వింది. ఈ రాష్ట్రంలో 2004 నుంచి 2019 వరకు గడిచిన నాలుగు ఎన్నికల్లోనూ బీజేపీ గణనీయ సంఖ్యలో లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించింది. ప్రస్తుత ఎన్నికల విషయానికి వస్తే కర్ణాటకలో బీజేపీ చాలా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. మాజీ ప్రధాని దేవెగౌడ నేతృత్వంలోని జేడీఎస్‌తో పొత్తు పెట్టుకుంది. తద్వారా ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్రంలో మొత్తం పార్లమెంటు స్థానాలను క్లీన్ స్వీప్ చేయాలని భావిస్తోంది.

గత వికాసం ఇదీ!

2019 సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 28 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ 25 స్థానాల్లో విజయం దక్కించుకోగా, కాంగ్రెస్, జేడీఎస్‌లు ఒక్కో స్థానంలో మాత్రమే గెలిచాయి. బీజేపీ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థి ఒకరు విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 51.4 శాతం ఓటు బ్యాంకును సొంతం చేసుకుంది. కాగా, గతేడాది కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జేడీఎస్‌కు ఘోర పరాభవం ఎదురైంది. పైగా ఈ పార్టీకి చెందిన 5% ఓటు బ్యాంకును కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకోవడం గమనార్హం. ఇదిలా ఉండగా, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్‌తో పొత్తులో భాగంగా 25 స్థానాల్లో పోటీ చేయాలని కమలనాథులు నిర్ణయించారు. మిత్రపక్షం జేడీఎస్.. కోలార్, హస్సన్, మాండ్య.. మూడు స్థానాల్లో బరిలోకి దిగనుంది. ఇక, బీజేపీ ఒక్క చిత్రదుర్గ మినహా 24 స్థానాల్లో తన అభ్యర్థులను ప్రకటించింది. అయితే, ఈ స్థానాల్లో 12 మంది సిట్టింగులకు టికెట్లను నిరాకరించింది. దీంతో టికెట్లు రాని వాళ్లు బీజేపీ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక, జేడీఎస్ నేతలు కూడా బీజేపీతో పొత్తు వ్యవహారంపై అంతర్గతంగా మథన పడుతున్నారు. సీట్ల పంపకాలను ఆలస్యం చేయడంతోపాటు, జేడీఎస్‌కు కంచుకోట వంటి మాండ్య నియోజకవర్గాన్ని నటి సుమలతా అంబరీష్‌కు కేటాయించాలన్న బీజేపీ ప్రతిపాదనపై కూడా కుమారస్వామి వర్గం గుర్రుగా ఉంది.



నేతల మధ్య సఖ్యత ప్రశ్నే!

బీజేపీ-జేడీఎస్‌లు చేతులు కలిపినా.. గత విషయాలను గుర్తు చేసుకుని ఇరు పక్షాల నేతలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. వాస్తవానికి జేడీఎస్‌తో బీజేపీ చేతులు కలపడం వెనుక.. దక్షిణ కర్ణాటక, లేదా పాత మైసూరు ప్రాంతాల్లో బలమైన సామాజిక వర్గంగా ఉన్న వక్కలిగలు తమవైపు మళ్లుతారనే ఆశ ఉంది. కానీ, నేతల మధ్య సఖ్యత కనిపించకపోవడం లేదు.

మైనారిటీలు కాంగ్రెస్ వైపే!

కర్ణాటకలో మైనారిటీలు కాంగ్రెస్ వైపే ఉన్నట్టు స్పష్టమవుతోంది. దీనికి ప్రధాన కారణం.. బీజేపీ అంటే లింగాయతుల పార్టీ అని, అగ్రవర్ణ పార్టీ అనే వాదన ఆయా వర్గాల్లో గూడుకట్టుకుపోవడమే. ఇక, బీజేపీతో జేడీఎస్ పొత్తు పెట్టుకున్న తర్వాత బలమైన రెండు సామాజిక వర్గాల(వక్కలిగ, లింగాయతులు) ఓట్లు కుమార స్వామికి ఏమేరకు అందివస్తాయనే చర్చ తెరమీదికి వచ్చింది. ఇక, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ ఓట్లు పూర్తిగా కాంగ్రెస్ పార్టీకే పడతాయనే అంచనా పెరుగుతోంది.

కాంగ్రెస్ గ్యారెంటీల ప్రభావం!

కర్ణాటకలో గత ఏడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఐదు గ్యారెంటీల హామీలను అమలు చేస్తోంది. ఇది కూడా ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అంచనాలపై ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తోంది. ప్రధానంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సాయం, పేదలకు ఉచిత బియ్యం వంటివి ఓటర్లను కాంగ్రెస్ వైపు మళ్లేలా చేస్తున్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో ఆయా పథకాలకు సీఎం సిద్దరామయ్య ప్రభుత్వం రూ.50 వేల కోట్ల రూపాయలను కేటాయించడం గమనార్హం.

మోదీ మేనియా కలసివచ్చేనా?

ప్రధాని మోదీ మేనియా, అయోధ్య రామ మందిరం వంటి కీలక అంశాలపై కర్ణాటక బీజేపీ చాలా ఆశలు పెట్టుకుంది. ఈ రెండు అంశాలు తమకు కలిసి వస్తాయని కమలనాథులు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో మోదీ ప్రజాదరణ కారణంగానే తమ ఓటు బ్యాంకు 51.4 శాతానికి చేరుకుందని నాయకులు అంచనా వేస్తున్నారు. ఇప్పుడు ఇది 53 శాతానికి పెరిగినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. - (సెంట్రల్ డెస్క్)

కాంగ్రెస్‌ను తుడిచి పెట్టేయండి

» వారికి దేశభక్తి గురించి మాట్లాడే అర్హత లేదు: ప్రధాని మోదీ

రుద్రపూర్ (ఉత్తరాఖండ్), ఏప్రిల్ 2: బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే దేశం అగ్నిగుండం అవుతుందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశాన్ని అస్థిరత, అరాచకంవైపు నెట్టిన కాంగ్రెస్ పార్టీని వచ్చే ఎన్నికల్లో పూర్తిగా తుడిచిపెట్టేయాలని ప్రజలను కోరారు. మంగళవారం ఉత్తరాఖండ్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో మోదీ ప్రసంగించారు. 'వారు దేశాన్ని 60ఏళ్లు పాలించారు. కేవలం పదేళ్లు అధికారానికి దూరంగా ఉండటంతో ఇప్పుడు దేశాన్ని తగులబెట్టడం గురించి మాట్లాడుతున్నారు. మీరు వారిని అలా చేయనిస్తారా? ప్రజాస్వామ్యంలో ఇలాంటి భాష వాడటం ఆమోదయోగ్యమేనా? మీరు వారిని శిక్షించలేరా?' అని మోదీ ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలు ఒక్కొక్కరిగా ఎన్నికల బరి నుంచి సాగనంపాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వాల బలహీనత దేశ విభజనకు దారితీసిందని, పాక్ జలసంధిలోని కచ్చతివు ద్వీపాన్ని శ్రీలంకకు ధారాదత్తం చేసిన ఆ పార్టీకి దేశ భక్తి గురించి మాట్లాడే అర్హత లేదని మోదీ ఆక్షేపించారు. 'అవినీతిపరులు నన్ను బెదిరిస్తున్నారు... దూషిస్తున్నారు... వీటికి నేను భయపడను. వారు నన్ను అడ్డుకోలేరు. ప్రతి ఒక్క అవినీతిపరుడిపై చర్యలు కొనసాగుతాయి. ఇలాంటివారు జైల్లో ఉండాలని మీకు అనిపించడం లేదా? మరోసారి ఎన్నికైన తర్వాత అవినీతిపై ఇంకా కఠిన చర్యలు తీసుకుంటాం' అని ప్రధాని మోదీ హామీ ఇచ్చారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నిజామాబాద్	40.9	27.1
ఆదిలాబాద్	41.3	23.2
రామగుండం	41.0	25.0
ఖమ్మం	40.0	26.0

ఇసుకకు ప్రత్యామ్నాయం!

» మట్టి, నిర్మాణ వ్యర్థాలు, కార్బన్ డై ఆక్సైడ్‌తో కొత్త మెటీరియల్.. ఐఐఎస్‌సీ ఘనత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: పట్టణీకరణ, భవన నిర్మాణ రంగం విస్తరిస్తుండటంతో ఇసుకకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోయింది. ఈ పరిస్థితుల్లో కాంక్రీట్ విఎక్సింగ్‌లో ఇసుకకు ప్రత్యామ్నాయంగా మరేదైనా అందుబాటులోకి వస్తే? ఇదే ఆలోచనతో పరిశోధనలు చేసిన బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)కి చెందిన సెంటర్ ఫర్ సస్టయినబుల్ (సీఎస్‌టీ) శాస్త్రవేత్తలు గొప్ప ముందడుగు వేశారు. ఇసుకకు 'ప్రత్యామ్నాయ మెటీరియల్‌ను కనుగొన్నారు. ఈ మెటీరియల్‌కు ముడి పదార్థాలు కార్బన్ డై ఆక్సైడ్, తవ్వి తీసిన మట్టి, భవన నిర్మాణాల వ్యర్థాలు! మట్టి, నిర్మాణాల వ్యర్థాల్లోకి ప్రత్యేక పద్ధతుల ద్వారా కార్బన్‌డై ఆక్సైడ్‌ను విఎక్స్ చేసి ఇసుకకు ప్రత్యామ్నాయ పదార్థాన్ని రూపొందించారు. కాగా ఈ మెటీరియల్‌ను ఉపయోగిస్తే ఇసుక కన్నా 20-22 శాతం మేర నిర్మాణాల్లో అధిక దృఢత్వం వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సహజ ఇసుకకు బదులుగా కొంత మేర ప్రత్యామ్నాయంగా ఈ మెటీరియల్‌ను ఉపయోగించవచ్చునని, తద్వారా ఇసుక వాడకం తగ్గి పర్యావరణానికి మేలు కలుగుతుందని తెలిపారు.

ఈడీ విచారణకు కలెక్టర్లు హాజరుకావాల్సిందే

» ఇసుక క్వారీల అవినీతి కేసుపై సుప్రీం

చెన్నై, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాట అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిగినట్లు రేగుతున్న ఆరోపణలకు సంబంధించి ఐదుగురు జిల్లా కలెక్టర్లు ఈడీ విచారణకు హాజరు కావాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఇసుక క్వారీల్లో జరిగిన అవినీతికి సంబంధించి గత సెప్టెంబర్‌లో ఈడీ అధికారులు ముమ్మర తనిఖీలు జరిపారు. ఇసుక క్వారీలు, నీటివనరుల శాఖ అధికారుల కార్యాలయాలు, నివాసగృహాల్లో ఒకే సమయంలో తనిఖీలు జరిపి కీలకమైన దస్తావేజులు స్వాధీనం చేసుకున్నారు. ఆ దస్తావేజుల ఆధారంగా విచారణకు హాజరుకావాలంటూ వేలూరు, తిరుచ్చి, కరూరు, తంజావూరు, అరియలూరు జిల్లాలకు చెందిన కలెక్టర్లకు ఈడీ సమన్లు జారీ చేసింది. అయితే ఆ సమన్లను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మద్రాసు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు ఈడీ సమన్లపై స్టే విధించింది. విచారణను మాత్రమే కొనసాగించవచ్చని పేర్కొంది. హైకోర్టు స్టేను వ్యతిరేకిస్తూ ఈడీ తరఫున అప్పీలు పిటిషన్, ఈడీ విచారణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల తరఫున అప్పీలు పిటిషన్ సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. కాగా, తమిళనాట లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ఈ నెల 25న జిల్లా కలెక్టర్లు ఈడీ విచారణకు హాజరు కావాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని సుప్రీంకోర్టు హెచ్చరించింది.

అన్ని హద్దులు దాటేశారు

» న్యాయస్థానాలంటే గౌరవం లేదా?

» 'పతంజలి'పై సుప్రీంకోర్టు ఆగ్రహం

» బాబా రామ్‌దేవ్ క్షమాపణలు.. అంగీకరించని ధర్మాసనం




న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పతంజలి ఆయుర్వేద ఉత్పత్తుల సంస్థ వ్యవస్థాపకుడు యోగా గురువు బాబా రామ్‌దేవ్, ఆ సంస్థ ఎండీ బాలకృష్ణలపై మంగళవారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తప్పుదోవ పట్టించే విధంగా మీడియా ప్రకటనలు ఇచ్చిన కేసులో తమ ఆదేశాలను పాటించనందుకు తదుపరి చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించింది. అలోపతి వైద్యవిధానాల గురించి తప్పుదోవ పట్టించేలా పతంజలి మీడియా ప్రకటనలు చేసిందని పేర్కొంటూ గతేడాది నవంబర్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎమ్ఏ) పిటిషన్ దాఖలు చేసింది. ఈ కేసుపై జస్టిస్ హిమా కోహ్లి, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఐఎంఏ చేసిన పిటిషన్‌పై గతేడాది నవంబర్‌లో విచారణ జరిపిన ధర్మాసనం పతంజలి సంస్థను మందలించింది. మళ్లీ తప్పుదోవ పట్టించే ప్రకటనలు చెయ్యొద్దని ఆదేశించింది. ఇది పునరావృతం కాదని పతంజలి తరఫు న్యాయవాదులు కోర్టుకు హామీ ఇచ్చారు. ఆ హామీని మళ్లీ ఉల్లంఘించడంతో మరోసారి కోర్టులో విచారణ జరిగింది. ఫిబ్రవరిలో జరిగిన విచారణలో పతంజలి వ్యవహార శైలిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. వివరణ ఇవ్వాలంటూ రామ్‌దేవ్ బాబా, బాలకృష్ణకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులకు స్పందించకపోవడంతో కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. ఈ క్రమంలో న్యాయస్థానాల పట్ల పతంజలి సంస్థ వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. "ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటనలు ఇచ్చారు. ఈ విషయంలో అన్ని హద్దులు దాటారు. కేవలం సుప్రీంకోర్టు మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా ఉన్న కోర్టులు జారీ చేసే ప్రతి ఉత్తర్వును గౌరవించాలి. లేకపోతే కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది కదా? కరోనాకు అల్లోపతిలో నివారణ లేదని పతంజలి ప్రకటనలు ఇచ్చినప్పుడు కేంద్రప్రభుత్వం ఎలా కళ్లు మూసుకుంది? ఈ కేసులో రామ్ దేవ్, బాలకృష్ణ ఒక వారంలోగా మళ్లీ కొత్త అఫిడవిట్లు దాఖలు చేయాలి. ఏప్రిల్ 10న మరోసారి న్యాయస్థానం ఎదుట వ్యక్తిగతంగా హాజరు కావాలి" అని ధర్మాసనం స్పష్టం చేసింది. రామ్‌దేవ్ బాబా క్షమాపణలు చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తరఫున న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లగా ధర్మాసనం అందుకు అంగీకరించలేదు. లిఖిత పూర్వకంగా అఫిడవిట్ ద్వారా సమర్పించాల్సిందేనని ఆదేశించింది.

పార్టీల కూటమి పేరు 'ఇండియా'ఉండొచ్చా?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: రాజకీయ పార్టీల కూటమికి 'ఇండియా' అన్న పేరు ఉండొచ్చా అన్నదానిపై వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టు మంగళవారం కేంద్ర ప్రభుత్వం, పలు విపక్షాలకు నోటీసులు ఇచ్చింది. సమాధానం ఇచ్చేందుకు ఇదే చివరి అవకాశం అని హెచ్చరించింది. 26 పార్టీలు కలిసి ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇన్‌క్లూజివ్ అలయెన్స్-సంక్షిప్త నామంలో ఇండియా అని పేరు పెట్టడాన్ని సవాలు చేస్తూ గిరీష్ భరద్వాజ్ అనే వ్యక్తి గత ఏడాది ఆగస్టు నెలలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. ఇది దేశం పేరును సొంత ప్రయోజనాల కోసం వాడుకున్నట్టయిందని ఆరోపించారు. తాజాగా ఈ కేసును తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్‌ప్రీత్ పి.ఎస్. అరోడా ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎన్నికల ప్రకటన వెలువడిన దృష్ట్యా పెండింగ్‌లో ఉన్న ఆ పిటిషన్‌పై విచారణ జరపాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వైభవ్ సింగ్ కోరారు. ఇంతవరకు ఎనిమిది అవకాశాలు ఇచ్చినా కేంద్రంగానీ, పార్టీలు గానీ నోటీసులకు సమాధానం ఇవ్వలేదని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు.

కరడుగట్టిన నేరగాళ్ల మధ్య కేజ్రీవాల్



సంజయ్‌సింగ్(ఫైల్)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రస్తుతం తిహార్ జైలులో కరడుగట్టిన నేరగాళ్ల పక్కన కాలం గడుపుతున్నారు. న్యాయస్థానం రెండు వారాల పాటు జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో పోలీసులు ఆయనను రెండో నెంబరు జైలుకు తరలించారు. అక్కడ డాన్ ఛోటా రాజన్, కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ నీరజ్ బవానా, ఇండియన్ ముజాహిదీన్ ఉగ్రవాది జియా ఉర్ రహ్మాన్‌లు ఇరుగుపొరుగు వారిగా ఉన్నారు. అండర్ వరల్డ్ డాన్ అయిన దావూద్ ఇబ్రహీంకు ఒకప్పుడు అత్యంత సన్నిహితుడైన ఛోటా రాజన్ అనంతర కాలంలో అతడికి ప్రత్యర్థిగా మారాడు. గ్యాంగ్‌స్టర్ నీరజ్‌పై హత్య, హత్యాయత్నం నేరాలు సహా 40కిపైగా క్రిమినల్ కేసులు ఉన్నాయి. కేజ్రీవాల్ ఈ రెండు వారాల పాటు వారితో కలిసి కాలం గడపాల్సి ఉంటుంది. సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు ఆయనను ఈ జైలుకు తీసుకువచ్చారు. రాత్రంతా చికాకుగానే గడిపారు. సుగర్ లెవల్స్ తగ్గడంతో మధ్యాహ్నం, రాత్రి భోజనాలను ఇంటి నుంచే తీసుకొచ్చేందుకు జైలు అధికారులు అనుమతి ఇచ్చారు. మంగళవారం ఉదయం 6.40 గంటలకు అల్పాహారం కింద టీ, బ్రెడ్ ఇచ్చారు. కేజ్రీవాల్ సెల్‌లోనే గంట సేపు యోగా, ధ్యానం చేశారు. ప్రతి రోజూ అయిదు నిమిషాల పాటు ఫోనులో కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు ఆయనకు అవకాశం ఇచ్చారు. తనను కలిసేందుకు ఆరుగురికి అవకాశం ఇవ్వాలంటూ ఆయన జాబితాను సమర్పించారు. భార్య సునీత, కుమారుడు, కుమార్తె, ప్రైవేటు సెక్రటరీ బిభావ్ కుమార్, ఆప్ ప్రధాన కార్యదర్శి సందీప్ పాఠక్‌ల పేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.

సంజయ్‌సింగ్‌కు బెయిల్

ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆరు నెలలుగా జైలు జీవితం గడుపుతున్న ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌కు సర్వోన్నత న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ట్రయల్ కోర్టు విధించిన షరతులకు లోబడి నడుచుకోవాలని ధర్మాసనం తెలిపింది. రాజకీయ సమావేశాల్లో పాల్గొనవచ్చునని, అయితే మద్యం విధానం కుంభకోణం కేసుకు సంబంధించి మాత్రం ఎటువంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆయన్ను ఆదేశించింది. నిరుడు అక్టోబరు 4న సంజయ్ సింగ్‌ను ఈడీ అదుపులోకి తీసుకుంది.

కేజ్రీ ఐఫోన్ అన్‌లాక్‌కు యాపిల్ 'నో'


కేజ్రీవాల్ ఐఫోన్‌ను అన్‌లాక్ చేసేందుకు ఈడీ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. మంగళవారం కేజ్రీవాల్ ఐఫోన్‌ను అన్‌లాక్ చేయాలని యాపిల్ కార్యాలయాన్ని ఈడీ కోరినట్లు తెలుస్తోంది. అయితే ఈడీ అనధికారంగా చేసిన ఈ వినతిని యాపిల్ తిరస్కరించినట్లు సమాచారం. తమ కంపెనీ నిబంధనల ప్రకారం ఫోన్ సొంతదారు మాత్రమే దాని లాక్‌ను తెరవగలరని యాపిల్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మార్చి 21న అరెస్టయిన కేజ్రీవాల్ తన ఐఫోన్‌కు లాక్ వేసి స్విచ్చాఫ్ చేశారు.

బస్తర్ మే సవాల్

» 1998నుంచి బీజేపీకి బస్తర్ కంచుకోట

» మోదీ హవా ఉన్నా 2019లో ఓటమి

» ఈనెల 19న ఇక్కడ ఎన్నికలు



కవాసీ లఖ్మా(కాంగ్రెస్) మహేశ్ కశ్యప్(బీజేపీ)

(ఆంధ్రజ్యోతి-సెంట్రల్ డెస్క్)

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ లోక్‌సభ నియోజకవర్గానికి తొలి విడతలో ఈనెల 19న ఎన్నికలు జరుగనున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ మధ్య గట్టి పోటీ ఉండొచ్చని భావిస్తున్న నియోజకవర్గాలలో ఇదొకటి. కొండగావ్, నారాయణ్‌పూర్, బస్తర్, జగ్దల్‌పూర్, చిత్రకోట్, దంతెవాడ, బీజాపూర్, కొంటా అసెంబ్లీ స్థానాలు ఈ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. హల్బ, భత్ర, గోండు తెగల ఓటర్లు ఈ నియోజకవర్గంలో ఎక్కువగా ఉన్నారు. 1998 నుంచి ఈ నియోజకవర్గం బీజేపీకి కంచుకోటగా ఉంది. ఛత్తీస్‌గఢ్ బాలాసాహెబ్ ఠాక్రేగా ఖ్యాతిగాంచిన బీజేపీ నేత బలిరామ్ కశ్యప్ ఇక్కడ నాలుగు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. 2011లో ఆయన మరణించినప్పటి నుంచి ఆయన కుమారుడు దినేశ్ కశ్యప్ ఇక్కడ ఎంపీగా కొనసాగుతూ వచ్చారు. అయితే, 2019లో బీజేపీ ఆయనకు టికెట్ నిరాకరించింది. ఆ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బైదు రామ్ కశ్యప్ ఇక్కడ ఓటమి పాలయ్యారు. ఆయనపై కాంగ్రెస్ అభ్యర్థి దీపక్ బైజ్ విజయం సాధించారు. తాజా ఎన్నికల్లో కొత్త అభ్యర్థి మహేశ్ కశ్యప్‌ను బీజేపీ ఇక్కడ బరిలోకి దింపింది. మరోవైపు సీనియర్ నేత కవాసీ లఖ్మాను ఇక్కడ పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. కొంటా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదు సార్లు గెలిచిన లఖ్మా ఛత్తీస్‌గఢ్ కేబినెట్ మంత్రిగా కూడా పనిచేశారు. 2013లో దర్బ లోయలో నక్సల్ దాడితో రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకత్వం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. ఆ దాడిలో 30 మందికిపైగా ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరిని నక్సల్స్ కిడ్నాప్ చేశారు. ఆ దాడి నుంచి లఖ్మా ప్రాణాలతో బయటపడటంపై ఆయన ప్రత్యర్థులు ఇప్పటికీ ప్రశ్నలు సంధిస్తున్నారు. ఆయనకు నార్కో ఆనాలసిస్ పరీక్ష చేయాలని కూడా పలువురు డిమాండ్ చేశారు. ఓటర్లతో మమేకమయ్యే ప్రత్యేక నైపుణ్యం వల్ల ఆయన ఎన్నికల్లో వరుస విజయాలు సాధిస్తున్నారని స్థానిక నేతలు చెబుతున్నారు. దీంతో పాటు స్థానిక భాషలన్నింటిలోనూ మాట్లాడగలగడం ఆయనకు కలిసివచ్చింది.

పీసీసీ చీఫ్ దీపక్ బైజ్ అసంతృప్తి

పీసీసీ అధ్యక్షుడు దీపక్ బైజ్ ఈ నియోజకవర్గం నుంచి తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరగా అధిష్ఠానం నిరాకరించింది. దీంతో ఆయన అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. 2013 నక్సల్స్ దాడిలో మరణించిన ప్రముఖ గిరిజన నేత మహేంద్ర కర్మ కుమారుడు చవీంద్ర కర్మ కూడా ఈసారి తనకు టికెట్ నిరాకరించడంపై అసంతృప్తితో ఉన్నారు. కాగా, నక్సల్స్‌ను పూర్తిగా అంతమొందిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన తమ పార్టీకి కలిసి వస్తుందని బీజేపీ నాయకులు చెబుతున్నారు.

బీజాపూర్ అడవుల్లో ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

నలుగురు నక్సల్స్, బీజాపూర్ జిల్లా పిడియాగుట్టలో ఇద్దరు, బాజగూడ అడవుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే..! ఈ ఏడాది ఆరంభం నుంచి ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 42 మంది నక్సల్స్ హతమయ్యారు. ఈ ఎన్‌కౌంట్లకు నిరసనగా మావోయిస్టు పార్టీ ఈ నెల 3న(బుధవారం) బీజాపూర్, సుకుమా జిల్లాల బంద్‌కు పిలుపునిచ్చింది. బంద్‌ను విజయవంతం చేసేందుకు మావోయిస్టులు సోమవారం సాయంత్రం నుంచి ఏజెన్సీల్లో తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో.. గంగలూరు ఠాణా పరిధిలోని గంగలూరు, లేంద్ర అడవుల్లో కోబ్రా, డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్, ఎస్టీఎఫ్ బలగాలు మంగళవారం తెల్లవారుజాము నుంచి కూబింగ్ ప్రారంభించాయి. ఉదయం 6 గంటల సమయంలో ఈ బలగాలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో.. ఇరువర్గాల మధ్య కాల్పులు జరిగాయి. ఉదయం 9 గంటల సమయంలో అడవుల్లోంచి కాల్పులు నిలిచిపోవడంతో.. పోలీసులు ముందుకు సాగారు. ఈ క్రమంలో ఉదయం 10 గంటల సమయంలో నలుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. మధ్యాహ్నం మరో ఐదు.. సాయంత్రం ఇంకో రెండు మృతదేహాలు లభ్యమైనట్లు ఐజీ సుందర్‌రాజ్ వెల్లడించారు. ఘటనాస్థలి నుంచి ఒక అధునాతన లైట్ మెషీన్‌గన్(ఎల్ఎంజీ), భారీ సంఖ్యలో జీబీఎల్ లాంచర్లు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎల్ఎంజీ ఆయుధాన్ని మావోయిస్టుల వద్ద సీజ్ చేయడం ఇదే మొదటిసారని వివరించారు.

బంద్ నేపథ్యంలో హైఅలెర్ట్

మావోయిస్టులు బుధవారం బీజాపూర్, సుకుమా జిల్లాల్లో బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. బంద్‌ను విజయవంతం చేయడానికి మావోయిస్టులు గూడేల్లోకి వస్తే.. వారిని పట్టుకునేలా కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో తెలంగాణ పోలీసులు కూడా కూంబింగ్‌ను పెంచారు. మావోయిస్టు పార్టీకి దండకారణ్యం సేఫ్‌జోన్. అయితే..ఎండాకాలం మొదలై, అడవంతా ఆకులు రాలుతున్న నేపథ్యంలో మావోయిస్టులకు గడ్డు పరిస్థితులు తప్పవని, గడిచిన 20 రోజుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో మావోయిస్టుల మరణాలు అధికంగా ఉండడానికి ఇదే కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వరకట్న పిశాచాలు!

- భార్యను కొట్టి పుట్టింటికి పంపిన భర్త
- కొడుకుకు విష గుళికలు తినిపించి, తానూ తీసుకుని భార్య బలవన్మరణం
- కుమార్తె, మనవడి చావు చూడలేక ఆమె తల్లి ఆత్మహత్య
- కరీంనగర్ శివారులో ఘటన
- సిరిసిల్ల జిల్లాలో మరో మహిళ..

కరీంనగర్ క్రైం, చందుర్తి, ఏప్రిల్ 2: అదనపు వరకట్నం కోసం భర్తల వేధింపులకు నాలుగు ప్రాణాలు బలయ్యాయి. భర్త వేధింపులు భరించలేని భార్య.. పేగుతెంచుకు పుట్టిన కొడుకుకు విషగుళికలు ఇచ్చి తాను మింగి ప్రాణాలు తీసుకుంది. కళ్లముందే కన్న కూతురు, మనవడు చనిపోవడం జీర్ణించుకోలేని మృతురాలి తల్లి కూడా విషగుళికలు మింగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కరీంనగర్ జిల్లాలో జరిగింది. కరీంనగర్ శివారులోని విజయనగర్ కాలనీకి చెందిన గద్దె శ్రీజ(27)కు వరంగల్‌కు చెందిన మొద్దుంపూర్ నరేష్‌తో 2021లో పెళ్లయింది. వారికి కొడుకు రేయాన్ష్ అలియాస్ అర్విన్ (11 నెలలు) ఉన్నాడు. పెళ్లి సమయంలో నరేష్‌కు శ్రీజ కుటుంబం వరకట్నంగా 3లక్షల డబ్బు, ఇతర లాంఛనాలు ముట్టజెప్పింది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసే నరేష్ కొన్నేళ్లుగా వరంగల్‌లో ఉంటూ వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. కొంతకాలంగా అదనపు కట్నం కావాలని నరేష్ తరచూ శ్రీజతో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో గత నెల 29న నరేష్, అతడి అమ్మానాన్నలు.. శ్రీజను కొట్టి అదనపు కట్నం తీసుకురమ్మని బాబుతో సహా పుట్టింటికి పంపించారు. ఈనెల 5న కొడుకు రేయాన్ష్ మొదటి పుట్టిన రోజని, భర్తను రమ్మని శ్రీజ మంగళవారం ఉదయం ఫోన్ చేసింది. అయితే తాను రానని, మీరే చేసుకోండంటూ శ్రీజను, ఆమె తల్లిదండ్రులను దూషించాడు. మీరు చచ్చిపోండంటూ నరేష్ మాట్లాడాడు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్రీజ కొడుకు రేయాన్ష్‌తో విష గుళికలు మింగించి ఆమె కూడా మింగింది. ఆస్పత్రికి తరలిస్తుండగా రేయాన్ష్ చనిపోయాడు. శ్రీజ ఆస్పత్రిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మనవడు, కూతురి చావును జీర్ణించుకోలేక పోయిన శ్రీజ తల్లి జయప్రద(51) ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చి విష గుళికలు తిన్నది. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయింది. మరో ఘటనలో రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం దేవుని తండా గ్రామ పంచాయతీ పరిధిలోని జలపతి తండాకు చెందిన గుగులోతు జలంధర్ వివాహం వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన శోభతో ఆరేళ్ల క్రితం జరిగింది. వివాహ సమయంలో కట్న కానుకలు ఇచ్చి పెళ్లి జరిపించారు. వీరికి నాలుగేళ్ల క్రితం కుమారుడు జన్మించాడు. ఇటీవల దంపతుల మధ్య అదనపు వరకట్న వేధింపుల గొడవలు జరుగుతున్నాయి. ఈ తరుణంలో సోమవారం రాత్రి శోభ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.


శ్రీజ


రేయాన్ష్


జయప్రద


శోభ (ఫైల్)

'పాలేరు' నిండేదాకా పహారా

- సాగర్ ఎడమ కాల్వపై నేటి నుంచి పెట్రోలింగ్
- మధ్యలో రైతులు నీటిని వాడుకోకుండా చర్యలు

నడిగూడెం, ఏప్రిల్ 2: నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నుంచి విడుదలైన నీరు ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌లో నిండేదాకా పెట్రోలింగ్ చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. మధ్యలో ఎక్కడా రైతులు తూములు తీయకుండా.. జలాలు నేరుగా పాలేరుకు చేరేలా చర్యలు తీసుకోనున్నారు. ఈ మేరకు మంగళవారం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ హేమమాలిని, ఎంపీడీవో ఇమాం, పీఆర్ ఏఈ రంగారావు, ఎన్నెస్పీ ఏఈ వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో తాగునీటి ఎద్దడి దృష్ట్యా ఎడమ కాల్వ ద్వారా 2,500 క్యూసెక్కుల నీటిని తరలించి పాలేరు రిజర్వాయర్‌ను నింపడమే లక్ష్యంగా సోమవారం కాల్వలోకి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం అడవిదేవులపల్లి రిజర్వాయర్ నిండగా, కిందికి వస్తున్న నీరు పొనుగోడు ఎస్కేప్ దాటి మునగాల హెడ్‌రెగ్యులేటర్ ద్వారా సాగర్ నుంచి 130 కి.మీ. దూరంలోని పాలేరు రిజర్వాయర్‌కు చేరుతుంది. ఈ మధ్యలో రైతులు నీటిని వినియోగించుకునేందుకు ఆస్కారం ఇవ్వకుండా బుధవారం నుంచి పటిష్ఠ బందోబస్తు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, పోలీస్, రెవెన్యూ అధికారులు రాత్రి వేళ్లలో గస్తీ చేపట్టనున్నారు. పాలేరు రిజర్వాయర్ నిండేందుకు ఐదు రోజులు పడుతుందని అధికారులు భావిస్తున్నారు. కాగా, 2004లోనూ ఇలాగే గస్తీ నిర్వహించి పాలేరుకు నీటిని తరలించారు.

పోలింగ్ సిబ్బందికి తగిన సౌకర్యాలు కల్పించాలి : యూటీఎఫ్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు తగిన సౌకర్యాలను కల్పించాలని యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావ రవి డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంగళవారం ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అన్ని పోలింగ్‌స్టేషన్లలో పోలింగ్ సిబ్బందికి ఆహారం, కనీస సౌకర్యాలను కల్పించాలని కోరారు. గత ఎన్నికల్లో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు.

ఉపాధ్యాయ సంఘం నేతలపై కేసులు ఎత్తివేయాలి

గతంలో ధర్నా చౌక్‌లో ఆందోళన నిర్వహించిన సమయంలో ఉపాధ్యాయ సంఘం నేతలపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు ఉపాధ్యాయ సంఘాల స్టీరింగ్ కమిటీ సభ్యులు చావ రవి, లింగారెడ్డి, సదానందం తదితరులు మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అక్కసుతోనే గత ప్రభుత్వం తమపై క్రిమినల్ కేసులను నమోదు చేసిందని వారు గుర్తుచేశారు. ఈ కేసులను తక్షణమే ఎత్తి వేయాలని కోరారు.

కల్తీ కల్లు తాగిన ఆరుగురికి అస్వస్థత

వేములవాడ రూరల్, ఏప్రిల్ 2: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం నూకలమర్రి గ్రామంలో కల్తీ కల్లు తాగి ఆరుగురు వ్యక్తులు అస్వస్థతకు గురయ్యారు. నూకలమర్రి గ్రామానికి చెందిన వీరు మంగళవారం గ్రామ శివారులో ఓ వ్యక్తి వద్ద కల్లు తాగారు. అనంతరం కొద్దిసేపటికే వాంతులు కావడంతో గమనించిన బంధువులు వేములవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని వారు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎక్సైజ్ పోలీసులు గ్రామంలోని కల్లు మండువాలో శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించారు.

జగనన్నా.. ఎందుకు భయం?

అవినాశ్ రెడ్డిని ఎందుకు కాపాడుతున్నారు?.. అరెస్టు చేస్తే నిజాలు బయటపడతాయనా?

- సీఎంగానైనా నా ప్రశ్నలకు బదులివ్వాలి
- జగన్ చానల్‌లో చర్చకు కూడా సిద్ధం
- రక్తంలో మునిగిన వైసీపీ మళ్లీ అధికారంలోకి రాకూడదు
- అవినాశ్, జగన్ ఓటమి మా లక్ష్యం
- వివేకా కుమార్తె సునీత ఉద్ఘాటన



అమరావతి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): తన తండ్రి వివేకానందరెడ్డి హత్య విషయంలో తనతోపాటు రాష్ట్ర ప్రజలందరూ జగన్ ఉచ్చులో పడ్డారని సునీతా రెడ్డి పేర్కొన్నారు. "నాన్న హత్య తర్వాత మిమ్మల్ని (జగన్‌ను) గుడ్డిగా నమ్మి మీరు చెప్పినట్లు చేశాను. నేను చేసిన తప్పును గ్రహించాను. దానిని సరిదిద్దుకొనేందుకు సమయం వచ్చింది. అందుకోసమే ఈ ప్రయత్నం" అని తెలిపారు. పులివెందుల పోలీసులు తనపైనా, తన భర్తపైనా నమోదు చేసిన కేసు కొట్టివేయాలని కోరుతూ దాఖలు చేసిన వ్యాజ్యం సోమవారం విచారణ ఉన్న సందర్భంగా సునీత హైకోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. "చిన్నాన్నను ఎవరు హత్య చేశారో దేవుడికి తెలుసు, కడప ప్రజలకు తెలుసు అని జగనన్న ప్రకటనలు చేస్తున్నారు. అంటే... ఆ ప్రాంతవాసిగా ఆయనకు కూడా తెలుసనే కదా. మరి... హత్య చేసినవారి పేర్లను ఎందుకు బయటపెట్టడం లేదు? ముఖ్యమంత్రిగానైనా దీనికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత జగనన్న పై ఉంది. వైఎస్ అవినాశ్ రెడ్డిని ఎందుకు కాపాడుతున్నారో సమాధానం చెప్పాలి. ఆయనను అరెస్ట్ చేస్తే ఇతర విషయాలు కూడా బయటకు వస్తాయని భయపడుతున్నారా?" అని సునీత ప్రశ్నించారు. తాను లేవనెత్తిన ప్రశ్నలకు ఒక అన్నగా జగన్ తనకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేనప్పటికీ... ముఖ్యమంత్రిగా సమాధానం చెప్పాల్సిన బాధ్యత కచ్చితంగా ఉందన్నారు. "జగన్ ఎందుకు భయపడుతున్నారో ప్రజలు అర్థం చేసుకోవాలి. నేను లేవనెత్తిన ప్రశ్నలపై జగన్ సొంత చానల్‌కు వచ్చి చర్చించేందుకూ సిద్ధం" అని సునీత పేర్కొన్నారు. "షర్మిలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో నాడు ఆమెను కడప ఎంపీ అభ్యర్థిగా నిలబెట్టాలని వివేకా నిర్ణయించారు. ఆమెకు మద్దతు లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే మా నాన్నను కిరాతకంగా హత్య చేశారా? నిజమేంటో బయటకు రావాలి. నా ప్రశ్నలకు జగనన్న సమాధానం చెప్పాలి. రాజకీయాలు, ఎన్నికల కోసమే వివేకా హత్యను జగనన్న మరోసారి తెరమీదికి తెచ్చారు. ఈ హత్యా రాజకీయాలకు ముగింపు పలకాలి. వైసీపీ ప్రభుత్వం రక్తంలో మునిగి ఉంది. మరోసారి ఈ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వ్యక్తిగతంగా నాకు మాత్రమే కాదు.. రాష్ట్ర ప్రజలకూ మంచిది కాదు. సీబీఐ విచారణ కోసం హైకోర్టును ఆశ్రయించక ముందు జగన్‌ను కలిసి మాట్లాడేందుకు చాలాసార్లు ప్రయత్నించాను. ఎలాంటి సహాయం చేయలేదు. నాన్న మొదటి వర్ధంతి సమయంలో వచ్చి కలుస్తానని అడిగాను. రావద్దని చెప్పారు. షర్మిల లక్ష్యం, నా లక్ష్యం ఒక్కటే. అవినాశ్ రెడ్డిని ఓడించాలి. కుదిరితే... జగనన్ననూ (పులివెందులలో) ఓడించాలి. రాష్ట్రంలో తిరిగి వైసీపీ అధికారంలోకి రాకూడదు" అని సునీత అన్నారు.

ప్రతిసారీ మోసం చేయలేరు...

"ఎవరో పన్నిన ఉచ్చులో నేను, షర్మిల పడ్డామని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డితోపాటు పలువురు పదేపదే చెబుతున్నారు. వాస్తవానికి వివేకా హత్య తర్వాత జగన్ పన్నిన ఉచ్చులోనే నాతోపాటు రాష్ట్ర ప్రజలంతా పడ్డారు. అప్పట్లో నన్ను జగన్ తోలుబొమ్మలా ఆడించారు. హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టించి అవినాశ్‌రెడ్డికి అనుకూలంగా మాట్లాడించారు. ఎవరినైనా ఒకసారి మోసం చేయవచ్చు. పదేపదే మోసం చేయలేరు. ప్రజలు చాలా తెలివైనవారు. నిజం గ్రహిస్తారు. వాళ్ల శ్రేయస్సు, పిల్లల శ్రేయస్సు కోసం కళ్లు తెరుస్తారనే నమ్మకముంది." అని సునీత తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రక్తంలో మునిగి ఉందని, దీని నుంచి బయటపడితే కానీ రాష్ట్ర పురోగతి సాధ్యం కాదని తెలిపారు. మరోసారి ఈ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వ్యక్తిగతంగా తనకు, రాష్ట్ర ప్రజలకూ మంచిది కాదని హెచ్చరించారు.

నా అనుకున్న వాళ్లను నాశనం చేశాడు!

- జగన్‌పై వైఎస్ షర్మిల ఫైర్
- హంతకుడు, హత్య చేయించిన వాళ్లు చట్టసభల్లోకి వెళ్లకూడదు
- అందుకే కడప నుంచి పోటీ చేస్తున్నా

కడప/న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): 'జగన్మోహన్‌రెడ్డి నా అన్న.. అన్నంటే నాకు ద్వేషం లేదు. ఎన్నికల్లో నన్ను చెల్లి కాదు బిడ్డ అన్నాడు.. ముఖ్యమంత్రి అయ్యాక మారిపోయాడు.. ఈ సీఎం నా అనుకున్న వాళ్లందరినీ నాశనం చేశాడు.' అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి దుయ్యబట్టారు. చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డిని చంపిన వాళ్లకే కడప ఎంపీ టికెట్ ఇచ్చాడని.. ఇది తట్టుకోలేక పోయానని తెలిపారు. 'హత్య చేసిన వాళ్లను, చేయించిన వాళ్లను తప్పిస్తున్నారు. ఎంపీని వెనకేసుకొచ్చారు. వైసీపీ ప్రభుత్వం రక్తంతో మునిగిపోయింది. వివేకా హత్యను రాజకీయానికి వాడుకున్నారు. సొంత చిన్నాన్నకే న్యాయం జరగలేదంటే ప్రజలకు ఏం జరుగుతుంది? చిన్నాన్న కోరిక మేరకు కడప ఎంపీగా పోటీ చేస్తున్నా' అని ప్రకటించారు. మంగళవారం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌లో తల్లి వైఎస్ విజయలక్ష్మి, కూతురు అంజలి, పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, జేడీ శీలం, మీడియా చైర్మన్ తులసిరెడ్డితో కలిసి వైఎస్‌కు నివాళులు అర్పించి ప్రార్థనలు చేశారు. 114 మంది ఎమ్మెల్యే అభ్యర్థులు, ఐదుగురు ఎంపీ అభ్యర్థులతో కూడిన కాంగ్రెస్ తొలి జాబితాను ఘాట్‌పై ఉంచారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్ని ఆధారాలు ఉన్నప్పటికీ హంతకులను ఈ ఐదేళ్లు వెనకేసుకొచ్చారని ఆక్షేపించారు. ఘోరమని తెలిసినా.. ప్రజలు హర్షించరని తెలిసినా.. ఎంత అహంకారం కాకపోతే మళ్లీ అదే అవినాశ్‌రెడ్డికి ఇస్తారని నిలదీశారు. రాజశేఖర్‌రెడ్డి తమ్ముడి బిడ్డ సునీత న్యాయం కోసం ఈరోజు కోర్టులు, గడపగడపా తిరుగుతోంది. అసలు కనికరం లేదా? వారినే హంతకులు అంటున్నారే.. హృదయం లేదా? ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారు. ఈరోజు నేను ఎంపీగా నిలబడడానికి కారణం వైసీపీ ఎంపీ అభ్యర్థిగా అవినాశ్‌ను నిలబెట్టారు కాబట్టి.. ఇది హత్యా రాజకీయం కాబట్టి.. హత్యా రాజకీయాలకు మేం వ్యతిరేకం కాబట్టి.. ఒక హంతకుడు, హత్య చేయించిన వాళ్లు చట్టసభల్లోకి వెళ్లకూడదనే నేను పోటీచేస్తున్నా' అని స్పష్టం చేశారు. రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను నిలబెడతానని ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను జగనన్న కోరితే అవకాశమిచ్చారని.. కానీ రాక్షస రాజ్యం తెచ్చాడని షర్మిల ధ్వజమెత్తారు. ఒక్క చాన్స్ ఇవ్వండి రాజధాని కడతానని.. మద్యనిషేధమని మహిళలను, పేదవాళ్లకు ఇళ్లు అని పేదలను.. జాబులని నిరుద్యోగులను మోసం చేశాడు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడు. మద్యాన్ని ఏరులై పారిస్తున్నాడు. ఎక్కడ చూసినా డ్రగ్స్. రాజశేఖర్‌రెడ్డి బిడ్డగా చెబుతున్నా.. కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి. మళ్లీ అవకాశం ఇవ్వండి.. రాజశేఖర్‌రెడ్డి సంక్షేమ పాలనను ఆయన బిడ్డగా నేను తీసుకొస్తా' అని తెలిపారు.


ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద షర్మిల, విజయలక్ష్మి

కాంగ్రెస్ తొలి జాబితాలో వైసీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ గూటికి చేరిన ఎమ్మెల్యేలు ఆర్థర్ (నందికొట్కూరు-ఎస్సీ), ఎలీజా(చింతలపూడి-ఎస్సీ)కు చోటు దక్కింది. పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీమంత్రి శైలజానాథ్‌కు శింగనమల(ఎస్సీ), వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలీకి గుంటూరు తూర్పు కేటాయించారు. కడప లోక్‌సభ స్థానం నుంచి షర్మిల, కాకినాడ-ఎంఎం పల్లంరాజు,రాజమండ్రి-గిడుగు రుద్రరాజు, బాపట్ల(ఎస్సీ)-జేడీ శీలం, కర్నూలు నుంచి పీజీ రాంపుల్లయ్య యాదవ్ పేర్లను అధిష్ఠానం ప్రకటించింది.

శంషాబాద్- అయోధ్య విమాన సర్వీసు ప్రారంభం

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నేరుగా అయోధ్యకు వెళ్లే విమాన సర్వీసును ప్రారంభించినట్లు జీఎంఆర్ అధికారులు మంగళవారం వెల్లడించారు. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో స్పైస్‌జెట్ ఎస్‌జీ611 విమానం ఉదయం 10.45 గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో బయలుదేరి మధ్యాహ్నం 12.45 గంటలకు అయోధ్య చేరుతుందని తెలిపారు. తిరుగు ప్రయాణంలో ఎస్‌జీ616 విమానం మధ్యాహ్నం 1.25 గంటలకు అయోధ్యలో బయలుదేరి మధ్యాహ్నం 3.25 గంటలకు శంషాబాద్ చేరుతుందని చెప్పారు. అయోధ్య సమీపంలోని పుణ్యక్షేత్రాలను సందర్శించాలనుకునే ప్రయాణికులకు ఈ నూతన సర్వీసు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ సర్వీసును ప్రారంభించడం ఎంతో సంతోషకరంగా ఉందని జీఎంఆర్ సీఈవో ప్రదీప్‌ఫణికర్ అన్నారు. స్పైస్‌జెట్ ఎయిర్‌లైన్స్ అధికారులు, జీఎంఆర్ ప్రతినిధులు మొదటి ప్రయాణికుడికి టికెట్‌ను అందజేశారు.

బక్క జడ్సన్‌పై వేటు

- ఆరేళ్ల పాటు బహిష్కరించిన కాంగ్రెస్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి బక్క జడ్సన్‌పై కాంగ్రెస్ పార్టీ బహిష్కరణ వేటు వేసింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకుగాను ఆయన్ను ఆరేళ్ల పాటు బహిష్కరిస్తున్నట్లు టీపీసీసీ క్రమశిక్షణ చర్యల కమిటీ ఛైర్మన్ చిన్నారెడ్డి ప్రకటించారు. బహిరంగ వేదికల మీద పార్టీ విధానాలను, కార్యక్రమాలను తప్పు పట్టినందుకు, పార్టీ నాయకత్వం, సీఎం రేవంత్‌పై విమర్శలు చేసినందుకుగాను బహిష్కరణ వేటు వేసినట్లు తెలిపారు. దీనిపై వివరణ కోరుతూ మార్చి 27నే జడ్సన్‌కు క్రమశిక్షణ చర్యల కమిటీ.. షోకాజ్ నోటీసు జారీ చేసింది. మూడు రోజుల్లో వివరణ ఇవ్వకుంటే పార్టీ నియమావళిని అనుసరించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఆయన వివరణ ఇవ్వక పోవడంతో బహిష్కరణ వేటు వేసింది. మార్చి 30 నుంచి బహిష్కరణ అమలు కానున్నట్లు చిన్నారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బహిష్కరణ వేటుపై జడ్సన్ స్పందిస్తూ.. చివరికి తనకు గుర్తింపు దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో 1989 నుంచి కొనసాగుతున్న తన ప్రస్థానానికి మద్దతుగా నిలిచిన ఏఐసీసీకి, రాహుల్, ప్రియాంక గాంధీలకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నానన్నారు. ఒరిజినల్ కాంగ్రెస్ నేతలను తినేస్తున్న వారి చేతుల్లో తెలంగాణ కాంగ్రెస్‌ను పెట్టారంటూ ఎక్స్ వేదికగా స్పందించారు.

బీసీ కులాలన్నీ ఏకమై మధును గెలిపించాలి: ఆర్.కృష్ణయ్య

రాంనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బీసీలందరూ ఏకమై మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కోరారు. నీలం మధు ముదిరాజ్ విద్యానగర్‌లో ఆర్.కృష్ణయ్యను మర్యాదపూర్వకంగా కలవడానికి మంగళవారం ఆయన నివాసానికి వచ్చారు. ఎంపీ ఎన్నికల్లో సహకారం అందించి తనకు అండగా నిలవాలని కృష్ణయ్యను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు సుధాకర్ ముదిరాజ్, నందగోపాల్, వేమూరి రామకృష్ణ తదితరులు నీలం మధుకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ సామాజికవర్గానికి చెందిన నీలం మధును ఎంపీ ఎన్నికల్లో గెలిపించుకుంటే, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీసీ వర్గాలను గెలిపించుకునే అవకాశం ఉంటుందన్నారు. బీసీ కులాలు, ఇతర అన్ని కులాల మద్దతుదారులు, సానుభూతిపరులు ఐక్యంగా నీలం మధును పార్లమెంట్‌కు పంపించాలని కోరారు.

పోలీసు కేసులకు భయపడి ప్రేమజంట ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా ఉత్తరాస్‌పల్లిలో ఘటన

కొందుర్గు, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ అబ్బాయి, అమ్మాయి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దాంతో తమ తమ కుటుంబాలకు తెలియకుండా గుడిలో పెళ్లి చేసుకున్నారు. అయితే అమ్మాయి మైనర్ కావడంతో పోలీసు కేసులు అవుతాయని భయపడి ఇద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ విషాద సంఘటన రంగారెడ్డి జిల్లాలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కొందుర్గు మండలంలోని ఉత్తరాస్‌పల్లికి చెందిన కావలి బాలకిష్టయ్య-లక్ష్మమ్మలకు దంపతులకు ఓ కొడుకు, ఇద్దరు కూతుళ్లు. పిల్లల చిన్న వయసులోనే బాలకిష్టయ్య చనిపోవడంతో లక్ష్మమ్మ కూలి పనులు చేస్తూ పిల్లలను పెంచింది. కూతుళ్లకు పెళ్లి చేసి కొడుకు శ్రీకాంత్(24)తో కలిసి ఉంటోంది. పదో తరగతి వరకు చదివిన శ్రీకాంత్ షాద్‌నగర్‌లోని ఓ కిరాణ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అతడికి ఆరునెలల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో బండ్లగూడ జాగీర్ కిస్మత్‌పురకు చెందిన ఓ పదోతరగతి బాలిక(16)పరిచయమైంది. పరిచయం ప్రేమగా మారడంతో పెళ్లి చేసుకోవాలనుకున్నారు. బాలిక మైనర్ కావడంతో ఇరు కుటుంబాలు ఒప్పుకోవని గతనెల 27న యాదగిరిగుట్ట ఆలయానికి వెళ్లి పెళ్లి చేసుకున్నారు. మార్చి 30న శ్రీకాంత్ వాళ్ల గ్రామానికి రాగా, గ్రామస్థులు మైనర్‌ను పెళ్లి చేసుకున్నందుకు పోలీసు కేసు నమోదవుతుందని చెప్పారు. బాలికను ఆమె తల్లిదండ్రుల వద్ద వదిలిపెట్టమని అన్నారు. దాంతో కేసులకు భయపడి, కలిసి ఉండలేమని భావించి శ్రీకాంత్, ఆ బాలిక గతనెల 30న గ్రామ సబ్‌స్టేషన్ వద్ద పురుగు మందు తాగారు. వారిని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి బాలిక మృతి చెందగా, మంగళవారం తెల్లవారుజామున శ్రీకాంత్ చనిపోయాడు. శ్రీకాంత్ తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీకాంత్(ఫైల్)


తగ్గిన నీటి నిల్వలతో ఎస్సారెస్పీ ప్రాజెక్టు

శ్రీరాంసాగర్‌లో తగ్గిన నీటి మట్టాలు

నిజామాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉత్తర తెలంగాణ వరప్రదాయిని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటి మట్టాలు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రస్తుతం ఆయకట్టులో పంటలు చేతికి వస్తుండగా, మరోవైపు మరో తడి కోసం నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. అయితే ప్రాజెక్టులో తగినంత నీటి నిల్వలు లేకపోవడంతో అధికారులు పంటలకు నీటి విడుదలను నిలిపివేశారు. ఉన్న నీటిని ఇక తాగునీటికి వినియోగించాలని అధికారులు నిర్ణయించారు. వచ్చే మూడు నెలల పాటు నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల ప్రాంతాలకు పూర్తిస్థాయిలో తాగునీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. యాసంగి ఆయకట్టుకు నీటిని విడుదల చేసే సమయంలో ప్రాజెక్టులో 78 టీఎంసీలు ఉండగా.. ప్రస్తుతం 12.852 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. ఎండలు పెరగడం తాగునీటి అవసరాలు జూలై వరకు ఉండటంతో.. ఐదు టీఎంసీల నీటిని అందించేందుకు నిర్ణయించారు. ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీ ఐదు టీఎంసీలు ఉండగా.. ఆవిరి రూపంలో ఒక టీఎంసీ నీళ్లు వృథా కానున్నాయి. మిగిలిన ఒక టీఎంసీ మేర నీటిని సరస్వతీ, లక్ష్మి కాల్వలతో పాటు ఇతర కాల్వల పరిధిలో ఒక తడికి ఇవ్వాలని నిర్ణయించారు.

14 ఏళ్లుగా పెరగని కాస్మటిక్ చార్జీలు

- ప్రస్తుత ధరల ప్రకారం పెంచాలని ఏఐఎస్‌ఎఫ్ డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందని ఏఐఎస్ఎఫ్ విమర్శించింది. 14 ఏళ్లుగా కాస్మటిక్ చార్జీలు పెంచడం లేదని బాలికలకు నెలకు రూ. 75, బాలురకు రూ. 50 మాత్రమే ఇస్తున్నారని వాటిని తక్షణమే పెంచాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసి వినతి పత్రం అందజేశారు. కాస్మటిక్ చార్జీలతోపాటు మెస్ చార్జీలు పెంచాలని, బోధన ఫీజులను తక్షణమే విడుదల చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలకు సంబంధించిన డైట్ బిల్లులు పది నెలలుగా పెండింగ్‌లో ఉండటం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి వివరించారు.

బోర్డుకు నిధులు విడుదల చేయండి

- తెలంగాణకు గోదావరి బోర్డు లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గోదావరి నది యాజమాన్య బోర్డుకు అందించాల్సిన నిధులను విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆ బోర్డు కార్యదర్శి కోరారు. 2023-24లో రూ.16 కోట్ల బడ్జెట్‌కు గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) ఆమోదం లభించిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రూ.8 కోట్లను బోర్డుకు అందించాల్సి ఉందని, ఇప్పటిదాకా రూ.5.27 కోట్లు మాత్రమే చేరాయన్నారు. మిగిలిన నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. మరోవైపు శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల్లో నీటి లభ్యతపై చర్చించడానికి ఈ నెల 4న కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కి చెందిన త్రిసభ్య కమిటీ సమావేశం జరగనుంది.

నాగోల్‌లో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- గడ్డి అన్నారం కార్పొరేటర్, మరో ఇద్దరు.. అవమానించి, వేధించారని సూసైడ్ నోట్

వనస్థలిపురం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గడ్డి అన్నారం బీజేపీ కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డితో పాటు ఇద్దరు వ్యక్తులు తనను తీవ్రంగా అవమానించారని.. వారి వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని ఓ వ్యక్తి సూసైడ్ నోట్ రాశాడు. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణం చెందాడు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకులకు చెందిన చలమల్ల బాలవర్ధన్ రెడ్డి(36).. భార్య ఇద్దరు పిల్లలతో కలిసి నాగోల్ డివిజన్‌లోని శ్రీనివాస్ కాలనీలో ఉంటున్నారు. ఆయన ఈవెంట్ ఆర్గనైజింగ్, రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా పనిచేస్తున్నారు. కొంత కాలంగా పనిలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెల 30న ఆయన భార్య అంజలి పిల్లలతో కలిసి తన సోదరి ఇంటికి వెళ్లింది. 31న భర్తకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో అనుమానం వచ్చిన అంజలి.. పక్కింటి వారికి ఫోన్ చేసి తమ ఇంటికి వెళ్లి చూడాలని చెప్పింది. వారు వెళ్లి చూడగా బాలవర్ధన్ రెడ్డి ఉరేసుకుని కనిపించారు. ఇంట్లోని భర్త రాసిన సూసైడ్ నోట్‌ను అంజలి గుర్తించింది. అందులో.. "చైతన్యపురికి చెందిన భాగ్య.. కారు కావాలని నాకు రూ.2.30 లక్షలు ఇచ్చింది. వాటిని వేరే వాళ్లకు ఇచ్చాను. వాళ్లేమో కారు ఇవ్వడం లేదు. తన డబ్బులు ఇచ్చేయాలని భాగ్య నా ఇంటి దగ్గరికి వచ్చి యాభై మంది ముందు నన్ను ఘోరంగా అవమానించింది. అది భరించలేక చనిపోతున్నా. నా కుటుంబం రోడ్డున పడటానికి భాగ్య, ఆమె భర్త రాములు, గడ్డి అన్నారం బీజేపీ కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి కారణం. మహేశ్వర్ రెడ్డి నా మీద రేప్ కేసు పెట్టిస్తానని బెదిరించారు. డబ్బు, రాజకీయ అండ ఉందని ఎంతో హింసించారు" అని ఆ నోట్‌లో ఉంది. బాలవర్ధన్ రెడ్డి భార్య అంజలి ఫిర్యాదు మేరకు నిందితులు భాగ్య, ఆమె భర్తను పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్ చేశారు. కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.


బాలవర్ధన్ రెడ్డి (ఫైల్)

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రమాదకర రాజకీయం

యాభైయేళ్ళక్రితం భారత్–శ్రీలంక మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందంలో భాగంగా పాక్ జలసంధిలోని కచ్చతీవు ద్వీపం శ్రీలంక అధీనంలోకి పోయింది. 1974జూన్‌లో ఇందిరాగాంధీ–సిరిమావో బండారు నాయకే చేసుకున్న ఈ స్నేహపూర్వక ఒప్పందం మనదేశానికి భద్రతాపరంగా పెద్ద నష్టాన్ని చేకూర్చిందని ప్రధాని నరేంద్రమోదీ ఇప్పుడు అంటున్నారు. కొత్త సత్యాలు బయటపడుతున్నాయనీ, దేశానికి వ్యూహాత్మకంగా ముఖ్యమైన ఈ ప్రాంతాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యంగా పొరుగుదేశానికి కట్టబెట్టిందని ఆయన ట్వీట్లు చేశారు. ఈ సార్వత్రిక ఎన్నికల కాలంలో భారతీయ జనతా పార్టీ తమిళనాడు రాష్ట్రశాఖ అధ్యక్షుడు ఆర్టీఐ ద్వారా సేకరించిన సమాచారంలో, ఐదుదశాబ్దాలుగా వెలుగుచూడని రహస్యాలు, దేశం నిర్ఘాంతపోయే సత్యాలు కొత్తగా ఏముంటాయన్నది అటుంచితే, పొరుగుదేశంతో దౌత్య సంబంధాలమీద విశేష ప్రభావం చూపే ఓ అంశంమీద ప్రధాని, విదేశాంగ మంత్రి వ్యాఖ్యలు చేయడం అమితాశ్చర్యం కలిగిస్తోంది. తమిళనాడులోని వివిధ రాజకీయపక్షాల మధ్య వాదోపవాదాలకు, కవ్వింపులకు పరిమితమవుతూన్న ఓ అంశం ఇప్పుడు ప్రధాని ప్రకటనతో, దానికి కొనసాగింపుగా ఈ దీవి విషయాన్ని తేలుస్తామంటూ విదేశాంగ మంత్రి చేసిన వ్యాఖ్యతో అమితప్రాధాన్యం సంతరించుకుంది. నిర్మానుష్యమైన, తాగేందుకు గుక్కెడు మంచినీళ్ళు దొరకని ఓ అతి చిన్న ప్రాంతం ఎన్నికలపుణ్యమాని రెండు దేశాల మధ్య దూరాన్ని పెంచడానికి తోడ్పడితే ఎంతో ప్రమాదం.

తమిళనాడులో ఎలాగైనా కాలూనాలన్న తహతహ వల్ల కాబోలు, కచ్చతీవుకు సంబంధించి ఏదో కొత్తగా బయటపడిందని మోదీ అంటున్నారు. కానీ, తమిళనాట డీఎంకె, అన్నాడీఎంకెలకు ఈ అంశం దశాబ్దాలుగా రాజకీయాస్త్రంగా ఉపకరిస్తున్నదే. తమిళ మత్స్యకారులమీద శ్రీలంక దాష్టీకం ప్రదర్శించినప్పుడల్లా తమిళనాడులో రాజుకొనే వేడి ఇదే. కచ్చతీవును మన దేశం శ్రీలంకకు పూర్తిగా ఇచ్చేసిందా, ఒప్పందం ప్రకారం మనకున్న పరిమితమైన అధికారాలను సైతం ఆ దేశం ఎందుకు గౌరవించడం లేదు అన్న లోతైన చర్చను అటుంచితే, ఈ దీవిని వెనక్కు తెచ్చుకోవడం అసాధ్యమన్న విషయం ఇప్పటికే తేలిపోయింది. కచ్చతీవు అప్పగింత రాజ్యాంగవ్యతిరేకమని 2008లో జయలలిత సుప్రీంకోర్టులో కేసువేయడం, దానిని వెనక్కుతీసుకోవాలంటే యుద్ధం ఒక్కటే మార్గమని అటార్నీ జనరల్ పేర్కొనడం ప్రధానికి తెలియనివేమీ కావు.

మోదీ తొలివిడత పాలనలో బంగ్లాదేశ్‌తో చేసుకున్న ఓ ఒప్పందంతో కాంగ్రెస్ ఈ కచ్చతీవు ఒప్పందాన్ని పోలుస్తోంది. భారతదేశానికి చెందిన 111 చిన్నాచితకా భూభాగాలను బంగ్లాదేశ్‌కు ఇచ్చేస్తూ, ఈ సరిహద్దుల ఒప్పందం కేవలం భూమికి పరిమితమైనది కాదని, రెండు హృదయాల కలయికని మోదీ వ్యాఖ్యానించిన విషయాన్ని కాంగ్రెస్ గుర్తుచేస్తోంది. పదేళ్ళపాలన తరువాత, సరిగ్గా లోక్‌సభ ఎన్నికలముందు కచ్చతీవుతో ముడిపడిన దేశసమగ్రత, భద్రత ప్రధానికి గుర్తురావడం విశేషం. నెహ్రూ కూడా ఈ చిన్నదీవి విషయంలో పట్టింపులేనితనం ప్రదర్శించారని, ఒక సమావేశంలో పొరుగుదేశంతో సత్సంబంధాలకంటే ఈ చిన్నప్రాంతం తనకు ముఖ్యం కాదన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇప్పుడు గుర్తుచేస్తున్నారు. ఇందిరాగాంధీ ఎంతో నిర్లక్ష్యంగా ఈ కీలకమైన ప్రాంతాన్ని లంకకు ఇచ్చేశారని బీజేపీ పెద్దలు ఇంతగా బాధపడుతున్నప్పుడు, దానిని వెనక్కుతెచ్చుకొనే ప్రయత్నాలు ఇప్పటికే ఆరంభించివుంటే బాగుండేది. గౌతమ్ అదానీకి శ్రీలంకలో ఓ భారీ ప్రాజెక్టు ఇప్పించేందుకు మోదీ స్వయంగా ఫోన్ చేశారన్న ఆరోపణలను కొందరు ఇప్పుడు గుర్తుచేసుకుంటూ, నరేంద్రమోదీకి శ్రీలంక పాలకులతో బలమైన బంధాలున్నందున ఆయనే కనుక తలుచుకొనివుంటే కచ్చతీవు కథ ఈపాటికే ఓ కొలిక్కివచ్చేదని అంటున్నారు. దేశభద్రతకు అమితప్రాధాన్యం ఇచ్చేపాలకులకు కచ్చతీవు ఇంతకాలం గుర్తుకురాకపోవడం విచిత్రమే మరి. కాంగ్రెస్‌పార్టీ దేశాన్ని రక్షించలేకపోయిందనీ, పొరుగుదేశాల చొరబాట్ల నుంచి మనలను కాపాడలేకపోయిందనీ, దేశభద్రత విషయంలో తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూ మన భూభాగాలను ఇతరులకు ధారాదత్తంచేసిందని బీజేపీ అనాదిగా వాదిస్తూ, కాంగ్రెస్‌ను ఆత్మరక్షణలోకీ, ఇరకాటంలోకి నెట్టడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. చైనా, పాకిస్థాన్‌తో ముడిపడిన విషయాల్లో ఎన్ని విమర్శలు చేసుకున్నా అంత ప్రమాదం ఉండకపోవచ్చును కానీ, ఇతర పొరుగుదేశాల విషయంలో మన మాటలు చేతలూ జాగ్రత్తగా ఉండక తప్పదు.

దేశ సరిహద్దు అవతలి శత్రువుపై వినియోగించాల్సిన నిఘా పరిజ్ఞానాన్ని పాలకులు తమను ప్రశ్నిస్తున్న గొంతుకల నోరు మూయడానికి వినియోగిస్తుండటమే ఆందోళన కలిగిస్తున్న అంశం.

ప్రతిష్ఠకు మచ్చ ఫోన్ ట్యాపింగ్!

టెలిఫోన్ కాదు కదా కనీసం సరైన రవాణా వసతి కూడ లేని మారుమూల ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సి. మాధవరెడ్డి లోక్‌సభలో 1980లలో తాను టెలిఫోన్ల టాపింగ్‌పై లేవనెత్తిన ఒక ప్రశ్న దేశ రాజకీయాలలో దుమారం రేపుతూ ఒక ముఖ్యమంత్రి పదవికి ఎసరు తెచ్చింది. రాజీవ్ గాంధీ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడానికి జనతా దళ్ సభ్యుడు మధుదండావతేతో కలిసి మాధవరెడ్డి లెవనెత్తిన ఈ అంశం చివరకు స్వంత పార్టీ ముఖ్యమంత్రి రామకృష్ణాహెగ్డే పదవికి ఎసరు తెచ్చిపెట్టింది. నైతిక విలువల నాయకుడిగా పేరు కల్గిన దిగవంత హెగ్డే తన రాజకీయ ప్రత్యర్థి దేవగౌడకు రాజధానిలో ఎంత వరకు ప్రాబల్యం ఉందో తెలుసుకోవడానికి అతని ఫోనును ట్యాపింగ్ చేసారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. టెలిఫోన్ల ట్యాపింగ్ అనేది నూతనంగా ఏమీ కాకున్నా, అది బహిర్గతమైన ప్రతిసారి రాజకీయ దుమారం చెలరేగడం షరా మామూలే.

ప్రస్తుతం తెలంగాణలో చర్చనీయంశంగా మారిన టెలిఫోన్ ట్యాపింగ్ తీరు ఇప్పటి వరకు వెలుగులోకి వచ్చిన దాని కంటె విభిన్నమైంది. ఒక సంప్రదాయక భద్రతాపరమైన నియమాన్ని రాజకీయ శక్తులు దుర్వినియోగం చేసిన విధానం ఆందోళన కలిగిస్తున్నది. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందే కొద్దీ సంభాషణలను వినడం లేదా రికార్డు చేయడం సులభతరమవుతూ ఒకప్పుడు జిల్లా ఎస్పీలకు కూడా లేని ఈ అధికారం ఇప్పుడు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులకు కూడ విస్తృతంగా లభిస్తున్నది. ఇది ఆందోళనకరం. ప్రభుత్వ ఆధ్వర్యంలోని ల్యాండ్ లైన్లు కనుమరుగవుతూ మొబైల్ ఫోన్ వ్యవస్థ పెరిగిన

గల్ఫ్ లేఖ

తర్వాత అనుమతులు, సర్వీసు ప్రొవైడర్లు వగైరాలతో సంబంధం లేకుండా నేరుగా దొంగచాటుగా వినే అవకాశం దక్కింది. కేవలం అత్యున్నత నిఘా స్థాయిలో మాత్రమే వాడే ఐఎంఎస్‌ఐ విధానాన్ని కూడా కార్పొరేట్లు, పాలకపక్షాలు సునాయసంగా వాడుతున్నాయంటే విస్మయం కలిగిస్తుంది.

దేశవిదేశాల నుంచి నిత్యం వచ్చే కొన్ని లక్షలాది ఫోన్ కాల్స్, ఇంటర్నెట్ సందేశాలను భారతీయ నిఘా వర్గాలు పరిశీలిస్తూ, అవసరమైనప్పుడు సంబంధిత ప్రభుత్వ వర్గాలను అప్రమత్తం చేస్తుం



డడం ఒక సంప్రదాయక భద్రతపరమైన నియమం. భారతదేశంలో ప్రతి రోజు దాదాపు పది లక్షలకు పైగా ఫోన్ కాల్స్‌ను కేంద్ర ప్రభుత్వ అధ్వర్యంలోని పది నిఘా సంస్థలు ట్యాపింగ్ చేస్తుండగా, అందులో విదేశాలలోని భారతీయ ఎంబసీలలో కేంద్రీకృతమై ఉండే 'రా' నిఘా విభాగం కూడా ఒకటి, ఇందులో పని చేసే అధికారులందరూ కూడా విధి నిర్వహణలో చిత్తశుద్ధి కలిగిన వారుగా పేరుంది. వీరికి తోడుగా అదనంగా రాష్ట్రాల పోలీసులు కూడా ట్యాపింగ్ చేస్తుంటారు.

జాతి భద్రత, శ్రేయస్సు కోసం ఉగ్రవాదులు, నేరస్థులపై దృష్టి సారించవల్సిన నిఘా నేత్రాన్ని పాలకుల విధానాలను విమర్శించే వారిపై ఎక్కుపెట్టడం పాలకులకు మామూలు విషయమే. కానీ శాంతిభద్రతలు రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి పోలీసులకు కూడా అవకాశం ఉండడంతో ఈ రకమైన దుర్వినియోగం జరుగుతుంది. దేశంలో ఫోన్లు, మెసేజ్‌లను టాపింగ్ చేసే అగ్రరాష్ట్రాలలో తెలంగాణ కూడా ఒకటి అనేది మరిచిపోకూడదు.

నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గుజరాత్‌లో రాజకీయాలు, నేరాలతో ఎలాంటి సంబంధం లేని ఒక యువతి ఫోన్‌ను ట్యాప్ చేసిన సంఘటన మొదలు మహారాష్ట్రలో కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం పతనం, తెలంగాణలోని తాజా పరిణామాల వరకు రాష్ట్రాలలో దీన్ని ఏ విధంగా దుర్వినియోగం చేస్తున్నారో అవగతమవుతుంది.

ఒక్క ఫోన్లే కాదు, ఇతర విధానాల ద్వారా కూడా సమాచారాన్ని సేకరించే చట్టబద్ధ వ్యవస్థకు 2011 లోనే భారతదేశం నాంది పలికింది. దీని ద్వారా సర్వీస్ ప్రొవైడర్లతో సంబంధం లేకుండా, శాంతిభద్రతలు రాష్ట్రాల అంశమైనప్పటికీ రాష్ట్రాలతో ప్రమేయం లేకుండా నేరుగా కేంద్రమే ఫోన్లు, మెసేజ్‌లు, మెయిల్స్ ఫోటోలు... వగైరా సర్వం సేకరించే సెంట్రల్ మానిటరింగ్ సిస్టం (సిఎంఎస్) విధానాన్ని రూ.800కోట్లతో ప్రారంభించింది. సిఎంఎస్ విధానం ఎదుటివారికి తెలియకుండా వారి ఫోన్ల సంభాషణను, మెసేజ్‌లను, ఫోన్‌లోని ప్రతి అంశాన్ని గమనిస్తూ నిక్షిప్తం చేస్తుంది. నాట్ గ్రిడ్ విధానం అనేది పౌరునికి సంబంధించిన 21 రకాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోగలుగుతుంది. అదే విధంగా నెట్రా అనేది ఒక్క సామాజిక మాధ్యమాలలోనే కాదు, ఒక కంప్యూటర్లో ఏమేం ఉందో తెలుసుకోగలుగుతుంది. వ్యక్తిగత గోప్యతను హరించే ఈ మూడు నిఘా విధానాలు కూడ భారతదేశంలో చట్టబద్ధంగా అమలులో ఉన్నాయి.

దేశ సరిహద్దు అవతలి శత్రువుపై వినియోగించాల్సిన నిఘా పరిజ్ఞానాన్ని పాలకులు తమను ప్రశ్నిస్తున్న గొంతుకల నోరు మూయడానికి వినియోగిస్తుండటమే ఆందోళన కలిగిస్తున్న అంశం.

■ **మొహమ్మద్ ఇర్ఫాన్**
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

నిజంగా ప్రజాస్వామ్యానికి అంతిమ ఘడియలా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

అభ్యర్థుల ఎంపికలు ఇప్పుడిప్పుడే పూర్తవుతున్నాయి. అసంతృప్తుల బుజ్జగింపులు కొనసాగుతున్నాయి. 'నేను కొన్ని దశాబ్దాలుగా నా నియోజక వర్గంలో పనిచేస్తున్నాను. కాని ఉన్నట్లుండి బయట నుంచి ఒక వ్యక్తిని తీసుకువచ్చి ఆయనను ఎంపిక చేశారు. రాజకీయాల్లో డబ్బు, కులం ఆధిపత్యం పెరిగిపోయింది' అని ఒక సీనియర్ రాజకీయ నాయకుడు వాపోయారు. ఎన్నో ఆశలు పెట్టుకుని పలు ప్రయత్నాలు చేసుకున్న వివిధ సామాజిక వర్గాలు నిరాశ చెందినట్లు కనిపిస్తున్నాయి. తమను ఉపయోగించుకోవడమే కాని, తమకు నిజమైన సామాజికాధికారం కల్పించే ఉద్దేశం ఎవరికీ లేదని పలువురు బడుగు, బలహీన వర్గాల నేతలు ఢిల్లీ దాకా వచ్చి మీడియాకు చెప్పుకుంటున్నారు. ఈ రణగొణ ధ్వనులు అన్ని పార్టీల్లో ఉన్నాయి. జీవితంలో ఒక్కసారి కూడా కాంగ్రెస్, బీజేపీ కార్యాలయాలు చూడని వారు ఆయా పార్టీల నాయకులుగా రాత్రికి రాత్రి అవతరిస్తున్నారు. ఇప్పుడు ఏ పార్టీలో అతి సామాన్యులు లేరనే చెప్పాలి. అసోసియేషన్ ఆఫ్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ సంస్థ ప్రకారం గత లోక్‌సభ ఎన్నికల్లో 25శాతం మంది ఎంపీలు వంద కోట్లకు పైగా ఆర్జించిన సంపన్నులైతే బీజేపీలో ప్రతి పదిమందిలో 9 మంది కోటీశ్వరులే. ఈడీ నిజాయితీగా పనిచేస్తే ఇవాళ దేశంలో సగానికిపైగా రాజకీయ నాయకులు కటకటాలు లెక్కపెట్టవలిసి వస్తుందని ఒక పార్టీ నేత చెప్పారు.

రాజకీయ పార్టీల్లో ఇన్ని లోపాలు ఉన్నప్పటికీ దేశంలో ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న కొద్దీ లోక్‌సభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు అన్న ఉత్కంఠ ఉండనే ఉంటుంది. 'ఇందులో ఉత్కంఠ ఏముంది? నరేంద్ర మోదీ సారథ్యంలోని భారతీయ జనతా పార్టీని ఢీకొనగల శక్తి దేశంలో ఎక్కడుంది? ఆయన మూడోసారి గెలిచే విషయంలో ఎలాంటి అనుమానం లేదు' అని వ్యాఖ్యానించేవారు ఎక్కువగా ఉన్నారు. వీరు అసలు మోదీ మరోసారి విజయం సాధిస్తారా లేదా అన్న చర్చకే తావులేదని కొట్టి పారేస్తున్నారు. మోదీ కూడా ఇప్పటికే గెలిచానన్నట్లుగా మాట్లాడుతున్నారు. జూన్‌లో మరోసారి అధికారం చేపట్టిన తర్వాత వందరోజుల్లో తాను చేపట్టే కార్యక్రమాల గురించి ఇప్పటి నుంచే చెప్పుకుంటున్నారు. 'గత పదేళ్లలో జరిగింది ట్రెయిలర్ మాత్రమే. ఇంకా చాలా చేయాల్సి ఉన్నది' అని మోదీ మంగళవారం రాజస్థాన్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రకటించారు.

మోదీ ఈ మాటలే ప్రతిపక్షాల్లోనూ, అనేకమంది ఇతర వర్గాల్లోను వణుకు పుట్టిస్తోంది. బహుశా బీజేపీలో కూడా ఈ విషయంపై అంతర్గత చర్చ జరుగుతున్నట్లు కనిపిస్తోంది. 'రెండు సార్లు గెలిస్తేనే మోదీ ఇంత బీభత్సం సృష్టించారు. ఇక మూడోసారి ఆయన గెలిస్తే గాలి కూడా స్తంభించిపోతుందేమో' అన్న భయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్ష నేతల్ని జైలుకు పంపి, ఈడీ, ఐటీ సమన్లు, దర్యాప్తులతో, ఖాతాల స్తంభనతో వేధిస్తూ ఎన్నికల్లో విజయం సాధించడం ఒకరకంగా మాచ్ ఫిక్సింగ్‌తో సమానమని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. 'ఇవి సాధారణ ఎన్నికలు కావు. బీజేపీ గెలిస్తే రాజ్యాంగమే మారిపోతుంది. దేశాన్ని కాపాడి, రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటే ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి' అని రాహుల్ గాంధీ రెండు రోజుల క్రితం రామ్ లీలా మైదాన్‌లో జరిగిన బహిరంగ సభలో అన్నారు. మళ్లీ మోదీ అధికారంలోకి వస్తే ఇక దేశంలో ప్రజాస్వామ్యాన్ని మరిచిపోవాల్సిందేనని ఇదే సభలో మాట్లాడిన దాదాపు 27 మంది ప్రతిపక్ష నేతలు అభిప్రాయపడ్డారు.

'కృష్ణుడు కంసుడిని వధించకపోతే, కంసుడే కృష్ణుడిని వధించేవాడు' అని ఒక ప్రవచన కర్త అన్నట్లుగా, రాజకీయాల్లో నేతలు ఎదురు దెబ్బలను తట్టుకుని నిలదొక్కుకోకపోతే ఇతరులు వారి భౌతిక కాయాలపై నడుచుకుంటూ వెళతారు. ఈ రీత్యా రాంలీలామైదాన్‌లో జరిగిన బహిరంగ సభను చూస్తే ప్రతిపక్షాలు కాడిని పడేయలేదని స్పష్టమవుతోంది. గత మూడునెలల్లో ప్రతిపక్షాలను కకావికలం చేసే అనేక ప్రయత్నాలు జరిగాయి. ఇండియా కూటమి నుంచి జనతాదళ్ (యు) నేత నితీష్ కుమార్ తప్పుకున్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేస్తానని ప్రకటించింది. ఇద్దరు ముఖ్యమంత్రులు జైలుకు వెళ్లారు. రాజ్యసభ ఎన్నికల్లో పలువురు ఎమ్మెల్యేలను బీజేపీ తమ వైపుకు తిప్పుకుంది. ఆరుగురు ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించడంతో హిమాచల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కొనఊపిరితో ఉన్నది. ఒక దిగ్బంధన వాతావరణంలో ప్రతిపక్షాలు అరివీర భయంకరుడైన మోదీని ఎదుర్కొనగలవా అన్న అనుమానాలు అంతటా నెలకొనడంలో ఆశ్చర్యం లేదు. ఈ పరిస్థితుల్లోనూ ప్రతిపక్షాలు చివరి పోరాటానికి సిద్ధపడినట్లే కనపడుతోంది. మార్చి 3న బిహార్‌లోని పట్నాలోని చరిత్రాత్మక గాంధీ మైదానంలో భారీ ఎత్తున జరిగిన జన విశ్వాస్ ర్యాలీ హిందీ బెల్ట్‌లో ప్రతిపక్షాల ఐక్యతను ప్రతిఫలించింది. ఆ తర్వాత మార్చి 17న రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా ముంబైలోని శివాజీ పార్క్‌లో జరిగిన ర్యాలీ, తాజాగా కేజ్రీవాల్, హిమంత్ సోరెన్ అరెస్టుని నిరసిస్తూ ఢిల్లీలో జరిగిన ర్యాలీ కూడా ప్రతిపక్షాల సంసిద్ధతను వ్యక్తం చేస్తున్నాయి. ఇది మంచి పరిణామమే.

అయితే 'నియంతృత్వాన్ని రూపుమాపండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని ప్రతిపక్షాలు చేస్తున్న నినాదం ఎంతవరకు ప్రజల్లో చొచ్చుకుపోతోంది? నిజంగా ప్రజాస్వామ్యానికి అంతిమ ఘడియలు దాపురించినట్లు దేశ ప్రజలంతా నమ్ముతున్నారా? నమ్మినా ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వారంతా ముందుకు వస్తారా? నేతల అరెస్టులు ప్రజల్లో ఎంత మేరకు సానుభూతిని కల్పిస్తాయి? అన్న ప్రశ్నలు వేసుకోవాల్సి ఉన్నది. 1977లో వివిధ పార్టీలు జనతా పార్టీ పేరిట ఏకమై 43.2 శాతం ఓట్లతో ఘనవిజయం సాధించిన నాటి పరిస్థితులు దేశంలో ఏర్పడేలా చేయగలిగిన శక్తి నేటి ప్రతిపక్షాలకు ఉన్నదా అన్నది చర్చనీయాంశం. నిజానికి ప్రతిపక్షాలకు సంఘటితం కాగలిగిన, ప్రజలను చైతన్యం చేయగలిగిన నైతిక శక్తి ఉంటే విజయం సాధించడం పెద్ద కష్టం కాదు. గత ఎన్నికల్లో బీజేపీకి కేవలం 37.36శాతం ఓట్లు మాత్రమే లభించాయి. మిగతా 63 శాతం ఓట్లు ప్రతిపక్షాల ఓట్లుగా, సీట్లుగా ఎందుకు మారలేకపోయాయి? ఇది ఓటర్ల వైఫల్యం కానే కాదు. దేశంలో ప్రతిపక్షాల, ప్రత్యామ్నాయ శక్తుల వైఫల్యం. సిద్ధాంత రాహిత్యాల, భావ దారిద్ర్యాల ఫలితం.



'నియంతృత్వాన్ని రూపుమాపండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని ప్రతిపక్షాలు చేస్తున్న నినాదం ఎంతవరకు ప్రజల్లో చొచ్చుకుపోతోంది? నిజంగా ప్రజాస్వామ్యానికి అంతిమ ఘడియలు దాపురించినట్లు దేశ ప్రజలంతా నమ్ముతున్నారా? నమ్మినా ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వారంతా ముందుకు వస్తారా? నిజానికి ప్రతిపక్షాలకు సంఘటితం కాగలిన, ప్రజలను చైతన్యం చేయగలిగిన నైతిక శక్తి ఉంటే విజయం సాధించడం పెద్ద కష్టం కాదు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మోదీ అనుసరిస్తున్న విధానాలను దేశంలో ప్రతిపక్షాలు, ఇతర చెదురుమదురు వర్గాలు మాత్రమే కాక ప్రపంచంలో పలు దేశాలు విమర్శిస్తున్నాయి. మోదీకి నీరాజనాలు పట్టిన అమెరికా కూడా రాజకీయ ప్రత్యర్థులపై వచ్చిన ఆరోపణలను పారదర్శకంగా, నిజాయితీగా, న్యాయపూరితంగా విచారించాలని ఆశించింది. జర్మనీ కూడా స్వతంత్ర న్యాయ వ్యవస్థకు ఉండాల్సిన ప్రమాణాలు, కనీస ప్రజాస్వామిక సూత్రాలు పాటించాలని ఆశించింది. ఇదే అమెరికా, జర్మనీ గత ఏడాది జీ–20 సమావేశాల్లో మోదీని ఆకాశానికి ఎత్తిన విషయం మరిచిపోరాదు. దేశ రాజధానిలో ఉండే రాయబార కార్యాలయ ప్రతినిధులే కాదు, ప్రతి విదేశీ మీడియా ప్రతినిధి జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్నారు. మోదీకి ఉన్నత వర్గాల్లో ఆదరణ ఉన్నదని చెబుతూనే కేజ్రీవాల్ అరెస్టు ప్రజాస్వామ్యంపై మచ్చలాంటిదని 'ద ఎకనామిస్ట్' వ్యాఖ్యానించింది. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలపై విరుచుకుపడడం అప్రజాస్వామికమని అనేక విదేశీ పత్రికలు విమర్శించాయి. 'ప్రతి ఒక్కరి రాజకీయ, పౌర హక్కులను పరిరక్షించాలి. ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా జరిగే వాతావరణంలో ప్రజలు ఓటు వేయగలగాలి' అని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ అన్నారు. మోదీని విదేశాల్లో ప్రశంసించినప్పుడు ఆర్భాటంగా చెప్పుకునే ఆయన భక్తులు ఈ విమర్శలను సీరియస్‌గా ఎందుకు పట్టించుకోవడం లేదు? తమ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం సరైంది కాదని అమెరికా, జర్మనీ రాయబారులను పిలిచి నిరసన తెలిపినంత మాత్రాన ప్రపంచం కళ్లు మూసుకుంటుందా? ఇదే మోదీ 2019లో అమెరికా వెళ్లి 'అబ్ కీ బార్ ట్రంప్ కీ సర్కార్' అని ట్రంప్‌కు అనుకూలంగా ప్రచారం చేయలేదా? ఇది ఆ దేశ అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం కాదా?

బీజేపీ మూడోసారి గెలుస్తుందా, లేదా అన్న చర్చను ప్రక్కన పెడితే ఆ పార్టీ ఆత్మరక్షణలో ఉన్నందువల్లే తమపై విరుచుకుపడుతోందన్న సందేశం ప్రజలకు చేర్చడంలో ప్రతిపక్షాలు ఎంతో కొంత విజయం సాధించాయి. తాను అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నానని మోదీ ప్రతి సందర్భంలోనూ చెప్పుకుంటున్నప్పటికీ, ప్రతిపక్షాలన్నిటినీ అవినీతిపరులుగా ఒకే గాటన కడుతున్నప్పటికీ అందరూ దాన్ని విశ్వసిస్తున్నట్లు కనపడడం లేదు. ఈ విషయంలో మోదీ చేస్తున్న ప్రకటనల్లో నిజాయితీ లేదని, డొల్లతనం మాత్రమే ఉన్నదన్న ప్రచారం కూడా జనంలోకి వెళ్లిపోయింది. ఎన్నికల బాండ్ల విషయంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు విస్మరించదగినవి కావు. డబ్బు తీసుకున్నట్లు రుజువుల్లేకపోయినా ఆరునెలలుగా ఆప్ నేత సంజయ్ సింగ్‌ను ఎందుకు జైల్లో పెట్టారని కూడా మంగళవారం సుప్రీం ప్రశ్నించడం ఈడీ పనితీరును సవాలు చేసింది. మోదీ కేవలం తన అధికారాన్ని శాశ్వతం చేసుకోవడం కోసమే ప్రత్యర్థులకు ఊపిరి సలపకుండా దాడులు చేయిస్తున్నారని, ఈ ఎన్నికలు పూర్తి ప్రజాస్వామికంగా జరగడం లేదని ప్రచారం కూడా జరగడం దేశంలో నెలకొని ఉన్న అనారోగ్యకర రాజకీయ వాతావరణానికి సంకేతం. పరిస్థితులు ఆరోగ్యకరంగా మార్చి దేశంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరుగుతున్నాయన్న సంకేతాలు పంపేందుకు మోదీకి ఇంకా సమయం దాటిపోలేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఏడో హామీ ఎందాకొచ్చింది?

కాంగ్రెస్ అధికారికంగా ఇచ్చిన ఆరు హామీలతో పాటు ఏడో హామీగా ప్రజాస్వామిక పునరుద్ధరణ వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి పాలన వందరోజుల్లో ఆ వాగ్దానం ఎలా అమలవుతున్నది?

తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టడానికి ఎవరు ఏ కారణం చెప్పుకున్నప్పటికీ, ఆ పదేళ్ళ పాలనలో అమలైన నిరంకుశత్వాన్ని ఓడించాలని ప్రజలు అనుకోవడమే ప్రధాన కారణం. కనీస పౌరహక్కులు అణచివేసిన, భిన్నాభిప్రాయాన్ని సహించని భయ వాతావరణాన్ని తెలంగాణ ప్రజలు ఆ పదేళ్ళల్లో అనుభవించారు. అంతకు ముందరి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కన్నా ఘోరమైన పోలీసు రాజ్యం అమలయింది. ఏలిక ఇచ్చిన బారాఖూన్ మాఫ్‌తో పోలీసులు ప్రజల హక్కులను ఇష్టారాజ్యంగా ఉక్కుపాదాల కింద అణచివేశారు. వందలాది మంది మీద డజన్ల కొద్దీ అబద్ధపు కేసులు బనాయించారు. అధికార పార్టీ బహిరంగ సభలు, ఒకటి రెండు ప్రతిపక్షాల బహిరంగ సభలు తప్ప ప్రజా సంఘాల, ప్రజల బహిరంగ సభ ఒక్కటి కూడా జరగనివ్వలేదు. రాష్ట్రంలో ఊరేగింపులను అనుమతించలేదు. హాలు లోపల, ప్రాంగణం లోపల జరిగే సభకు పోలీసు అనుమతులు అవసరం లేకపోయినప్పటికీ హాళ్ల యజమానులను బెదిరించి, హాళ్లకు తాళాలు వేసి, నిర్వాహకులను అరెస్టు చేసి, వందలాది మంది పోలీసులను మోహరించి, సభలు జరగకుండా చూశారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ పదేళ్ళల్లో తెలంగాణలో రాజ్యాంగ అధికరణం 19 స్ఫూర్తి అడుగడుగునా ఉల్లంఘనకు గురయింది.

ఆ నేపథ్యంలో, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అధ్యక్షుడిగా, తర్వాత ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చేసిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ వాగ్దానానికి ప్రజల దృష్టిలో చాలా ప్రాధాన్యత వచ్చింది. ఆ మాటకు నిజమైన అర్థం పౌరహక్కులను గౌరవించే పాలన నెలకొల్పడమే. ఏర్పడి ఉన్న భయ వాతావరణాన్ని తొలగించి, భయరహిత వాతావరణాన్ని తీసుకురావడమే, ఆ పదేళ్ల అబద్ధపు కేసులను ఉపసంహరించడమే. ఊరేగింపులకూ, బహిరంగసభలకూ అనుమతించడమే. హాళ్లలో జరిగే సభలకు ఎటువంటి ఆటంకాలూ కల్పించకపోవడమే. వాక్‌సభా స్వాతంత్ర్యాలకు, భావప్రకటనా స్వేచ్ఛకు ఎటువంటి అవరోధాలు లేకుండా చూడడమే. కాని ఈ మూడు నెలల 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ' కాలంలో తెలంగాణ రాష్ట్ర సమితి పాలన నాటి పోలీసు రాజ్యంలో ఏమీ మార్పు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి రాక ముందు, అధికారం స్వీకరించగానే పదే పదే వినబడిన 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ' అనే మాట ఈ మూడు నెలల్లో ఎక్కడా మళ్ళీ ప్రస్తావనకు కూడా రాలేదు. ధర్నా చౌక్ పునరుద్ధరణ ఒక్కదాన్ని చూపెట్టి అదే విశాలమైన ప్రజాస్వామ్య పునరుద్ధరణ అని నమ్మబలుకుతున్నారు. నిజానికి ధర్నాచౌక్ పునరుద్ధరణ కొత్త ప్రభుత్వం చేసినదేమీ కాదు. అది పాత ప్రభుత్వ పాలనలోనే, ఆ ప్రభుత్వం వ్యతిరేకించినప్పటికీ, హైకోర్టు ఉత్తర్వుల వల్ల జరిగింది. ప్రజాస్వామ్య పునరుద్ధరణకు నిజమైన ఉదాహరణలుగా చెప్పగలిగినవి ఈ మూడు నెలల్లో ఏమీ లేకపోగా, పాత పోలీసు రాజ్యం కొనసాగింపుకు ఉదాహరణలు మాత్రం ఎన్నో ఉన్నాయి.

పౌరహక్కుల సంఘం 50ఏళ్ళ మహాసభల సందర్భంగా మార్చి 10న ఊరేగింపు జరపడానికి అనుమతి అడిగితే ఆ ఊరేగింపులో ప్రొ. జి.హరగోపాల్ పాల్గొంటారని చూసి, 'నక్సలైట్ల ఊరేగింపా' అనే వ్యాఖ్యతో నిరాకరించారు. నిజానికి ప్రజల ఊరేగింపులకు పోలీసుల అనుమతి కోరవలసిన అవసరమే లేదు. ఆ మార్గంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం, బందోబస్తు కోసం సమాచారం ఇవ్వాలనేది మాత్రమే ఉద్దేశం. కాని ఉమ్మడి రాష్ట్రంలో పోలీసు రాజ్యంలో 'సమాచారం' అనే మాటను 'అనుమతి'గా అమలులోకి తెచ్చారు. గత పదేళ్లల్లో ఒక్క ఊరేగింపుకు కూడా 'అనుమతి' ఇవ్వలేదు. ఇప్పుడు 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ'లో కూడా అదే కొనసాగుతున్నది.

అలాగే, ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో జనవరి 13న అంతర్జాతీయ పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన రోజున, టాంక్ బాండ్ మీద మఖ్దూం విగ్రహం దగ్గర ప్రదర్శన జరపబోతే విపరీతంగా పోలీసులను మోహరించి విద్యార్థి యువజనులను అరెస్టు చేశారు. ముస్లిం సంస్థల అభ్యర్థన మేరకు అరగంట అనుమతి ఇచ్చి, అది కూడా మఖ్దూమ్ విగ్రహం దగ్గర జరపగూడదని ఆంక్షలు విధించారు.

భువనగిరిలో హైస్కూలు విద్యార్థినులు భవ్య, వైష్ణవిల అనుమానాస్పద మరణాలపై సరైన దర్యాప్తు కోరుతూ చైతన్య మహిళా సంఘం ధర్నా తలపెడితే పోలీసులు దాన్ని విచ్ఛిన్నం చేశారు. హైదరాబాద్ గాంధీనగర్‌లో గ్రూపు పరీక్షలకు తయారవుతున్న ఒక నిరుద్యోగ యువతి ఆత్మహత్య చేసుకుంటే, అక్కడ చేరిన నిరుద్యోగులు ఆందోళనకు దిగకుండా చెదరగొట్టారు. హైదరాబాద్ శివార్లలో ఒక చర్చ్‌ను మతోన్మాదులు ధ్వంసం చేసిన ఘటనలో సమస్యను పరిష్కరించకపోగా, తమ సమస్యలు చెప్పుకోవడానికి ప్రయత్నించిన బాధితులనే అడ్డుకున్నారు. ఈ మూడు నెలల్లో ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా వార్తలు రాసినందుకు జర్నలిస్టుల మీద దాడుల వార్తలు వస్తూనే ఉన్నాయి. శాసనసభలో మీడియా పాయింట్ దగ్గర ప్రతిపక్ష సభ్యులు మాట్లాడకుండా అడ్డుకున్నారు. నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీసు స్టేషన్‌లో గిరిజన యువకుడి లాకప్ మరణం జరిగింది.

పోలీసులు ఇష్టారాజ్యంగా పౌరులను నిర్బంధించడం, చట్టబద్ధంగా ఇరవై నాలుగు గంటలలోపు న్యాయస్థానం ముందర హాజరుపరచకుండా చిత్రహింసలు పెట్టి తప్పుడు ఒప్పుదల ప్రకటనల మీద సంతకం పెట్టించుకోవడం యథావిధిగా జరిగిపోతున్నాయి. ఇటువంటి ఘటనలలో ప్రధానమైనది ఖమ్మం జిల్లా పూసపల్లి కుట్ర కేసు. సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్, గోపన్నలను, షేక్ మదార్, కలకొండ సురేష్ అనే ఇద్దరితో కలిపి ఖమ్మం పరిసరాలలో ఫిబ్రవరి 14న అదుపులోకి తీసుకుని, ఆ తర్వాత రోజు పుల్లన్న అనే మరొక వ్యక్తిని కలిపి, అయిదుగురినీ ఫిబ్రవరి 16న పూసపల్లి దగ్గర అరెస్టు చేసినట్టు, మరొక పందొమ్మిది పేర్లు కలిపి పూసపల్లి కుట్రకేసు బనాయించారు. సరిగ్గా ఈ కేసు, గత పదేళ్ళల్లో పోలీసులు అల్లిన డజన్ల అబద్ధపు కుట్రకేసుల లాగే ఉంది!

రాష్ట్రంలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ వాగ్దానాలు సాగుతుండగానే ఈ మూడు నెలల్లో ఎన్ఐఎ, ఈడీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు, పొరుగు రాష్ట్రాల పోలీసులు సోదాలు, దాడులు, మనుషులను ఎత్తుకుపోవడం సాగిస్తున్నారు. ఒక పౌరహక్కుల సంఘం నాయకుడి పేరును ఒక అబద్ధపు కేసులో ఇరికించిన ఛత్తీస్‌గఢ్ పోలీసులు జగిత్యాల సమీపంలోని ఆయన స్వగ్రామం రేచుపల్లికి రాబోయి, మరొక గ్రామానికి వెళ్లి అక్కడ గందరగోళం సృష్టించి, ప్రజలు నిలదీయగా తమ ఐడీ కార్డులు చూపి, తప్పించుకుని చివరికి రేచుపల్లి చేరి, కారణమేమిటో చెప్పకుండానే దొంగల్లా ఆయనను ఎత్తుకుపోయారు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు స్థానిక పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఆందోళన జరపగా ఎత్తుకుపోయినవాళ్లు ఛత్తీస్‌గఢ్ పోలీసులనీ, ఆయనను దంతెవాడ జైలులో నిర్బంధించారనీ తేలింది. గత ప్రభుత్వం పెట్టిన అబద్ధపు కేసులలో యుఎపిఎను చేర్చడం వల్ల ఆ కేసులు స్వాధీనం చేసుకొని, రాష్ట్ర ప్రభుత్వానికి కనీస సమాచారం లేకుండానే రాష్ట్రంలో దాడులు చేసే అవకాశం నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీకి వస్తున్నది. గత పాలనలో పెట్టిన అక్రమ కేసులను తొలగించాలనీ, కనీసం యుఎపిఎను సమీక్షించాలనీ చేసిన అభ్యర్థనలు ప్రజాస్వామిక పునరుద్ధరణ ప్రభుత్వానికి ఇంకా వినబడినట్టు లేవు. ఆ కేసులు ఎంత అవకతవకగా, తప్పుల తడకగా, కేవలం భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారి మెడల మీద కత్తులుగా తయారయ్యాయో సమీక్షించి, ఉపసంహరించడం ఈ ప్రభుత్వ ప్రజాస్వామ్య పునరుద్ధరణ కర్తవ్యం.

గత ప్రభుత్వ ఫోన్ టాపింగ్ వ్యవహారం ఇప్పుడిప్పుడు బైటపడుతున్నది. కాని నిజానికి రాష్ట్రంలో స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) అనేది అత్యంత భయానకమైన, విచారణాతీత, శిక్షాతీత, రాజ్యాంగేతర శక్తిగా పెరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్ఐబికి మితిమీరిన అధికారం కట్టబెట్టారు. లెక్క చెప్పనక్కరలేని భారీ నిధులు, వాహనాలు, సౌకర్యాలు సమకూర్చారు. మనుషులను వేటాడి చంపితే నగదు పారితోషికాలు, ఆక్సిలరేటెడ్ ప్రమోషన్లు ఇచ్చారు. ఎస్ఐబి ఎన్నో రాష్ట్రాలలో చట్టవ్యతిరేకంగా రహస్య స్థావరాలు నెలకొల్పింది. ఇతర రాష్ట్రాలలో విప్లవకారులను పట్టుకుని వచ్చి కాల్చి చంపి ఇక్కడ ఏదో ఒక జిల్లాలో ఎన్‌కౌంటర్లు చూపింది. రెండు మూడు దశాబ్దాల పాటు ఇట్లా బారాఖూన్ మాఫ్ అధికారాలు సంపాదించిన ఎస్ఐబి పనులలో ఫోన్ల టాపింగ్ చాల చిన్న పని. టీఆర్ఎస్ ప్రభుత్వం గత ప్రభుత్వాల కన్న రెండాకులు ఎక్కువ చదివి, ఎస్ఐబిని బంధువులతో నింపి, సొంత పనులకు వాడుకుని, టాపింగ్‌ను ప్రతిపక్ష నాయకుల మీదికి, వ్యాపారుల మీదికి, ఎవరి మీద తలచుకుంటే వారి మీదికి తిప్పే అవకాశం ఇచ్చింది. పోలీసు రాజ్యం వల్ల, భయ వాతావరణం వల్ల తెలంగాణ సమాజం ఎంత నష్టపోయిందో, ధ్వంసమయిందో ఈ ఫోన్ల టాపింగ్ కుంభకోణంలో బైటపడుతున్న వాస్తవాలైనా మన కళ్లు తెరిపించాలి. ప్రజాస్వామ్య పునరుద్ధరణ అంటే పోలీసు రాజ్యాన్ని, ఎస్ఐబిని అదుపులో పెట్టడం అని తెలంగాణ ప్రభుత్వం తెలుసుకోవాలి.

కనీస పౌరహక్కులు అణచివేసిన, భిన్నాభిప్రాయాన్ని సహించని భయ వాతావరణాన్ని తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనుభవించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కన్నా ఘోరమైన పోలీసు రాజ్యం అమలయింది. ఏలిక ఇచ్చిన బారాఖూన్ మాఫ్‌తో పోలీసులు ప్రజల హక్కులను ఇష్టారాజ్యంగా ఉక్కుపాదాల కింద అణచివేశారు. వందలాది మంది మీద డజన్ల కొద్దీ అబద్ధపు కేసులు బనాయించారు.



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి రాక ముందు, అధికారం స్వీకరించగానే పదే పదే వినబడిన 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ' అనే మాట ఈ మూడు నెలల్లో ఎక్కడా మళ్ళీ ప్రస్తావనకు కూడా రాలేదు.

● **ఎన్. వేణుగోపాల్**

గ్రామ రెవెన్యూ వ్యవస్థను చక్కదిద్దాలి!

పాలకుల చదరంగంలో గ్రామ రెవెన్యూ వ్యవస్థ నేడు కనుమరుగైపోయింది. నాటి ఎన్టీఆర్ ప్రభుత్వం ఎక్కడో, ఎవరో అవినీతికి పాల్పడ్డారని మొత్తం వ్యవస్థే భ్రష్టు పట్టిందని 1984లో తీసుకున్న అనాలోచిత నిర్ణయం మూలంగా మొత్తం గ్రామాధికారుల వ్యవస్థ రద్దుకు బీజం పడింది. ఆ తర్వాత ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతికి అంతులేకుండా పోయింది. కోళ్లు తినేవాళ్లు పోయి గొర్రెలు తినేవాళ్లు వచ్చిన విధంగా పరిస్థితి తయారైంది. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు కూడా గ్రామ రెవెన్యూ వ్యవస్థపై సరైన నిర్ణయాలు తీసుకోలేదు.

మండలాలు ఏర్పడిన తదుపరి రద్దయిన గ్రామాధికారుల నుంచి కోర్టు తీర్పులననుసరించి ఎస్ఎస్‌సి, ఆపై చదివిన అర్హులైన వారికి గ్రామ సహాయకులుగా ప్రతి మండలానికి నలుగురైదుగురు చొప్పున పే స్కేల్ ఇచ్చి 1987లో నియమించారు. రాష్ట్రంలో 1989 ఎన్నికలలో టీడీపీ ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 1992లో రద్దయిన గ్రామాధికారుల నుంచి అర్హులైన మరికొంత మందిని తీసుకుని వారికి గౌరవ వేతనం ఇచ్చి, వారి వారి సొంత గ్రామాల్లోనే వీఆర్వోగా కొనసాగించారు. 1999లో మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2002లో ప్రతి రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలను కలిపి కొత్తగా పంచాయతీ కార్యదర్శి పోస్టు సృష్టించారు. 1992లో తీసుకున్న వీఆర్వోలకు కూడా పేస్కేల్ ఇచ్చి వారి సొంత గ్రామం నుంచి బదిలీ చేశారు. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2006లో పంచాయతీ, రెవెన్యూ శాఖలను వేరు చేసి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక పంచాయతీ కార్యదర్శి, ఒక వీఆర్వోను నియమించారు. కేసీఆర్ ప్రభుత్వం మొత్తం గ్రామ వీఆర్వో, వీఆర్ఏలను 2020లో తొలగించి గ్రామ రెవెన్యూ వ్యవస్థకు మంగళం పాడారు.

గ్రామాల్లో రెవెన్యూ వ్యవస్థ లేనందున కొండలకు, గుట్టలకు, జాతీయ రహదారులకు, ప్లాట్లుగా మార్చిన వ్యవసాయ భూములకు కూడా రైతుబంధు డబ్బులు జమచేసి సుమారు ఇరవై రెండు వేల కోట్లు దుర్వినియోగం చేశారు. ఇప్పుడు ఊర్లోకి ఎవరైనా అధికారి వస్తే వారికి సమాచారం ఇచ్చేవారు, ఎవరి భూమి ఎక్కడ ఉందో తెలిపేవారు, గ్రామాల్లో నేరాలు, తగాదాలు, ఎన్నికలు జరిగినప్పుడు పై అధికారులకు సమాచారం ఇచ్చేవారు, బ్యాంకు సిబ్బందికి సహకరించేవారు లేరు.

మళ్లీ గ్రామ రెవెన్యూ వ్యవస్థను ఒక గాడిన పెట్టాలని ప్రయత్నిస్తున్న సందర్భంలో సమగ్రంగా ఆలోచించి, పొరపాట్లకు తావులేకుండా ఈ వ్యవస్థ పునరుద్ధరణపై సరైన నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.

– టి.సుదర్శనరెడ్డి, మాజీ గ్రామాధికారి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : బుధవారం సా : 6.34 గం..

సహర్ : గురువారం ఉ : 4.46 గం..

జల ఘంటికలు



వేసవిలో తీవ్రం కానున్న నీటి ఎద్దడి

- కలెక్టర్లను అప్రమత్తం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ముందస్తుగా ఉమ్మడి జిల్లాకు రూ.13.24కోట్లు విడుదల
- పంచాయతీ, ఇతరత్రా నిధుల వాడకానికీ అనుమతి
- బోర్లు, చేతి పంపుల మరమ్మతులకు స్పెషల్ డ్రైవ్
- క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న అన్ని జిల్లాల కలెక్టర్లు
- మిషన్ భగీరథతో పక్కన పడేసిన చేతిపంపులు
- ప్రస్తుతం వాటిపై దృష్టిసారించిన అధికారులు


హనుమకొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో తాగునీటి ఎద్దడి తీవ్రమవుతోంది. ఎండల తీవ్రత పెరిగే కొద్ది భూగర్భజలాలు క్రమంగా అడుగంటుతున్నాయి. అన్ని జిల్లాలో ప్రస్తుతం భూగర్భజలాలు 1 నుంచి 2 మీటర్ల కిందకు పడిపోయాయి. దీనితో బోర్లు, చేతిపంపులు పని చేయడం లేదు. చెరువులు, కుంటలు ఇప్పటికే పూర్తిగా అడుగంటిపోయాయి. తాగునీరు సరఫరా అయ్యే ఎల్ఎండీలోనూ నీటి మట్టాలు తగ్గుతున్నాయి. అయితే భయపడాల్సిన పని లేదని, ఎల్ఎండీ గ్రిడ్‌లో ప్రస్తుతం నీరు చాలినంత ఉందని మిషన్ భగీరథ అధికారులు భరోసా ఇస్తున్నారు. వేసవి పూర్తయ్యే వరకు ఈ నీరు సరిపోతుందంటున్నారు.

ముందస్తు చర్యలు

మిషన్ భగీరథ ద్వారా బోర్లతోపాటు చిన్నపైపులైన్ల మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసింది. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తీవ్రం కానుండడంతో ప్రత్యామ్నాయంగా మరమ్మతులు చేయించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. గత ఏడాది సరిగా వర్షాలు పడలేదు. దీంతో తాగునీటి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఈ నెలలోనే పట్టణాల్లోని ఇళ్లలో బోరుబావులు ఎండిపోయాయి. మరో 45రోజులకు మించి మిషన్ భగీరథ నీళ్లు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. గ్రామాలు, పట్టణాల్లో ఉన్న బోరుబావులపై దృష్టి సారించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మిషన్ భగీరథ పథకం అమలైన తర్వాత బోరుబావులను పట్టించుకోవడం లేదు. ఇప్పుడు మళ్లీ వాటి అవసరాన్ని గర్తించి పునరుద్ధరించాలని నిర్ణయించారు. గ్రామాల్లో ఉన్న పాత బోరుబావులు, చేతిపంపులను సైతం పనిచేసేలా చూడాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్నచోట ప్రైవేటు బోర్లు ఉంటే అద్దెకు తీసుకోవాలని సూచించారు. ఆవాసాల వారీగా నీటి సమస్యలు ఎక్కడ ఉన్నాయనేది గుర్తించారు. పైపులైన్ పగిలిపోయిన చోట యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టనున్నారు. నీటి ఎద్దడి నివారణకు తక్షణమే అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

కలెక్టర్ల సమీక్ష

వేసవికాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు హనుమకొండ, వరం గల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ జిల్లా యంత్రాంగాలు నెలక్రిందటే అన్ని ముందస్తు చర్యలు తీసుకోవడం ప్రారంభించాయి. ఆయా జిల్లాల కలెక్టర్లు ఆర్‌డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ, నీటిపారుదలశాఖ, మున్సిపాలిటీల అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో నీటిఎద్దడి తలెత్తకుండా తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. అందుబాటులో ఉన్న అన్ని జలవన రులను వాడుకోవాలని సూచించారు. పాతబోర్లకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. డివిజన్, మండల, గ్రామ స్థాయిలో తాగునీటి సరఫరా, నిర్వహణపై స్థానిక ఆర్డీవో, పురపాలక కమిషనర్, ఎంపీడీవో, ఎంపీవో ఇతర అధికారులు అప్రమత్తంగా ఉండాలనీ, తాగునీటి సరఫరా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తుండాలని కోరారు.



పంచాయతీలకు నిధుల్లేవు..

పంచాయతీలకు నిధులే లేవు. 15వ ఆర్థిక సంఘం నుంచి ఇచ్చిన నిధులు సరిపోవడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో వాటిలో సగం నిధులు బోరుబావులు, చేతిపంపుల మరమతులకు వాడుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. డబ్బుల్లేకుండా చేతిపంపుల మరమతులు ఎలా చేయాలో అర్థం కాక సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఇంటి పనులు వసూలు చేస్తే వచ్చే జనరల్ ఫండ్‌ను చిన్న చిన్న అవసరాలకు వాడుకుంటున్నారు. రాష్ట్రం, కేంద్రం ఇచ్చే నిధులు ఆరునెలలు ఏ మాత్రం సరిపోవడం లేదు. అవి కూడా సకాలంలో రావడం లేదు. ఒక్కో చేతి పంపునకు మరమ్మతు చేయాలంటే రూ 2వేల నుంచి రూ 5వేల వరకు ఖర్చవుతోంది.

పట్టణాల్లో తీవ్రం

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని పట్టణాల్లో తాగునీటి సమస్య తీవ్రం అవుతోంది. వరంగల్, హనుమకొండ, కాజీపేటతో పాటు జన గామ, మహబూబాబాద్ తదితర పట్టణాలు, జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీల్లోని అనేక ఇళ్లలో బోర్లలో నీళ్లు రావడం లేదు. కొన్ని కాలనీల్లో నీళ్లు కొద్ది కొద్దిగా వస్తున్నాయి. దీనితో పూర్తిగా వరంగల్ నగర పాలక సంస్థ సరఫరా చేసే నీటిపైనే ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొన్నది. మరో వైపు మళ్లీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరంగల్ పట్టణంలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. మరో నెల రోజులు దాటితే పరిస్థితి మరింత తీవ్రమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పట్టణాల్లో పాత బోర్లను మరమ్మతులు చేసి నీటిని సరఫరా చేయటంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పట్టణాల్లో ఆ దిశగా పనులు వేగంగా జరగడం లేదు. పాతవాటిని వినియోగంలోకి తేవటం లేదు.

రూ.13.24 కోట్లు

చేతిపంపులు, ఇతర బోర్ల మరమ్మతుల కోసం రాష్ట్రప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఇటీవల రూ.13.24కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.. హనుమకొండ జిల్లాకు రూ.1.58కోట్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు రూ.1.58కోట్లు, ములుగు జిల్లాకు రూ.3.21కోట్లు, మహబూబాబాద్ జిల్లాకు రూ.3.05కోట్లు, జనగామ జిల్లాకు రూ.1.89కోట్లు, వరంగల్ జిల్లాకు రూ.1.93కోట్లు విడుదలయ్యాయి. వీటితో పాటు ఎమ్మెల్యేల నిధుల నుంచి రూ.కోటి చొప్పున ఇచ్చారు. అదనంగా గ్రామపంచాయతీల్లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు, మండల ప్రజాపరిషత్, జిల్లా ప్రజాపరిషత్‌ల పరిధిలో ఉన్న నిధులనూ సగం వరకు వినియోగించాలని ప్రభుత్వం ఆదేశించింది.



తాగునీటి ఎద్దడి నివారణకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు కలిపి రూ.100కోట్లను విడుదల చేసింది. స్థానిక సంస్థల పరిధిలో నిధులు లేకుంటే ప్రభుత్వ నిధులను సైతం వాడుకోవచ్చునని ప్రభుత్వం స్పష్టం చేసింది. నిధులను ఆయా జిల్లాల కలెక్టర్లకు కేటాయించారు. ఎక్కడైనా నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని తెలిస్తే అక్కడ తక్షణం నివారణ చర్యలు తీసుకోవడానికి ఈ నిధులను వినియోగించేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. గ్రామ పంచాయతీ నిధులను ఇతరత్రా వాటికి కాకుండా ముందుగా తాగునీటి ఎద్దడి నివారణకే వినియోగించాలని ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది.



స్పెషల్ డ్రైవ్

బోరుబావులు, చేతిపంపులు, సింగిల్ మోటారు పంపులకు మరమ్మతులు చేయడం పూర్తయింది. తాగునీటి సరఫరాకు సంబంధించి ప్రస్తుతం అందుబాటులో ఉన్న పాత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంతా సిద్ధం చేసి పెట్టుకున్నారు. గతనెల 7నుంచి 15వ తేదీ మధ్య చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న బోర్లు, చేతిపంపులు తదితర వాటిని సర్వే చేసి వాటి వివరాలను సేకరించారు. ఎక్కడైనా పని చేయకుండా మూలపడి ఉన్నపాత బోర్లు, చేతిపంపులు, లీకేజీ అవుతున్న పైప్‌లైన్లు, కాలిపోయిన మోటార్లకు మరమ్మతులు చేశారు. మరమ్మతులు చేసినప్పటికీ వాటికి మళ్లీ రిపేర్లు వచ్చే అవకాశం ఉంది. వీటిని ఎప్పటికప్పుడు సరి చేయడానికి అన్ని మండలాల్లో మెకానిక్‌లతో కూడిన 100కుపైగా ప్రత్యేక బృందాలను నియమించారు. సమాచారం అందగానే వీరు వెళ్లి వాటికి మరమ్మతులు చేస్తారు. వేసవి కాలం పూర్తయ్యే వరకు ఈ బృందాలు అందుబాటులో ఉంటాయి.

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ జిల్లా వరకు తాగునీటి ఎద్దడి పెద్దగా లేదు. మిషన్ భగీరథ నీరు చాలినంత సరఫరా అవుతోంది. ఎల్ఎండీ నుంచి గ్రిడ్ వాటర్ వస్తోంది. రిజర్వాయర్‌లో చాలినంత నీరుంది. ప్రస్తుతం తాగునీటికి ఇబ్బందైతే లేదు. వేసవి అయిపోయేవరకు కరీంనగర్ నుంచి వచ్చే నీటికి సంబంధించి ఎలాంటి ఇబ్బంది ఉండదు. అన్ని గ్రామాల్లో తిరిగి నీటిఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని గుర్తించినచోట్ల ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మిషన్ భగీరథ ఈఈలు, ఏఈలు, ఇతర అధికారులు గ్రామాల్లో తరుచూ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని స్వయంగా తెలుసుకుంటున్నారు. ప్రత్యేక అభివృద్ధి నిధులు (ఎస్‌డీఎఫ్) కింద వచ్చిన నిధులను నీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి వినియోగిస్తున్నారు.

వసంతోత్సవానికి వేళాయే..

- నిట్‌లో 5వ తేదీ నుంచి స్ప్రింగ్ స్ప్రీ వేడుకలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2: జాతీయ సాంకేతిక సంస్థలో భావిభారత ఇంజనీర్లు మూడురోజుల పాటు సాంస్కృతిక సంబరాల్లో మునిగితేలనున్నారు. ఈనెల 5 నుంచి 7 వరకు మూడు రోజుల పాటు స్ప్రింగ్ స్ప్రీ (వసంతోత్సవం) వేడుకలు నిర్వహించనున్నారు. నిట్‌లో ఈ ఏడాది స్ప్రింగ్ స్ప్రీ వేడులకు అట్టహాసంగా నిర్వహించనున్నట్లు నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది స్ప్రింగ్ స్ప్రీ వేడుకల్లో ప్రముఖ గాయకుడు హరిచరణ్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియన్ రాక్ బ్యాండ్ చౌరస్తాను నిర్వహించనున్నారు. అలాగే నకాష్ అజీజ్, ఇండియన్ రాక్ బ్యాండ్ లోహర్-ది బ్లాక్ స్మిత్ ప్రదర్శనలు ఉండనున్నాయి. ఈ వేడుకల్లో కళా, సాహిత్యం, నాటకం, నృత్యం, సంగీతం, క్విజ్, ఫొటోగ్రఫీ, పెయింటింగ్, ఫ్యాషన్, మ్యూజిక్ రాక్‌షోలు, స్పాట్‌లైట్ ఈవెంట్లు, కొరియో నైట్, అల్లూర్, డైరెక్టర్స్ కట్, నుక్కడ్ నైట్ తదితర ప్రత్యేకమైన సాంస్కృతిక కార్యక్రమాలతో మూడు రోజుల పాటు నిట్‌లో సందడి నెలకొననుంది. ఈ కార్యక్రమంలో దేశంలోని వివిధ ఎన్ఐటీలకు చెందిన విద్యార్థులు నిట్ వసంతోత్సవంతో పాల్గొననున్నారు.



హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

తుక్కుగూడ సభకు తరలాలి..

- ఉమ్మడి జిల్లా నుంచి తరలింపునకు ఏర్పాట్లు
- కాంగ్రెస్ మేనిఫెస్టోను రాహుల్‌గాంధీ విడుదల చేస్తారు..
- లోక్‌సభ ఎన్నికల్లో కడియం కావ్యను గెలిపించాలి
- మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ

7

నా నిజాయితే రాజకీయ

ఉన్నతికి మూలం



- బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు..
- యశస్వినిరెడ్డి చేతిలో ఓడినా ఎర్రబెల్లికి సిగ్గు రాలేదు..
- కేసీఆర్ అంటే గౌరవం ఉంది.. నమ్మకాన్ని వమ్ముచేయలేదు..
- దండోరా ముసుగు తీసి మందకృష్ణ బీజేపీలో చేరాలి
- నా బిడ్డ కావ్యను ఆశీర్వదించి గెలిపించండి
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

7

ఇద్దరు నకిలీ మావోయిస్టుల అరెస్టు

- 70 లెటర్ ప్యాడ్లు, ఫోన్లు, బైకులు సీజ్
- హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 2: హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులతోపాటు డెయిరీ నిర్వాహకుడిని మావోయిస్టుల పేరుతో బెదిరింపులకు పాల్పడిన ఇద్దరు నకిలీ మావోయిస్టులను హనుమకొండ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. మంగళవారం హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు.

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రీకాంత్ సులువుగా డబ్బులు సంపాదించడం కోసం మావోయిస్టుల పేరును వాడుకొని వసూళ్లకు పాల్పడాలని ప్రణాళిక రూపొందించారు. ఇందుకు కరీమాబాద్‌కు చెందిన బాలిని మహేశ్ సహాయం తీసుకున్నాడు. వీరు భారత కమ్యూనిస్టు పార్టీ మావోయిస్టు చర్ల శబరి ఏరియా కమిటీ పేరుతో లెటర్ ప్యాడ్ ముద్రించారు. కాగా, ఈనెల 29న మావోయిస్టు కమాండర్ దేవన్న పేరుతో గూడెప్పాడ్‌లోని ఎస్ఎస్ఆర్ డెయిరీ, హనుమకొండలోని అజర, దీపక్ శోధన్ ఆస్పత్రి రిసెప్షెన్‌లలో లెటర్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. అలాగే అదే రోజు రాత్రి నుంచి వీరికి ఫోన్‌లు చేసి ఆస్తులు వివరాలు, డబ్బులు పట్టుకొని రాకపోతే చంపుతామని బెదిరించారు. దీంతో బాధితులు హనుమకొండతో పాటు ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసుల నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు ప్రారంభించారు.

ఈ క్రమంలో మంగళవారం ఉదయం ములుగురోడ్డులోని హనుమాన్ జంక్షన్‌లో వాహనాలు తనిఖీలు చేస్తుండగా దాసరి శ్రీకాంత్ పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నారు. బాలిని మహేశ్ సహాయంతో లెటర్ ప్యాడ్లు ముద్రించామన్నారు. వెంటనే మహేశ్‌ను కరీమాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి 70 లెటర్ ప్యాడ్లు స్వాధీనం చేసుకొని, సెల్‌ఫోన్‌లను, బైక్‌లను పోలీసులు సీజ్ చేశారు. ఈ సమావేశంలో సీఐలు సతీష్, అబ్బయ్య, ఎస్సై శ్రీనువాస్ పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

'452 సిబ్బంది' గుండెల్లో గుబులు

- అధికారులు, జవాన్ల వద్దకు పరుగులు
- ఉద్యోగ భద్రతపై అనుమానాలు నివృత్తి
- శానిటేషన్ ఉద్యోగులతో కమిషనర్ సమావేశం
- ఔట్ సోర్సింగ్ సిబ్బంది పూర్తి డేటా ఇవ్వాలని ఆదేశం
- బల్దియాలో ప్రకంపనలు సృష్టించిన 'ఆంధ్రజ్యోతి' కథనం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 2: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లో అడ్డదారిలో నియామకమైన 452 మంది ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల గుండెల్లో గుబులు పుట్టింది. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఆ 452 మంది ఎక్కడ' కథనంతో.. తమ ఉద్యోగానికి ఎక్కడ ఎసరు వస్తుందో అని ఆందోళన చెందారు. కొందరు సిబ్బంది ఉదయాన్నే ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, కార్మిక సంఘాల నాయకులు, దళారులు, పైరవీకారుల వద్దకు పరుగు తీశారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సంబంధిత అధికారులను పిలిచి మందలించినట్టు సమాచారం. ఇటీవల బల్దియా శానిటేషన్‌పై వస్తున్న వరుస కథనాలపై వివరణ ఇవ్వాలని సంబంధిత అధికారిని కోరినట్టు సమాచారం. అలాగే మధ్యాహ్నం కౌన్సిల్ హాల్‌లో శానిటేషన్ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయించి.. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు, సీఎంహెచ్‌వోతోపాటు మరికొందరు అధికారులతో మాట్లాడారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లతో విడివిడిగా మాట్లాడి డివిజన్లలో ఎంత మంది కార్మికులు.. ఎక్కడెక్కడ.. ఏయే పనులు చేస్తున్నారు? పురుషులు, స్త్రీలు ఎంత మంది? స్వచ్ఛ వాహనాలు ఎన్ని ఉన్నాయి? రోడ్ స్వీపింగ్ యంత్రాలు, ప్రధాన రోడ్లు, కాలనీలు తదితర వివరాలు అడగ్గా.. ఒక్క అధికారి కూడా సరిగ్గా సమాధానం చెప్పలేకపోయినట్టు సమాచారం. ఈ 452లో ఎవరు ఎక్కడ పని చేస్తున్నారని, ఎవరి ఇళ్లకు వెళ్లి బయోమెట్రిక్ సంతకాలు తీసుకుంటు న్నారో వారి పూర్తి వివరాలు తనకు ఇవ్వాలని ఆదే శించారు. ఈ క్రమంలో అవగాహన లేని కొందరు ఉద్యోగులు తలలు దించుకున్నట్టు తెలిసింది. శానిటే షన్ అంశాలపై సిబ్బందికి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించినట్టు తెలిసింది. సమావేశంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, వరంగల్ డీఎంహెచ్‌వో వెంకట రమణ, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, శానిటరీ సూపర్‌వైజర్లు సాంబయ్య, నరేందర్, భాస్కర్‌తో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

సిబ్బంది పరుగో పరుగు

'ఆంధ్రజ్యోతి' కథనంతో అడ్డదారిలో జీతాలు తీసుకుంటున్న చాలామంది సిబ్బంది హుటాహుటిన సంబంధిత అధికారులు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, పైరవీకారులు, కార్మిక సంఘాల నాయకులు, ఎస్ఐలు, జవాన్ల వద్దకు పరుగు పెట్టారు. తమ ఉద్యోగం ఉంటుందా? ఊడుతుందా? అని ఆరా తీసుకున్నారు. అయితే తాము చెల్లించిన డబ్బులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, లేదంటే వడ్డీతో సహా కలిపి డబ్బులు ఇవ్వాలని పైరవీ కారులను నిలదీసినట్టు సమాచారం. ఇన్ని రోజులు గుట్టుచప్పుడు కాకుండా జీతం తీసుకుని.. ఇప్పుడు రోడ్లు ఊడ్చి, మోరీలు శుభ్రం చేయాలంటే తమ వల్ల కాదని తెగేసి చెప్పారు. తమ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఎవరికైనా విక్రయించి తలా కొంత డబ్బు పంచుకుని వచ్చిన డబ్బులు తమకు ఇవ్వాలని కోరినట్టు తెలిసింది. దీంతో ఉద్యోగాల కోసం డబ్బులు తీసుకున్న వారు డైలామాలో పడ్డారు. ఇప్పటికీ కొందరు పీహెచ్ వర్కర్లు ప్రభుత్వ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారుల ఇళ్లలో పాచి పని, డ్రైవర్లుగా పని చేస్తున్నట్టు సమాచారం.

బయోమెట్రిక్ ప్రకారమే కార్మికులకు జీతాలు

- సీఎంహెచ్‌వో మల్లం రాజేశ్

452 మంది కార్మికులకు బయోమెట్రిక్ ప్రకారమే జీతాలు చెల్లిస్తున్నామని నగర పాలక సంస్థ సీఎంహెచ్‌వో మల్లం రాజేశ్ వివరణ ఇచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్ మార్గదర్శకాలలో భాగంగా ఆదినారాయణ అనే కాంట్రాక్టర్ ద్వారా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రోజువారి ఒప్పంద ప్రకారం తీసుకున్నామని తెలిపారు. వారికి సీఎల్‌సీ, జీడబ్ల్యుఎంసీ వేతనాలు అంది స్తోందని, వారికి ఐడీ నెంబర్లు కూడా మంజూ రు చేశామని వెల్లడించారు. అలాగే బల్దియా పరిధిలోని పలు డివిజన్‌లలో మహిళా పీహెచ్ వర్కర్లను ట్రాక్టర్‌లపై ఎక్కించే విధులు ఉండవని, పురుష కార్మికులే ట్రాక్టర్‌లపై పని చేస్తారని చెప్పారు.

ఎకరాకు రూ.25వేల నష్ట పరిహారం చెల్లించాలి

- మద్దతు ధరకు అదనంగా రూ.500 అందించాలి
- అడిషనల్ కలెక్టర్‌కు వినయభాస్కర్ వినతి

రాంనగర్, ఏప్రిల్ 2: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అన్యాయం చేస్తున్నాయని, సాగునీరు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. మంగళవారం ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్యతో కలిసి వెళ్లిన వినయభాస్కర్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌కు రైతుల సమస్యలపై వినతి పత్రం ఇచ్చారు.

అనంతరం హనుమకొండలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వినయభాస్కర్ మాట్లాడారు. సాగునీరు అందక, కరెంటు సమస్యలతో రైతులు పంట నష్టపోవడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకోవాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు ఇవ్వాలని, మద్దతు ధరకు అదనంగా రూ.500 చెల్లించాలన్నారు. కరెంటు కోతలను ఎత్తివేసి 24గంటల విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఒక వేళ ప్రభుత్వం స్పందించకుంటే రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని వినయభాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, నేతలు నాగుర్ల వెంకటేశ్వర్లు, సుందర్‌రాజ్, మర్రి యాదవరెడ్డి, లలితా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న వినయభాస్కర్

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

హనుమకొండ టౌన్, ఏప్రిల్2: ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం కొత్తగట్టుకు చెందిన రామగిరి శ్రీనివాస్ (34) హనుమకొండ గోకుల్‌నగర్‌లో కిరాయి ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. హైదరాబాద్ వెళ్లేందుకు సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో బస్టాండ్‌కు వస్తున్న క్రమంలో జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంతో వచ్చి ఢీకొట్టగా శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నా నిజాయితే రాజకీయ ఉన్నతికి మూలం

● బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారు.. ● మీడియా సమావేశంలో స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: నిజాయితీ, క్రమశిక్షణ, విలువలతో కూడిన జీవితమే తన రాజకీయ ఉన్నతికి మూలమని, మూడు దశాబ్దాలకుపైగా తన రాజకీయ జీవితంలో అవినీతి మచ్చలేకుండా ఉన్నానని అందువల్లే అన్ని వర్గాల వారు తనను విశ్వసిస్తున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండలోని తన నివాసంలో వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కావ్యతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన కాంగ్రెస్‌లో తమ చేరికకు గల కారణాలు, బీజేపీ పాలన తీరు, బీఆర్ఎస్ నేతలు తనపై చేస్తున్న విమర్శలు, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగా ఆరోపణలు తదితర అంశాలపై వివరణ ఇచ్చారు. వివిధ వర్గాల్లో తనపై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకుంటూ రాజీపడకుండా ముందుకు వెళుతున్నానన్నారు. తన రాజకీయ ఉన్నతి కోసం ఎవరికీ అన్యాయం చేయలేదని, ఒకరి అవకాశాలను కొట్టి తన స్వార్థానికి ఉపయోగించుకునే చరిత్ర తనది కాదన్నారు. తానెప్పుడూ పదవుల కోసం వెంపర్లాడ లేదని.. 1994లో తొలిసారిగా ఎమ్మెల్యే అయిన తరువాత కేబినెట్‌లో చోటు దక్కే వరకు ఆ విషయమే తనకు తెలియదని, ఇక ఎంపీగా గెలిచిన అనంతరం 2016లో కేసీఆర్ తనను పిలిచి డిప్యూటీ సీఎం పదవి ఇచ్చారని గుర్తు చేశారు. 2024లో కాంగ్రెస్ పెద్దలు తనను పార్టీలోకి రావాలని కోరారని, బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన ఒక నాయకుడు కాంగ్రెస్‌లో చేరికకు రెండు నెలలుగా తిరుగుతున్నా పార్టీ చేర్చుకోవడం లేదని, కానీ అదే తనను పార్టీలోకి రావాలని కాంగ్రెస్ ఆహ్వానించిందన్నారు. దళితులు, ముస్లింలు, క్రైస్తవుల హక్కుల పరిరక్షణతోపాటు స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ చేరానన్నారు. బీఆర్ఎస్ నుంచి ఎందరో పార్టీని వీడారని, వారందరినీ విడిచి తనొక్కడి విషయంలో మాత్రం కొందరు బీఆర్ఎస్ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, అది వారి అవివేకానికి నిదర్శనమన్నారు. తాను వారిలా సంస్కారం లేకుండా మాట్లాడలేనని, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్ కుమార్తె పోటీచేస్తే మూడో స్థానమే అని ఆయన అనడమే నిదర్శనమన్నారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న దయాకర్‌రావు తన మనవరాలి వయస్సున్న యశస్వినీరెడ్డి చేతిలో ఓడిపోయినా సిగ్గు రాలేదని, బలుపు, అహంకార మాటలు తగ్గలేదని వ్యాఖ్యానించారు. ఇక నిప్పు తొక్కిన కోతిలా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తనపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తాను భూకబ్జాలు, అక్రమాలకు పాల్పడినట్లు చెబుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. వాటిని నిరూపించాలని.. నిరూపిస్తే వాటిని ప్రభుత్వానికి అప్పగిస్తానని సవాల్ విసిరారు. లేదంటే జనగామ చౌరస్తాలో పల్లా రాజేశ్వర్ రెడ్డిని బట్టలూడదీసి నిలబెట్టడం ఖాయమన్నారు. కొందరైతే తనను పండబెట్టి తొక్కుతామంటూ రెచ్చిపోతున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు పండబెట్టి తొక్కిన విషయాన్ని వారు గుర్తుంచుకోవాలన్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ దండోరా ముసుగు తీసి బీజేపీలో చేరాలని శ్రీహరి హితవు పలికారు. దళితులను హింసపెడుతూ, రిజర్వేషన్ల తొలగింపు కుట్రలు చేస్తున్న బీజేపీ పక్షాన ఆయన ఎలా చేరుతాడని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్ తీసుకువస్తే సరిపోతుందని, ఆ పని బీజేపీ పదేళ్లుగా ఎందుకు చేయడం లేదని మందకృష్ణ ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. తాను దళితజాతి పరిరక్షణకు కృషి చేస్తున్నానని, అంతేకానీ తన రాజకీయ స్వార్థం కోసం దళితవర్గాలనే కాదు.. ఏ వర్గాలకు అన్యాయం చేయలేదని పునరుద్ఘాటించారు. మందకృష్ణ విధానాల వల్లే ఎంఆర్‌పీఎస్ ముక్కలైందని ఆరోపించిన కడియం శ్రీహరి.. వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉన్న తన బిడ్డ డాక్టర్ కావ్యను ఆశీర్వదించి గెలిపించాలని ప్రజలను కోరారు. తన వలే నిజాయితీగా ప్రజలకు సేవ చేస్తుందని తాను హామీ ఇస్తున్నానన్నారు.

నమ్మకాన్ని నిలబెడతా : కావ్య

కాంగ్రెస్ అధిష్ఠానం తనపై నమ్మకంతో లోక్‌సభ టికెట్ కేటాయించడంపై డాక్టరు కడియం కావ్య అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలియచేశారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, పార్టీ పటిష్ఠతకు నిజాయితీగా కృషి చేసి అటు పార్టీ.. ఇటు ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతానని తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ ఫీజుల గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 2: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఎం, బీబీఏ ఇతర డిగ్రీ రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ ఫీజులు చెల్లించుకునేందుకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 4 వరకు పొడిగించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీ రామోజు నరసింహచారి, డాక్టర్ ఎం.తిరుమలదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రూ.50 అపరాధ రుసుంతో ఏప్రిల్ 16 వరకు విద్యార్థులు ఫీజులు చెల్లించుకునే అవకాశం ఉందని తెలిపారు. రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూమెంట్ విద్యార్థులందరూ ఫీజులు చెల్లించుకోవాలని కోరారు. పరీక్షలు మేలో నిర్వహిస్తామని ప్రకటించారు.

రాజస్థాన్ కోట మోషన్ కాలేజ్‌లో ఉచిత బ్రిడ్జి కోర్సు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2: రాజస్థాన్ కోట్ మోషన్ ఐఐటీ, నీట్ కాలేజ్‌లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఉచితంగా 35 రోజుల బ్రిడ్జి కోర్సును ఈనెల 5 నుంచి ప్రారంభిస్తున్నట్లు కళాశాల హనుమకొండ బ్రాంచి చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణలో ఐఐటీ, మెడికల్ కోర్సులకు బేసిక్స్, కెరీర్ గైడెన్స్‌ను ఐఐటీ, నీట్ ఫ్యాకల్టీ బోధిస్తారని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట నయీంనగర్‌లోని బ్రాంచిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉచిత బ్రిడ్జి కోర్సును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నయీంనగర్ బ్రాంచిలో, 9703000850 ఫోన్‌నెంబర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

అనైతిక ప్రాక్టీస్‌పై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉక్కుపాదం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2: రాష్ట్ర చరిత్రలోనే మొదటి సారిగా 19మంది నకిలీ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ కేసులు నమోదు చేసింది. ఈ కేసుల ప్రకారం రూ.5లక్షల నగదు జరిమానాతోపాటు యేడాది జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కూడా ఆయుర్వేదం, హోమియో, యూనాని విద్యను అభ్యసించి అల్లోపతి చికిత్స అందిస్తున్న ముగ్గురిపై కూడా ఆయుష్ విభాగానికి ఫిర్యాదు చేసింది. వరంగల్ నుంచి డాక్టర్ జి.సురేష్, రంగంపేట నుంచి డాక్టర్ బి.సాంబయ్య, శంభునిపేట నుంచి డాక్టర్ టి.సదానందంలపై ఆయుష్ విభాగానికి ఫిర్యాదు చేసింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ తెలంగాణ రాష్ట్ర శాఖ చైర్మన్ డాక్టర్ మహేష్‌కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ హనుమంతరావు ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

కాంట్రాక్టు వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2: కాకతీయ మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు ప్రొఫెసర్స్, అసోసియేట్ ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 2: పద్మాక్షి పాలీక్లినిక్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ చౌరస్తాలోని తమ క్లినిక్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకుడు రఘు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులకు రక్తపరీక్షలతో పాటు టీఎస్‌హెచ్, టీ-3, టీ-4, జీఆర్‌బీఎస్, లిప్పిడ్ ప్రొఫైల్, ఈసీజీ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. వైద్యరంగంలో సుదీర్ఘ అనుభం కలిగిన ప్రముఖ ఎండోక్రనాలజిస్ట్ డాక్టర్ ఇ.లక్ష్మణ్‌కుమార్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ అనీల్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరం, రక్త పరీక్షలను నిర్వహిస్తామన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధిగ్రస్తులు గతంలో వాడుతున్న మందుల చిట్టీలను, రిపోర్టులను వెంట తీసుకొని రావాలని రఘు సూచించారు. ఉచిత వైద్యశిబిరంలో పాల్గొనే వారు సెల్ 9955996166, 9133893360 నెంబర్‌లలో ముందస్తుగా కాల్‌చేసి తమ నెంబర్‌ను రిజిస్టర్ చేసుకోవచ్చునని ఆయన వెల్లడించారు.

క్రూ కంట్రోల్ తరలింపును నిలిపివేయాలి

● లేదంటే ఆమరణ దీక్ష చేపడతా ● మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 3: కాజీపేట రైల్వే జంక్షన్ క్రూ కంట్రోల్ నుంచి క్రూ లింకుల తరలింపు చర్యలను వెంటనే నిలిపివేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేకుంటే ఆమరణ దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. తరలింపును బీజేపీ ఎందుకు అడ్డుకోవడం లేదని రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం హనుమకొండలోని ఓ కన్వెన్షన్ హాలులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికార ఒప్పందాలవల్ల కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాజీపేట ప్రాంతంలో నగరంలో ఒక ముఖ్య భాగంగా ఉన్నా అభివృద్ధిలో వెనకంజలో ఉందన్నారు. ఇందుకు బీఆర్ఎస్, బీజేపీలే కారణమని దుయ్య బట్టారు. కోచ్ ఫ్యాక్టరీ తరలిందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన వ్యాగన్ పరిశ్రమ పనులు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగునెలల్లో చూపించామని రాజేందర్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో పశ్చిమలో రూ.2కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి రూ.40లక్షల కోట్ల అభివృద్ధిగా చూపించారంటూ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌ను విమర్శించారు. పదేళ్లలో పశ్చిమ అభివృద్ధిని విస్మరించి ప్రజలను మాయ మాటలు చెప్పి నమ్మించారన్నారు. వరంగల్ పశ్చిమలో వరదలతో ముంపు సమస్య తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపడుతున్నట్లు రాజేందర్‌రెడ్డి చెప్పారు. ఇందులో భాగం గా నయీంనగర్ బ్రిడ్జి, విస్తరణ చేపట్టినట్లు చెప్పారు. ఈనెల 5వతేదీన నయీంనగర్ బ్రిడ్జిని కూలగొట్టి కొత్తగా విస్తరణ పనులు చేపట్టనున్నట్ల వెల్లడించారు. రెండు నెలల్లో బ్రిడ్జి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు చెప్పారు. పెద్దపెండ్యాల జంక్షన్ వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల వాహనాలు వంతెన పై నుంచి రాకపోకలు సాగించవచ్చన్నారు. రెండు నెలల్లో హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి అవుతుందన్నారు. ఇక భద్రకాళి మాడ వీధుల నిర్మాణం చర్యలు కూడా అమల్లో ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ నేతల పాపాలే వారిని వెంటాడుతున్నాయని రాజేందర్‌రెడ్డి దుయ్యబట్టారు. లిక్కర్ కేసు, ఫోన్ ట్యాపింగ్, భూకబ్జాలు ఇలా అనేక అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. కేసీఆర్ కుటుంబ అక్రమాలు మరిన్ని వెలుగులోకి వస్తాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో దోపిడీ చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగునెలలు కాక ముందే కేసీఆర్ కరువుయాత్ర పేరుతో విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. వర్షాకాలమే రాలేదు కరువు ఎక్కడిదని ప్రశ్నించారు. పశ్చిమలో ధరణి పేరిట భూ దందాలు, కబ్జాలు, అనేక అక్రమాలను ప్రజలే బయటపెడుతున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరుపనున్నట్లు రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ధరణి పేరిట భూముల స్వాహాతో పాటు బాలసముద్రంలో అక్రమంగా నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయంపై విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ, పీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, ఈవీ శ్రీనివాస్, గుంటి కుమారస్వామితో పాటు టీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, పోతుల శ్రీమాన్, మామిండ్ల రాజు, మానస రాంప్రసాద్, సయ్యద్ విజయశ్రీ రజాలీతో పాటు చీకటి ఆనంద్, నాయిని లక్ష్మారెడ్డి, డాక్టరు శ్రవణ్, బంక సంపత్ యాదవ్, కార్తీక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో పనిచేస్తున్న అధికారులను బదిలీ చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 2: హనుమకొండలోని ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో ఏళ్ల తరబడి ఇక్కడే విధులు నిర్వహిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారులను బదిలీచేసి వారిపై చర్యలు తీసుకోవాలని లంబాడ హక్కుల పోరాట సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు అజ్మీరా వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐటీడీఏ కార్యాలయ ఆవ రణలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్ మాట్లాడారు. ఇంజనీరింగ్ శాఖ లో కొన్నేళ్లుగా కొందరు అధికారులు విధులు నిర్వహించడంలో ఆంతర్యమేమిటన్నారు. ఇక్కడే పాతు కుపోయిన అధికారులను వెంటనే బదిలీ చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు రమేష్ నాయక్, బాదావత్ భాస్కర్ నాయక్, నూనావత్ శ్రీనివాస్ నాయక్, జాటోతు బావుసింగ్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడి

వరంగల్ క్రైం, ఏప్రిల్ 2: టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరంగల్ నగరంలోని పలుచోట్ల బెల్టుషాపులపై దాడులు చేశారు. మంగళవారం నిర్వహించిన దాడిలో రూ.22వేల విలువ కలిగిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దేశాయిపేటలో రూ.8490, వడ్డెపల్లి రెండు ఇళ్లల్లో ఒకరి ఇంట్లో రూ.7300, మరొకరిఇంట్లో రూ.6420 విలువ కలిగిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూదన్ ధ్రువీకరించారు.

'రూ.2వేల నోట్లు మార్చుకోవచ్చు'

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 2: ప్రభుత్వం రూ.2వేల నోట్లను రద్దు చేసి, గత సంవత్సరం అక్టోబరు వరకు మార్చుకునే అవకాశాన్ని కల్పించిందని, ఇంకా ఎవరివద్దనైనా రూ.2నోట్లు ఉంటే రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ కార్యాలయం హైదరాబాద్‌లో మార్చుకోవచ్చని జిల్లా లీడ్ బ్యాంకు అధికారి రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.20వేల వరకు మార్చుకొనే అవకాశం ఉందని, రీజినల్ కార్యాలయంలో నోట్లు మార్చుకునే వారు తమ బ్యాంకు అకౌంట్ వివరాలతో నోట్లను రీజినల్ కార్యాలయంలో అందించిన తర్వాత వారి ఖాతాలో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. పోస్టాఫీసుల్లో కూడా తమ బ్యాంకు అకౌంట్ పూర్తి వివరాలు, పోస్టాఫీసులో పూర్తి వివరాలతో నోట్లను అందజేస్తే మార్పిడి అనంతరం వారి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. రూ. 20వేలకు మించి ఉంటే కేవైసీ సర్టిఫికెట్‌తో ఇతర వివరాలను రీజినల్ బ్యాంకు కార్యాలయంలో అందించాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా రిజర్వు బ్యాంకుకు చెందిన 18 సెంటర్లు ఉన్నాయని ఏ సెంటర్‌లోనైనా మార్చుకునే అవకాశాన్ని ఆర్‌బీఐ కల్పించిందని అన్నారు.

కమిషనరేట్‌లో సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్

ప్రారంభించిన సీపీ అంబర్ కిషోర్ ఝా


స్టేషన్‌ను ప్రారంభిస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఏప్రిల్ 2: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. నేరాల నియంత్రణలో భాగంగా రాష్ట్ర సైబర్ క్రైం సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆరు సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వరంగల్‌లో ఒక స్టేషన్ ప్రారంభించారు. స్టేషన్‌ను ప్రారంభించిన అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వారు నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్‌క్రైం స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ సూచించారు. సైబర్ నేరానికి గురైన బాధితులు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో సైబర్ వారియర్స్‌గా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి కమిషనర్ చేతుల మీదుగా సెల్‌ఫోన్‌లు, సిమ్ కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రవిందర్, అబ్దుల్ బారీ, ట్రెయినీ ఐపీఎస్‌లు అంకిత్, శుభంనాగ్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ ఏసీపీ విజయ్‌కుమార్, సీఐ రవి తదితరులు పాల్గొన్నారు.

ఆటిజమ్‌పై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2: ఆటిజమ్ ఏ విధంగా వచ్చిందో అనేది కాకుండా.. ఎలా జయించాలో తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని వరంగల్ డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ సూచించారు. అంతర్జాతీయ ఆటిజమ్ అవగాహన దినోత్సవాన్ని మంగళవారం వరంగల్ ఎంజీఎం హాస్పిటల్‌లోని డైక్ కేంద్రంలో వరంగల్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ పీడియాట్రిక్స్, ఎంజీఎం ఆధ్వర్యంలో ఆటిజమ్ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ.. పీడియాట్రిక్ విభాగంలో అనేక వసతులు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకొని పిల్లల ఎదుగుదల పట్ల శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ వాసుదేవ్, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శేషుమాధవ్ పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించకుంటే ఆత్మహత్యలే..

బల్దియా కాంట్రాక్టర్ల నిరసన


నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్టర్లు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 2: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో రెండేళ్లుగా చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని, ఇదే విధంగా బిల్లుల విషయంలో జాప్యం చేస్తే ఆత్మహత్యలు తప్పవని బల్దియా కాంట్రాక్టర్లు అధికారులను హెచ్చరించారు. జీడబ్ల్యుఎంసీ కాంటార్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాజారావు, ఎమ్డీ అదిల్ అమ్మద్ సంయుక్తంగా మాట్లాడారు. బల్దియాలో ప్రస్తుతం పైరవీకార్లకు, పర్సంటేజ్‌కార్లకే చేసిన పనులకు బిల్లులు చెల్లిస్తున్నారని, తమ లాంటి వాళ్లకు బిల్లులు చెల్లించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని అన్నారు. జనరల్ ఫండ్స్ బిల్స్ ఇప్పటివరకే తమకు రూ.20కోట్ల వరకు రావాలని 2024లో వివిధ రకాల పన్నులు వసూలు చేసిన రూ.76 కోట్లు ఏం చేశారని వారు ప్రశ్నించారు. సీఎంఏ బిల్లులు కూడా చాలారోజులుగా పెండింగ్‌లో ఉన్నాయని ఇదేవిధంగా జరిగితే తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉంటుందన్నారు. చాలామంది కాంట్రాక్టర్లు అప్పులు చేసి బల్దియా అభివృద్ధి పనులు చేశామని, రోస్టర్ విధానం కాకుండా బడా కాంట్రాక్టర్లకు కొందరు అధికారులు అడ్డదారిలో బిల్లులు చెల్లిస్తున్నారని ఆరోపించారు. తమకే వచ్చే బిల్లులు తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు, తిరుపతి, దేవేందర్, రాజేంద్రప్రసాద్, బొక్క కుమారస్వామి, రవి, నాగరాజు, అప్పాల శ్రీనివాస్‌లతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తుక్కుగూడ సభకు తరలాలి..

● ఉమ్మడి జిల్లా నుంచి తరలింపు ఏర్పాట్లు చేస్తున్నాం ● మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ


సమావేశంలో శ్రీహరిని సత్కరిస్తున్న నాయిని, చిత్రంలో మంత్రి కొండా సురేఖ, తదితర నాయకులు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 2: ఈ నెల 6న హైదరాబాద్ తుక్కుగూడలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొనే కాంగ్రెస్ సభకు భారీగా తరలి.. విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం హనుమకొండలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. తుక్కుగూడ సభ విజయవంతానికి తగిన ప్రణాళికలు రూపొందించామని, ఉమ్మడి జిల్లాలోని ప్రతీ గ్రామం నుంచి శ్రేణుల తరలింపునకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ముఖ్య నేతల తరలింపు ఏర్పాట్లను సమీక్షించి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సభలో అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొని లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేస్తారని వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ఆరు గ్యారంటీలను ప్రకటించారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్యారంటీలను అమలు చేసి ప్రజాదరణ పొందుతున్నట్టు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టో కూడా ప్రజా సంక్షేమం, అభివృద్ధికి దిక్సూచిగా ఉండనుందన్నారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో బలమైన విశ్వాసం నెలకొంటుండగా బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేక అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని మంత్రి సురేఖ ధ్వజమెత్తారు. వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన డాక్టర్ కావ్యకు పార్టీ శ్రేణులు అండగా నిలిచి భారీ మెజారిటీతో ఆమెను గెలిపించాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరడం ఆనందంగా ఉందన్నారు.

కాంగ్రెస్ పటిష్ఠానికి కృషి చేస్తా : కడియం

కాంగ్రెస్‌లో చేరాక తొలిసారిగా డీసీసీ భవన్‌కు వచ్చిన స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠానికి అంకితభావంతో కృషి చేస్తానన్నారు. పార్టీ ఇచ్చిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి.. కడియం శ్రీహరిని సన్మానించారు. మీడియా సమావేశంలో వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణతో పాటు మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ తదితరులు పాల్గొన్నారు.

తుక్కుగూడ, లోకసభ ఎన్నికపై సమీక్ష

మీడియా సమావేశం అనంతరం మంత్రి కొండా సురేఖ, వరంగల్ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితర నేతలు డీసీసీ భవన్‌లో సమీక్ష జరిపారు. తుక్కుగూడ సభకు వాహనాల సమకూర్పు, నియోజకవర్గాల వారీగా శ్రేణుల తరలింపు, నాయకులు బాధ్యతల విభజన తదితర అంశాలతో పాటు వరంగల్ లోక్‌సభ ఎన్నిక అంశాలను చర్చించినట్లు తెలిసింది.

నాలా అభివృద్ధి పనుల పరిశీలన

నయీంనగర్, ఏప్రిల్ 2:హనుమకొండ నగరంలోని వరద ముంపు ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక నిధులను విడుదల చేసింది. ఈ పనుల్లో భాగంగా హనుమకొండ నయీంనగర్ ప్రాంతంలోని నాలా, బ్రిడ్జి నిర్మాణ పనులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం అధికారులు, కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత కాలంలో పూర్తిచేసే విధంగా కృషి చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, కార్పొరేటర్లు పోతుల శ్రీనివాస్, జక్కుల రవీందర్, తోట వెంకన్న, ఏనుగుల మానస రాంప్రసాద్, చీకటి శారద ఆనంద్, మాజీ కార్పొరేటర్ వీరగంటి రవీందర్, డాక్టర్ శ్రవణ్, రాహుల్‌రెడ్డి, నాయకులు నాయిని లక్ష్మారెడ్డి, నలుబోల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి 'పది' మూల్యాంకనం ప్రారంభం

- ఏప్రిల్ 3 నుంచి 11 వరకు స్పాట్ క్యాంపు
- జిల్లాలో మూల్యాంకనం కానున్న 2.20 లక్షల జవాబు పత్రాలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం నేటి నుంచి ప్రారంభం కానుంది. ఏప్రిల్ 3 నుంచి నిరాటకంగా 11 వరకు క్యాంపు కొనసాగనున్నది. కాజీపేటలోని ఫాతిమా గర్ల్స్ ఎయిడెడ్ స్కూల్లో టెన్త్ స్పాట్ క్యాంపునకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాకు 2,20000 జవాబు పత్రాలు చేరుకోగా.. ఇప్పటికే వాటికి సంబంధించిన కోడింగ్ పూర్తయ్యింది. హనుమకొండ డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరిస్తుండగా సహాయ క్యాంపు ఆఫీసర్‌గా హనుమకొండ జిల్లా ప్రభుత్వ పరీక్షల అదనపు కమిషన్ దున్నాడ చలపతిరావు వ్యవహరిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే టెన్త్ స్పాట్ క్యాంపులో 1,060 మంది సీఈలు, ఏఈలు విధుల్లో పాల్గొంటున్నారు. కోడింగ్ కోసం 10 మంది ఏసీవోలను నియమించగా, వాల్యూయేషన్ కోసం 8 మంది ఏసీవోలను నియమించినట్లు క్యాంపు అధికారి డాక్టర్ అబ్దుల్‌హై తెలిపారు. క్యాంపులో విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు ఎలాంటి అసౌకర్యాలు చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 9 గంటల వరకు సీఈలు, ఏఈలు క్యాంపులో రిపోర్టు చేయాల్సిందిగా ఆయన ఆదేశాలు జారీ చేశారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి దిష్టిబొమ్మ దహనం



కడియం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 2: స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి దిష్టిబొమ్మను మంగళవారం కేయూ మొదటి గేటు వద్ద విద్యార్థి సంఘాలు అంబేద్కర్ విద్యార్థి సమాఖ్య, బహుజన స్టూడెంట్ ఫెడరేషన్‌ల నేతృత్వంలో దహనం చేసిన నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంద నరేశ్, బొట్ల మనోహర్‌లు మాట్లాడారు. దళిత నేతల త్యాగాల పునాదులపై పురుడుపోసుకుంటున్న దళిత, సామాజిక ఉద్యమాలను కడియం శ్రీహరి అణిచివేస్తున్నారని మండిపడ్డారు. పార్టీలనుంచి టికెట్లు పొందుతూ అవకాశవాద రాజకీయాలనునడుపుతున్నారని మండిపడ్డారు. వరంగల్ నుంచి కడియం కావ్యను ఓడిస్తామని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఖర్గే, రాహుల్‌గాంధీ వరంగల్ నుంచి కావ్యకు ఇచ్చిన సీటు విషయంలో పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. కడియం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి నిజాయితీని నిరూపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మచ్చ పవన్‌కల్యాణ్, కుమ్మరి శ్రీనాథ్, జుపాక చరణ్, ఎల్తూరి సాయికుమార్, ఓడేల అరిస్టాటిల్, జీవన్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన హాస్టల్స్ జాయింట్ డైరెక్టర్లు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 2: కాకతీయ యూనివర్సిటీ నూతనంగా ఆరుగురు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వర్సిటీ హాస్టల్స్ జాయింట్ డైరెక్టర్లుగా నియామించారు. వీరిలో డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ రాధిక, డాక్టర్ రామచంద్రం, స్వప్న, లక్ష్మి, సత్య, శివప్రసాద్‌లున్నారు. వీరిని మంగళవారం కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ నేతృత్వంలో శాలువా, పుష్పగుచ్ఛం అందచేసి అభినందించారు. కాంట్రాక్టు అధ్యాపకులకు జేడీలుగా అవకాశం కల్పించిన కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.అనిల్‌కుమార్, డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ కల్పన, ప్రసన్న రాణి, రమేశ్, వాణి, లక్ష్మణ్‌నాయక్, మంజుల, రాజేశ్‌రెడ్డి, కుమారస్వామి, వందన సిరి, సంతోష్, సౌజన్య ఓవైసీ, రేఖశ్రీ, భాగ్యలక్ష్మి, రాజన్‌బాబు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు లేఅవుట్ అనుమతులు తీసుకోవాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 2: ప్రతీ ఒక్కరు లేఅవుట్ అనుమతులు తప్పకుండా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో లేఅవుట్ అనుమతుల కోసం జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధ్యక్షతన మంగళవారం లేఅవుట్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో లేఅవుట్ అనుమతుల కోసం ప్రతిపాదనలు రాగా, వాటిపై ఈ సమావేశంలో చర్చించారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్లు రాధికా గుప్తా, వెంకట్‌రెడ్డి, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, సిటీ ప్లానర్ వెంకన్న, సాగునీటిపారుదల శాఖ, ల్యాండ్స్ సర్వే విభాగం అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

వరంగల్ కార్పొరేషన్ : లేఔట్ ప్లాట్లు, వెంచర్లు నిబంధనల ప్రకారం చేస్తేనే అనుమతులు ఇస్తామని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మంగళవారం బల్దియా పరిధిలోని ధర్మసాగర్, మడికొండ ప్రాంతాల్లో ఉన్న లేఔట్ ప్లాట్లను క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. లేఔట్ వెంచర్లు చేసే నిర్వాహకులు చట్టానికి లోబడి నిబంధనల ప్రకారం పనులు చేసుకోవాలని సూచించారు. అనంతరం వరంగల్ పల్లవి ఆస్పత్రిలో నిర్మాణాలను సందర్శించారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించగా సంబంధిత అధికారులను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీ వెంకన్న, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అధికారి బషీర్, శానిటరి సూపర్‌వైజర్ సాంబయ్య పాల్గొన్నార

సమయం పాటించని మద్యం షాపులను సీజ్‌చేస్తాం..

- యజమానులకు ఏసీపీ దేవేందర్‌రెడ్డి హెచ్చరిక

హనుమకొండ టౌన్, ఏప్రిల్2: సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్న మద్యం షాపుల లైసెన్స్‌లు రద్దు చేసి షాపులను సీజ్ చేస్తామని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో మద్యం షాపు నిర్వాహకులు వారికి కేటాయించిన సమయంలోనే మద్యం విక్రయాలు జరపాలని, ఆ తర్వాత షాపులను మూసేయాలన్నారు. పోలీస్‌శాఖ ఆదేశాలను ధిక్కరించి అర్ధరాత్రి వరకు మద్యంషాపులు తెరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్టుషాపుల్లో మద్యం పట్టుబడితే సంబంధిత వ్యక్తితో పాటు బెల్టుషాపునకు మద్యం సరఫరా చేసిన మద్యం షాపుల యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కొన్నిషాపులు తెల్లవారుజామునే తెరిచి మద్యం విక్రయాలు చేస్తున్నారని మా దృష్టికి వస్తుందని, అలాంటి వారిని వదిలేదు లేదని హెచ్చరించారు.

రైళ్లలో సాధారణ బోగీల సంఖ్యకు ఐదుకు పెంచాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 2: దేశవ్యాప్తంగా రైళ్లలో సాధారణ బోగీలను ఇప్పడున్న దానికంటే మరో ఐదుకు అదనంగా పెంచాలని ప్రముఖ సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం కేయూ మొదటి గేటు ఎదుట రైళ్లలో బోగీలను ఐదుకు పెంచాలనే డిమాండ్‌తో ప్రధాని నరేంద్రమోదీకి దేశవ్యాప్తంగా కోటి ఉత్తరాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రత, ప్రయాణం రైల్వేశాఖ చర్యలు చేపట్టాలని బోగీలను పెంచాలని డిమాండ్ చేశారు. సమాజంలోని అన్ని వర్గాల నుంచి తమకు మద్దతు లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి రిటైర్డు ఎంపీడీవో విద్యాసాగర్ అధ్యక్షత వహించగా రిటైర్డు ప్రొఫెసర్ వేముల బాల సుందర్, సీఐ శ్రీనివాస్, జాతీయ అవార్డు గ్రహీత వేణుమాధవ్, పద్మ, బ్రహ్మణ సంఘంనాయకులు కృష్ణశాస్త్రి, అవయవదాతల సంఘం నాయకులు మల్లారెడ్డి, ఈశ్వర్‌ప్రసాద్, గంగాధర చంద్రయ్యదయ, కొమ్ము నరేశ్, బెడిద నారాయణ, డీష్ శ్రీను, కొమ్ము అశోక్, కిషన్ నాయక్, శ్రీనివాస్, వేణు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొమ్మల్ల కట్టయ్య జయంతి

వడ్డెపల్లి, ఏప్రిల్ 2 : బొమ్మల్ల కట్టయ్య జయంతిని మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం బొమ్మల్ల కట్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరాల సందీప్, రాష్ట్ర కార్యదర్శి సింగారపు రవిప్రసాద్, ప్రజా సంఘాల నాయకులు కొమ్ముల సురేందర్, పి.నర్సయ్య, మేదరి సారంగపాణి, కొండ్ర నర్సింగరావు, రౌతు అజయ్, కొంగర జగన్, కేడల ప్రసాద్, కృష్ణవేణి, వెంకటస్వామి పాల్గొన్నారు.

వర్సిటీ లైబ్రరీలో మౌలిక సదుపాయాలను కల్పించాలి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 2: కాకతీయ యూనివర్సిటీ ప్రధాన లైబ్రరీలో మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరుతూ మంగళవారం విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు పెద్దఎత్తున నిరసన, ఆందోళనలకు దిగారు. లైబ్రరీలో చల్లని నీటి వసతి, లైబ్రరీ టైమింగ్స్ పెంచడం, ఇంటర్నెట్, వైఫై సౌకర్యం, కుర్చీలు, రైటింగ్ ప్యాడ్లు, లైట్లు, టయిూలెట్స్‌తో పాటు అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు తెప్పించాలని ఆందోళనకు దిగారు. పీడీఎస్‌యూ, గిరిజన విద్యార్థి సంఘం, ఏబీఎస్‌ఎఫ్, బీఎస్‌ఎఫ్‌తోపాటు లైబ్రరీలో చదువుతున్న విద్యార్థుల నేతృత్వంలో లైబ్రరీనుంచి వర్సిటీ పరిపాలన భవనం వరకు నిరసన ఆందోళన ప్రదర్శనలు చేపట్టారు. పరిపాలన భవనం ఎదుట బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లైబ్రరీలోని సమస్యలను పరిష్కరించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డికి వినతి పత్రాన్ని అందచేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, గిరిజనవిద్యార్థి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ రాజునాయక్, ఏబీఎస్‌ఎఫ్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంద నరేశ్, బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జి బొట్ల మనోహర్‌లు మాట్లాడారు. ఈ సందర్భంగా నిరసన ఆందోళన చేపట్టిన విద్యార్థులకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్‌లు నచ్చచెప్పారు. సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు.

మాడ వీధులపై అధికారుల సమావేశం

వరంగల్ కల్చరల్, ఏప్రిల్ 2: శ్రీభద్రకాళి ఆలయ మాడ వీధులు, రాజగోపురాల నిర్మాణ పనులపై దేవాదాయ శాఖ, 'కుడా' అధికారులు ఆలయ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. నిర్మాణ పనులు ప్రారంభంపై ఇతర అంశాలపై ఇంజనీర్లతో మాట్లాడి సమీక్ష చేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, శ్రీభద్రకాళి దేవస్థానం కార్యనిర్వాహణాధికారిణి శేషు భారతి, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రాయల సునిత, 'కుడా' అధికారులు అజిత్‌రెడ్డి, భీంరావ్‌తోపాటు కుడా కార్యదర్శి డీఈలు, ఏఈల సిబ్బంది పాల్గొన్నారు.

ధీరత్వానికి ప్రతీక సర్వాయి పాపన్న

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్



బీఆర్ఎస్ కార్యాలయంలో సర్వాయి పాపన్న వర్ధంతి

రాంనగర్, ఏప్రిల్ 2: తెలంగాణ బహుజనుల ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ప్రతీక అని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ కొనియాడారు. సర్వాయి పాపన్న వర్ధంతిని మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయభాస్కర్ మాట్లాడుతూ.. నబ్బుండవర్గాలకు సామాజిక, రాజకీయ సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, నేతలు సుందర్‌రాజ్, మర్రి యాదవరెడ్డి, లలితాయాదవ్, పులి రజనీకాంత్, నయీమ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

- కాజీపేట: కాజీపేట చౌరస్తాలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెడ్‌క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షుడు పెద్ది వెంకటనారాయణ గౌడ్ హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడారు. అగ్రవర్ణ భూస్వాములను ఎదురించిన చరిత్ర పాపన్నదన్నారు. బహుజన రాజ్యస్థాపనకు ఆయన చేసిన పోరాటం గురించి వివరించారు. రాష్ట్ర కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పల్లగాని అమ్మయ్య, గౌని సాంబయ్య, బుర్ర శ్రీనివాస్, మోడెం రాజేందర్, బైరి ప్రభాకర్, వెంకట్రాజ్యం, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

8వతేదీ నుంచి ఎస్‌ఏ-2 పరీక్షలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఏప్రిల్ 8 నుంచి ఎస్‌ఏ-2 (సమ్మెటివ్ అసెస్‌మెంట్-2) పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఏప్రిల్ 8 నుంచి 20 వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం డీసీఈబీ ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రాలను ముద్రించి సంబంధిత మండల విద్యావనరుల కేంద్రాలకు పంపించినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్ష నిబంధనలకు అనుగుణంగా పరీక్ష పత్రాలను సంబంధిత పాఠశాలలకు పంపిణీ చేస్తూ పరీక్షలకే పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, ఏప్రిల్2: డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 28 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షాకూర్ తెలిపారు. మంగళవారం 28 మందిని కోర్టులో హాజరు పరచగా డ్రంక్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ 18 మందికి 20,500. డ్రైవింగ్ లైసెన్స్‌లేని 10 మందికి రూ.7,400 జరిమానాను న్యాయమూర్తి రమేశ్ విధించినట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి చేరికలు

హనుమకొండ టౌన్, ఏప్రిల్2: వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన 12 వార్డు మెంబర్ తొర్రి లక్ష్మణ్, 11వ వార్డు మెంబర్ కనిగంటి కవిత, విజయ్ కుమార్, దేశ్ రాము మంగళవారం బీజేపీ పార్టీలో చేరారు. వీరికి హనుమకొండలో వరంగల్ బీజేపీ అభ్యర్థి ఆరూరి రమేశ్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గ్రేటర్ పరిధిలోని 14 డివిజన్‌కు చెందిన సూరం రాజు, మాధవి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుంచి సిలువేరు పుష్ప, అనిత, లలిత, రాణి, జ్యోతి, లక్ష్మీ, శిరీష, మల్లికాంబ చేరగా ఆరూరి పార్టీలోకి ఆహ్వానించారు.

సాంకేతిక సమస్యతో రోగుల ఇబ్బంది



చిట్టీలు రాసి ఇస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 2: కేఎంసీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఓపీ చిట్టీల జారీలో ఆలస్యం కావడంతో రోగులు ఇబ్బందులు పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. టెక్నికల్ సమస్యతో ఓపీ చిట్టీలు ఇవ్వడం ఆలస్యం కావడంతో రోగులో వేచి చూడాల్సి వచ్చింది. కంప్యూటర్ ఆపరేటర్లు మాన్యువల్‌గా చిట్టీలు ఇచ్చారు. ఒక్కో రోగి పేరు పేపర్‌పై రాసి మాన్యువల్‌గా ఇవ్వడం మూలంగా ఆలస్యం జరిగింది. వేచి చూడాల్సి రావడంతో కొందరు రోగులు నిలబడలేక అవస్థలు పడ్డారు. టెక్నికల్ సమస్య కావడంతో ఆలస్యం జరిగిందని కంప్యూటర్ ఆపరేటర్లు తెలిపారు.

శేషజీవితం ఆనందమయంగా ఉండాలి

మడికొండ, ఏప్రిల్ 2: మడికొండలోని హరిహర క్షేత్రంలో జూనియర్ అసిస్టెంట్‌గా సుదీర్ఘ కాలం విధులు నిర్వహించిన కల్వల రామక్రిష్ణారావు ఉద్యోగ విరమణ పొందారు. ఈసందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం దేవస్థాన ధర్మకర్తల మండలి, ఆలయపూజారులు, సిబ్బంది రామక్రిష్ణారావును పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. చైర్మన్ రఘుచందర్ మాట్లాడుతూ.. రామక్రిష్ణారావు శేష జీవితం సుఖసంతోషాలతో సాగిపోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు బైరి రాజు, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, వస్కుల ఉమ, ఆలయ సిబ్బంది, కొత్తకొండ వీరభద్రస్వామి దేవస్థాన అర్చక సిబ్బంది, మడికొండ వాసులు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని వినియోగించుకోవాలి

హనుమకొండ టౌన్, ఏప్రిల్2: ఎన్పీడీసీఎల్ ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బాటసారులు వినియోగించుకోవాలని సీఎండీ వరుణ్‌రెడ్డి సూచించారు. తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఎండీ మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీడీఈఏ ప్రధాన కార్యదర్శి నార్ల సుబ్రమణ్యేశ్వర్ రావు, అధ్యక్షుడు ఇంద్రసేనా రెడ్డి, సహాయ ప్రధాన కార్యదర్శి పి.మల్లిఖార్జున్, కంపెనీ సలహాదారుడు జె.మధుసూదన్, మహిళ ప్రతినిధురాలు జ్యోతిర్మయి, సర్కిల్ సెక్రటరీలు అనిల్‌కుమార్, వంశీ, కృష్ణ, తరుణ్, రాజు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యాన్ని తెలియజేయండి

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 2: ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు ప్రాదాన్యతపై తెలియజేయాలని బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ అమృత్ మిత్రలకు సూచించారు. మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో స్వీప్-2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిసుర్ రషీద్ మాట్లాడారు. ఓటు హక్కు అనే వజ్రాయుధం లాంటిదని, ఎలాంటి ప్రలోభాలకు లోబడకుండా అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేలా అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజక వర్గం నోడల్ అధికారి కోల రాజేశ్‌కుమార్, ఎస్‌ఈ ప్రవీణ్‌చంద్ర, సెక్రెటరి విజయలక్ష్మి, ఈఈలు శ్రీనివాస్, రాజయ్య, డీఈలు, సీవోలు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసింది బీజేపీ

ధర్మసాగర్, ఏప్రిల్ 2: భారత దేశ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేసింది భారతీయ జనతా పార్టీ అని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మంగళవారం మండల నాయకుడు రాజారపు రత్నం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సమితి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి, లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటు పరం చేస్తుందని ఆయన విమర్శించారు. సకాలంలో సాగునీరు అందక పంట పొలాలు ఎండి పోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్, మండల సహాయ కార్యదర్శి వెంకటేష్, ప్రభాకర్, బాబు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవోస్ కాలనీని అభివృద్ధి చేయండి..

మడికొండ, ఏప్రిల్ 2: మడికొండలోని అయోధ్యపురం రోడ్, టీఎన్‌జీవోస్ కాలనీ వాసులు మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కుర్ల మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ, మిషన్ భగీరథ పైపులైన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వారం రోజుల్లో సమస్యల పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బుర్ర శ్రీధర్, కల్లూరి అనంతరాములు, తాడూరి సురేందర్, గంగారపు యాదగిరి, మాట్ల బాబు, తాటికొండ రమేష్‌చారి(బేరింగ్), సంకె ప్రవీణ్, కుర్ల మోహన్, బైరి లింగమూర్తి పాల్గొన్నారు.

రావు పద్మను కలిసిన బీజేపీ నాయకులు

మడికొండ, ఏప్రిల్ 2: బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను మడికొండకు చెందిన బీజేపీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పార్టీ అభ్యర్థి ఆరూరి రమేష్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త చిత్తశుద్ధితో కృషి చేయాలని రావు పద్మ పార్టీ శ్రేణులను కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు పొనగోటి వెంకట్రావు, దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, తక్కళ్ళపల్లి నిఖిల్‌రావు, గడ్డం కుమార్, దార ధనుంజయ్, బుర్ర సురేష్, చట్ల అజయ్, దారంగుల రాజేష్, దపెల్లి అరవింద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, ఏప్రిల్2: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు సిటిజన్ క్లబ్, భద్రకాళి బండ్ ఏరియా, వాసవికాలనీ, దుర్గాదేవి కాలనీలో, ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు కేయూ సబ్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌పుర ఏరియాలో విద్యుత్ సరఫరా జరగదన్నారు.

ఆటిజంపై అవగాహన పెంచుకోవాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 2: ఆటిజం (మందబుద్ధి)పై అవగాహన పెంచుకోవాలని మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండా రామలీల అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని డాక్టర్ నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండా రామలీల మాట్లాడుతూ.. అధిక మేధాశక్తి కలిగిన తల్లిదండ్రులకు ఆటిజం పిల్లలు ఎక్కువ మోతాదులో పుడుతున్నారని అన్నారు. నెలలు నిండకుండానే శిశువుకు జన్మనివ్వడం ద్వారా ఆటిజం అనే వ్యాధి లక్షణాలు సంక్రమిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఎన్‌టీ వైద్యుడు సుదీప్, వసుధ, కోడం కల్యాణ్, పద్మ, సదానందం, రాధికారెడ్డితో పాటు బీఈడీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 2: వడదెబ్బ నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలపై బల్దియా కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే చేతుల మీదుగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. చీఫ్ సెక్రెటరీ ఆదేశాల మేరకు ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్‌లు, పారిశుధ్య సిబ్బంది ప్రతీరోజు తప్పకుండా 4 లీటర్ల నీరు తాగాలని సూచించారు. ఓఆర్‌ఎస్, జ్యూస్‌లవంటి ద్రవపదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎస్‌హెచ్‌ఓ డాక్టర్ మల్లం రాజేశ్, వరంగల్ డీఎంహెచ్‌వో వెంకటరమణ, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, శానిటరీ సూపర్‌వైజర్లు మాదాసి సాంబయ్య, నరేందర్, భాస్కర్‌లతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపునివ్వాలి

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 2: దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న, అనారోగ్యానికి గురైన, గర్భిణీ, వికలాంగులు, ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్న ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి మినహాయింపునివ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.సదాశివరెడ్డి, పెండెం రాజు కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... వేసవి కాలం దృష్ట్యా పోలింగ్ స్టేషన్లలో కూలర్లు, తాగునీటి వసతిని కల్పించాలని కోరారు. పోలింగ్ విధుల నిర్వహణ అనంతరం డ్యూటీ సర్టిఫికేట్లు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సీహెచ్. రవీందర్‌రాజు, కార్యదర్శి సీఎస్‌ఆర్ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన కాంగ్రెస్

వడ్డెపల్లి, ఏప్రిల్ 2: అత్యధిక జనాభా కలిగిన మాదిగ సమాజానికి వరంగల్ లోక్‌సభ టికెట్ కేటాయించకుండా మాదిగలను కాం గ్రెస్ మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ జాతీ య అధికార ప్రతినిధి మంద కుమార్ మాది గ దుయ్యబట్టారు. మాదిగలకు లోక్‌సభ టికె ట్ ఇవ్వకుండా కాంగ్రెస్ మోసం చేసిందని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డిల దిష్టి బొమ్మలను దహ నం చేశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మంద కుమార్ మాదిగ మాట్లాడు తూ.. రాష్ట్రంలో 90 లక్షల జనాభా, వరంగల్ ఉమ్మడి జిల్లాలో 9 లక్షల జనాభా కలిగిన మాదిగ సమాజానికి లోక్‌సభ స్థానాలను కేటాయించకుండా కాంగ్రెస్ పార్టీ మొండి చేయి చూపిందని విమర్శించారు. వరంగల్ లోక్‌సభ టికెట్ స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యకు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని అన్నా రు. కడియం శ్రీహరి మాదిగ సమాజాన్ని రాజకీయంగా ఎదగకుండా అణచివేస్తున్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మాదిగలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా వరంగల్ లోక్‌సభ స్థానాన్ని మాదిగలకు కేటాయించాలని మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ రాష్ట్ర, జిల్లా నాయకులు రేణుకుంట్ల ఉమామహేష్, చేతళ్ల శివ, జేరిపోతుల సారంగపాణి మాదిగ, అక్కెనకుంట వెంకటస్వామి, రాజారపు కిరణ్, నద్దునూరి కిరణ్, కుమ్మరి శ్రీనివాస్, తిప్పారపు మల్లేష్, మంద స్వరాజ్, సుంచు రజిని, రాజారపు క్రాంతి, జేరిపోతుల కరుణాకర్, ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సెంట్రల్ ఆఫీస్, మచిలీపట్నం (1923)
పట్టాభి సీతారామయ్య



జాతీయోద్యమ చరిత్రలో మరుపురాని, మరువలేని వ్యక్తి డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య. వందేళ్ల కిందటే ఆంధ్రా బ్యాంకు, సహకార బ్యాంకు, బీమా కంపెనీ తదితర సంస్థలను నెలకొల్పిన దార్శనికుడు ఆయన. ఆంధ్రుల అస్తిత్వ చిహ్నామైన ఆంధ్రాబ్యాంకుకు వందేళ్లు పూర్తి అయింది. ఇప్పుడు ఆ పేరు చరిత్రగా మిగిలినా... భారత జాతీయ కాంగ్రెస్‌లో చరిత్ర సృష్టించిన 'తెలుగోడు'గా పట్టాభి సీతారామయ్య ఖ్యాతి చిరస్మరణీయం. ఆయన మనుమరాలు **మారెళ్ల శారద** చెబుతున్న తాతయ్య జ్ఞాపకాలు 'నవ్య'కు ప్రత్యేకం...

అది అన్యాయం... అయినా

ఆయన పేరు చరితార్థం

"తెలుగువారి అస్తిత్వానికి చిహ్నామైన 'ఆంధ్రా బ్యాంకు' చరిత్రగా మిగిలిపోవడాన్ని తలచుకున్నప్పుడు... దాని వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్యకు మనుమరాలిగా నా హృదయం మెలిపెట్టినట్టుంటుంది. నాదే కాదు, ఆయన మనుమలు, మనుమరాళ్ళగా... మా అందరిదీ ఇదే భావన. కోఠిలోని ఆంధ్రా బ్యాంకు ప్రధాన కార్యాలయం ముందు ఇప్పుడు యూనియన్ బ్యాంకు హోర్డింగ్ చూస్తున్నప్పుడల్లా నా మనసు విలవిలలాడిపోతుంది. అదీ ప్రతిష్టాత్మక బ్యాంకుకు వందేళ్లు పూర్తికావడానికి కొద్ది నెలలు ముందు విలీనం చేసి అన్యాయంగా వ్యవహరించారు. అప్పుడు మమ్మల్ని చాలామంది పోరాడమన్నారు. కానీ మనమంతా కలిసి పోరాడదామన్నవాళ్లు లేరు. అయితే బ్యాంకు సిబ్బంది మాత్రం 'విలీనం చేసినా కనీసం ఆంధ్రా బ్యాంకు పేరు అలానే ఉంచాలి' అని ఉద్యమించినా లాభం లేకపోయింది. బహుశా ఉత్తరాది వారికి దక్షిణాది వారి భావోద్వేగాలు అంత ముఖ్యం కాదేమో! లేదంటే, మనకే మన ప్రాంతీయ అస్తిత్వం పట్ల శ్రద్ధ తక్కువైనా అయిుండవచ్చు. అసలు ఈ ప్రాంతీయ తారతమ్యాలు ముందు నుంచి దేశంలో ఉన్నాయనిపిస్తోంది. జాతీయ కాంగ్రెస్‌లో ముఖ్య పాత్ర పోషించిన తాతయ్య దక్షిణాది వ్యక్తి కావడంవల్లే... జాతీయోద్యమ కాంగ్రెస్‌లో ఉత్తరాది నాయకులకు లభించినంత గుర్తింపు, గౌరవం ఆయనకు దక్కలేదు. కనీసం ఆంధ్రులమైనా ఆ మహానుభావుడిని సముచితంగా గౌరవించుకుంటున్నామా? అంటే అదీ లేదు కదా! అయినా, ఆయన రాసిన 'భారత జాతీయ కాంగ్రెస్ చరిత్ర' అత్యంత ప్రామాణికం కనుక, అలా మా తాతయ్య పేరు చరితార్థం.

> తాతయ్య మధ్యప్రదేశ్ గవర్నర్‌గా ఉన్న సమయంలో ఒక రోజు రాజ్‌భవన్ సిబ్బంది క్వార్టర్స్ గోడలు బీటలు వారి కూలిపోయేట్టు ఉండటం గమనించారట. ఆ వెంటనే వాటి మరమ్మతులకు నిధులు కేటాయించాల్సిందిగా ప్రభుత్వానికి లేఖ రాస్తే... రోజులు గడుస్తున్నా అవతలి నుంచి సమాధానం రాలేదు. దాంతో రాజ్‌భవన్ ప్రాంగణంలోని గుబురుగా పెరిగిన చెట్ల కొమ్మలను కొట్టించి... అవి వేలం వేయగా వచ్చిన సొమ్ముతో క్వార్టర్స్ గోడలు బాగుచేయించారు. పట్టాభి సీతారామయ్యగారి వ్యవహార శైలికి ఇదొక చిన్న ఉదాహరణ. ఆంధ్రాబ్యాంకు, ఇన్సూరెన్స్ కంపెనీ, కృష్ణా సహకార బ్యాంకులాంటి సంస్థలెన్నింటినో తాతయ్య స్థాపించారు. వాటన్నిటిలో మన మాతృభాష తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు సాగాలని ఆదేశించారు. ఆంధ్ర రాష్ట్రోద్యమానికి ప్రధాన మద్దతుదారుగా ఉండడం వల్లే తాతయ్య పట్ల ఆనాటి ఒకరిద్దరు జాతీయ స్థాయి పెద్ద నేతలు కినుకవహిస్తుండేవారని కూడా విన్నాను.

మనుమలంటే మురిపెం...

తాతయ్యకు మనుమలంటే మహామురిపెం. మా పెద్దనాన్న వెంకటరత్నానికి ఎనిమిదిమంది సంతానం. మా మేనత్త కామేశ్వరికి నలుగురు పిల్లలు. ఆమె పెద్ద కూతురును రాయప్రోలు సుబ్బారావుగారి అబ్బాయికి, చిన్న కూతురును దేవులపల్లి కృష్ణశాస్త్రి గారబ్బాయికి ఇచ్చి పెళ్లి చేశారు. మా నాన్న రాధాకృష్ణకు మేము ఏడు మందిమి. అలా 1940నుంచి ఏడాదికి ఒకరు నట్టింట ఊయలలో మనుమరాలు లేదంటే మనుమడు ఉండడాన్ని చూసి తాతయ్య తెగ సంబరపడేవారు. కోడళ్లను చాలా బాగా చూసుకునేవారు. హైదరాబాద్‌లో మొదట గడ్డిఅన్నారంలో ఉండేవారట.



"మగవాళ్లు ఉదయం వెళ్లి సాయంత్రం ఇంటికి చేరతారు, అప్పటి వరకు ఊరి చివర పిల్లలతో ఉండటం భయంగా ఉంటుంది కదా!" అని మా అమ్మ అనగానే... హిమాయత్ నగర్‌లో ఇల్లు కొన్నారు. అదీ కోడలి మాటలకు ఆయన ఇచ్చిన విలువ. పట్టాభి సీతారామయ్య గారి మనుమలమంతా వేడుకలు, ప్రత్యేక సందర్భాలలో కలుస్తుంటాం. ఉద్యోగరీత్యా తలా ఒకచోట స్థిరపడినా... తాతయ్య కోరుకున్నట్టు మేమంతా ఒక్కటిగా కలిసిమెలిసి ఉంటాం.

బంగారు కరవాలం బహూకరణ...

నేను పట్టాభి సీతారామయ్యగారి చిన్న కుమారుడు రాధాకృష్ణ కుమార్తెను. తాతయ్య కన్నుమూసేనాటికి నాకు రెండేళ్లు. మధ్యప్రదేశ్ గవర్నర్‌గా పదవీకాలం ముగిసిన నాటి నుంచి చనిపోయే వరకు తాతయ్యతో పాటు మేము హిమాయత్‌నగర్‌లో కలిసున్నాం. పెద్దనాన్నగారి కుటుంబమంతా చెన్నైలో ఉండేవారు. తాతయ్య జ్ఞాపకాలు నాకు గుర్తు లేకున్నా అమ్మా నాన్న ఎప్పుడూ చెబుతుండేవారు. నన్ను భుజాన వేసుకొని వసారాలో తిరుగుతూ... 'శారద నీరదేందు ఘనసార...' అంటూ పోతన భాగవత పద్యం పాడుతూ ఆడిస్తుండేవారట. మా పెద్దక్కయ్య సుదక్షిణాదేవి తాతయ్య వెంట తరచుగా వెళుతుండేవారు. కొన్నాళ్ళ కిందట ఆమె చనిపోయారు. తాతయ్య జైలుజీవితం సమయంలో ఆయనకు వచ్చిన ఉత్తరాల వెనుక భాగంలో కొన్నివ్యాసాలు రాసుకున్నారు. వాటన్నిటిని నాన్న భద్రపరిచారు. ఇంగ్లండ్‌కు చెందిన రాజనీతిశాస్త్ర పరిశోధకురాలు జేన్స్ ఒకరోజు మా ఇంటికొచ్చి వాటిని ఇవ్వాల్సిందిగా కోరితే... నా చేతులమీదగా ఆమెకు ఇచ్చాను. తర్వాత వాటిని ఢిల్లీలోని నెహ్రూ స్మారక మ్యూజియంకు అప్పగించినట్టు తెలిసింది. అరబ్ రాజు తాతయ్యకు బంగారు కరవాలాన్ని బహూకరించారు. దాన్ని తాతయ్య మరణానంతరం పబ్లిక్ గార్డెన్స్‌లోని హెల్త్ మ్యూజియానికి మా నాన్న అప్పగించారు. అయితే, ఇప్పుడు అది ప్రదర్శనశాలలో కనిపించడంలేదు. దాని గురించి అడిగితే... మ్యూజియం బాధ్యులు తెలియదంటున్నారు.

ప్లీడరు కాదు డాక్టరు...

తాతయ్య చిన్నతనంలోనే ఆయన తండ్రి చనిపోవడంతో తీవ్రమైన పేదరికాన్ని అనుభవించారు. చాలారోజులు ఒంటిమీద చొక్కా లేకుండానే స్కూలుకు వెళ్లారు. వీధి లైటుకింద చదువుకున్నారు. అలాంటి తాతయ్యకు నాయనమ్మ రాజేశ్వరితో పరిణయం... ఆయన జీవితాన్ని మార్చింది. కాకినాడలో గంజాం వెంకటరత్నం పంతులు గారని బాగా పేరు, డబ్బున్న వకీలు. ఆయన ఒక్కగానొక్క కుమార్తెకు పెళ్లి సంబంధాలు చూస్తూ... 'బాగా తెలివైనవాడు, అందమైనవాడు, పేదవాడు అయిన అబ్బాయిని చూసిపెట్టమ'ని తన స్నేహితుడు రఘుపతి వెంకటరత్నం నాయుడుగారితో చెప్పారట. దాంతో ఆయన బందరు నోబుల్ కాలేజీలో తన ప్రియ శిష్యుడైన పట్టాభి సీతారామయ్యను సూచించారట. అలా తాతయ్య గంజాం వెంకటరత్నంగారి అల్లుడయ్యారు. తనలాగే అల్లుడు కూడా వకీలు అవ్వాలని 'లా' చదవమని అంటే... 'అబద్ధం ఆడకుండా ప్లీడరుగా పైకిరావడం సాధ్యమేనా?" అని ప్రశ్నించారట. "అది కుదరని పని" అని మామగారి నుంచి బదులు రావడంతో... తాతయ్య మెడిసిన్‌లో చేరారు. తర్వాత మచిలీపట్నంలో ఐదేళ్లు ప్రాక్టీసుకూడా చేశారు. బందరులో మా ఇంటికి గాంధీగారు వచ్చారని, మా ఇంటిలో బసచేశారని మా అమ్మ చెబుతుండేవారు.


ఇప్పటికీ ఆచరిస్తున్నాం...

చిన్నప్పటి నుంచి డబ్బు విలువ తెలిసిన తాతయ్య మనుమలు, మనుమరాళ్ళతో రోజూ జమాఖర్చులు రాయించేవారట. అప్పుడప్పుడు వాళ్ళందరినీ మెరీనా బీచ్‌కు తీసుకెళ్లి ఒక్కొక్కరికీ ఒక్కో చాక్లెట్ ఇచ్చేవారట. అది తిన్న తర్వాత కాగితం మాత్రం ఇంటికొచ్చి చెత్తబుట్టలోనే వేయాలి. అదీ ఆయన నేర్పిన క్రమశిక్షణ. భోజనాల సమయంలోనూ పిల్లలం ఎవరిమైనా కంచంలో అన్నం మిగిల్చితే... "అదే వాళ్ళకు సాయంత్రం పెట్టండి" అని సున్నితంగా మందలించేవారట. ఇలా తాతయ్య మా వాళ్ళకు చెప్పినవీ, వారి నుంచి నేను విన్నవీ ఇప్పటికి కూడా ఆచరించడానికి ప్రయత్నిస్తున్నాం. తాతయ్య చివరి రోజుల్లో... నిత్యం సాయంత్రం ఆయనను పీవీ నరసింహారావు, నీలం సంజీవరెడ్డి లాంటి పెద్దలు ఇంటికి వచ్చి కలిసేవారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు హైదరాబాద్ వచ్చిన ప్రతిసారీ తాతయ్యను చూడకుండా వెళ్లేవారు కాదు. ఇలా తాతయ్య జ్ఞాపకాలు బోలెడు. అవి మాకు ఎంతో అపురూపమైనవి, విలువైనవి. తాతయ్య కేవలం స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమే కాదు ఒక దార్శనికుడు. వందేళ్ళ కిందట బ్యాంకులు, బీమా సంస్థ నెలకొల్పడమంటే మాటలా! అలాంటి మహనీయుణ్ణి ప్రస్తుతం సమాజం మరవడం బాధాకరం. భోగరాజు పట్టాభి సీతారామయ్య మనుమలుగా మాకు గుర్తింపు అక్కర్లేదు. చరిత్రలో ఆయనకు ఇవ్వాల్సిన స్థానాన్ని, దక్కాల్సిన గౌరవాన్ని ఆయనకు ఇస్తే చాలు."

• సాంత్వన్

నేతాజీకి పట్టాభి సలహాలు

రాజకీయ పదవులకు మొదటి నుంచి తాతయ్య చాలా దూరం. బాబూ రాజేంద్రప్రసాద్ గారి ఒత్తిడి మేరకు మధ్యప్రదేశ్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆ తరువాత అవకాశాలు వచ్చినా మరే పదవీ స్వీకరించలేదు. అంతకుముందు చక్రవర్తి రాజగోపాలాచారి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంత్రి పదవి ఇస్తానన్నా తాతయ్య తిరస్కరించారు. భారత జాతీయ కాంగ్రెస్‌కు 1939 నాటి అధ్యక్ష ఎన్నికల్లో గాంధీ మాట కాదనలేక నేతాజీకి ప్రత్యర్థిగా పట్టాభి సీతారామయ్య పోటీ చేసిన సంగతి తెలిసిందే! అప్పుడే 'పట్టాభి ఓటమి నా ఓటమి' అని గాంధీ ప్రకటించారు. అయితే ఆ ఎన్నికల తర్వాత కూడా నేతాజీతో తాతయ్య స్నేహం పూర్వంలాగే కొనసాగింది. అదే సమయంలో నేతాజీ అనారోగ్యానికి లోనయ్యారని తెలియగానే తాతయ్య వెళ్లి పరామర్శించారు. ఒక వైద్యుడిగా కూడా బోస్‌కు సూచనలు ఇచ్చారని నాకు మా నాన్న చెప్పారు.


నేతాజీతో పట్టాభి సీతారామయ్య

కూల్ కూల్ కాటన్

తేలికగా, మెత్తగా, సౌకర్యంగా ఉండే కాటన్ చీరలను ఇష్టపడని వాళ్లుండరు. మరీ ముఖ్యంగా వేసవి వేడిని భరించడానికి ఈ చీరలెంతో అనువుగా ఉంటాయి కాబట్టే మహిళల మనసు కాటన్ శారీస్ మీదకే మళ్లుతూ ఉంటుంది. అలాంటి కొన్ని సమ్మర్ శారీస్ మీద ఓ లుక్కేద్దామా..!



లినెన్ కాటన్

మెత్తగా, ఒంటికి హత్తుకుపోయే ఈ కాటన్ శారీస్ తాజా ట్రెండ్‌గా మారింది. వెండి, బంగారు జరీ అంచుతో ఆకర్షణీయమైన డిజైన్లతో, రంగులతో మనసును కట్టిపడేసే ఈ చీరలు ఈవినింగ్ పార్టీలకు, చిన్నపాటి వేడుకలకు కూడా ధరించవచ్చు. సింపుల్ జ్యువెలరీతో ఈ శారీని జత చేస్తే, నలుగురిలో హుందాగా కనిపించవచ్చు.



ప్రింటెడ్ కాటన్

పూలు, లతలు, జామెట్రీ డిజైన్లతో ఆకర్షణీయమైన రంగుల్లో దొరికే ప్రింటెడ్ కాటన్ శారీస్ అందరికీ నప్పుతాయి. అయితే నాణ్యమైన కాటన్ అయితే రంగులు వెలసిపోకుండా ఉంటాయి. ఫ్యాబ్రిక్ కూడా ఎక్కువ కాలం మన్నుతుంది. కాబట్టి ధర ఎక్కువే అయినా నాణ్యత కలిగి ఉన్న కాటన్ శారీస్‌నే ఎంచుకోవాలి.



కలంకారి

ఈ చీరల ప్రత్యేకత గురించి తెలియని మహిళలుండరు. అరుదైన డిజైన్లు, అందమైన రంగులు కలిగి ఉండే కలంకారి చీరలు ఎప్పటికీ వన్నె తరగవు. ఇటుక, మెరూన్, పసుపు రంగులను కలిగి ఉండే కలంకారి చీరలు రెట్టింపు ఆకర్షణీయంగా ఉంటాయి. కాంట్రాస్ట్ కలర్స్ కలిగి ఉండే కలంకారి చీరలను ఎంచుకుంటే సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ మీరే అవుతారు. చీరకు తగిన బ్లౌజ్ ధరించడం కూడా ముఖ్యమే కాబట్టి, బ్లౌజ్ డిజైన్ మీద ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి.



ఎముకలు ఆరోగ్యంగా...

- వేసవిలో వచ్చే ఈ లిచి పండులో అధికంగా కేలరీలుంటాయి. పండుతో పాటు జ్యూస్ రూపంలో వీటిని తీసుకోవచ్చు. వంద గ్రాముల లిచిలు తీసుకుంటే 66 కేలరీలుంటాయి. ఇందులో ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్లు అధికంగా ఉంటాయి.
- విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్స్ వీటిలో పుష్కలం.
- బ్లడ్ ప్రెషర్‌ను నియంత్రిస్తుంది. తద్వారా గుండె సమస్యలు దరిచేరవు. ముఖ్యంగా ఫ్రీరాడికల్స్ వల్ల కణాలకు డ్యామేజ్ కాకుండా నిరోధించే లక్షణం వీటికి ఉంది. ఇందువల్ల క్యాన్సర్ లక్షణాలు వచ్చే అవకాశాలు తక్కువ.
- వేసవిలో ఫ్లూ లక్షణాలుంటే ఈ పండ్లు తినటం వల్ల తగ్గిపోతాయి. ముఖ్యంగా నొప్పులు తగ్గుతాయి.
- విటమిన్- ఇ ఉండటం వల్ల చర్మ రక్షణకు మేలు కలుగుతుంది. స్కిన్ ఇన్‌ఫెక్షన్లు పోతాయి.
- మాంగనీస్, కాపర్ ఉండటం వల్ల ఎముకల గట్టిదనానికి ఉపయోగపడతాయివి.
- ఉదయంపూట లిచిపండ్లను తింటే రిఫ్రెష్‌గా ఉండటంతో పాటు టెన్షన్ తగ్గుతుంది.

మార్పునకు మార్గదర్శి

జర్నలిస్ట్‌గా జనం సమస్యలను ఎత్తిచూపుతారు. సామాజిక కార్యకర్తగా వాటికి పరిష్కారాలూ చూపిస్తారు. అమ్మ వెంట ఆవుల్ని మేపుతూ తిరిగిన రోజుల నుంచీ... తాజాగా 'ఫోర్బ్స్ ఇండియా- ఉమెన్ పవర్' జాబితాలో స్థానం సంపాదించుకొనే వరకూ... 34 ఏళ్ల జయంతి బురుడా జీవితంలో అనేక మలుపులు. ఒడిశాలోని మారుమూల పల్లెలో ప్రారంభమైన ఆమె ప్రయాణం ఇప్పుడు ఎందరో బాలికలకు స్ఫూర్తి మంత్రం.

జయంతి బురుడా స్వగ్రామం ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాలోని సెర్పల్లి గ్రామం. సామాన్య గిరిజన కుటుంబంలో... పదకొండుమంది తోబుట్టువుల్లో తొమ్మిదో బిడ్డగా జన్మించారు జయంతి బురుడా. "మా ఊరి చుట్టూ ఉన్న అడవిలోకి వెళ్ళి ఆవుల్ని మేపడం, కట్టెలు సేకరించడం, మహువా పూలను ఏరడం... ఇదీ బాల్యంలో నా దినచర్య. ఆరేళ్ళ వయసులో నన్ను బడిలో చేర్పారు. చదువు మీద నాలో ఆసక్తి పెరగడానికి కారణం... ఇక్కడ ఉన్న ఇద్దరు టీచర్లు. సబ్జెక్ట్స్ అన్నీ వాళ్ళే బోధించేవారు" అని నాటి రోజులను గుర్తు చేసుకున్నారు జయంతి. అక్కడ డ్రాపవుట్స్ చాలా ఎక్కువగా ఉండేవి. ఆడపిల్లలు ఏడో క్లాసు దాటడం అరుదే. కానీ జయంతి పట్టుదలగా చదివారు. ఆ స్కూల్ నుంచి పదో క్లాసులో పదిమంది పాసైతే... బాలిక ఆమె ఒక్కరే. ఆ తరువాత మల్కన్‌గిరిలో ఆమె కాలేజీ చదువు సాగింది. అక్కడే సామాజిక సేవ పట్ల ఆమెకు ఆసక్తి కలిగింది. మురికివాడల్లోని కూలీల పిల్లలకు ఉచితంగా ట్యూషన్లు చెప్పడం మొదలుపెట్టారు. అలాగే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో కార్యకర్తగా చేరారు. "మన సమాజంలో రకరకాల వివక్షలు ఉన్నాయి. కొన్ని పైకి కనిపిస్తాయి. మరికొన్ని కనిపించకుండా బాధ పెడతాయి. సామాజిక సేవలో దిగాక... పురుషాధిక్యత ఎలా ఉంటుందనేది తొలిసారిగా రుచి చూశాను. అత్యున్నత స్థానంలో ఉన్నవారు నా ప్రశ్నలకు కానీ, విజ్ఞాపనలకు కానీ ఏమాత్రం స్పందించేవారు కాదు. కంటితుడుపు పనుల వల్ల ప్రయోజనం ఏమిటనిపించేది. అలాంటి అనుభవాలు కొన్నిటిని ఎదుర్కొన్న తరువాత... జర్నలిజం చదవాలని నిర్ణయించుకున్నాను. 'అప్పుడు నా మాటలకు వాళ్ళు స్పందిస్తారు, నన్ను గౌరవిస్తారు, తప్పు చేస్తే నిలదీస్తానని భయపడతారు' అనుకున్నాను" అని చెబుతారు జయంతి. "మల్కన్‌గిరిలో డిగ్రీ అయ్యాక కొరాపుట్ సెంట్రల్ యూనివర్సిటీలో జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశాను. భువనేశ్వర్‌లో ఫిలిమ్‌మేకర్, జర్నలిస్ట్ బీరేన్‌దాస్ స్టూడియోలో నెలరోజులు ఇంటర్న్‌షిప్ చేశాను. కెమేరాను హ్యాండిల్ చెయ్యడం, ఇంటర్వ్యూలు నిర్వహించడం, ఎడిటింగ్ లాంటివి అక్కడ నేర్చుకున్నాను. ఆ శిక్షణ నా వృత్తి జీవితానికి పునాదిగా నిలిచింది" అన్నారామె.



తరువాత భువనేశ్వర్‌లోని ప్రాంతీయ వార్తా ఛానెల్‌లో చేరారు జయంతి. అక్కడ ఎన్నో చేదు అనుభవాలు ఎదురైనా... సహనంతో భరించారు. "ఆ సమయంలో... వివిధ దశల్లో స్నేహితులు నన్ను అన్ని విధాలా ఆదుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరైనప్పుడు 'పికిల్ జార్ మీడియా' వ్యవస్థాపకురాలు, సీఈఓ వాసంతి హరిప్రకాశ్ పరిచయం అయ్యారు. ఆమె ఒక సభలో మాట్లాడుతూ "ఒడిశాలోని మారుమూల గిరిజన ప్రాంతానికి చెందిన మహిళ చదువుకోవడం అంత సులువుకాదు. అలాంటిది... తన తెగలోనే కాదు... తన జిల్లాలోనూ తొలి మహిళా జర్నలిస్ట్ కావడం, సమాజ శ్రేయస్సు కోసం తపించడం గొప్ప విషయం" అన్నారు. ఆ మాటలు నాకు జీవితానికి సరిపడేంత ప్రేరణ ఇచ్చాయి" అంటారు జయంతి. ఆ తరువాత వివిధ మీడియా సంస్థల్లో ఆమె పని చేశారు. 2017లో... 'ఎన్‌డబ్ల్యూఎంఐ ఫెలోషిప్ ఫర్ ఉమెన్ జర్నలిస్ట్స్' ఆమెకు లభించింది. అది అందుకున్న తొలి వ్యక్తి జయంతే. "నేను జర్నలిస్ట్ కావడం మా ఇంట్లో ఎవరికీ ఇష్టం లేదు. నా అక్కచెల్లెళ్ళు పలు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్నారు. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగంలో చేరితే జీవితానికి భద్రత ఉంటుందని వాళ్ళ నమ్మకం. కానీ సామాజికంగా నాకు గట్టి మద్దతు దొరికింది. ఎక్కడికి వెళ్ళినా గ్రామస్తులు నన్ను సాదరంగా ఆహ్వానించేవారు. వారి సమస్యలను మీడియా ద్వారా హైలైట్ చేయడం దీనికి కారణం" అని చెప్పారు జయంతి.

అదే సవాల్: జర్నలిస్ట్‌గా ప్రజల సమస్యలను మీడియా ద్వారా వివరిస్తున్నా... వాటి పరిష్కారం మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుండడం ఆమెను బాధించింది. మార్పుకు తనే శ్రీకారం చుట్టాలనుకున్నారు. నెలసరి సమయంలో పాటించాల్సిన శుభ్రతా చర్యల గురించి మహిళల్లో, విద్యార్థినుల్లో అవగాహన కల్పించడం కోసం మరికొందరు యువతులతో కలిసి 2019 నుంచి మల్కన్‌గిరి జిల్లాలో వివిధ కార్యక్రమాలను చేపట్టారు. దీనిలో భాగంగా ఈ ఏడాది జనవరిలో 'శానిటరీ నేప్‌కిన్ బ్యాంక్' ఏర్పాటు చేశారు. 'బడా దాదీ యూనియన్' పేరిట మహిళల కోసం ఒక సంస్థను నెలకొల్పారు. దాని ఆధ్వర్యంలో 2000 సంవత్సరంలో ఒక గ్రంథాలయం ఏర్పాటు చేశారు. అయిదేళ్ళలో 'బడా దీదీ యూనియన్' జిల్లాలోని ఏడు బ్లాక్‌లకూ విస్తరించింది. "పలు గ్రామాలకు చెందిన బాలికలు తమకోసం శానిటరీ నేప్‌కిన్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అయితే దానికోసం సొంత మిషన్లు, మెటీరియల్ కావాలి. అదే విధంగా మేము ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో... వేసవి సెలవుల్లో పిల్లలు చదవడానికి మరిన్ని పుస్తకాలు కావాలి. ఈ పనులన్నిటికీ నిధులు సమకూర్చడమే మా ముందున్న సవాల్" అంటారు జయంతి. తన దగ్గర శిక్షణ పొందుతున్న బాలికలు... తను కోరుకొనే మార్పునకు సారథులు కావాలనేది ఆమె కోరిక.

సాధికారత కోసం 'జంగిల్ రాణి'

కిందటి ఏడాది మేలో ఆమె ప్రారంభించిన 'జంగిల్ రాణి' కార్యక్రమం బాలికా సాధికారత దిశగా పెద్ద అడుగు. జిల్లా స్థాయిలో బాలికలను ఎంపిక చేసి జర్నలిజంలోని ప్రధాన అంశాల్లో జయంతి శిక్షణ ఇస్తున్నారు. అటవీ చట్టాలు, గిరిజనుల జీవితం, సంస్కృతి, సంప్రదాయాల మీద అవగాహన కలిస్తున్నారు. 'ఇక్కడ శిక్షణ పొందిన అమ్మాయిలు గిరిజన ప్రాంతాల్లోని వివిధ అంశాలను వీడియో తీసి, మా సోషల్ మీడియాలో పెడతారు. ఎవరికీ పట్టని జీవితాల మీద వెలుగులు ప్రసరించడమే దీని ఆశయం" అంటున్న జయంతి 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్'కు చెందిన స్వతంత్ర మేధో బృందం... 'భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ పాలసీ'తో కలిసి పని చేస్తున్నారు. అటవీ వనరుల రక్షణ, గిరిజన హక్కులు తదితర అంశాలపై క్లస్టర్ కో-ఆర్డినేటర్‌గా గళం వినిపిస్తున్నారు. అలాగే ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యురాలుగానూ వ్యవహరిస్తున్నారు. ఇటీవల 'ఫోర్బ్స్ ఇండియా ఉమెన్ పవర్- 2024' జాబితాలో ఆమెకు స్థానం లభించింది.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 3 ఏప్రిల్ 2024
cinema@andhrajyothy.com



పుట్టిన రోజున టీజర్

ప్రపంచ వ్యాప్తంగా సినిమా ప్రేక్షకులు ఎదురు చూస్తున్న చిత్రం 'పుష్ప 2' ..ది రూల్. అల్లు అర్జున్ , దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం టీజర్‌ను ఏప్రిల్ 8న విడుదల చేయనున్నారు. ఆ రోజే అల్లు అర్జున్ పుట్టినరోజు కావడంతో డబుల్ ధమాకా అంటూ అభిమానులు ఆనందంతో పొంగిపోతున్నారు. 2021లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'పుష్ప ది రైజ్' చిత్రం జాతీయస్థాయిలో అల్లు అర్జున్‌కు ఉత్తమ నటుడిగా అవార్డ్ తెచ్చి పెట్టింది. దానికి సీక్వెల్‌గా వస్తున్న 'పుష్ప ది రూల్' చిత్రానికి ఆకాశమంత స్థాయిలో అంచనాలు ఉన్నాయి. వాటిని అధిగమించేందుకు సుకుమార్ అయన టీమ్ విశేషంగా కృషి చేస్తున్నారు. రష్మిక హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి చిత్ర నిర్మాతలు.

ఎన్‌టీఆర్ గ్యారేజీలో మరో ఖరీదైన కారు..!





జూనియర్ ఎన్‌టీఆర్ గ్యారేజీలో మరో ఖరీదైన కారు చేరింది. ఖైరతాబాద్‌లోని ఆర్‌టీఏ కార్యాలయంలో నూతన వాహనం రిజిస్ట్రేషన్ ఇటీవల జరిగింది. మెర్సిడెజ్ బెంజ్ మే బ్యాక్ మోడల్ కారును ఆయన ఇటీవల కొనుగోలు చేశారు. ఈ కారు ధర రూ.3.50 కోట్ల వరకు ఉంటుంది. కార్లు, వాచీలంటే అమితంగా ఇష్టపడే ఎన్‌టీఆర్ వాటి కొనుగోలుపై ఆసక్తి చూపుతుంటాడు. దేవర, వార్-2 చిత్రీకరణలో ఉన్న ఆయన షూటింగ్‌కు బ్రేక్ ఉండడంతో కారు రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్టు తెలిసింది. ఆర్‌టీఏ అధికారులు దగ్గరుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు.

సైకలాజికల్ థ్రిల్లర్‌గా బహుముఖం



అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసే హర్షివ్ కార్తీక్ ప్రధాన పాత్రలో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బహుముఖం'. సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రం షూటింగ్ అంతా అమెరికాలోని వివిధ ప్రదేశాల్లో జరిగింది. ఈ నెల 5న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా హర్షివ్ కార్తీక్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. 'మానసిక అనారోగ్యం ఉన్న ఓ వ్యక్తి ఓ ఆడిషన్‌కు వెళితే అక్కడ అతనికి అవమానం జరుగుతుంది. దాన్ని సీరియస్‌గా తీసుకున్న ఆ వ్యక్తి ఆ తర్వాత ఏం చేశాడన్న ఇతివృత్తంతో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఇటువంటి కథతో ఇంతవరకూ ఏ సినిమా రాలేదు. ఇప్పుడు సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రాలను ప్రేక్షకులు ఎక్కువగా చూస్తున్నారు. అందుకే ఈ ప్రాజెక్ట్ చేశాను' అని చెప్పారు. 'ఇందులో దాదాపు 40 మంది కొత్త నటీనటులు ఉన్నారు. ప్రతిదీ వర్క్ షాప్ నిర్వహించి క్లియర్ విజన్‌తో నిర్మించాను. ఖర్చు తగ్గించుకోవాలనే తపనతో చాలా శాఖలు నేనే నిర్వహించాను. పాటలను ఫణి కల్యాణ్ స్వరపరచగా, శ్రీచరణ్ పాకాల నేపథ్య సంగీతం అందించారు' అని తెలిపారు హర్షివ్ కార్తీక్. తదుపరి చిత్రం కోసం ఓ యాక్షన్ డ్రామా రాసుకున్నాననీ, ఇన్ని శాఖలు కాకుండా ఏదో ఒక దాని మీదే దృష్టి పెడతానని ఆయన చెప్పారు.

'నా పేరు చిరంజీవి' అని తొలిసారి చెప్పింది సావిత్రమ్మకే



"సావిత్రి గారిపై నాకు ఉన్న అభిమానాన్ని ఇలా పుస్తకావిష్కరణ ద్వారా చూపించే అవకాశం దక్కినందుకు ఆనందంగా ఉంది. 'ప్రేమ తరంగాలు' చిత్రంలో ఆమెకు కొడుగ్గా నటించాను. ఇప్పటికీ ఆమె సినిమాలు, పాటలు ఇంట్లో చూస్తుంటాను. ఈ ప్రపంచంలో కళ్లతో అభినయాన్ని పలికించే ఏకైక నటి సావిత్రమ్మ. ఇది ఆ మహాతల్లి నాకు ఇచ్చిన గొప్ప అవకాశంగా ఈ పుస్తకావిష్కరణను భావిస్తున్నాను" అని చిరంజీవి అన్నారు. సంజయ్ కిశోర్ రచించిన మహానటి 'సావిత్రి క్లాసిక్స్' పుస్తకావిష్కరణ మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. సావిత్రి నటించిన 47 సినిమాల్లోంచి ఆమె పాత్రలను ఎంచుకొని వాటిని విశ్లేషించి, ఫొటోలతో సహా చక్కని పుస్తకంగా మలిచారు.

చిరంజీవి, సురేఖ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. సావిత్రి కూతురు విజయ చాముండేశ్వరి, అల్లుడు గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ "పునాదిరాళ్లు' సినిమాలో మహానటి సావిత్రితో కలసి నటించబోతున్నావు' అని చెప్పినప్పుడు ఒళ్లు జలదరించింది. నమ్మలేకపోయాను. అప్పుడే రాజమండ్రి పంచవటి హోటల్లో తొలిసారి సావిత్రిగారిని చూశాను. ఆమె 'బాబూ నీ పేరేంటి?' అని అడిగారు. అంతకు ముందే స్ర్కీన్ నేమ్ చిరంజీవి అనుకున్నాను. అలా తొలిసారి నన్ను చిరంజీవిగా సావిత్రి గారికి పరిచయం చేసుకున్నాను. ఆమె 'శుభం' అన్నారు. ఆ షూటింగ్ జరిగేటప్పుడు ఓ రోజు సావిత్రి గారి ముందు టేప్‌రికార్డర్‌లో పాట పెట్టి డాన్స్ చేశాను. గచ్చుపైన తేమ ఉండడంతో జారి పడ్డాను. కానీ వెంటనే దాన్ని నాగుపాము నృత్యంలా మార్చడం సావిత్రి గారికి బాగా నచ్చింది. నన్ను దగ్గరకు తీసుకొని 'నీ సమయస్ఫూర్తి నచ్చిందోయ్, భవిష్యత్తులో మంచి యాక్టర్‌వి అవుతావు' అని ఆశీర్వదించారు. దాంతో నాకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. ఈ పుస్తకావిష్కరణకు వారధిగా నిలిచే అవకాశం ఇచ్చినందుకు చాముండేశ్వరిగారికి ధన్యవాదాలు' అన్నారు.

విజయ చాముండేశ్వరి మాట్లాడుతూ 'చెన్నైలో మా ఎదురింట్లోనే అల్లు రామలింగయ్య గారి కుటుంబం ఉండేది. అప్పటి నుంచే సురేఖ గారితో పరిచయం ఉంది. నన్ను తోడబుట్టిన సోదరిలా చూసుకుంటారు చిరంజీవి. 'నేను ఉదయం లేవగానే సావిత్రమ్మ ఫొటో చూస్తాను' అని ఆయన చెప్పారు. తన బెడ్‌రూంలో ఉన్న ఫొటోను తెప్పించి చూపించారు. 'ఈ పుస్తకావిష్కరణను సింపుల్‌గా కానిచ్చేద్దాం' అని అన్నాను. కానీ అమ్మకు పెద్ద కొడుకు ఉండుంటే ఏం చేసేవాడో ఈ రోజు చిరంజీవిగా గారు అంత గొప్పగా నిర్వహించారు. ఆయనకు ఎలా ధన్యవాదాలు చెప్పాలో తెలియడం లేదు. 'మహానటి' సినిమా వల్ల ఈ తరం పిల్లలు కూడా అమ్మ గురించి మాట్లాడుతున్నారు. అమ్మ జీవితం గురించి చాలా పుస్తకాలు వచ్చాయి. ఆమె నటన గొప్పదనం తెలిపేలా ఈ పుస్తకం ఉంటుంది' అన్నారు. తల్లి సావిత్రితో తన బాల్యస్మృతులను చాముండేశ్వరి గుర్తు చేసుకున్నారు. 'స్కూల్లో పేరెంట్స్ మీటింగ్స్‌కి అమ్మ వచ్చేది కాదు. అమ్మ నాకు జడ వేయడం లేదు అనుకునేదాన్ని. అప్పట్లో నాకు అది అర్థం కాలేదు. రాత్రి అమ్మమ్మతో కలసి బజ్జుంటే పొద్దున్నే లేచేసరికి అమ్మ పక్కలో ఉండేదాన్ని. మా కోసమే అంతలా కష్టపడిందని పెద్దయ్యాక అర్థమైంది. సండే సఫారీ థియేటర్‌లో కార్టూన్ షోలు వేసేవారు. అప్పుడప్పుడూ నన్ను తీసుకెళ్లేవాళ్లు. చీకటి పడ్డాక బీచ్‌కు తీసుకెళ్లేవారు. అక్కడ మమ్మల్ని ఆటపట్టిస్తూ చాలా చిలిపి పనులు చేసేది. అమ్మతో కార్లో వెళ్లేటప్పుడు, కారు మధ్యలో ఆపి పైకెక్కి చింతకాయలు కోసేవాళ్లం. పొలంలో వేరుశనగ కాయలు దొంగతనంగా కోసేది. 'అడిగితే ఇచ్చేవాళ్లం కదమ్మా' అని కావలివాళ్లు అంటే 'ఆ అందులో రుచి ఉండదోయ్' అనేది. ఓసారి సినిమాలో చూసి జంప్ సూట్ నాకూ కావాలని అడిగా 'ఆడపిల్లల శరీరం కనపడకూడదు' అని వద్దంది. తన చీరలతో నాకు హాఫ్ శారీస్ కుట్టించేది. పుదుపోట రాజా దగ్గర నుంచి అమ్మ రెండు పులిపిల్లలను తెచ్చింది. కుందేలు, నెమలి పిల్లలను పెంచేది. అమ్మకు ఆరోగ్యం బాగోకపోవడంతో అత్తకొడుకు గోవిందరావుకు ఇచ్చి 16 ఏళ్లకే నా పెండ్లి చేసింది. అమ్మ కోమాలోకి పోయినప్పుడు 19 నెలలు హాస్పిటల్‌లో ఉంది. ఆ జ్ఞాపకాలు తలుచుకోవడం ఇష్టం లేదు. 'సావిత్రి గారు అన్నీ పోగొట్టారు, పిల్లలకు చిల్లిగవ్వ కూడా విగల్చలేదు అనుకుంటారు కానీ అది నిజం కాదు. ఎన్ని దానధర్మాలు చేసినా నాకూ, తమ్ముడికి లోటు లేని సంపదను ఇచ్చిపోయింది. 'మహానటి' చిత్రంలో ప్రతిదీ నా అనుమతి తీసుకున్న తర్వాతే చేశారు కాబట్టి అందులో తప్పుపట్టటానికేం లేదు' అన్నారు.


సురేఖ మాట్లాడుతూ 'చిరంజీవి గారికి సావిత్రమ్మ అంటే ఎంతో ప్రేమ. అందుకే అంగీకరిస్తారనే నమ్మకంతో ఆయన్ను అడగకుండానే విజయ చాముండిగారికి మాటిచ్చాను. ఇలా వేదికపైన కూర్చోవడం, మాట్లాడడం ఎప్పుడూ చేయలేదు. చాముండి కోసం చేస్తున్నాను. సావిత్రమ్మ గారి గురించి తెలుసుకోవాలనుకున్నాను. అది ఈ రోజు మీ ద్వారా కుదిరింది' అన్నారు.

నా జీవితంలో ఒకే ఒకసారి మా స్నేహితుడి ఇంట్లో సావిత్రిగారిని చూశాను. నటనలో ఆమెకు ఆమే సాటి అని అల్లు అరవింద్ చెప్పారు.

సంజయ్ కిశోర్ మాట్లాడుతూ 'ఆర్టిస్ట్‌గా నేను రాణించడానికి స్ఫూర్తి సావిత్రిగారు. చాముండేశ్వరి గారు పిలిచి ఈ పుస్తకం రాయమని చెప్పారు. పుస్తకావిష్కరణనే కాదు కార్యక్రమ నిర్వహణను కూడా తనపైన వేసుకున్న చిరంజీవి గారికి ధన్యవాదాలు. మహానటి సావిత్రిగారికి చిరంజీవి ఇస్తున్న గొప్ప నివాళి ఈ పుస్తకం' అన్నారు.

ఒక హీరోయిన్‌కు సంబంధించిన కార్యక్రమ నిర్వహణకు హీరో అయిన చిరంజీవిగారు స్వయంగా పూనుకొన్నందుకు చాలా సంతోషంగా ఉందని జయసుధ తెలిపారు. 15 ఏళ్ల వయసులో పరిశ్రమకు వచ్చి ఎన్నో గొప్ప పాత్రల్లో ప్రేక్షకులను మెప్పించిన సాహసి సావిత్రి అని పరుచూరి గోపాలకృష్ణ తెలిపారు. సావిత్రిగారు మనందరి హృదయాల్లో ఎప్పటికీ జీవించే ఉంటారు అని బ్రహ్మానందం చెప్పారు. సావిత్రిగారితో ఒక్క ఫొటో దిగినా చాలు అనుకునేవాణ్ణి, అలాంటిది ఆమెతో ఏడెనిమిది సినిమాల్లో నటించే అవకాశం దక్కడం నా అదృష్టం అని మురళీమోహన్ అన్నారు.

లెజెండరీ కోచ్ జీవితకథగా...



భారతదేశంలో మోడరన్ ఫుట్‌బాల్ విప్లవానికి నాంది పలికిన లెజెండరీ కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ జీవిత కథగా వస్తున్న చిత్రం 'మైదాన్'. అజయ్ దేవ్‌గణ్ ఇందులో కోచ్ సయ్యద్ అబ్దుల్ రహీమ్ పాత్రను పోషిస్తున్నారు. భారతీయ ఫుట్‌బాల్ రంగానికి స్వర్ణయుగంగా చెప్పుకునే పదేళ్ల కాలంలో (1952-1962) జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. దేశంలో మోడరన్ ఫుట్‌బాల్ ఆటకు ఆద్యుడిగా, నేషనల్ ఫుట్‌బాల్ టీమ్ కోచ్‌గా, మేనేజర్‌గా అబ్దుల్ రహీమ్ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలను, ఆయన ఎదుర్కొన్న సవాళ్లను ఈ చిత్రంలో చూపించనున్నారు. మంగళవారం కథానాయకుడు అజయ్ దేవ్‌గణ్ పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం 'మైదాన్' ఫైనల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఫుట్‌బాల్ రంగంలో ఇండియా టీమ్ చరిత్రను ఎలా తిరగరాసిందో తెలిపే ఈ బయోపిక్‌కు అమిత్ రవీంద్రనాథ్‌శర్మ దర్శకత్వం వహించారు. ప్రియమణి, గజ్‌రాయ్ రావు, రుద్రనీల్ ఘోశ్ కీలక పాత్రలు పోషించారు. ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందించారు. బోనీకపూర్ నిర్మించిన 'మైదాన్' ఈ నెల 10న విడుదలవుతోంది.



జీవి ప్రకాశ్‌కుమార్, ఐశ్వర్యరాజేశ్ జంటగా నటించిన చిత్రం 'డియర్'. ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహించారు. వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి పృథ్వీరాజ్ నిర్మించారు. ఈ చిత్రం తమిళంలో 11న, తెలుగులో 12న విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం నుంచి 'భలే వెడ్డింగ్' సాంగ్‌ను విడుదల చేశారు. ఈ అట్రాక్టివ్ వెడ్డింగ్ సాంగ్‌కు జీవి ప్రకాశ్‌కుమార్ సంగీతం అందించారు. రాకేందు మౌళి లిరిక్స్ రాశారు. నారాయణన్ రవిశంకర్, సింధూరి విశాల్ ఆలపించారు. ఈ చిత్రంలో కాళీవెంకట్, ఇళవరుసు, రోహిణి, తలైవాసల్ విజయ్, గీతా కైలాసం కీలక పాత్రలలో నటిస్తున్నారు.

'పడమటి సంధ్యారాగం' చిత్రానికి సీక్వెల్



విజయశాంతి ప్రధాన పాత్రను పోషించిన చిత్రం 'పడమటి సంధ్యారాగం'. జంధ్యాల దర్శకత్వంలో పూర్తిగా అమెరికా నేపథ్యంలో రూపుదిద్దుకున్న ఆ సినిమా 1987 ఏప్రిల్ 11న విడుదలై విజయం సాధించింది. ప్రవాసాంధ్రులు గుమ్మలూరి శాస్త్రి, మీర్ అబ్దుల్లా కలసి ఈ సినిమా నిర్మించారు. ఇన్నేళ్ల తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్ వస్తుండడం విశేషం. ఆ చిత్ర నిర్మాతలలో ఒకరు, అందులో విజయశాంతి బాబాయిగా నటించిన మీర్ అబ్దుల్లా ఈ సీక్వెల్‌ను స్వీయ దర్శకత్వంలో నిర్మించనున్నారు. ఈ చిత్రం వివరాలను ఆయన చిత్రజ్యోతికి ప్రత్యేకంగా వివరిస్తూ "పడమటి సంధ్యారాగం' చిత్ర నిర్మాణంలో భాగస్వామిగా ఉండడమే కాకుండా జంధ్యాలగారి దగ్గర దర్శకత్వంలో మెళకువలు నేర్చుకున్నాను. ఈ సినిమాకు సీక్వెల్ తీయాలనే ఆలోచన గుమ్మలూరి శాస్త్రిగారికి, నాకూ చాలా కాలంగా ఉంది. ఈ నిర్మాణ సన్నాహాల్లో ఉండగా ఆయన మరణించడంతో ఈ ప్రాజెక్ట్‌ను ముందుకు నడిపించాలని నిర్ణయించుకున్నాను. తెలుగు రాష్ట్రాల్లోనే ఈ చిత్ర నిర్మాణం జరుగుతుంది. 'పడమటి సంధ్యారాగం' చిత్రంలో విజయశాంతి తప్ప మిగిలిన పాత్రలలో దాదాపు అందరూ కొత్తవారే నటించారు. సీక్వెల్‌లో కూడా కొత్త నటీనటులకు అవకాశం ఇవ్వాలనుకుంటున్నా. కామెడీ ఎంటర్‌టైనర్‌గా సినిమాను రూపొందిస్తాం. జులైలో చిత్ర నిర్మాణం మొదలు పెట్టాలనుకుంటున్నా. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాక షూటింగ్ తేదీ వెల్లడిస్తా' అన్నారు.

తొలి తెలుగు కామెడీ కిడ్ స్టార్ విశ్వేశ్వరరావు ఇక లేరు



ప్రముఖ హాస్య నటుడు జి.విశ్వేశ్వరరావు (64) కన్నుమూశారు. కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతూ వచ్చిన ఆయనకు సోమవారం ఉదయం గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచినట్టు ఆయన పెద్ద కుమార్తె భార్గవి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆయన అంత్యక్రియలను మంగళవారం పూర్తి చేశారు. ఆయనకు భార్య వరలక్ష్మి, కుమార్తెలు భార్గవి, పూజ ఉన్నారు. తమిళం, తెలుగు భాషల్లో దాదాపు 350కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన స్వస్థలం కాకినాడ. 1967లో చెన్నైకు వచ్చిన ఆయన బాల నటుడుగా తన కెరీర్‌ను ప్రారంభించారు. మాస్టర్ రాము, బేబి రాణి, మాస్టర్ ప్రభాకర్ వంటి బాల నటులు ఎక్కువ సినిమాల్లో నటిస్తూ పేరు తెచ్చుకుంటున్న తరుణంలో ప్రవేశించిన మాస్టర్ విశ్వేశ్వరరావు కొద్ది కాలంలోనే తన ప్రతిభ చాటుకున్నారు. ఆ రోజుల్లో ఎన్టీఆర్, ఏయన్నార్, కాంతారావు, హరనాథ్, జగ్గయ్య వంటి వారు హీరో పాత్రలు చేస్తుంటే రేలంగి, పద్మనాభం, చలం, రాజబాబు హాస్య పాత్రలు పోషించేవారు. ఈ హాస్య నటుల చిన్నప్పటి వేషాలు విశ్వేశ్వరరావు వేసేవారు. బాల తారలతో తీసిన 'బాల భారతం'లో విశ్వేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. తెలుగు సినిమాల వరకూ తొలి కామెడీ కిడ్ స్టార్ ఈయనే. చిన్నప్పుడు హాస్య నటుడిగా ఎంత పేరు తెచ్చుకున్నారో పెరిగి పెద్దయ్యాక ఆ స్థాయిలో గుర్తింపు పొందలేక పోయారు. 'ముఠామేస్త్రి', 'ప్రెసిడెంట్‌గారి పెళ్లాం', 'ఆయనకు ఇద్దరు', 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి', 'రిక్షావోడు' వంటి చిత్రాల్లో ఏవో చిన్న వేషాలు వేశారు కానీ పూర్తి స్థాయి కమెడియన్‌గా ఆయన నిలదొక్కుకోలేక పోయారు. సినిమాల్లోనే కాకుండా, అనేక టీవీ సీరియల్స్‌లో కూడా విశ్వేశ్వరరావు నటించారు.. అవకాశాలు తగ్గిన సమయంలో సొంతంగా 'విస్సు టాకీస్' పేరుతో యూ ట్యూబ్ ఛానల్‌ను నిర్వహిస్తూ తన అనుభవాలను వివరించేవారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

అయితే ఎర్న్... లేకపోతే లెర్న్

'నాకు చిన్నప్పటి నుంచి ఈ గ్లామర్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాలని కోరిక. మంచి కథ దొరకడంతో 'భరతనాట్యం' చిత్రంతో నిర్మాతగా మారా. మావారు హితేష్, సూర్యతేజ జిమ్‌లో ఫ్రెండ్స్. తన దగ్గర ఉన్న కథని మావారికి చెప్పారు. ఆయనకు కథ నచ్చింది. సినిమా తీద్దామా అని నన్ను అడగడంతో సరేనన్నా. అలా ఈ సినిమా మొదలైంది' అన్నారు మహిళా నిర్మాత పాయల్ సరాఫ్. సూర్యతేజని హీరోగా పరిచయం చేస్తూ నిర్మించిన 'భరతనాట్యం' చిత్రం ఈ నెల 5న విడుదలవుతుండడంతో పాయల్ మీడియాతో ముచ్చటించారు.



'దర్శకుడు కావాలని ప్రయత్నించే యువకుడి కథ ఇది. ఫ్యామిలీ, లవ్ లైఫ్ నుంచి సమస్యలు ఎదుర్కొంటూ అనుకోకుండా క్రైమ్ వరల్డ్‌కి వెళ్లి, అక్కడి నుంచి ఎలా బయటపడ్డాడనేది ఈ చిత్రకథ. మంచి కంటెంట్‌తో పాటు అద్భుతమైన నటీనటులు ఈ చిత్రంలో నటించారు. ఇక్కడ ఎర్న్ చేస్తాను, లేదా లెర్న్ చేస్తాను అనుకుని ఈ పరిశ్రమలోకి అడుగుపెట్టా. అనుకున్న బడ్జెట్‌లోనే సినిమా పూర్తి చేశాం. అందరూ సపోర్ట్ చేశారు' అని చెప్పారు పాయల్.

'కథ రాస్తున్నప్పుడే ఈ సినిమాకు మహేంద్ర దర్శకుడైతే బాగుండునని సూర్య అనుకున్నారు. ఆ తర్వాత కాస్టింగ్ అంతా డైరెక్టర్‌గారే చూసుకున్నారు. అయితే తను హీరోగా చేయాలని సూర్యతేజ మొదట అనుకోలేదు. ఈ పాత్రకు కొత్త నటుడు కావాలి కనుక ఆయన్ని ఎంపిక చేశారు. నిజానికి ఇది హీరో బేస్డ్ సబ్జెక్ట్ కాదు. నటీనటులంతా కథలో భాగం అవుతారు' అని వివరించారామె.

మళ్లీ మయాంకే..

3 వికెట్లతో అదరగొట్టిన పేసర్

లఖ్‌నవూ ఘనవిజయం 1 బెంగళూరు చిత్తు

నేటి మ్యాచ్
ఢిల్లీ x కోల్‌కతా
రా.7.30 నుంచి


మయాంక్ (3/14)

బెంగళూరు: అదే జోరు.. అదే వేగం.. స్పీడ్‌గన్ మయాంక్ యాదవ్ (3/14)ను ఎదుర్కొనేందుకు బ్యాటర్లు బెంబేలెత్తుతున్నారు. ఈసారి రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై నిప్పులు చెరిగే బంతులతో విరుచుకుపడ్డాడు. ఏకంగా తాజా సీజన్‌లోనే అత్యంత (156.7) వేగంగా బంతి విసిరి లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు స్టార్ అట్రాక్షన్‌గా మారాడు. అతడికి జతగా మిగిలిన బౌలర్లు కూడా రాణించడంతో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో లఖ్‌నవూ 28 పరుగులతో నెగ్గింది. సొంతగడ్డపై ఆర్‌సీబీకిది వరుసగా రెండో ఓటమి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 5 వికెట్లకు 181 పరుగులు చేసింది. డికాక్ (56 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సర్లతో 81), పూరన్ (21 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్సర్లతో 40 నాటౌట్) ఆకట్టుకున్నారు. ఛేదనలో బెంగళూరు 19.4 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటైంది. లొమ్రోర్ (13 బంతుల్లో 33), రజత్ (29), విరాట్ (22) ఓ మాదిరిగా రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మయాంక్ యాదవ్ నిలిచాడు.

ఆరంభంలోనే..: ఛేదనలో ఆర్‌సీబీ తడ'బ్యాటు' కొనసాగింది. పవర్‌ప్లేలోనే విరాట్, డుప్లెసి (19), మ్యాక్స్‌వెల్ (0) వికెట్లను కోల్పోయి బేలగా కనిపించింది. కానీ తొలి నాలుగు ఓవర్లలో ఓపెనర్లు ఆడిన తీరు చూస్తే జట్టు విజయం లాంఛనమే అనిపించింది. కానీ వరుస ఓవర్లలో విరాట్‌ను స్పిన్నర్ సిద్ధార్థ్, మ్యాక్స్‌వెల్‌ను పేసర్ మయాంక్ అవుట్ చేయగా, డుప్లెసి రనౌటయ్యాడు. ఇక మయాంక్ తన బుల్లెట్‌లాంటి బంతులతో గ్రీన్ (9)ను సైతం పెవిలియన్‌కు చేర్చడంతో 58/4తో ఆర్‌సీబీ పోటీలోకి రాలేకపోయింది. ఈ దశలో రజత్-అనూజ్ (11)తో కలిసి ఐదో వికెట్‌కు 36 పరుగులు జోడించాడు. కానీ మయాంక్ తన చివరి ఓవర్‌లో రజత్‌ను అవుట్ చేసి వరుసగా రెండో మ్యాచ్‌లోనూ మూడు వికెట్లను సాధించాడు. అటు చివరి 30 బంతుల్లో 78 రన్స్ కావాల్సిన వేళ లొమ్రోర్ యథేచ్ఛగా బ్యాట్ ఝుళిపించాడు. 16వ ఓవర్‌లో 19 రన్స్ అందించి, తర్వాతి ఓవర్‌లోనూ మెరిసి ఆశలు రేపాడు. కానీ అదే ఓవర్‌లో దినేశ్ కార్తీక్ (4) కీపర్ రాహుల్‌కు క్యాచిచ్చాడు. లొమ్రోర్‌ను యశ్ అవుట్ చేయడంతో ఆర్‌సీబీ చేసేదేమీ లేకపోయింది. సిరాజ్ (12) చివర్లో రెండు సిక్సర్లతో ఆకట్టుకున్నాడు.

తక్కువ ఇన్నింగ్స్ (99)లో 3 వేల రన్స్ సాధించిన ఆరో ఐపీఎల్ బ్యాటర్‌గా డికాక్. తొలి స్థానంలో గేల్ (75) ఉన్నాడు.


డికాక్ (81)

డికాక్ పోరాటం

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ డికాక్ ఆటే హైలైట్‌గా నిలిచింది. పిచ్ బ్యాటింగ్‌కు అంతగా అనుకూలించకపోయినా.. అతను ఎదురుదాడికి దిగగా, చివర్లో పూరన్ సైతం చెలరేగడంతో భారీ స్కోరు సాధ్యమైంది. మిగతా బ్యాటర్లు పరుగులు తీసేందుకు కష్టపడ్డారు. తొలి ఓవర్‌లోనే మూడు ఫోర్లతో వేగం కనబర్చిన డికాక్ ఆ తర్వాత కూడా ధాటి కొనసాగించాడు. అటు కెప్టెన్ రాహుల్ (20) కూడా రెండేసి సిక్సర్లతో టచ్‌లో ఉన్నట్టు కనిపించినా మ్యాక్స్‌వెల్ ఓవర్‌లో అవుటయ్యాడు. తొలి వికెట్‌కు వీరి మధ్య 53 పరుగులు జత చేరాయి. దేవ్‌దత్ (6) తన పేలవ ఫామ్‌ను కొనసాగించాడు. అయితే డికాక్‌కు స్టొయినిస్ (24) జత కలిశాక స్కోరుబోర్డు వేగంగా కదిలింది. 12వ ఓవర్‌లో డికాక్ 36 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. ఆ వెంటనే గ్రీన్ ఓవర్‌లో స్టొయినిస్ 6,6 డికాక్ 4తో 19 రన్స్ సమకూరాయి. కానీ స్టొయినిస్‌ను మ్యాక్స్‌వెల్ దెబ్బతీయడంతో మూడో వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. సిరాజ్ ఓవర్‌లో మరో రెండు ఫోర్లతో డికాక్ 80 పరుగులకు చేరి సెంచరీ వైపు కదిలాడు. అయితే టోప్లే ఫుల్‌టాస్ బంతికి అతడు దాగర్‌కు క్యాచ్ ఇచ్చాడు. 15-18 ఓవర్ల మధ్య బౌలర్లు యష్ దయాల్, టోప్లే రన్స్ కట్టడి చేశారు. దీంతో బ్యాట్ ఝుళిపించిన పూరన్ 19వ ఓవర్‌లో 3 సిక్సర్లతో 20 పరుగులు, ఆఖరి ఓవర్‌లో రెండు సిక్సర్లతో 13 రన్స్ అందించడంతో స్కోరు 180 దాటింది.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	ముస్తాఫిజుర్ (చెన్నై)
203 పరుగులు	7 వికెట్లు

స్కోరుబోర్డు

లఖ్‌నవూ : డికాక్ (సి) దాగర్ (బి) టోప్లే 81, రాహుల్ (సి) దాగర్ (బి) మ్యాక్స్‌వెల్ 20, పడిక్కళ్ (సి) అనూజ్ రావత్ (బి) సిరాజ్ 6, స్టొయినిస్ (సి) దాగర్ (బి) మ్యాక్స్‌వెల్ 24, పూరన్ (నాటౌట్) 40, ఆయుష్ (సి) డుప్లెసి (బి) యశ్ 0, క్రునాల్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం 20 ఓవర్లలో 181/5; వికెట్ల పతనం:** 1-53, 2-73, 3-129, 4-143, 5-148; **బౌలింగ్:** టోప్లే 4-0-39-1, యశ్ దయాల్ 4-0-24-1, సిరాజ్ 4-0-47-1, మ్యాక్స్‌వెల్ 4-0-23-2, దాగర్ 2-0-23-0, గ్రీన్ 2-0-25-0.

బెంగళూరు: కోహ్లీ (సి) పడిక్కళ్ (బి) సిద్ధార్థ్ 22, డుప్లెసి-రనౌట్ (పడిక్కళ్) 19, పటీదార్ (సి) పడిక్కళ్ (బి) మయాంక్ 29, మ్యాక్స్‌వెల్ (సి) పూరన్ (బి) మయాంక్ 0, గ్రీన్ (బి) మయాంక్ 9, రావత్ (సి) పడిక్కళ్ (బి) స్టొయినిస్ 11, లొమ్రోర్ (సి) పూరన్ (బి) ఠాకూర్ 33, కార్తీక్ (సి) రాహుల్ (బి) నవీనుల్ 4, దాగర్-రనౌట్ (పూరన్) 0, టోప్లే (నాటౌట్) 3, సిరాజ్ (సి) పూరన్ (బి) నవీనుల్ 12, **ఎక్స్‌ట్రాలు11, మొత్తం: 19.4 ఓవర్లలో 153 ఆలౌట్; వికెట్లపతనం:** 1-40, 2-42, 3-43, 4-58, 5-94, 6-103, 7-136, 8-137, 9-138; **బౌలింగ్:** సిద్ధార్థ్ 3-0-21-1, కృనాల్ 1-0-10-0, నవీనుల్ 3.4-0-25-2, మయాంక్ యాదవ్ 4-0-14-3, బిష్ణోయ్ 3-0-33-0, యశ్ ఠాకూర్ 4-0-38-1, స్టొయినిస్ 1-0-9-1.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	3	3	0	0	6	1.249
కోల్‌కతా	2	2	0	0	4	1.047
చెన్నై	3	2	1	0	4	0.976
లఖ్‌నవూ	3	2	1	0	4	0.483
గుజరాత్	3	2	1	0	4	-0.738
హైదరాబాద్	3	1	2	0	2	0.204
ఢిల్లీ	3	1	2	0	2	-0.016
పంజాబ్	3	1	2	0	2	-0.337
బెంగళూరు	4	1	3	0	2	-0.876
ముంబై	3	0	3	0	0	-1.423

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

విశాఖలో నేడు
కేకేఆర్‌తో ఢిల్లీ సై


కెప్టెన్లు పంత్, శ్రేయాస్

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయ ఢంకా మోగించి, ఊపులో ఉన్న కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో పోరుకు రిషబ్ పంత్ నాయకత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్ సై అంటోంది. ఈ సీజన్‌లో విశాఖకు కేటాయించిన మ్యాచ్‌ల్లో రెండో, ఆఖరి పోరు ఇది. వరుస పరాజయాలకు స్వస్తి చెబుతూ, గత మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ సీఎస్కేకు షాకిచ్చిన ఢిల్లీ, ఈసారి జోష్‌లో ఉన్న కేకేఆర్ స్పీడ్‌కు బ్రేక్‌లు వేసేందుకు వ్యూహాలు పన్నుతోంది. ఈ ఇరు జట్లు ఇప్పటివరకు ఐపీఎల్‌లో 33 సార్లు తలపడగా, చెరో 16 సార్లు గెలిచాయి. గత మ్యాచ్‌లో ఢిల్లీ ఓపెనర్ డేవిడ్ వార్నర్, కెప్టెన్ పంత్ అర్ధ సెంచరీలతో చెలరేగడం, ఆ జట్టు పేసర్ ఖలీల్ అహ్మద్ కీలక సమయాల్లో చెలరేగడం ఆ జట్టుకు సానుకూలాంశం. మరోవైపు కేకేఆర్ ఆల్‌రౌండర్లు ఆండ్రీ రస్సెల్, సునీల్ నరైన్ ఫామ్‌లోకి రావడం, యువ క్రికెటర్లు అంచనాలకు తగ్గట్టు రాణిస్తుండడం ఆ జట్టుకు బలంగా మారింది. విశాఖ పిచ్ బ్యాటర్లకు అనుకూలం, మొదట బ్యాటింగ్ చేసిన జట్లకు గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నది విశ్లేషకుల అంచనా.

ఒకటి ముందుకి-మరోటి వెనక్కి

» రెండు ఐపీఎల్ మ్యాచ్‌ల రీషెడ్యూల్

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో రెండు మ్యాచ్‌లను బీసీసీఐ రీషెడ్యూల్ చేసింది. ఈడెన్ గార్డెన్స్‌లో ఈ నెల 17న కోల్‌కతా-రాజస్థాన్ మధ్య మ్యాచ్‌ను ఒక రోజు ముందుగా.. అంటే 16న నిర్వహించనున్నారు. శ్రీరామ నవమి పండుగ ఉన్నందున తగినంత భద్రత కల్పించలేమని కోల్‌కతా పోలీసులు స్పష్టం చేయడంతో.. ఆ మ్యాచ్‌ను ఒక రోజు ముందు నిర్వహిస్తున్నట్టు బీసీసీఐ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. దీంతో అహ్మదాబాద్‌లో 16న గుజరాత్-ఢిల్లీ మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను ఓ రోజు తర్వాతికి.. అంటే 17వ తేదీకి మార్చారు.

మహిళా ఫుట్‌బాలర్లపై దాడుల కేసులో..
దీపక్ శర్మపై వేటు




న్యూఢిల్లీ: ఇద్దరు మహిళా ఫుట్‌బాలర్లపై భౌతిక దాడులకు పాల్పడిన కేసులో అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) ఈసీ సభ్యుడు దీపక్ శర్మపై సస్పెన్షన్ వేటుపడింది. విచారణ ప్రక్రియలో భాగంగా దీపక్ నుంచి వివరాలు తీసుకొన్న అత్యవసర కమిటీ.. ఈ కేసును క్రమశిక్షణా సంఘానికి సిఫార్సు చేసింది. మహిళల ఫుట్‌బాల్ సెకండ్ డివిజన్ లీగ్‌లో పాల్గొనేందుకు హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన 'ఖాద్ ఎఫ్‌సీ' జట్టు గోవాకు వచ్చింది. అయితే, ఆ టీమ్ యజమాని కూడా అయిన దీపక్.. తాగిన మైకంలో బలవంతంగా తమ రూమ్‌లోకి చొరబడి తమపై దాడి చేశాడని ఖాద్ ఎఫ్‌సీ బాధిత ప్లేయర్లు ఫిర్యాదు చేశారు. దీంతో ఆటకు సంబంధించిన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని శర్మను ఏఐఎఫ్ఎఫ్ ఆదేశించింది.

టీ20 వరల్డ్‌కప్‌నకు స్టోక్స్ దూరం



లండన్: ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ టీ20 వరల్డ్‌కప్ నుంచి వైదొలిగాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో పూర్తి స్థాయి ఆల్‌రౌండర్‌గా రాణించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు స్పష్టం చేశాడు. టెస్టు క్రికెట్ తన మొదటి ప్రాధాన్యతగా చెప్పాడు. ఇంగ్లండ్ జట్టుకు ఈ ఏడాది టెస్టులకు సంబంధించి బిజీ షెడ్యూల్ ఉంది. 12 టెస్టులు ఆడాల్సి ఉండడంతో ఇప్పటికే ఐపీఎల్‌కు దూరమైన స్టోక్స్, తాజాగా మెగా టోర్నీలోనూ ఆడకూడదని నిర్ణయించుకున్నాడు. జూలైలో వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ ద్వారా వీరి షెడ్యూల్ ఆరంభం కానుంది.



ఫేవరెట్ ప్రజ్ఞానంద

» మహిళల బరిలో హంపి
» నేటి నుంచి క్యాండిడేట్స్ చెస్ టోర్నీ

టొరంటో: ప్రతిష్ఠాత్మక క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో టీనేజ్ సంచలనం ప్రజ్ఞానంద ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నాడు. బుధవారం నుంచి జరిగే టోర్నీకి పురుషుల విభాగంలో ప్రజ్ఞానందతోపాటు గుకేశ్, విదిత్ గుజరాతీ కూడా అర్హత సాధించారు. 8 మంది టాప్ రేటెడ్ గ్రాండ్ మాస్టర్లు బరిలో ఉన్న ఈ టోర్నీలో విజేతగా నిలిచిన ఆటగాడికి.. వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్‌ను సవాల్ చేసే అరుదైన అవకాశం దక్కుతుంది. అంతేకాకుండా సుమారు రూ. 45 లక్షల ప్రైజ్‌మనీని కూడా గెలుచుకొంటాడు. 2023 వరల్డ్‌కప్ రన్నరప్‌గా ప్రజ్ఞానంద ఈ టోర్నీలో ఆడే చాన్స్ పట్టేశాడు. కాగా, మహిళల విభాగంలో గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, వైశాలి బరిలో నిలవనున్నారు.

గెలుపు దిశగా లంక

చట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌లో శ్రీలంక విజయం దిశగా సాగుతోంది. లంక నిర్దేశించిన 511 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా.. ఆటకు నాలుగో రోజైన మంగళవారం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన బంగ్లా 268/7తో ఎదురీదుతోంది. ఆఖరి రోజు బంగ్లా గెలుపునకు ఇంకా 243 పరుగులు కావాల్సి ఉంది. ఓవర్‌నైట్ స్కోరు 102/6తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన లంక 157/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో లంక 531 పరుగులు చేయగా.. బంగ్లా 178 రన్స్‌కు ఆలౌటైంది.

మేం పెద్ద తప్పు చేశాం..

2019 వరల్డ్‌కప్ ఫైనల్‌పై మాజీ అంపైర్ ఎరాస్మస్



లండన్: ఇంగ్లండ్ క్రికెట్ జట్టు తొలి వన్డే వరల్డ్‌కప్ ట్రోఫీని అంపైర్ పొరపాటు నిర్ణయం వల్లనే సాధించిందా? అంటే అవుననే సమాధానం వస్తోంది. 2019లో అత్యంత ఉత్కంఠభరితంగా ముగిసిన ఆ ఫైనల్.. క్రికెట్ చరిత్రలోనే అత్యంత అరుదైన మ్యాచ్‌గా నిలిచింది. కివీస్‌తో ఆ మ్యాచ్ సూపర్ ఓవర్ కూడా టైగా ముగియడంతో, ఎక్కువ బౌండరీల కారణంగా ఇంగ్లండ్ విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. అయితే ఆ మ్యాచ్ ఆఖరి ఓవర్‌లో తాము పొరపాటుకు పాల్పడినట్టు అప్పటి అంపైర్ ఎరాస్మస్ పేర్కొన్నాడు. 50వ ఓవర్ నాలుగో బంతికి గప్టిల్ విసిరిన త్రో రన్‌తీస్తున్న స్టోక్స్ బ్యాట్‌కు తగిలి బౌండరీకి వెళ్లింది. అప్పటికే బ్యాటర్లు రెండు పరుగులు పూర్తి చేయగా.. ఈ ఫోర్ కలిపి ఫీల్డ్ అంపైర్లు ఆరు పరుగులుగా ప్రకటించారు. దీంతో సమీకరణం 2 బంతుల్లో మూడు రన్స్‌కు మారగా ఇంగ్లండ్ రెండు పరుగులే చేయడంతో టైగా ముగిసింది. కానీ ఐసీసీ రూల్స్ ప్రకారం ఇక్కడ ఐదు పరుగులే రావాలి. ఎందుకంటే.. గప్టిల్ బంతి విసిరే సమయానికి బ్యాటర్లు రెండో పరుగు కోసం ఒకరినొకరు క్రాస్ చేసుకోలేదు. మర్నాడు ఉదయం హోటల్లో మరో అంపైర్ ధర్మసేన తాము చేసిన అదిపెద్ద పొరపాటు గురించి చెప్పాడని ఎరాస్మస్ గుర్తు చేసుకున్నాడు. కానీ మైదానంలో మాత్రం బ్యాటర్ల పరుగు గమనించక, తామిద్దరం ఆరు పరుగులే ఇవ్వాలనే విధంగా మాట్లాడుకున్నామని తెలిపాడు.

ఈసారి రూ.లక్ష కోట్ల ఐపీఓలు!

ఇన్వెస్ట్‌మెంట్జ్.కామ్ అంచనా

» క్యూలో రూ.70,000 కోట్ల ఆఫర్లు
» 2023-24లో రూ.62,000 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: ఈ నెల 1తో ప్రారంభమైన కొత్త ఆర్థిక సంవత్సరం (2024-25)లోనూ ప్రైమరీ మార్కెట్లో పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)ల జోరు కొనసాగనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో 76 కంపెనీలు ఐపీఓల ద్వారా దాదాపు రూ.62,000 కోట్లు సమీకరించగా.. 2024-25లో ఐపీఓల ద్వారా నిధుల సేకరణ రూ.లక్ష కోట్లు దాటవచ్చని పెట్టుబడులు, ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ 'ఇన్వెస్ట్‌మెంట్జ్.కామ్' నివేదిక అంచనా వేసింది. ఆకస్మిక అంతర్జాతీయ ప్రతికూల పరిణామాల ప్రభావం లేకపోతే ఈ మొత్తం మరింత పెరగవచ్చని అంటోంది. ఇప్పటికే రూ.70,000 కోట్ల విలువైన 56 కంపెనీల పబ్లిక్ ఆఫర్లు క్యూలో ఉన్నాయని నివేదిక పేర్కొంది. అందులో రూ.25,000 కోట్ల సమీకరణ లక్ష్యంతో కూడిన 19 కంపెనీల ఐపీఓలకు ఇప్పటికే సెబీ ఆమోదం లభించగా.. మరో రూ.45,000 కోట్ల విలువ చేసే 37 కంపెనీల ఐపీఓ దరఖాస్తులు నియంత్రణ సంస్థ పరిశీలనలో ఉన్నాయి. మొత్తం 56 కంపెనీల్లో 9 నవతరం టెక్నాలజీ కంపెనీలనీ.. వీటి నిధుల సమీకరణ లక్ష్యం మొత్తం రూ.21,000 కోట్ల స్థాయిలో ఉందని నివేదిక వెల్లడించింది.

నిధుల సేకరణలో 19% వృద్ధి

అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2022-23)లో 37 కంపెనీలు ఐపీఓల ద్వారా సమీకరించిన రూ.52,115 కోట్లతో పోలిస్తే 2023-24లో ఈ మొత్తం మరో 19 శాతం పెరిగింది. సెకండరీ మార్కెట్లో జోరు, రిటైల్ మదుపరుల పాత్ర పెరగడంతో పాటు సంస్థాగత ఇన్వెస్టర్లు భారీగా పెట్టుబడులు గుమ్మరించడం ఇందుకు దోహదపడింది. మరిన్ని ఆసక్తికర అంశాలు..

1 గత ఆర్థిక సంవత్సరంలో పబ్లిక్ ఇష్యూకు వచ్చిన కంపెనీల షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయిన తొలి రోజు పంచిన లాభం సగటు 29 శాతంగా నమోదైంది. 2022-23లో ఈ సగటు 9 శాతంగా ఉంది.

1 గత ఆర్థిక సంవత్సరంలో ఐపీఓకు వచ్చిన 70 శాతం లేదా 55 కంపెనీల షేర్లు ఇప్పటికీ ఇష్యూ ధర ఎగువన ట్రేడవుతున్నాయి.

1 ఐపీఓలకు రిటైల్ మదుపరుల నుంచి లభించిన దరఖాస్తుల సగటు 2022-23లో 6 లక్షలుగా ఉండగా.. 2023-24లో 13 లక్షలకు పెరిగింది.

1 గత ఏడాది చిన్న, మధ్య స్థాయి కంపెనీ (ఎస్ఎంఈ) ఐపీఓలు భారీగా పెరిగాయి. ప్రైమ్ డేటాబేస్ ప్రకారం.. 2022-23లో 125 ఎస్ఎంఈలు పబ్లిక్ ఇష్యూల ద్వారా రూ.2,235 కోట్లు సమీకరించగా.. 2023-24లో 200 ఎస్ఎంఈలు మొత్తం రూ.5,838 కోట్లు సేకరించాయి.

1 గత ఆర్థిక సంవత్సరంలో నిఫ్టీ 29 శాతం వృద్ధి చెందగా.. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 70 శాతం, మిడ్‌క్యాప్ 100 సూచీ 60 శాతం పెరిగాయి. ఐపీఓ తర్వాత మార్కెట్లో లిస్టయిన కంపెనీల షేర్ల పనితీరును తెలిపే బీఎస్ఈ ఐపీఓ ఇండెక్స్ సైతం 69 శాతం ఎగబాకింది.

బిజినెస్

ఏపీలో శ్రీ సిమెంట్ ప్లాంట్

» దాచేపల్లి యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా దాచేపల్లిలో శ్రీ సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేసిన సిమెంట్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభమైంది. ఏటా 30 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కంపెనీ ఈ ప్లాంట్ ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.2,500 కోట్లు ఖర్చు చేసింది. నిర్దిష్ట గడువు కంటే 6 నెలల ముందే ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభించినట్టు తెలిపింది. ఈ ప్లాంట్ ద్వారా 700 మందికి ప్రత్యక్షంగా, 1,300 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. తెలంగాణ సరిహద్దుకు చేరువలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల మార్కెట్లలో తన సత్తా చాటాలని శ్రీ సిమెంట్ భావిస్తోంది. అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ నుంచి కాలుష్యం కూడా పెద్దగా వెలువడదని తెలిపింది.

భారత్ బయోటెక్ నుంచి ఓరల్ పోలియో వ్యాక్సిన్

హైదరాబాద్ కేంద్రంగా పని చేసే భారత్ బయోటెక్ మరో వినూత్న వ్యాక్సిన్ ఉత్పత్తికి సిద్ధమవుతోంది. నోటి ద్వారా తీసుకునే పోలియో వ్యాక్సిన్‌ను ఉత్పత్తి చేయనుంది. ఇందుకోసం నెదర్లాండ్ కేంద్రంగా పని చేసే బిల్త్రోవెన్ బయోలాజికల్స్ బీవీ అనే కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపింది. ఇందు కు అవసరమైన అనుమతుల కోసం రెండు కంపెనీలు సంయుక్తంగా దరఖాస్తు చేస్తాయి. భారత్ బయోటెక్ ఉత్పత్తిచేసే ఓరల్ పోలియో వ్యాక్సీన్లను భారత్‌తో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి చేస్తారు. బిల్త్రోవెన్ బయోలాజికల్స్. సీరమ్ ఇనిస్టిట్యూట్ అనుబంధ సంస్థ.

మూడేళ్లలో 'విజేత' పబ్లిక్ ఇష్యూ

పదేళ్లలో మరో 90 స్టోర్లు 1 రూ.2,000 కోట్ల టర్నోవర్ టార్గెట్
తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాలకు విస్తరణ
'ఆంధ్రజ్యోతి'తో విజేత సూపర్ మార్కెట్స్ ఎండీ జగన్మోహన రావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



విజేత సూపర్ మార్కెట్స్ అంటే తెలియని వారు లేరు. హైదరాబాద్‌లో విజేత సూపర్ మార్కెట్ కనిపించని ప్రదేశం లేదంటే అతిశయోక్తి కాదు. నాణ్యమైన సరుకులు సరసమైన ధరలకు అందించడం ద్వారా కస్టమర్లను ఆకట్టుకున్న ఈ సంస్థ భారీ విస్తరణ ప్రణాళిక సిద్ధం చేసుకుంది. రాబోయే పదేళ్లలో కొత్తగా 90 స్టోర్లు ప్రారంభించడం, పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ద్వారా నిధులు సమీకరించుకోవడం ఈ ప్రణాళిక ప్రధానాంశాలు. విజేత సూపర్ మార్కెట్స్ ప్రారంభమై మార్చి నాటికి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మురకొండ జగన్మోహనరావు 'ఆంధ్రజ్యోతి'తో ముఖాముఖిలో పలు అంశాలు ప్రస్తావించారు. అవి ఆయన మాటల్లోనే...

* గుంటూరు జిల్లాలోని నిమ్మగడ్డవారి పాలెం గ్రామానికి చెందిన రైతు కుటుంబంలో పుట్టిన నేను ప్రారంభంలో కొన్ని చిన్న ఉద్యోగాలు చేశాను. హైదరాబాద్ వచ్చి త్రినేత్ర సూపర్ మార్కెట్లో ఉద్యోగానికి చేరాను. బిల్లింగ్ క్లర్క్ నుంచి స్టోర్ ఇన్‌చార్జ్ వరకు 5 సంవత్సరాల అనుభవం ఈ వ్యాపార జీవితానికి పునాది అయింది. ఏదో ఒకటి సాధించాలనే నాలోని తపన దానికి జోడయింది.
* అలా తొలి స్టోర్ చందానగర్‌లో 1999 మార్చి 7వ తేదీన ప్రారంభించాను. అప్పటికి ఇతర రంగాలతో పోల్చితే బీహెచ్ఈఎల్ ఉద్యోగులకు అధిక వేతనాలుండడం వల్ల వారి కొనుగోలు శక్తి అధికంగా ఉండేది. అందుకే తొలి స్టోర్ అక్కడ ప్రారంభించాను.
* క్రమంగా స్టోర్ల సంఖ్యను విస్తరిస్తూ పాతికేళ్ల ప్రయాణంలో 110 స్టోర్లకు వ్యాపారాన్ని పెంచాం. వీటిలో 11 స్టోర్లు మాత్రం ఆంధ్రప్రదేశ్‌లో ఉండగా మిగతావన్నీ తెలంగాణలోనే ఉన్నాయి. వచ్చే పదేళ్ల కాలంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఉమ్మడి జిల్లా కేంద్రాలన్నింటిలో విజేత స్టోర్లు తెరవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాబోయే 10 సంవత్సరాల్లో మొత్తం స్టోర్ల సంఖ్య 200కి చేర్చడం, రూ.2000 కోట్ల టర్నోవర్ సాధించడం మా లక్ష్యం. ప్రస్తుతం మా టర్నోవర్ రూ.840 కోట్లుంది. ఏటా 15 నుంచి 20 శాతం వృద్ధి నమోదు చేస్తున్నాం.
* కొత్త స్టోర్ల ఏర్పాటుకు నిధులు భారీగానే అవసరం అవుతాయి. మంచి ప్రాంతంలో విశాలమైన ప్రాంగణంలో ఒక స్టోర్ ప్రారంభించాలంటే కనీసం రూ.6 కోట్లు అవసరం. ఇప్పటివరకు అంతర్గత వనరులు, బ్యాంకు రుణాల ద్వారా నిధులు సమకూర్చుకున్నాం. భవిష్యత్ అవసరాల కోసం తొలుత ప్రైవేట్ ఈక్విటీ సంస్థల (పీఈ)ను ఆశ్రయించాలనుకుంటున్నాం.
* పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధులు సమీకరించే ఆలోచన ఉంది. అయితే అందుకు కొంత సమయం తీసుకుంటాం. బహుశ మూడేళ్లలో ఇష్యూకి వచ్చే అవకాశం ఉంది.
* వ్యవస్థీకృత రిటైలింగ్ రంగంలో పోటీ తీవ్రంగా ఉన్న మాట వాస్తవమే. కాని నాణ్యత ఉన్న చోటికి కస్టమర్లు తమంత తాముగానే వస్తారు. అదే మా వ్యాపార రహస్యం. దానికి తోడు స్టోర్‌ను ఆకర్షణీయంగా డిజైన్ చేయడం, కస్టమర్లతో సిబ్బంది స్నేహపూర్వకంగా వ్యవహరించడం మా ప్రత్యేకతలు.
* 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరి 23 నుంచి మార్చి 31 వరకు కస్టమర్లకు స్పెషనల్ కూపన్లు అందించాం. త్వరలో వాటిని డ్రా తీయబోతున్నాం. డ్రాలో విజేతలకు కార్లు, బైక్‌లు, ఇతర ఆకర్షణీయమైన బహుమతులు అందిస్తాం.

మన మార్కెట్ వాల్యుయేషన్స్ సబబే

నమ్మకం, విశ్వాసం ఉండబట్టే పెట్టుబడులు: సెబీ చీఫ్ మాధవి పురి బుచ్



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ అధిక వాల్యుయేషన్స్‌ను మార్కెట్ నియంత్రణ మండలి సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ సమర్థించారు. మదుపరులకు ముఖ్యంగా విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ)కు మన ఆర్థిక వ్యవస్థ, క్యాపిటల్ మార్కెట్‌పై నమ్మకం, విశ్వాసం, ఆశావాదం ఉండబట్టే వాల్యుయేషన్స్ అధికంగా ఉన్నా పెట్టుబడులు పెడుతున్నట్టు తెలిపారు. కార్పొరేట్ గవర్నెన్స్‌పై సీఐఐ నిర్వహించిన ఒక సదస్సులో ఆమె ఈ విషయాలు చెప్పారు. ప్రస్తుతం దేశీయ స్టాక్ మార్కెట్ 22.2 పీఈ వద్ద ట్రేడవుతోంది. అనేక దేశాల స్టాక్ మార్కెట్లతో పోలిస్తే ఇది చాలా ఎక్కువని మాధవి అన్నారు. తాను భేటీ అయిన ఎఫ్‌పీఐల ప్రధాన అధికారులు కూడా వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థపై అత్యంత నమ్మకం, విశ్వాసం వ్యక్తం చేశారన్నారు. నమ్మకం అనే అంశంపైనే క్యాపిటల్ మార్కెట్ అనే భవనం నిలబడి ఉందన్నారు. ఇందుకు పారదర్శక లావాదేవీలు అత్యంత ముఖ్యమన్నారు.

మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

దేశీయ స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస ర్యాలీకి అడ్డుకట్ట పడింది. ఐటీ, ప్రైవేట్ బ్యాంకింగ్, వాహన రంగాలకు చెందిన కొన్ని కంపెనీల షేర్లలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడటంతో మంగళవారం సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 110.64 పాయింట్లు కోల్పోయి 73,903.91 వద్దకు జారుకుంది. ఇంట్రాడేలోనైతే సూచీ 270 పాయింట్లకు పైగా పతనమైనప్పటికీ.. ఆఖరి గంటలో నష్టాలను సగానికి పైగా తగ్గించుకోగలిగింది. నిఫ్టీ 8.70 పాయింట్ల నష్టంతో 22,453.30 వద్ద క్లోజైంది.

విస్తారాలో పైలట్ల సంక్షోభం

» కొత్త వేతన ప్యాకేజీపై అసంతృప్తితో విధులకు పైలట్లు డుమ్మా
» ఒక్కరోజే 70 విమాన సర్వీసుల రద్దు.. వివరణ కోరిన డీజీసీఏ

న్యూఢిల్లీ/ముంబై: టాటా గ్రూప్‌నకు చెందిన విస్తారా ఎయిర్‌లైన్స్ సంక్షోభంలోకి జారుకుంది. ఎయిరిండియాలో విలీనం కాబోతున్న ఈ ఎయిర్‌లైన్స్ మార్చి నుంచి అమల్లోకి తెచ్చిన కొత్త వేతన ప్యాకేజీపై పైలట్లు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారు. కొత్త ప్యాకేజీతో జీతం తగ్గనున్న కారణంగా చాలామంది పైలట్లు గత కొన్ని రోజులుగా వ్యక్తిగత, అనారోగ్య కారణాలతో విధులకు హాజరు కావడం లేదు. పైలట్లు అందుబాటులో లేని కారణంగా గత కొన్ని రోజుల నుంచి ఎయిర్‌లైన్స్‌కు చెందిన పలు సర్వీసులు రద్దు కావడంతో పాటు ఆలస్యంగా నడుస్తున్నాయి. సోమవారం 50కి పైగా సర్వీసులు రద్దు కావడంతో పాటు కనీసం 160 సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. మరింత మంది పైలట్లు డుమ్మా కొట్టడంతో మంగళవారం దాదాపు 70 విమాన సర్వీసులను రద్దయినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పాటు ఇతర కారణాలతో కార్యకలాపాలను తగ్గించుకుంటున్నట్లు విస్తారా సోమవారమే ప్రకటించింది. ఈ విషయంపై 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్' (డీజీసీఏ).. విస్తారాను సమగ్ర వివరణ కోరింది. విమానాల రద్దు, సేవల జాప్యంపై రోజువారీ రిపోర్టును సమర్పించాలని ఆదేశించింది. ఎయిర్‌లైన్స్ తాజా పరిస్థితిని డీజీసీఏ అధికారులు కన్నేసి ఉంచారు.

15 మంది పైలట్ల రాజీనామా: టాటా గ్రూప్, సింగపూర్ ఎయిర్‌లైన్స్‌ల ఉమ్మడి భాగస్వామ్య సంస్థే విస్తారా. ఈ ఎయిర్‌లైన్స్ 70 విమానాలతో సేవలందిస్తోంది. మార్చి 31తో ప్రారంభమైన వేసవి షెడ్యూలు ప్రకారం.. విస్తారా రోజుకు 300కు పైగా విమాన సర్వీసులను నడపాల్సి ఉంది. అయితే, వేతన ప్యాకేజీపై అసంతృప్తితో కనీసం 15 మంది సీనియర్ పైలట్లు తమ ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే ఈ విషయంపై వ్యాఖ్యానించేందుకు విస్తారా నిరాకరించింది.

1 అమెజాన్ ఫ్రెష్.. వేసవి కాలాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నెల 7 వరకు అందుబాటులో ఉండనున్న సూపర్ వాల్యూ డేస్‌లో పండ్లు, కూరగాయలు, నిత్యావసరాలపై 45% వరకు తగ్గింపును ఇస్తున్నట్లు ప్రకటించింది.

1 కియా ఇండియా మార్కెట్లోకి సరికొత్త 6 సీటర్ కారెన్స్‌ను విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.12,11,900. కాగా 1.5 లీటర్ డీజిల్ ఎంటీ వేరియంట్ ధర రూ.12,66,900. స్మార్ట్‌కీ, పుష్‌బటన్ స్టార్ట్, రియర్ ఎల్ఈడీ లైట్స్ వంటి కొత్త ఫీచర్లను పొందుపరిచింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,110 ▼	63,350 ▼	82,000 ▲
ముంబై	68,961 ▲	63,168 ▲	76,127 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ

హైదరాబాద్	380	విజయవాడ	403
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	403	వరంగల్	382

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	137	గోదావరి	131
వరంగల్	137	విజయవాడ	131
కరీంనగర్	137	గుంటూరు	132
మహబూబ్‌నగర్	137	ఒంగోలు	132
కర్నూలు	137	చిత్తూరు	133
విశాఖపట్నం	122		

బిల్లుల మంజూరు కోసం 'బీ' టాక్స్

- 8-9శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు
- ధరణి పోర్టల్‌లో రూ.2లక్షల కోట్ల కుంభకోణం
- కేసీఆర్, కేటీఆర్‌ను రక్షిస్తున్నదెవరు?: ఏలేటి



హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్ బిల్లుల మంజూరు కోసం కొత్తగా 'బీ' టాక్స్ వసూలు చేస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. "పెండింగ్ బిల్లుల మంజూరు కోసం 8-9శాతం బీ టాక్స్ కట్టాల్సి వస్తోంది. ఇప్పటివరకు 'ఆర్' టాక్స్ పేరిట వసూళ్లు చేయగా.. ఇప్పుడు 'బీ' టాక్స్ పేరిట బాదుతున్నారని కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు" అని వివరించారు. దేశంలోనే అతిపెద్ద కుంభకోణం 'ధరణి' అని, ఇందులో రూ.2లక్షల కోట్ల మేర గోల్‌మాల్ జరిగిందన్నారు. ఇందులో 40శాతం వాటా కోసం కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారని, తద్వారా కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. లేకుంటే కేసీఆర్, కేటీఆర్‌ను ఎందుకు రక్షిస్తున్నారని సీఎం రేవంత్‌ను నిలదీశారు. చిత్తశుద్ధి ఉంటే ఈ కేసును సీబీఐకి అప్పగించి, ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని డిమాండ్ చేశారు. పదేళ్లలో 18లక్షల ఎకరాల అసైన్డ్ భూములు, 1.30లక్షల ఎకరాల భూదాన్ భూములు, 60వేల ఎకరాల దేవాదాయ భూములు అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరగానే కేకే, బొంతు రామ్మోహన్, రంజిత్‌రెడ్డి.. ఆణిముత్యాలయ్యారా? అని ప్రశ్నించారు. కాగా, కాంగ్రెస్‌లో చేరేందుకు మంత్రి పదవి డిమాండ్ చేసినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలపై మహేశ్వర్‌రెడ్డి స్పందించారు. కోమటిరెడ్డి ఏమైనా ప్రధాన మంత్రా? ముఖ్యమంత్రా? అని ప్రశ్నించారు. తన కంఠంలో ప్రాణమున్నంత వరకూ బీజేపీలోనే ఉంటానని స్పష్టం చేశారు.

ఆర్టీసీలో తొలగించిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోండి :కూనంనేని

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): చిన్న చిన్న తప్పులను కారణాలుగా చూపి గత ప్రభుత్వం ఆర్టీసీలో సుమారు 1500 మంది ఉద్యోగులను తొలగించిందని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్లుగా పని చేస్తున్న వారిని స్వల్ప కారణాలతో ఉద్యోగాల నుంచి తొలగించారని, వారిని తిరిగి విధుల్లోకి తీసుకుని ఆయా కుటుంబాలకు అండగా నిలవాలని కూనంనేని కోరారు.

ఖమ్మం ఎంపీ టికెట్ నాకే ఇవ్వాలి

- సీఎం రేవంత్‌ను కలిసి ఇదే విషయం చెప్పా: వీహెచ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ సీటు తనకే ఇవ్వాలని పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు(వీహెచ్) కోరారు. ఇటీవలే సీఎం రేవంత్ రెడ్డిని కలిసి, ఖమ్మం టికెట్ ఇవ్వాలని కోరానని తెలిపారు. ఖమ్మం టికెట్ తనకు ఇస్తే భారీ మెజార్టీతో గెలుస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజీవ్ గాంధీతో కలిసి ఖమ్మంలో తిరిగిన అనుభవం తనకు ఉందని గుర్తు చేశారు. అయితే, పార్టీ అధిష్ఠానం ఎటువంటి నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని చెప్పారు. తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో అసలు సూత్రధారితోపాటు ప్రమేయం ఉన్న ప్రతిఒక్కరినీ బయటికి లాగాలన్నారు. అలాగే గ్యాంగ్‌స్టర్ నయీం కేసును మళ్లీ రీ ఓపెన్ చేయాలని సూచించారు. సుమారు రూ.2500 కోట్ల ఆస్తులు, భూములను నయీం ఆక్రమించాడని, అవన్నీ పేదలకు పంచాలని కోరారు.

రేవంత్‌పై చీటింగ్ కేసు పెట్టాలి: హరీశ్‌రావు

- రూ.100 కోట్లతో పేద విద్యార్థుల చదువులకు సాయం
- గజ్వేల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి హామీ

గజ్వేల్, ఏప్రిల్ 2: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నో హామీలనిచ్చి వాటిని అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను రేవంత్‌రెడ్డి మోసం చేశారని, ఆయనపై చీటింగ్ కేసు పెట్టాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో గజ్వేల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నో అబద్ధపు, మోసపూరిత హామీలతో రేవంత్ గద్దెనెక్కారని ఆరోపించారు. రూ.2లక్షల రుణమాఫీ అయినోళ్లు కాంగ్రెస్‌కు, కానోళ్లు బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయాలని అన్నారు. దేవుళ్ల పేరుతో బీజేపీ రాజకీయం చేస్తోందని హరీశ్ విమర్శించారు. కేసీఆర్ చేసిన యాగాలు ఎవరైనా చేశారా అని ప్రశ్నించారు. గజ్వేల్ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని హరీశ్‌రావు భరోసానిచ్చారు. సమావేశంలో వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సేవ చేసేందుకు పీవీఆర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి, రూ.వంద కోట్లతో నిరుపేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం చేస్తానన్నారు. యువతకు పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తానని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

పాడి రైతులకు పాల బిల్లులు చెల్లించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ రావు లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాడి రైతులకు 45 రోజులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.80 కోట్ల పాల బిల్లులను తక్షణం చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీఎంకు లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల మందికి పైగా పాడి రైతులు పాల ఉత్పత్తి సహకార సంఘాలుగా ఏర్పడి, ప్రభుత్వం నడిపే విజయ డెయిరీకి ప్రతీ రోజు పాలు సరఫరా చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బిల్లుల చెల్లింపు సకాలంలో జరగడంలేదన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బకాయిలు విడుదల చేయడంతో పాటు 15 రోజులకోసారి పాల బిల్లులు చెల్లించాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఎండిన పంటలు

- రైతు దీక్షలో ఎంపీ బండి సంజయ్ కుమార్



కరీంనగర్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంవల్లే పంటలు ఎండిపోయాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. పంట నష్టంపై ప్రభుత్వం తక్షణం ప్రకటించిన పది వేలు ఇవ్వకుండా ఎందుకు జాప్యం చేస్తోందని నిలదీశారు. ఎకరానికి వెంటనే 25 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి కౌలు రైతులకు 15 వేలు, కూలీలకు 12 వేలు చెల్లించాలన్నారు. మంగళవారం కరీంనగర్‌లోని ఎంపీ కార్యాలయంలో ఆయన రైతు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫసల్ బీమా అమలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచుతారా అని ప్రశ్నించారు. రైతు భరోసా కోసం ఎకరానికి ఏడాదికి 15 వేలు ఎందుకు ఇవ్వడం లేదని నిలదీశారు. కేసీఆర్ గడీల పాలనకు అంతం పలికిన ఘనత బీజేపీదేనన్నారు. ఇతర పార్టీల నేతల కోసం గేట్లు తెరవడం కాకుండా సాగునీటి విడుదలకు గేట్లు తెరవాలన్నారు. కేసీఆర్ ఫాం హౌస్ నుంచి రాజకీయాలు చేస్తే, కాంగ్రెస్ నేతలు హామీల పేరుతో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.తాము శ్రీరాముడి ఫొటోతో ఓట్లడుగుతున్నామని, వాళ్లకు దమ్ముంటే బాబర్ ఫొటోతో ప్రచారం చేసుకోవాలని సవాల్ విసిరారు.

బండి సంజయ్... దీక్ష మోదీ వద్ద చేయి: పొన్నం

హుస్నాబాద్, ఏప్రిల్ 2: ఏనాడూ ప్రజాసమస్యలు పట్టించుకోని కాబోయే మాజీ ఎంపీ బండి సంజయ్‌కి రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా..? అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఆయన దీక్ష ఇక్కడ చేసే బదులు... ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ వద్ద దీక్ష చేయాలని సూచించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆయన సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అంబేడ్కర్ చౌరస్తాలో పాపన్న విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. వర్షాకాలంలో వానలు కురియక నీటి ఎద్దడి నెలకొందన్నారు. అయినా కాంగ్రెస్ వల్లే కరువు వచ్చిందని కనీస జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఇప్పుడు పొలాల బాట పట్టారని, ఈ నాలుగు నెలలు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు.

హరీశ్‌ను అడ్డుకున్న 'డబుల్' లబ్ధిదారులు

- కేటాయించిన ఇళ్ల సర్టిఫికెట్లు ఇప్పించాలని ఆందోళన
- ఏడాది క్రితం వీరంతా లక్కీడ్రా ద్వారా ఎంపిక
- లబ్ధిదారులతో కలిసి ఆర్డీవో ఆఫీసుకు హరీశ్
- వారం రోజుల్లో సర్టిఫికెట్లు ఇవ్వాలన్న మాజీ మంత్రి
- లేదంటే ధర్నా, వంటావార్పు చేపడతానని హెచ్చరిక

గజ్వేల్, సిద్దిపేట, ఏప్రిల్ 2: డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు మాజీ మంత్రి హరీశ్ రావును అడ్డగించారు. తమను నిరుడు లక్కీ డ్రా ద్వారా డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఎంపిక చేశారని, దాదాపు ఏడాదైనా సర్టిఫికెట్లు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారడంతో కాంగ్రెస్ నేతలను అడిగితే తమకు సంబంధం లేదని అంటున్నారని.. ఇళ్ల కేటాయింపునకు సంబంధించిన సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని ఓ ఫంక్షన్‌హాల్లో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు హరీశ్ లోపలికి వస్తుండగా గేటు వద్ద గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులు అడ్డుకున్నారు. స్పందించిన హరీశ్.. తాను గజ్వేల్ ఆర్డీవో, తహసీల్దార్‌తో మాట్లాడి సర్టిఫికెట్లు ఇప్పించే ప్రయత్నం చేస్తానని చెప్పారు. అయినా తమకు సర్టిఫికెట్లు ఇచ్చే దాకా వెళ్లేది లేదంటూ వారు దాదాపు నాలుగు గంటల పాటు అక్కడే ఉండిపోయారు. సమావేశం ముగిసి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు బయటకు వెళ్తున్న క్రమంలో లబ్ధిదారులు బయట నుంచి ఫంక్షన్‌హాల్ గేట్‌ను మూసివేసి నిరసన తెలిపారు. ఈ క్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి గేట్ వద్దకు వచ్చి లబ్ధిదారులను సముదాయించినా వారు వినలేదు. ఈ క్రమంలో పెద్దఎత్తున బీఆర్ఎస్ నాయకులొచ్చి ఆందోళన చేస్తున్న లబ్ధిదారులను పక్కకు తోసేసి.. గేట్లు తెరిచి కొన్ని వాహనాలను పోనిచ్చారు. ఈ క్రమంలో మహిళల్లో కొందరి కాళ్లు, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. ఇక హరీశ్ ఫంక్షన్ హాలు నుంచి తన వాహనంలో బయటకు వస్తున్న క్రమంలో మహిళలు మరోసారి అడ్డుతగిలే ప్రయత్నం చేశారు. ఆయన తన వాహనాన్ని ఆపకుండా వేగంగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో లబ్ధిదారులు నిరాశగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాగా, కొద్దిసేపటికి కొందరు లబ్ధిదారులతో కలిసి హరీశ్, గజ్వేల్ ఆర్డీవో కార్యాలయానికి వెళ్లారు. అక్కడ ఆర్డీవో లేకపోవడంతో అక్కడి నుంచి గజ్వేల్ ఆర్డీవో, సిద్దిపేట ఆర్డీవోలతో పాటు సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్‌చేసి డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు వెంటే సర్టిఫికెట్లు పంపిణీ చేయాలని, దీనికి ఎన్నికల కోడ్‌తో సంబంధం లేదని పేర్కొన్నారు. లేనిపక్షంలో లబ్ధిదారుల పక్షాన తానే ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా, వంటావార్పు చేపడుతానన్నారు. కాగా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, వరికి రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని హరీశ్ డిమాండ్‌చేశారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది కేసీఆరే

రేవంత్‌వి మాయమాటలు.. కాంగ్రెస్ మాకు పోటీయే కాదు.. రాష్ట్రానికి మోదీ చేసిందేమీ లేదు: కేటీఆర్

మేడ్చల్ ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/శామీర్‌పేట: పదేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది కేసీఆరేనని.. మాయమాటలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్నది సీఎం రేవంత్‌రెడ్డేనని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం అలియాబాద్‌లో నిర్వహించిన మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన కేటీఆర్ మాట్లాడారు. మేడ్చల్ నియోజకవర్గం అంటేనే మాస్.. అందులో మల్లన్న(ఎమ్మెల్యే మల్లారెడ్డి) అంటే మరీమాస్.. మల్లన్న మేడ్చల్‌కే పరిమితం కావొద్దని, రాష్ట్రమంతా తిరుగుతూ బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలన్నారు. సోషల్ మీడియాలో మల్లన్నకు తిరుగులేదని, మేడ్చల్ నియోజవర్గంలో పదేళ్లుగా మల్లన్న ఎన్నో అభివృద్ధి పనులను చేసి ఆదర్శంగా నిలిచారని కితాబిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు మళ్లీ జరగకుండా జాగ్రత్త పడాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటే అంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే పార్లమెంటు ఎన్నికల తర్వాత బీజేపీలో చేరుతారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతోషంగా లేదన్నారు. బీఆర్ఎస్సే నిజమైన సెక్యులర్ పార్టీ అని క్రిస్టియన్, ముస్లిం సోదరులకు చెబుదామన్నారు. జై శ్రీరామ్ నినాదాలు చేసే పిల్లలకు.. అది కడుపు నింపదని, ఉద్యోగం ఇవ్వదని చెప్పాలని, ప్రజల కోసం పార్లమెంటులో మాట్లాడేవాళ్లు, కొట్లాడే వాళ్లు కావాలని వారికి అర్థమయ్యేలా వివరించాలని కార్యకర్తలకు సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పోటీ లేదని, ఆ పార్టీ నుంచి డమ్మీ అభ్యర్థులు బరిలో ఉన్నారన్నారు. మల్కాజిగిరిలో బీఆర్ఎస్, బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని చెప్పారు. బీజేపీకి సత్తా ఉంటే మల్కాజిగిరి నుంచి ఈటల రాజేందర్‌ను గెలిపించి చూపించాలని సవాల్ విసిరారు. మేడ్చల్, శామీర్‌పేట మార్గాల్లో స్కైవే కడదామని బీఆర్ఎస్



పదేళ్లుగా పోరాటం చేయగా.. గత ఆగస్టులో కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిందని, దీంతో 100 రోజుల్లోనే తాము సాధించామని సీఎం రేవంత్‌రెడ్డి అనడం విడ్డూరంగా ఉందని కేటీఆర్ విమర్శించారు. రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలకోరని, నోటికొచ్చినట్లు మాయమాటలు చెబుతారన్నారు. దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ చేసిందేమి లేదని, ఒక్క నవోదయ పాఠశాల, మెడికల్ కళాశాల కూడా ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీల్లో అభివృద్ధి పనులు చేసే వారే లేరని, మాయమాటలు చెప్పేవారే ఉన్నారని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తల కృషితో ఎంపీగా తాను భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు.

ఐదేళ్ల తరువాత కేటీఆరే సీఎం: ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఐదేళ్ల తర్వాత జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని, కేటీఆర్ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ నియోజవర్గంలో ఏ మూలకు వెళ్లిన బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధే కనిపిస్తోందని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీల్లో సత్తా ఉన్నావాళ్లెవరూ లేరని, కసిమీద ఉన్నది బీఆర్ఎస్ పార్టీయేనన్నారు. బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ నేతలు దౌర్జన్యం చేస్తున్నారని, బెదిరింపులకు పాల్పడుతూ తమ నేతలను వాళ్ల పార్టీలో చేర్చుకుంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌లో చేరిన వారంతా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే ఓట్లు వేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లీగల్ నోటీసులు పంపిస్తా!

- నాపై సిగ్గులేని, నిరాధార, పిచ్చి ఆరోపణలు చేస్తున్నారు: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనపై కాంగ్రెస్ నేతలు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, వారికి లీగల్ నోటీసులు పంపిస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ నేతలు కేకే మహేందర్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలతో కూడిన ఓ న్యూస్‌క్లిప్పింగ్‌ను ఎక్స్‌లో మంగళవారం పోస్ట్ చేస్తూ, దానిపై తన కామెంట్ జోడించారు. 'పరువునష్టం, దుష్ప్రచారానికి సంబంధించి మంత్రితోసహా ఈ కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు పంపిస్తా. ఈ సిగ్గులేని, నిరాధార, పిచ్చి ఆరోపణలపై క్షమాపణ చెప్పాలి.. లేదంటే, న్యాయపరమైన పరిణామాలను ఎదుర్కోవాలి. నిజానిజాలను తెలుసుకోకుండా చెత్తను వండివారుస్తున్న వార్తాసంస్థలకు కూడా లీగల్ నోటీసులు పంపిస్తా' అని హెచ్చరించారు.

కాంగ్రెస్.. మాదిగల వ్యతిరేక పార్టీ

- లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క టికెటైనా ఇవ్వకుండా మొండి చేయి
- నేటి నుంచి 10 రోజుల పాటు నిరసన: మంద కృష్ణ



పంజాగుట్ట, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): మాదిగ సామాజిక వర్గానికి ఒక్క పార్లమెంట్ టికెట్ కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ మొండి చెయ్యి చూపిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ మండిపడ్డారు. మాదిగల రాజకీయ ఉనికిని కాంగ్రెస్ అగ్ర నేతలు ప్రశ్నార్థకం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తీరును వ్యతిరేకిస్తూ బుధవారం నుంచి 10 రోజుల పాటు అన్ని సంఘాలు కలిసి రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కడియం శ్రీహరికి బీఆర్ఎస్ ఏం తక్కువ చేసిందని ప్రశ్నించారు. కడియం శ్రీహరికి విలువల్లేవని, ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి ద్రోహం చేశారని ధ్వజమెత్తారు. "రాజీనామా చేయకుండా పార్టీ మారే వారిని రాళ్లతో కొట్టి చంపాలని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం కడియం శ్రీహరి ఏ పార్టీ నుంచి ఏ పార్టీలో చేరారు. మరి ఎవరిని రాళ్లతో కొట్టాలి?" అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికల తరువాత మారో మాట మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో మాలలకు ఉన్న గౌరవం, గుర్తింపు తమకు లేదని రుజువైందన్నారు. దీన్ని నిరసిస్తూ గ్రామాలు, మండలాలు, జిల్లా కేంద్రాల్లో పది రోజుల పాటు నిరసన తెలపనున్నట్లు తెలిపారు.

ఎర్రబెల్లికి బలుపు తగ్గలే

- మనవరాలి వయసున్న అమ్మాయి చేతిలో.. ఓడిపోయినందుకు సిగ్గనిపించడం లేదా..?
- బీఆర్ఎస్ ప్రస్తుత దుస్థితికి పల్లానే కారణం
- నాపై చేసిన ఆరోపణలను నిరూపించాలి
- లేకుంటే జనగామలో పల్లా బట్టలూడతీస్తా
- మందకృష్ణ బీజేపీలో చేరాలి: కడియం శ్రీహరి



వరంగల్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "పాలకుర్తిలో రూ.వంద కోట్లతో అభివృద్ధి పనులు చేశానని చెప్పే ఎర్రబెల్లి దయాకర్‌రావు.. మనవరాలు వయసున్న అమ్మాయి చేతిలో ఓడిపోయాడు.. సిగ్గనిపించడం లేదా..? దయాకర్‌రావుకు ఇంకా అహంకారం, బలుపు తగ్గటం లేదు. ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదు" అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ధ్వజమెత్తారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నిప్పులు తొక్కిన కోతిలా ఎగురుతున్నాడని, కేసీఆర్ పక్కన చేరి చీడ పురుగులా మారాడని మండిపడ్డారు. బీఆర్ఎస్ దుస్థితికి పల్లానే కారణమని ఆరోపించారు. పల్లా తనపై చేసిన ఆరోపణలను నిరూపించకుంటే జనగామ చౌరస్తాలో బట్టలూడదీసి నిలబెడతామని హెచ్చరించారు. తాను పార్టీ ఫండ్ తీసుకున్నట్లు ప్రచారం చేస్తున్నారని.. తనకు డబ్బులు ఇచ్చినట్లుగా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఆధారాలతో నిరూపిస్తే.. తాను, తన కూతురు రాజకీయాల నుంచి తప్పుకుంటామని సవాల్ చేశారు. బీఆర్ఎస్‌ను వీడినందుకు బాధగా ఉందన్న కడియం.. తనకు అవకాశాలు కల్పించిన కేసీఆర్‌కు ధన్యావాదాలు తెలిపారు. కాంగ్రెస్‌లో చేరిన తనను రాజీనామా చేయాలనే నైతిక హక్కు బీఆర్ఎస్ నేతలకు లేదన్నారు. ఈ సంస్కృతి మొదలు పెట్టిందే బీఆర్ఎస్ అని చెప్పారు. దేశానికి ప్రమాదకరంగా మారిన బీజేపీని ఎదుర్కొనేందుకే కాంగ్రెస్‌లో చేరానని కడియం శ్రీహరి తెలిపారు. దేశంలో బీజేపీ భయానక పరిస్థితులను సృష్టిస్తోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 400 సీట్లు వస్తే రాజ్యాంగం నుంచి లౌకికవాదాన్ని తొలగించాలని, రిజర్వేషన్లు ఎత్తేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

రాజకీయంగా ఇవే చివరి ఎన్నికలు

మంద కృష్ణ తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని.. ప్రతీ సందర్భంలోనూ తాను దండోరా ఉద్యమంలో ఉన్నానని కడియం పేర్కొన్నారు. మంద కృష్ణ ప్రతీ ఎన్నికల్లో ఏదో ఒక పార్టీకి మద్దతు ప్రకటించడం వల్లే ఎమ్మార్పీఎస్ ముక్కలైందని తెలిపారు. మంద కృష్ణ దండోరాను పక్కన పెట్టి బీజేపీలో చేరాలని చెప్పారు. రాష్ట్రంలో మతోన్మాదం పెరుగుతోందని, దళితులపై దాడులు, హత్యలు చేస్తూ, ముస్లింలను టెర్రరిస్టుల్లా చూపిస్తున్న బీజేపీకి ఓటు వేయాలని ఎలా అడుగుతారని ప్రశ్నించారు. ఆర్డినెన్స్ ద్వారా ఎస్సీ వర్గీకరణ చేయవచ్చని తెలిపారు. మాదిగ ఉప కులాలకు మద్దతు ఇస్తానని మంద కృష్ణ అన్నారని, తనదీ ఉప కులమే కదా అని అన్నారు. తాను ఎవరి అవకాశాలను అందిపుచ్చుకోలేదని, అవకాశాలే తనను వెతుక్కుంటూ వచ్చాయని తెలిపారు. రాజకీయంగా ఇవి తనకు చివరి ఎన్నికలని చెప్పారు.

కేటీఆర్‌కు భయమెందుకు?

- ఫోన్‌ట్యాపింగ్‌లో తన ప్రమేయమే లేకపోతే అంత కలవరం దేనికి?
- జైలులో ఉన్న కవిత రుద్రాక్షమాల కావాలని అడుగుతున్నారు
- పదేళ్లలో ఆమె మెడలో తాళి చూడలేదు
- జైలుకెళ్లాక తాళి గుర్తుకొచ్చిందా?:సురేఖ
- పరువునష్టం సంగతి తర్వాత.. అసలు మీకు పరువుందా?: యెన్నం





వరంగల్, మహబూబ్‌నగర్, హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తన ప్రమేయం లేకుంటే కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారని మంత్రి కొండా సురేఖ ప్రశ్నించారు. ఈ విషయానికి సంబంధించి గత ప్రభుత్వ హయాంలో నియమితులైన అధికారులే లొంగిపోతున్నారని, దర్యాప్తు కొనసాగుతోందని, దోషులెవరో త్వరలోనే తెలుస్తుందన్నారు. కేటీఆర్ ఏ నోటీసులు పంపించినా సమాధానం ఇస్తామని తెలిపారు. మంగళవారం హన్మకొండలో కొండా సురేఖ మాట్లాడారు. సీఎం రేవంత్ గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని పేర్కొంటూ.. 'మీ నాన్న నేర్పిన భాషనే మాట్లాడుతున్నావు. మీ కుటుంబం నుంచే ఈ భాష మొదలైంది. మీ భాష మారకుంటే మీ భాషలోనే మీకు సమాధానం చెబుతాం' అని హెచ్చరించారు. ఎన్నికల్లో ఓడిపోయిన ఒత్తిడిలో, చెల్లెలు జైలుకు పోయిన బాధలో కేటీఆర్ ఉన్నారని, ఆయన నీతులు చెబితే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. లిక్కర్ స్కాంలో జైలుకు వెళ్లిన కవిత.. రుద్రాక్షమాల కావాలని అడుగుతోందని, గత పదేళ్లలో ఎన్నడూ కవిత మెడలో తాళిబొట్టు చూడలేదని, జైలుకు వెళ్లగానే ఆమెకు తాళి బొట్టు గుర్తుకొచ్చిందా అని సురేఖ ప్రశ్నించారు. పదేళ్లుగా వారు చేసిన పాపాలే వారి మెడకు ఉచ్చులా చుట్టుకున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే లోక్‌సభ ఎన్నికల్లోనూ మెజారిటీ సీట్లు గెలుచుకుంటామని, తెలంగాణలో బీజేపీని ప్రజలు ఆదరించరని మంత్రి సురేఖ పేర్కొన్నారు.

ఆ నైతిక హక్కు కేటీఆర్‌కు ఉందా?

'ఫోన్ ట్యాపింగ్‌తో ఇప్పటికే రాష్ట్రం పరువు తీశారు. ఇంకా మీకు పరువు.. పరువు నష్టం దావా వేసే నైతిక హక్కు ఉన్నాయా?' అంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కేటీఆర్‌ను ప్రశ్నించారు. టెలిగ్రాఫ్ చట్టం ప్రకారం ఫోన్ ట్యాపింగ్ దేశ ద్రోహమని గుర్తు చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియాతో పార్టీ నేత కేకే మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్‌ల మాటలు పాత కాలం నాటి రాచరిక దర్బార్‌ను తలపిస్తున్నాయని, తెలంగాణ ప్రజలు బండకేసి కొట్టినా వారికి సిగ్గు రావటం లేదన్నారు. పోలీసుల రూపంలో ఓ ప్రైవేటు సైన్యాన్ని పెంచి పోషించిన కేసీఆర్.. ఆ సైన్యంతోనే తన హయాంలో ఫోన్ ట్యాపింగ్ చేయించారన్నారు. ఇప్పుడు ఆ సైన్యమే ఒక్కొక్కటిగా వాస్తవాలు బయటపెడుతున్నా.. కేటీఆర్ ఇంకా ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌కు తెలంగాణ ఉద్యమం గురించి తెలుసా? మేం ఉద్యమంలో ఉన్నప్పుడు ఆయన ఎక్కడున్నాడు? తెలంగాణ ఉద్యమానికి ముందు కేటీఆర్ ఆస్తులు ఎన్ని.. ఇప్పుడు ఎన్ని? దీనిపై న్యాయపోరాటం చేద్దామా? అని సవాల్ విసిరారు. కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ పరువు నష్టం దావాలకు భయపడేది లేదని, ఏ నోటీసులు ఇచ్చినా సిద్ధంగా ఉన్నామన్నారు.

100 కోట్లు హాంఫట్!

(మొదటి పేజీ తరువాయి)

480 మెగావాట్ల సామర్థ్యం(ఒక్కోటి 120 మెగావాట్లు కలిగిన నాలుగు యూనిట్లు), 240 మెగావాట్ల సామర్థ్యం(ఒక్కోటి 60 మెగావాట్లు కలిగిన నాలుగు యూనిట్ల)ఉన్న ప్లాంట్లను నిర్మించి 30 ఏళ్లు దాటింది. దీంతో వాటిని మూసేయాలని 2018ఏప్రిల్‌లో కేంద్ర పర్యావరణ శాఖ ఆదేశాలు జారీ చేసింది. 2019 తర్వాత కాలం చెల్లిన ప్లాంట్లు నడపడానికి వీల్లేదని స్పష్టం చేసింది. వాస్తవానికి కేటీపీఎస్ ఏడో దశ 800మెగావాట్ల సూపర్ క్రిటికల్ విద్యుత్తు కేంద్రానికి అనుమతినిచ్చిన సందర్భంలోనే 30ఏళ్లు దాటిన ప్లాంట్లన్నీ మూసివేయాలని కేంద్రం ప్రతిపాదించగా.. తెలంగాణ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. వీటిలో కాలుష్య ఉద్గారాలు తగ్గించే అవకాశాలు లేకపోవడం, అది కూడా అధిక వ్యయంతో కూడుకున్న పని కావడంతో వీటికి తాళం వేయడమే మేలని తెలంగాణ జెన్‌కో నిర్ణయానికి వచ్చింది. కేంద్రం ఆదేశాలను ధిక్కరిస్తే భారీగా జరిమానాలు పడే అవకాశం ఉండడంతో 2019 డిసెంబరు నాటికి రెండు ప్లాంట్లను మూసివేసింది. పనిలో పనిగా మూసివేసిన ప్లాంట్లను తుక్కు రూపంలో విక్రయించేందుకు 2023 జూన్‌లో టెండర్లు పిలిచింది. వాస్తవానికి ప్లాంట్‌లోని మెకానికల్ సామగ్రితోపాటు ప్లాంట్ లోపల ఉన్న పైపులు, కేబుళ్లు, కన్వేయర్స్, షెడ్, ఐరన్ నిర్మాణాలు, స్టోర్‌లోని పరికరాలు, సివిల్ నిర్మాణాలను తుక్కుగా విక్రయించడం ద్వారా రూ.449కోట్ల ఆదాయం వస్తుందని అప్పట్లో అంచనా వేసింది. అయితే, ఈ టెండరును రూ.485 కోట్లకు దక్కించుకున్న సంస్థ... టెండర్ పరిధిలో లేని కాపర్, అల్యూమినియంతో పాటు ఇనుమును తరలించింది. ఈ వ్యవహారంలో రూ.100కోట్ల దాకా చేతులు మారినట్లు తేలింది.

టెండర్‌లో లేకున్నా...

టెండర్ నిబంధనల ప్రకారం ప్లాంట్ ఉన్న స్థలంలోనే తవ్వకాలు జరిపి.. తుక్కును తరలించాల్సి ఉంది. అయితే, టెండరు దక్కించుకున్న సంస్థ ఇష్టారాజ్యంగా సామగ్రిని తరలించేసింది. ఈ ప్లాంట్ల నుంచి బూడిద వాగు చెరువు దాకా సుమారు 8 కిలోమీటర్ల మేర మూడు వరుసల్లో ఉన్న పైపులైన్లను తరలించేసింది. నిబంధనల ప్రకారం ఈ పైపులను ముట్టుకోకూడదు. అంతేకాదు.. ప్లాంట్ పునాది(ఫౌండేషన్)లో ఉన్న పరికరాలను కూడా ముట్టుకోరాదని టెండర్ నిబంధనల్లో ఉంది. కానీ, భూగర్భంలో ఎర్తింగ్ కోసం పరిచిన 3 నుంచి 4 ఇంచుల డయా కలిగిన కాపర్, అల్యూమినియం కేబుళ్లు కూడా మాయం చేసినట్లు తేలింది. అక్రమంగా తరలించిన ఈ పైపులు, కేబుళ్ల విలువే రూ.100కోట్లకు పైగా ఉంటుందన్న అంచనాలున్నాయి. ఇందులో ఓ కీలక అధికారికి రూ.15కోట్ల మేర అందగా, మరో నలుగురు అధికారుల పాత్ర కూడా ఉందన్న ఆరోపణలున్నాయి. మరోవైపు.. 2019 డిసెంబరులో రెండు ప్లాంట్లు మూతపడగా... బూడిద పైపులు, ప్లాంట్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన కాపర్, బస్ బార్స్, ఎయిర్ కండీషనర్లతో పాటు రూ.12కోట్ల విలువైన బేరింగ్స్‌ను కీలక అధికారి నేతృత్వంలోని నలుగురు అధికారులు బృందంగా ఏర్పడి, అమ్ముకున్నట్లు తెలిసింది. రెండు ప్లాంట్ల పరిధిలో 250-300 చెట్లు ఉండగా... అనుమతి లేకుండా నరికేసి, కలపను అమ్ముకున్నట్లు సమాచారం. ప్లాంట్ పరిధిలో జంగిల్ (మొక్కలను కట్ చేయించే) పేరిట కూడా రూ.80 లక్షల దాకా తిన్నారని ఆరోపణలు ఉన్నాయి.

ఆదరాబాదరాగా ఉత్తర్వులు

దేశంలో విద్యుత్తు డిమాండ్ అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో విద్యుదుత్పత్తి నిలిపివేసిన ప్లాంట్లను సైతం ఇప్పటికిప్పుడు కూల్చివేయరాదని కేంద్ర విద్యుత్తు శాఖ 2023 జనవరి 30న రాష్ట్రాలను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న 81 (30 ఏళ్లు దాటిన)ప్లాంట్లను 2030 దాకా కూల్చివేయొద్దని సూచించింది. అయితే, కేంద్రం ఆదేశాలు వెలువడిన ఆర్నెల్ల తర్వాత అంటే 2023 జూన్ 8న కేటీపీఎస్ పరిధిలోని రెండు ప్లాంట్లను తుక్కు కింద అమ్మేయడానికి తెలంగాణ జెన్‌కో ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఆదేశాల జారీ వెనుక భారీగా ముడుపులు చేతులు మారినట్లు సమాచారం. దీనిపై సమగ్ర విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

దొడ్డి కొమురయ్య పోరాటమే స్ఫూర్తి

» బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం: సీఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): దొడ్డి కొమురయ్య ఉద్యమ స్ఫూర్తితో రాష్ట్రంలో నియంతృత్వ పాలన నుంచి విముక్తి పొంది ప్రజాపాలన ఏర్పడిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా బుధవారం ఆయన త్యాగాన్ని, ఉద్యమ స్ఫూర్తిని రేవంత్ గుర్తుచేసుకున్నారు. నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛావాయువులు పీల్చుకునేందుకు, ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేసేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన యోధుడని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం వెల్లడించారు. మంత్రివర్గం నుంచి మొదలుకుని అన్ని నియామకాల్లో సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తున్నామని రేవంత్ చెప్పారు.

చిరస్మరణీయుడు సర్వాయి పాపన్న

తెలంగాణ ప్రాంతంలో మొట్టమొదటి బహుజన చక్రవర్తిగా పేరుగాంచిన సర్వాయి పాపన్న చిరస్మరణీయుడని బీసీ సంక్షేమశాఖ కమిషనర్ బాల మాయాదేవి అన్నారు. మంగళవారం పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా సంక్షేమ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై, పాపన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ప్రజల నుంచి నాయకుడిగా ఎదిగిన పాపన్న చరిత్ర ఎంతో గొప్పదని ఆమె కొనియాడారు.

'కొండపాలైన కొమురవెల్లి సొమ్ము'పై దేవాదాయశాఖ కమిషనర్ ఆరా

» విచారణ చేసి నివేదిక అందించాలని ఏడీసీకి ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, ఏప్రిల్ 2: మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తన సొంత నిధులతో కొమురవెల్లి మల్లికార్జునస్వామి కొండపై నిర్మించ తలపెట్టిన గెస్ట్‌హౌజ్ నిర్మాణం కోసం దాసారం గుట్ట అప్రోచ్‌రోడ్ పనుల్లో ఆలయ నిధులు ఖర్చు పెట్టడంపై రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు ఆరా తీశారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం ఆలయ నిధులు రూ.4.38 కోట్లు ఖర్చుపెట్టడంతో పాటు అదనంగా రూ.1.90 కోట్ల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినట్లు మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'కొండపాలైన కొమురవెల్లి సొమ్ము' కథనం ప్రచురితమైంది. ఈ విషయమై దేవాదాయశాఖ కమిషనర్ హన్మంతరావు స్పందించి నిధుల మంజూరు, పనుల నిర్వహణ ఇతరత్రా అంశాలపై విచారణ చేపట్టి సమగ్ర నివేదిక అందించాలని దేవాదాయశాఖ ఏడీసీని ఆదేశించారు.

కర్ర బొగ్గు ఉత్పత్తిదారులను వేధిస్తే చర్యలు

» నల్లగొండ జిల్లా అటవీశాఖాధికారి రాజశేఖర్

» 'ఆంధ్రజ్యోతి' కథనానికి వివరణ

నల్లగొండ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో కర్ర బొగ్గు ఉత్పత్తిదారులను వేధించే విషయం తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర్ పేట్ల పేర్కొన్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో ప్రచురితమైన 'బొగ్గు వేబిల్లుకు రూ.6వేలు' కథనానికి ఆయన వివరణ పంపారు. కథనంలో పేర్కొన్న ఆరోపణలపై క్షేత్రస్థాయి సిబ్బందితో విచారణ జరిపించామని తెలిపారు. కర్ర బొగ్గు రవాణాకు అధికారులు జారీ చేసే ఫాం-2 పర్మిట్ల ద్వారానే బొగ్గు సరఫరా జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో బొగ్గు ఉత్పత్తిదారుల నుంచి అటవీశాఖ సిబ్బందిపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, ఎవరైనా వేధిస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రైవేటు జూనియర్, డిగ్రీ కాలేజీల సమస్యల పరిష్కారానికి కృషి: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు జూనియర్, డిగ్రీ కాలేజీల సమస్యలపై మ్యానిఫెస్టో కమిటీలో చర్చించి ప్రభుత్వ పరంగా పరిష్కారం కోసం కృషి చేస్తానని మంత్రి, మ్యానిఫెస్టో కమిటీ ఛైర్మన్ శ్రీధర్‌బాబు భరోసానిచ్చారు. గాంధీభవన్‌లో మంగళవారం టీపీజేఎంఏ, టీపీడీఎంఏ ప్రతినిధులు మ్యానిఫెస్టో కమిటీతో భేటీ అయి ప్రైవేటు జూనియర్, డిగ్రీ కాలేజీల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సమస్యలను ప్రభుత్వం కూలంకషంగా పరిశీలిస్తుందని, సమస్య పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు.



సీఎస్ శాంతికుమారిని కలిసి వినతిపత్రం ఇచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

» సీఎస్ శాంతికుమారికి బీఆర్ఎస్ నేతల వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సదుపాయం లేకపోవడం, అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ మాజీ మంత్రులు జి.జగదీశ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద గౌడ్, పాడి కౌశిక్ రెడ్డి మంగళవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు సీఎస్‌ను కోరారు. అనంతరం మాజీమంత్రి జగదీశ్ రెడ్డి తెలంగాణభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వ పక్షపాతవైఖరి, నీటి నిర్వహణలో అసమర్థత వల్లే రైతులు పంట నష్టపోయారని అన్నారు.లోక్‌సభ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు ప్రారంభించాలని కోరారు.

పాలకుర్తిలో బీఆర్ఎస్ ఖాళీ: యశస్వినీరెడ్డి



పాలకుర్తిలో బీఆర్ఎస్ పార్టీని ఖాళీ చేస్తామని, కాంగ్రెస్‌లోకి ఊరూరా చేరికలను ప్రోత్సహిస్తామని ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనాయకులు మంగళవారం గాంధీభవన్‌లో యశస్వినీరెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యశస్వినీరెడ్డి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో పాలకుర్తి నుంచి పార్టీకి లక్ష మెజార్టీ అందించే విధంగా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు.

వాహనాల తనిఖీల్లో 2 కోట్ల నగదు స్వాధీనం

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, ఏప్రిల్ 2: ఎన్నికల కోడ్ నేపథ్యంలో.. చెక్‌పోస్టులలో పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. మంగళవారం వివిధ చెక్‌పోస్టుల వద్ద దాదాపు రూ. 2 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నారు. పాత బస్తీలోని దారుసలాం చెక్‌పోస్టు వద్ద టీఎస్ 15 ఈఎస్ 5999 కారు నుంచి దాదాపు రూ. 1.5 కోట్ల నగదు ఉన్న మూడు బ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పురానాపూల్ ఎక్స్ రోడ్డు వద్ద ఓ వ్యక్తి నుంచి పది లక్షలను సౌత్- ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ బృందం స్వాధీనం చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లి వద్ద జాతీయ రహదారి 365/ఏపై ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద రూ. 8లక్షల నగదు పట్టుబడింది. మాలోతు సోరన్‌సింగ్ అనేవ్యక్తి నుంచి రూ.4.50లక్షలు, కావటి రవి వద్ద నుంచి రూ.3.50లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నగదు తరలిస్తున్న వ్యక్తులను ప్రశ్నించగా తాము రైతులమని, తాము పండించిన మిర్చిని ఖమ్మం మార్కెట్‌లో విక్రయించుకుని నగదు తీసుకువెళ్తున్నట్లు చెప్పారు. ఎలాంటి రశీదులు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 21 లక్షలు రూపాయల నగదు పట్టుబడింది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల చెక్‌పోస్టులో సరైన పత్రాలు లేని సుమారు రూ. 2 లక్షల నగదు పట్టుబడింది.

కేసీఆర్‌ను చూస్తే జాలేస్తోంది

(మొదటిపేజీ తరువాయి)



తుక్కుగూడలో మీడియాతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

ఏర్పాట్లను, ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం పరిశీలించి నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. కేసీఆర్ పొలం బాట పట్టడం సంతోషం. పదేళ్ల తర్వాత తెలంగాణ రైతులు గుర్తొచ్చినందుకు సంతోషం. అధికారం పోకుండా ఉండి ఉంటే.. కిందపడి గాయం కాకుండా ఉంటే.. కూతురు జైలుకు వెళ్లకపోయి ఉంటే ఆయన ఎవరికీ దొరికే వారు కాదు. కాంగ్రెస్ వచ్చింది కరువు వచ్చింది అని కేసీఆర్ అంటుండు.. మేం అధికారంలోకి వచ్చిందే చలికాలంలో... వర్షాకాలంలో అధికారంలో ఉన్నది వాళ్లే.. కేసీఆర్ పాపాలకు వరుణ దేవుడు కూడా భయపడి అప్పట్లో పారిపోయాడు' అని రేవంత్ పేర్కొన్నారు. 80 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్‌కు ఏ సీజన్ ఎప్పుడు వస్తుందో, వానకాలం ఎప్పుడు వస్తుందో తెలియదా అని ప్రశ్నించారు. కేసీఆర్ పాపాలతోనే కరువు పరిస్థితులు వచ్చాయని, ఆయన చేసిన పాపాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఖాతాలో వేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 'ఆడబిడ్డల కళ్లలో సంతోషం చూసి కేసీఆర్ నిప్పులు పోసుకుంటున్నారు. ఆయన పర్యటన చూస్తోంటే వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్లుంది. ఆయన పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగింది' అని సీఎం చెప్పారు.

30 సెకన్లు కూడా కరెంటు పోలేదు

కేసీఆర్ మొన్నటి పర్యటనలో జనరేటర్‌తో ప్రెస్ మీట్ పెట్టి, కరెంటు పోయిందని తమ ప్రభుత్వంపై నిందలు వేశారని.. వాస్తవానికి, కేసీఆర్ పర్యటించిన రోజు సూర్యాపేటలో 30 సెకన్లు కూడా కరెంట్ పోలేదని సీఎం తెలిపారు. 'మీ జనరేటర్‌లో ఎవడు పుల్ల పెట్టిండో ఎవరికి తెలుసు? ఆ నింద మా మీద ఎందుకు వేస్తావు' అని నిలదీశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తాము ఏదైనా కార్యక్రమానికి పిలుపునిస్తే తమను ఎక్కడికక్కడ అరెస్టులు చేశారని.. కానీ ఇప్పుడు తాము అలా వ్యవహరించలేదని, కేసీఆర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. తాము తలుచుకుంటే కేసీఆర్ బయటకు వెళ్లేవారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఖాతాలో రూ.1500 కోట్లు ఉన్నాయని.. రైతులకు రూ.100 కోట్లు సహాయం చేయొచ్చు కదా అని సూచించారు. ప్రతి వారం కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లాలని, ప్రతిపక్ష నాయకునిగా బాధ్యత నెరవేర్చాలని.. న్యాయమైన సలహాలు, సూచనలు ఇస్తే అమలు చేస్తామని చెప్పారు. 'రేవంత్‌రెడ్డీ! ఎక్కడ నిద్రపోతున్నావని కేసీఆర్ అంటున్నారు. నేను ఫామ్‌హౌస్‌లోనో, సినిమా వాళ్ల గెస్ట్‌హౌస్‌లలోనో పడుకోవడం లేదు' అంటూ సీఎం ఎద్దేవా చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధును వేయడానికి 10 నెలల సమయం తీసుకున్నదని, తాము ఇప్పటికే 65 లక్షల రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు వేశామని.. మిగిలింది 4 లక్షల రైతులేనని.. ఎన్నికలు అయిపోగానే వీరికి కూడా అందజేస్తామని సీఎం తెలిపారు. ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశామన్నారు. తాము చెప్పిన లెక్కలు తప్పని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమేనన్నారు. చనిపోయిన రైతుల వివరాలు ఇచ్చేందుకు కేసీఆర్‌కు 24 గంటల సమయం ఇస్తున్నానని.. ఆలోగా వివరాలు ఇస్తే ఎన్నికల కోడ్ ముగియగానే ఆయా రైతు కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్ చెల్లని వెయ్యి నోటు

తాము ఢిల్లీ వెళ్లిన ప్రతిసారీ తెలంగాణ హక్కులు సాధిస్తున్నామని.. అందుకే అక్కడకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. కేసీఆర్ కుటుంబ దోపిడీ నుంచి రాష్ట్రాన్ని కాపాడి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నామన్నారు. కేసీఆర్ పాపాల వల్లే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు పారిపోతున్నారని, పార్టీ నేతలను కాపాడుకోవడానికి కేసీఆర్ డ్రామాలు ఆడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ చెల్లని వెయ్యి రూపాయల నోటని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని... ఈ రెండు పార్టీలు లోక్‌సభ ఎన్నికల్లో కుట్రకు తెరదీశాయని ఆరోపించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని పథకాలు రాష్ట్రంలో అమలయ్యేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో సమస్యలు ఉన్నాయని, నీళ్లు ఎత్తిపోయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కాంగ్రెస్‌కు కంచుకోట తెలంగాణ

కాంగ్రెస్‌కు తెలంగాణ కంచుకోట అని నిరూపిస్తామని రేవంత్ చెప్పారు. తెలంగాణ ప్రాంతం కాంగ్రెస్ పార్టీకి ఎంతో ప్రత్యేకమైనదని, సోనియమ్మ కుటుంబంతో రాష్ట్రానికి ఉన్న అనుబంధం మరింత ప్రత్యేకమైనదన్నారు. సోనియమ్మపై అభిమానంతోనే ప్రజలు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. గత ఏడాది సెప్టెంబర్ 17న జరిగిన సభలో సోనియమ్మ ఆరు గ్యారంటీలను విడుదల చేశారని, వాటిని స్వల్పకాలంలోనే ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ఎన్నికల కోడ్ ముగియగానే హామీలన్నింటినీ వందశాతం అమలు చేస్తామని చెప్పారు. ఇప్పుడు ఇదే వేదికగా తుక్కుగూడ సభలో జాతీయ స్థాయి ఎన్నికల మేనిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ విడుదల చేయనుందని, 5 గ్యారంటీలను ప్రకటించనుందని తెలిపారు. జాతీయ కార్యాచరణకు ఇక్కడి నుంచి పిలుపునివ్వడం అంటే తెలంగాణ కార్యకర్తల కష్టాన్ని అధిష్ఠానం గుర్తించినట్లేనని పేర్కొన్నారు. ఈ సభకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ హాజరు కానున్నట్లు చెప్పారు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకు రాష్ట్రం నలుమూలల నుంచి జనజాతర సభకు తరలి రావాలని, ఆడబిడ్డలు పెద్ద సంఖ్యలో వచ్చి ఆశీర్వదించాలన్నారు. సభలో మహిళలకు ప్రత్యేక సీట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే... రాష్ట్రానికి జరిగే మేలును ఈ సభ ద్వారా తెలియజేస్తామని చెప్పారు.

జూన్ 6న ఇండియా కూటమి ప్రభుత్వ ప్రమాణ స్వీకారం

లోక్‌సభ ఎన్నికల అనంతరం కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రానుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూన్ 6వ తేదీన ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి ప్రభుత్వ ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కూడా రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ అధికారంలోకి రానుందని, డిసెంబరు 9న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ప్రభుత్వం బాధ్యతలు చేపడుతుందని ప్రకటించి కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపిన విషయం తెలిసిందే. అప్పుడు ఆయన చెప్పినట్లుగానే జరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో, ఢిల్లీలో కేంద్ర సర్కార్ తమదే అంటూ రేవంత్‌రెడ్డి తేదీని కూడా ప్రకటించటంపై ఆసక్తి నెలకొంది.

సీకెంట్ పైల్స్ వినియోగించాలని సర్కారే చెప్పింది!

» అందుకే 'అన్నారం'లో ఆ విధానం

» ఎన్‌డీఎస్ఏకు తెలిపిన అఫ్కాన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అన్నారం బ్యారేజీ నిర్మాణంలో కటాఫ్‌ల కోసం షీట్ పైల్స్‌ను వినియోగించాలని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) సిఫారసు చేస్తే.. సీకెంట్ పైల్స్ ఎందుకు వాడారని నిర్మాణ సంస్థ అఫ్కాన్స్‌ను జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ప్రశ్నించింది. బ్యారేజీ నిర్మాణంపై ఎన్‌డీఎస్ఏ 33 ప్రశ్నలు సంధించగా.. అఫ్కాన్స్ వాటికి బదులిచ్చింది. సీకెంట్ పైల్స్ వినియోగించాలని తెలంగాణ నీటి పారుదలశాఖ 2017 ఫిబ్రవరి 4న లేఖ రాసిందని తెలిపింది. అందువల్లే ఈ విధానాన్ని ఎంచుకున్నట్లు స్పష్టం చేసింది. గేట్లు కాకుండా బ్యారేజీ పనులు 2018 సెప్టెంబరులోనే పూర్తయ్యాయని, 2019 గేట్ల పనులు పూర్తికాగా.. 2019 జూలై 21న గేట్లను మూసివేసి, నీటిని నిల్వ చేశామని, అయితే గేట్లు మూసిన తర్వాత ఎలాంటి లీకేజీలను గుర్తించలేదని గుర్తు చేసింది. 2019 వరదల సమయంలో గేట్లను కొద్దిగా ఎత్తడం జరిగిందని, నీటి ప్రవాహానికి బ్యారేజీ దిగువ భాగంలో ఉన్న రక్షణ పనులు కొట్టుకుపోయాయని, 2019 వరదల తర్వాత ఇదే పరిస్థితి దిగువ భాగంలో ఉందని తెలిపింది. బ్లాకుల వారీగా నిర్మాణానికి సంబంధించిన షెడ్యూల్ అందించాలని కోరగా.. అది తయారు చేయలేదని అఫ్కాన్స్ వెల్లడించింది. బ్యారేజీ నిర్మాణం చేపట్టిన తీరును వివరించాలని కోరగా.. 2016 నవంబరులో నిర్మాణ పనులను కుడివైపు నుంచి ప్రారంభించామని తెలిపింది. బ్యారేజీ దిగువ/ఎగువ భాగంలో రక్షణ పనులు పూర్తయ్యేదాకా డీ వాటరింగ్ చేశామని, పునాది దశకు చేరిన తర్వాత ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ఉమాశంకర్ పర్యవేక్షణలో వైబ్రోమాక్స్ అండ్ ప్లేట్ లోడ్ టెస్ట్‌ను బ్లాక్‌నం.5కు చేశామని, ఆ తర్వాత ఇతర బ్లాకుల్లో కూడా చేశామని వివరించింది. ప్రతి కాంపొనెంట్ పూర్తికి సంబంధించిన నివేదికలు అందించాలని కోరగా.. ఆ నివేదికలు లేవని, పనులు పూర్తయినట్లు ప్రభుత్వం ఇచ్చిన సర్టిఫికెట్‌ను పొందుపరిచామని నివేదించింది. బ్యారేజీ గేట్లను ఎత్తే క్రమంలో సీసీ బ్లాకులు చెల్లాచెదురు కావడంతో పాటు ప్రవాహ వేగానికి బ్లాకుల్లో లోతైన రంధ్రాలను గుర్తించామని, దీనివల్ల సీకెంట్ పైల్స్ దెబ్బతిని సీపేజీ జరిగినట్లు వివరించింది. కొన్నిచోట్ల సీపేజీని కట్టడి చేయడానికి గ్రౌటింగ్ చేశామంది. బ్యారేజీని కాపాడుకోవడానికి ఏయే చర్యలు తీసుకోవాలో చెప్పాలని ఎన్‌డీఎస్ఏ కోరగా.. డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ ఛైర్మన్ ఏబీ పాండ్యా నివేదిక ప్రకారం శాశ్వత ప్రాతిపదికన మరమ్మతు పనులు చేసే దాకా వానాకాలానికి ముందు మోడల్ స్టడీస్ చేయాలని అఫ్కాన్స్ తెలిపింది. బ్యారేజీ గేట్లన్నీ తెరిచి వచ్చిన వరదను వచ్చినట్లే దిగువకు వదిలేయాలని, బ్యారేజీ దిగువ భాగంలో ఏర్పడిన రంధ్రాలకు తగు మరమ్మతులు చేపట్టాలని వివరించింది.

సైబర్ నేరాలపై ఫిర్యాదు ఇక సులభం

» సైబర్ యోధులకు ప్రత్యేక సెల్‌ఫోన్లు

» 1930కు వచ్చిన కాల్స్ వెంటనే బదిలీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరం జరిగిన వెంటనే బాధితులు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే త్వరగా స్పందించి పోగొట్టుకున్న డబ్బును రికవరీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే సైబర్ నేరాలు పెరిగిపోవడంతో 1930కు కూడా కాల్స్ పెరిగిపోయాయి. బాధితులు 1930కు ఫోన్ చేసినప్పుడు లైన్ బిజీ అని వస్తుంది. ఇకపై ఈ కష్టాలు ఉండవని సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందుకు ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న సైబర్ యోధులకు(సైబర్ క్రైమ్ కానిస్టేబుల్) ప్రత్యేక మొబైల్స్ అందజేయాలని నిర్ణయించారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, సైబర్ క్రైమ్ డీసీపీ నర్సింహ, సైబర్ క్రైమ్ సిబ్బంది, సైబర్ యోధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బాధితులు 1930కు కాల్ చేయగానే వారు ఎక్కడి నుంచి మాట్లాడుతున్నారో తెలుసుకొని ఆ కాల్‌ను సమీపంలో ఉన్న సైబర్ యోధులకు బదిలీ చేస్తారన్నారు. వారు ఆ కాల్ రిసీవ్ చేసుకొని బాధితులు చెప్పిన వివరాలు తీసుకొని ఫిర్యాదును రిజిస్టర్ చేసుకోవాలి. వెంటనే నేషనల్ సైబర్ పోర్టల్‌లో రిపోర్టు పెట్టాలి. దాంతో ఏ బ్యాంకు ఖాతాలో పోయిన డబ్బు జమ చేశారో గుర్తించి ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందన్నారు. ఇలా కాల్స్‌ను బదిలీ చేయడం వల్ల 1930 లైన్‌సులభంగా కలిసే అవకాశం ఉంటుందన్నారు.

భానుడి భగ భగ

» అత్యధికంగా 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత

» కొత్తగూడెం జిల్లాలో వడ దెబ్బతో మహిళ మృతి

» మధ్యాహ్నం 12 నుంచి 4గంటల దాకా బయటకు రావొద్దు: వైద్యశాఖ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)





నల్లగొండ జిల్లా కేంద్రం పరిధిలో దాహం తీర్చుకునేందుకు తంటాలు పడుతున్న మేకపిల్ల; నల్లగొండ జిల్లా కేంద్రంలో భగభగ మండే ఎండల్లో సైకిల్‌పై వెళుతున్న కూలీలు

రాష్ట్రంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. భానుడి భగభగలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పశుపక్ష్యాదులు తాగునీటి కోసం తండ్లాడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన కూడళ్లు బోసిపోయి కనిపిస్తున్నాయి. ఉదయం 9గంటల నుంచే రోడ్లపై వాహనదారులు కనిపించడం లేదు. వడగాడ్పుల ధాటికి వృద్ధులు, చిన్నారులు విలవిలాడుతున్నారు. ఇళ్లలో వేడి తట్టుకోలేక, బయటకు వెళ్లే పరిస్థితి లేక సామాన్య ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 9గంటల నుంచే ఎండ మండిపోతుండడంతో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. నల్లగొండ జిల్లాలోని మాడ్గులపల్లిలో మంగళవారం అత్యధికంగా 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి(టి)లో 43.0, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం లక్కవరం రోడ్డులో 42.6 డిగ్రీలు, యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం జనగామలో 41.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలం మొక్కంపాడు తండాకు చెందిన బానోతు వినోద(40) మంగళవారం వడదెబ్బకు గురై ఇంటి వద్దే మృతి చెందింది.

ఎండలపై వైద్య శాఖ అప్రమత్తం

రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మంగళవారం హెల్త్ అడ్వైజరీ జారీ చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు బయటకు రావొద్దని, వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని సూచించారు. "ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాలి. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు. చెప్పులు ధరించకుండా ఎండలో తిరగొద్దు. మద్యం, టీ, కాఫీలు ఎక్కువగా తీసుకోవద్దు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య వంట గదికి దూరంగా ఉండటం మంచిది" అని పేర్కొన్నారు. అలాగే, ప్రతి రోజూ వడదెబ్బ బారినపడ్డ వారి వివరాలతోపాటు, వడదెబ్బ మృతుల వివరాలను సేకరించి పంపాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి వైద్య శాఖ సూచించింది. అస్వస్థతకు గురై ఆస్పత్రికి వచ్చే హీట్ రిలేటెడ్ ఇల్‌నెస్ (హెచ్ఆర్ఐ) కేసుల వివరాలను కూడా పంపాలని కోరారు. ప్రతి ఆస్పత్రిలో తాగునీటిని అందుబాటులో ఉంచుకోవాలని, తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు, ఐవీ ఫ్లూయిడ్స్, ఐస్ ప్యాక్స్‌ను సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రులకు విద్యుత్ అంతరాయం కలగకుండా ఆశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు.

కర్షకులకు తీన్‌మార్

(మొదటిపేజీ తరువాయి)



సంబంధించిన విధివిధానాలపై వ్యవసాయ శాఖ కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికే యాసంగి సాగు పురోగతిలో ఉంది. గడచిన మూడు నెలల్లో రైతులకు మేలుచేసే సంక్షేమ పథకాలపై రేవంత్ సర్కారు దృష్టిసారించలేదు. ఆరు గ్యారెంటీలు, మహాలక్ష్మి పథకాలపైనే ప్రభుత్వం ఎక్కువ ఫోకస్ పెట్టింది. కొత్త వ్యవసాయ క్యాలెండర్ జూన్ నుంచి మొదలవుతుంది. అప్పుడే కొత్త వ్యవసాయ పథకాలను అమలులోకి తీసుకురావాలని రేవంత్ సర్కారు సమాయత్తం అవుతోంది. మరోవైపు ఇప్పుడు దేశవ్యాప్తంగా పార్లమెంటు ఎన్నికల కోడ్ అమలులో ఉంది. పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ నాలుగో తేదీన పూర్తవుతుంది. అప్పటి వరకు విధివిధానాలను రూపొందించుకొని సిద్ధంగా ఉంటే.. 'కోడ్' ఎత్తివేయగానే పథకాలను పట్టాలెక్కించవచ్చనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అన్నదాతలు కూడా ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల కోసం ఎదురుచూస్తున్నారు. అందుకు అనుగుణంగా మూడు పథకాలను ఏకకాలంలో అమలుచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వేర్వేరు సందర్భాల్లో ప్రకటించారు.

రైతు భరోసా ఎకరానికి రూ.15 వేలు..

కేసీఆర్ ప్రభుత్వం ఏడాదికి ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతుబంధు పంపిణీ చేసింది. వానాకాలంలో రూ.5 వేలు, యాసంగిలో రూ.5 వేల చొప్పున ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పెట్టుబడి సాయాన్ని 50 శాతం పెంచబోతోంది. అంటే.. ఒక్కో సీజన్‌కు ఎకరానికి రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15 వేలు పంపిణీ చేయబోతోంది. ఖరీఫ్ సీజన్ నుంచి 'రైతుభరోసా' పేరుతో ఈ పథకాన్ని అమలుచేయనుంది. అయితే కేసీఆర్ సర్కారు హయాంలో రైతుబంధు పథకంలో నిధుల దుర్వినియోగం జరిగింది. అనర్హులైన వేలాది మందికి పెట్టుబడి సాయం అందించారు. వ్యవసాయ భూముల జాబితాలో ఉంటే చాలు.. రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలు, రోడ్లు, ఫామ్ హౌస్‌లు, వెంచర్లకు కూడా రైతుబంధు ఇచ్చారు. సంపన్నులు, సినీ ప్రముఖులకూ సాయం అందించారు. దీనిపై విమర్శలు వచ్చాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకే రైతు భరోసా ఇస్తామని, అనర్హులకు ఇచ్చేదిలేదని ప్రకటించింది. ఇటీవల నిర్వహించిన 'మీట్ ది మీడియా'లో కూడా సీఎం రేవంత్‌రెడ్డి 'రైతు భరోసా' అమలుపై స్పష్టత ఇచ్చారు. కేవలం సాగు భూములకే నిధులు ఇస్తామని, పథకాన్ని పూర్తిగా ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి అనర్హులను ఏరిపారేస్తామని, ఖరీఫ్ నుంచి అర్హులకే రైతు భరోసా అమలు చేస్తామని సీఎం ప్రకటించారు.

పంటల బీమాకు లైన్ క్లియర్..

దేశంలో పంటల బీమా పథకం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే. రైతుబంధు ఇస్తున్నామనే నెపంతో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని ఎత్తివేసింది. పీఎం-ఎఫ్‌బీవై(ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన) నుంచి ఐదేళ్ల క్రితం బయటకు వచ్చింది. దీంతో ప్రకృతి విపత్తులు వచ్చినపుడు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిని గ్రహించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వానాకాలం నుంచి పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో చేరుతున్నట్లు ప్రకటించింది. ప్రీమియంలో కేంద్ర ప్రభుత్వ వాటాధనం పోగా.. రాష్ట్ర ప్రభుత్వ వాటాతో పాటు రైతుల వాటాను కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించింది. అంటే రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని 'ఉచితంగా' అమలు చేయాలని రేవంత్ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది.

వరి క్వింటాకు రూ.500 బోనస్..

ప్రస్తుతం రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ) ప్రకారమే కొనుగోళ్లు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తున్నారు. ప్రస్తుతం సాధారణ వరి ధాన్యానికి క్వింటాకు రూ.2,183.. ఏ-గ్రేడు ధాన్యానికి రూ.2,203 ఎమ్మెస్పీ ఉంది. అయితే, అధికారంలోకి వస్తే వరికి రూ.500 బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఇప్పుడున్న ఎమ్మెస్పీ ప్రకారం లెక్కిస్తే.. సాధారణ రకాలకు రూ. 2,683.. ఏ- గ్రేడు ధాన్యానికి రూ.2,703 వచ్చే అవకాశం ఉంది. ఈ పథకాన్ని కూడా ఖరీఫ్ సీజన్ నుంచి అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

'కాళేశ్వరం'పై మీ వైఖరి చెప్పండి

» సీబీఐ దర్యాప్తు కోరుతూ పిటిషన్లపై.. రాష్ట్ర సర్కారుకు మరోసారి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేయాలని దాఖలైన పిటిషన్‌లకు సంబంధించి మరోసారి ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్, ప్రొఫెసర్ కోదండరాం, న్యాయవాది రామ్మోహన్ రెడ్డి, ఎం. విశ్వనాథ్‌రెడ్డి, బక్క జడ్సన్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌ల ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. కాళేశ్వరం అక్రమాలపై ఇప్పటికే న్యాయవిచారణకు జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేశామని.. దాంతోపాటు విజిలెన్స్ ఎంక్వైరీ, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ పరిశీలనలు కొనసాగుతున్నాయని ప్రభుత్వం తెలియజేసిందని ధర్మాసనం పేర్కొంది. ఈ పరిస్థితుల్లో ఇంకా సీబీఐ దర్యాప్తు కావాలని కోరుతున్నారా? అని పిటిషనర్‌లను ప్రశ్నించింది. ఈ వ్యవహారాన్ని తాము ఇప్పటికే పరిగణనలోకి తీసుకున్నామని, సీబీఐ దర్యాప్తు అంశంపై వైఖరి తెలియజేయడానికి మరోసారి ప్రభుత్వానికి అవకాశం ఇస్తున్నట్లు పేర్కొంది. కేఏ పాల్ వ్యక్తిగతంగా వాదనలు వినిపిస్తూ.. ఇతరుల పిటిషన్‌లలో లేని అంశాలు తనవద్ద ఉన్నాయని.. తాను రెండేళ్లు దీనిపై పరిశోధన చేశానని పేర్కొన్నారు. మేఘా కృష్ణారెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారని.. అందుకే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడం లేదని ఆరోపించారు. తాను స్వయంగా కేంద్ర హోంశాఖ మంత్రిని, సీబీఐ డైరెక్టర్‌ను కలిశానని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఈ అంశాలన్నీ మీ పిటిషన్‌లో ఎక్కడ పేర్కొన్నారు? మీకు సమాచారం ఎక్కడ నుంచి లభించింది? అవినీతి జరిగిందని మీకు ఎలా తెలిసింది? ఎన్నికల ప్రసంగాలు చేయడానికి ఇది వేదిక కాదు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం కోసం మాపై ఒత్తిడి తేవొద్దు. ఇవన్నీ పబ్లిక్ ఇంట్రెస్ట్ పిటిషన్‌లా ? లేక పొలిటికల్ ఇంట్రెస్ట్ పిటిషన్‌లా? లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎవరూ కనిపించరు' అని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. తమ వ్యాజ్యాలను వేర్వేరుగా వినాలని.. తమకు అవకాశం ఇవ్వాలని ఇతర పిటిషనర్‌ల తరఫు న్యాయవాదులు కోరగా.. ఒకే అంశంపై వేర్వేరుగా వాదనలు వినడం కుదరదని ధర్మాసనం స్పష్టం చేసింది. కావాలంటే తమ ఆదేశాలపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చని వ్యాఖ్యానించింది.

మాజీ న్యాయమూర్తి చంద్రఘోష్‌తో రాష్ట్ర నీటిపారుదల అధికారుల భేటీ

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం లోపాలపై న్యాయవిచారణ కమిటీ ఛైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్‌తో రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా, ఈఎన్‌సీ (ఓఅండ్‌ఎం) బి.నాగేంద్రరావు, డిప్యూటీ ఈఎన్‌సీ (పీఅండ్‌ఎం) కె. శ్రీనివాస్ మంగళవారం కోల్‌కతాలో భేటీ అయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యాలకు గల కారకులను గుర్తించడానికి వీలుగా న్యాయ విచారణకు ప్రభుత్వం ఆదేశించిన విషయాన్ని వివరిస్తూ విచారణ విధి విధానాలను ఆయనకు అందించారు. కమిషన్ కార్యాలయాన్ని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని 8వ అంతస్తులో ఏర్పాటు చేస్తున్నామని, దానికి అవసరమైన మరమ్మతులు త్వరలోనే పూర్తిచేసి సమాచారం అందిస్తామని చెప్పారు. అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), చీఫ్ ఇంజనీర్ (సీఈ), ఆఫీస్ సబార్డినేట్, సూపరింటెండెంట్ తదితర ఉద్యోగులతో పాటు ముగ్గురు న్యాయవాదులను కమిషన్‌కు సమకూర్చనున్నామని అధికారులు జస్టిస్ చంద్రఘోష్‌కు వివరించారు. దానికి ఆయన స్పందిస్తూ త్వరలోనే హైదరాబాద్‌కు వస్తానని బదులిచ్చారు.


పట్టాలు అందుకున్న ఎంబీబీఎస్ పూర్తి చేసిన అమ్మాయిలు, వైద్యులు, నిర్వాహకులు

'వైద్య విద్య యుద్ధం' సక్సెస్!

- రష్యా వార్‌తో ఉక్రెయిన్ నుంచి భారత్‌కు వైద్య విద్యార్థులు
- ఉజ్బెకిస్థాన్‌లో మిగతా విద్యను పూర్తిచేసే అవకాశం
- అక్కడ ఎంబీబీఎస్‌ను పూర్తిచేసిన 81 మంది

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఆ వైద్య విద్యార్థుల లక్ష్యం పూర్తయింది. రష్యా దాడులతో ఉక్రెయిన్‌లో బిక్కుబిక్కుమంటూ గడిపి.. వైద్యవిద్యను మధ్యలోనే వదిలేసి భారత్‌కు తిరిగొచ్చిన ఆ విద్యార్థులు, ఉజ్బెకిస్థాన్‌లో ఎంబీబీఎస్‌ను పూర్తిచేశారు. ఈ మేరకు మంగళవారం గచ్చిబౌలిలోని ఏఐజీలో జరిగిన గ్రాడ్యుయేషన్ సెర్మనీ కార్యక్రమంలో 81మందికి పట్టాలు పంపిణీ చేశారు. అప్పట్లో యుద్ధంతో ఉక్రెయిన్‌లో భీతావహ పరిస్థితులు నెలకొనడంతో 210 మంది వైద్య విద్యార్థులు రెండో సెమిస్టర్ మధ్యలోనే స్వదేశానికి తిరిగొచ్చారు. ప్రత్యేక చొరవ తీసుకున్న భారత ప్రభుత్వం, ఉజ్బెకిస్థాన్ విదేశీ మంత్రిత్వశాఖతో మాట్లాడి ఆ దేశంలో వైద్య విద్యను పూర్తి చేసేందుకు అవకాశం కల్పించింది. వీరిలో 110 మంది ఎఫ్ఎంజీఈ పరీక్ష రాయగా, 81 మంది తొలిప్రయత్నంలోనే ఉత్తీర్ణులయ్యారు.

జోగినపల్లి సంతోష్ ఎవరో తెలియదు!

- కబ్జా కేసు కొట్టేయాలని లింగారెడ్డి శ్రీధర్ పిటిషన్
- పిటిషనర్‌ను అరెస్ట్ చేయొద్దని హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ ఫిర్యాదు మేరకు నమోదైన భూకబ్జా కేసులో నిందితుడిగా ఉన్న జోగినపల్లి సంతోష్ ఎవరో తనకు తెలియదని.. మరో నిందితుడు లింగారెడ్డి శ్రీధర్ హైకోర్టుకు వెల్లడించారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన భూకబ్జా, ఫోర్జరీ, చీటింగ్ కేసును కొట్టేయాలని హైకోర్టులో ఆయన క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రవిచందర్ వాదనలు వినిపిస్తూ పిటిషనర్ తండ్రి 1990లోనే వివాదంలో ఉన్న ఆస్తిని కొనుగోలు చేశారని.. ఫిర్యాదుదారు అయిన నవయుగ మాత్రం 2010లో కొనుగోలు చేసినట్లు చెబుతోందని తెలిపారు. వివాదంలో ఉన్న స్థలానికి తప్పుడు పత్రాలతో మునిసిపల్ ట్యాక్స్ కడుతున్నామని పేర్కొనడం నవయుగ కంపెనీ ఆరోపణ మాత్రమేనని, సదరు ఆస్తిపై తన పిటిషనర్‌కు టైటిల్ హక్కు ఉందని పేర్కొన్నారు. మరో నిందితుడిగా ఉన్న సంతోష్ ఎవరో తమకు తెలియదని, అతనితో కలిసి కుట్ర చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. పిటిషనర్ లింగారెడ్డి శ్రీధర్‌ను అరెస్ట్ చేయరాదని పేర్కొంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. విచారణను జూన్‌కు వాయిదా వేసింది.

8 వరకు శివానందరెడ్డిని అరెస్టు చేయొద్దు: హైకోర్టు

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భూ కబ్జా కేసులో నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఐపీఎస్ మాండ్ర శివానందరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను ఈనెల 8వ తేదీ వరకు అరెస్టు చేయరాదని తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో 26 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమ పత్రాలు సృష్టించి కబ్జాచేశారనే ఆరోపణలపై శివానందరెడ్డి, ఆయన భార్య ఉమాదేవి, కుమారుడు కనిష్కపై సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తమపై ఎలాంటి కఠినచర్యలు తీసుకుకోకుండా చూడాలని శివానందరెడ్డి, కుటుంబ సభ్యులు తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రాగా.. ఈ నెల 8వ తేదీ వరకూ వారిని అరెస్టు చేయొద్దని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ సోమవారానికి వాయిదా పడింది.

తెలంగాణ 7.391 టీఎంసీలు అదనంగా తరలించింది

- కృష్ణాబోర్డుకు ఏపీ లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జలాశయాల్లో ఉన్న 80 టీఎంసీల నీటిని.. ఏపీ 45 టీఎంసీలు, తెలంగాణ 35 టీఎంసీలు వినియోగించడానికి గతేడాది అక్టోబరు 6వ తేదీన నిర్ణయం తీసుకున్నారని, అయితే ఇప్పటిదాకా తెలంగాణ 42.391 టీఎంసీలు తరలించిందని ఏపీ ఆరోపించింది. ఈ మేరకు కృష్ణా బోర్డు ఛైర్మన్‌కు లేఖ రాసింది. జంట జలశయాల నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండా ఏకపక్షంగా 7.391 టీఎంసీలను తెలంగాణ అదనంగా తరలించినట్లు ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి వివరించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 17.60 టీఎంసీలు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద 9.715 టీఎంసీలు, హైదరాబాద్ తాగు నీటి అవసరాలకు 15.076 టీఎంసీలు కలుపుకొని 42.391 టీఎంసీలు వినియోగించుకుందని పేర్కొన్నారు. తాము(ఏపీ) పోతిరెడ్డిపాడు నుంచి 3.43 టీఎంసీలు, హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా 16.13 టీఎంసీలు, ముచ్చుమర్రి నుంచి 7.42 టీఎంసీలు, సాగర్ రైట్ కెనాల్ నుంచి 13.717 టీఎంసీలు, సాగర్ లెఫ్ట్ కెనాల్ ఏపీ భాగం నుంచి 1.760 టీఎంసీలు కలుపుకొని 42.457 టీఎంసీలు తీసుకున్నామని వెల్లడించారు. ఇక ఏపీలో తాగునీటి అవసరాల కోసం 5 టీఎంసీలను ఈనెల 8వ తేదీ నుంచి తరలించడానికి వీలుగా అవసరమైన ఏర్పాట్లు చేయాలని నివేదించారు.

ఫోన్ ట్యాపింగ్‌తో.. కారు సీట్లకే ఎసరు!

(మొదటిపేజీ తరువాయి)



సంగతి తెలిసిందే. విపక్షనేతలు, ఎన్నికల్లో ప్రత్యర్థుల ఫోన్లను ట్యాప్ చేసి.. వారి ఆర్థిక మూలాలను దెబ్బతీయం.. అస్మదీయుల నగదు రవాణాకు టాస్క్‌ఫోర్స్ వాహనాలను, పోలీసులను వాడుకోవడం.. ఇవన్నీ ప్రజాప్రాతినిధ్య చట్టంలో పేర్కొన్న 'కరప్ట్ ప్రాక్టీసెస్' కిందికే వస్తాయని రాజకీయ, రాజ్యాంగ నిపుణులు పేర్కొంటున్నారు. 1971లో ఇందిరాగాంధీ గెలిచినప్పుడు.. అధికార దుర్వినియోగం ద్వారానే ఆమె విజయం సాధించారంటూ రాజ్‌నారాయణ ఆమెపై కోర్టులో కేసు వేయగా.. కోర్టు ఆమెపై అనర్హత వేటు వేసిన విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు.

అప్పట్లో ఏం జరిగిందంటే..

1971లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 352 సీట్లతో అజేయశక్తిగా నిలిచింది. రాయ్‌బరేలీ నుంచి ఇందిరాగాంధీ లక్షకు పైగా ఓట్ల మెజారిటీతో నెగ్గారు. ఆ సీటులో సంయుక్త సోషలిస్ట్ పార్టీ అభ్యర్థిగా ఆమెతో పోటీ పడ్డ రాజ్‌నారాయణ్.. తన గెలుపుపై చాలా విశ్వాసంతో ఉన్నారు. కానీ, ఫలితం అందుకు విరుద్ధంగా రావడం ఆయనకు షాక్. ఇందిరాగాంధీ ప్రభుత్వ యంత్రాంగాన్ని దారుణంగా దుర్వినియోగం చేయడమే తన ఓటమికి కారణమని భావించిన ఆయన.. అలహాబాద్ హైకోర్టులో 'ఎన్నికల పిటిషన్' దాఖలుచేశారు. ఎన్నికల పిటిషన్ అంటే.. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 80 ప్రకారం.. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి అవినీతి విధానాలను అవలంబించినా, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడినా.. ఆ అభ్యర్థిని అనర్హుడిగా/అనర్హురాలిగా ప్రకటించాలంటూ సదరు అభ్యర్థితో పోటీపడిన ప్రత్యర్థిగానీ, ఆ నియోజకవర్గంలోని ఓటరుగానీ హైకోర్టును ఆశ్రయించి వేసే పిటిషన్. 1971 ఏప్రిల్ 24న రాజ్‌నారాయణ ఈ పిటిషన్ వేశారు. ఇందిరాగాంధీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని.. సాయుధ దళాలు సహా ఎన్నికల ప్రచారంలో ఆమెకు పలువురు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, స్థానిక పోలీసులు సహకరించారని తన అప్పీలులో పేర్కొన్నారు. భారత వైమానిక దళం ఆమెకు విమానాలను, హెలికాప్టర్లను సమకూర్చిందని పేర్కొన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123 (7) ప్రకారం అలా చేయడం 'కరప్ట్ ప్రాక్టీసెస్' కిందకు వస్తుందని.. అది అనర్హతకు తగిన కారణమని గుర్తుచేశారు. అలాగే.. ఆమె తన ఎన్నికల ప్రచారానికి ప్రభుత్వ వాహనాలను వాడుకున్నారని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ కేసును విచారించిన అలహాబాద్ హైకోర్టు.. ఎన్నికల కోసం అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసినందున ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 123 (7) ప్రకారం ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదంటూ 1975 జూన్ 12న తీర్పునిచ్చింది. ఆ తీర్పుతో.. ఉన్న సీటును కోల్పోవడమే కాక, ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేసే అర్హతను కూడా ఆమె కోల్పోయారు. దీనిపై ఇందిర సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ.. దేశ అత్యున్నత న్యాయస్థానం అలహాబాద్ హైకోర్టు తీర్పును కొట్టివేయలేదు. ఎగ్జిక్యూషనల్ స్టే మాత్రమే ఇచ్చింది. దరిమిలా ఆమె దేశంలో ఎమర్జెన్సీ విధించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంచలనం రేపుతున్న ట్యాపింగ్ వ్యవహారం సైతం అంతకుమించి అధికార దుర్వినియోగం కిందికి వస్తుందని న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. ఈ కేసు తీవ్రత చూస్తే ఎమర్జెన్సీకి దారితీసిన నాటి వ్యవహారం కంటే ఎక్కువేనని అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటికీ చాన్స్..

ఫోన్ ట్యాపింగే అక్రమం, చట్ట విరుద్ధం అయితే.. ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులు చట్టబద్ధంగా ఎన్నికల్లో ఖర్చు పెట్టేందుకు తీసుకెళ్తున్న డబ్బు వివరాలను సైతం ట్యాపింగ్ ద్వారా విని, ఆ సొమ్మును అడ్డుకోవడం ఎన్నికల అక్రమం కిందకే వస్తుందని న్యాయనిపుణులు పేర్కొంటున్నారు. అలా చేయడమంటే.. ఎన్నికల్లో ప్రత్యర్థుల కాళ్లు, చేతులు కట్టేసినట్టేనని, వారి విజయావకాశాలను దెబ్బతీయడమేనని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో.. విపక్షాలు న్యాయపరంగా తమకున్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ అవసరాల కోసం బ్యాంకు నుంచి డబ్బు తీసుకుని వస్తుంటే.. ట్యాపింగ్ ద్వారా తెలుసుకుని పట్టుకున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సైతం వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అలాగే తన ఫోన్ ట్యాప్ చేశారని సిరిసిల్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన కేకే మహేందర్ రెడ్డి ఇటీవలే ఆరోపించారు. అలాగే ఎన్నికల సందర్భంగా తమ ఫోన్‌లు ట్యాప్ అయ్యాయని పలువురు ఆరోపిస్తున్నారు. అప్పటి అధికార పార్టీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడటం ద్వారా తాము ఓడిపోయామని పేర్కొంటూ వీరంతా హైకోర్టును ఆశ్రయించే అవకాశం ఉందని సమాచారం. అయితే.. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత నిర్ణీత కాలవ్యవధిలోనే హైకోర్టును ఆశ్రయించి ఎలక్షన్ పిటిషన్ వేయాల్సి ఉంటుందని నిబంధనలు చెబుతున్నాయి. కానీ, ట్యాపింగ్ గుట్టు రట్టయిందే ఇప్పుడు కనుక.. ఓడిపోయిన అభ్యర్థులు హైకోర్టును ఇప్పటికైనా ఆశ్రయించవచ్చని, కోర్టు కూడా వారి వాదనను, పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, కేసును విచారించే అవకాశం ఉన్నదని కొందరు న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కరప్ట్ ప్రాక్టీసెస్ అంటే..

ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 123వ సెక్షన్‌లో ఈ కరప్ట్ ప్రాక్టీసెస్ గురించి ఉంది. దాని ప్రకారం.. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులుగానీ, వారి తరఫున పనిచేసే ఏజెంట్లుగానీ, అభ్యర్థుల అనుమతితో మరెవరైనాగానీ..

- గెజిటెడ్ అధికారులు
- స్టైపెండరీ జడ్జిలు, మేజిస్ట్రేట్‌లు
- సాయుధ దళాల సభ్యులు
- పోలీసులు
- ఎక్సైజ్ అధికారులు
- రెవెన్యూ అధికారులు, తదితరుల సహాయం తీసుకోవడం, తీసుకోవడానికి ప్రయత్నించడం, తీసుకోవడానికి ప్రేరేపించడం అవినీతి విధానాల కిందికే వస్తుంది. గత ప్రభుత్వం తన గెలుపు కోసం పోలీసుల 'సేవ'లను అడ్డగోలుగా వాడుకున్న నేపథ్యంలో విపక్షాలు రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉంది.

ఫోన్ ట్యాపింగ్‌లో ఆ నలుగురినీ నిందితులుగా చేర్చాలి

- దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికల్లోనూ ట్యాపింగ్
- 2014 నుంచీ విచారణ చేపట్టాలి: రఘునందన్



హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని నిందితులుగా చేర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికల సందర్భంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం సెక్రటరీ అనుమతి అవసరమని, అలాంటప్పుడు వారి పేర్లు ఎందుకు బహిర్గతం చేయడం లేదని ప్రశ్నించారు. తమ ఫోన్లు ట్యాప్ అయ్యాయని ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్‌ను నిలదీశారు. ఓటుకు నోటు కేసులో రేవంత్‌ను అరెస్టు చేసినప్పుడు ఉన్న డీజీపీ, ఇంటలిజెన్స్ చీఫ్, ఎస్ఐబీ చీఫ్‌ను కూడా విచారించాలని డీజీపీని కోరారు. వారిని విచారించినప్పుడే దర్యాప్తు పారదర్శకంగా సాగుతున్నట్లు ప్రజలు భావిస్తారన్నారు. నలుగురు ఎమ్మెల్యేల కొనుగోళ్ల వ్యవహారం సందర్భంగా వాహనంలో రూ.30కోట్లు ఉన్నట్లు పోలీసు అధికారి స్టీఫెన్ రవీంద్ర ఆనాడు ప్రకటించారని, ఆ డబ్బులు ఎక్కడకు వెళ్లాయని ప్రశ్నించారు. దీనిపై ఈడీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా, మోకాళ్లపై యాదగిరిగుట్ట ఎక్కి హిందువులకు వారసులం అని చెప్పినా బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మబోరని హరీశ్‌కు స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా వంద కోట్లు ఖర్చు చేస్తానంటూ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి చెబుతున్నారని విమర్శించారు. వెంకట్రామిరెడ్డిని ఆయన బంధువు, మంత్రి అయిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాపాడుతున్నట్లు కనిపిస్తోందని ఆరోపించారు.

కల్వకుంట్ల కన్నారావు అరెస్టు

- భూ వివాదంలో జోక్యం.. నెల రోజులుగా పరారీ

ఆదిభట్ల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ అన్న కుమారుడు కల్వకుంట్ల తేజేశ్వర్‌రావు అలియాస్ కన్నారావును రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఆదిభట్లలోని మన్నెగూడలో ఓ భూవివాదంలో జోక్యం చేసుకున్న కేసులో ఆయన నిందితుడు. కన్నారావును మంగళవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడకు చెందిన జక్కిడి సురేందర్‌రెడ్డి మన్నెగూడలోని సర్వే నంబర్ 32లో ఉన్న 2 ఎకరాల 15 గుంటల భూమిని 2013లో చామ సురేశ్ వద్ద రూ.కోటి తీసుకుని, జీపీఏ చేశారు. ఆ మొత్తం తిరిగి చెల్లించాక.. ఆ భూమిని తిరిగి సురేందర్‌రెడ్డి పేరిట మార్చేలా ఒప్పందం చేసుకున్నారు. ఇది జరిగిన రెండు నెలల తర్వాత సురేశ్ ఆ భూమిని సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేయించారు. 2020 వరకు సురేందర్‌రెడ్డి డబ్బులను తిరిగి ఇవ్వలేదు. దాంతో సురేశ్ ఈ భూమిని ఓఎస్ఆర్ గ్రూప్ అనే రియల్ఎస్టేట్ కంపెనీ డైరెక్టర్ శ్రీనివాస్ పేరిట రిజిస్టర్ చేశారు. ఆ తర్వాత జక్కిడి సురేందర్‌రెడ్డికి.. శ్రీనివాస్‌కు మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే.. సురేందర్‌రెడ్డి వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ కన్నారావును కలిశారు. డీల్ సెటిల్ చేయడానికి ఇరువురి మధ్య 2021లో ఒప్పందం కుదిరింది. ఆ మేరకు కన్నారావుకు సురేందర్‌రెడ్డి రూ.3కోట్లు ఇవ్వాలి. అలా విడతల వారీగా రూ.2.35 కోట్లను అందజేశారు. డబ్బులిచ్చినా.. పనిచేయడం లేదంటూ కన్నారావుపై సురేందర్‌రెడ్డి ఒత్తిడి పెరగడంతో.. గత నెల 3వ తేదీ తెల్లవారుజామున కన్నారావు సహాయకులు డేనియల్, శివ, మరో 40 మంది ఆ భూమిపైకి వచ్చి, వాచ్‌మన్‌పై దాడి చేశారు. ఎక్స్‌కవేటర్లతో భూమి చుట్టూ వేసిన ప్రీకాస్ట్ ప్రహరీని కూల్చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, ఎక్స్‌కవేటర్ డ్రైవర్, యజమాని, మరో ముగ్గురిని అరెస్టు చేశారు. ఏ1 సురేందర్‌రెడ్డి, ఏ2 హరినాథ్ సహా.. మొత్తం 8 మంది ఈ కేసులో అరెస్టై, రిమాండ్‌లో ఉండగా.. ఏ3గా ఉన్న కన్నారావు మాత్రం అప్పటి నుంచి పరారీలో ఉన్నారు. బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తూనే.. ఢిల్లీ, బెంగళూరులో మకాం వేశారు. మాల్దీవులకు కూడా మూడ్రోజుల ట్రిప్‌కు వెళ్లారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ఏడు ఫోన్లు, సిమ్‌కార్డులను మార్చారు. కన్నారావు కోసం 12 మంది పోలీసులతో మూడు బృందాలను ఏర్పాటు చేశామని.. మంగళవారం అరెస్టు చేశామని ఆదిభట్ల ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఈ కేసులో 40 మంది దాకా నిందితులున్నారని, 23 మందిని గుర్తించామని చెప్పారు. విగతా నిందితులను కూడా అరెస్టు చేస్తామన్నారు. కన్నారావును మరింత విచారించాల్సి ఉందని, కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుంటామని వెల్లడించారు. అయితే.. కన్నారావు తానే పోలీసులకు ఫోన్ చేసి, లొంగిపోయినట్లు చెబుతున్నారు.

ఫోన్ ట్యాపింగ్ గుట్టు.. ప్రభాకర్‌రావుకే ఎరుక!

ఆయన శాసిస్తే.. పాటించామన్న నిందితులు.. ప్రభాకర్‌రావును శాసించిందెవరు??

- ఆయన వాంగ్మూలమే అత్యంత కీలకం
- ముగిసిన భుజంగరావు, తిరుపతన్న కస్టడీ
- రాధాకిషన్‌రావు కస్టడీపై తీర్పు వాయిదా


ప్రభాకర్‌రావు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐబీ కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు వాంగ్మూలమే కీలకంగా మారనుంది. ఇప్పటి వరకు అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు, మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఇచ్చిన వాంగ్మూలాల్లో.. ప్రభాకర్‌రావు చెప్పినట్లే చేశామని పేర్కొన్నారే తప్ప.. బీఆర్ఎస్ హయాంలో ఫలానా నాయకుడు ప్రధాన సూత్రధారి అనే విషయాన్ని ఇతమిత్థంగా కూడా చెప్పలేదని తెలుస్తోంది. దీంతో.. ఈ వ్యవహారం వెనక ఉన్న అసలు సూత్రధారి ఎవరో తెలియాలంటే ప్రభాకర్‌రావు అరెస్టవ్వడమో.. లొంగిపోవడమో అత్యంత కీలకమని స్పష్టమవుతోంది. భుజంగరావు, తిరుపతన్నను కస్టడీలోకి తీసుకున్న పంజాగుట్ట పోలీసులు జరిపిన విచారణలోనూ.. ఎస్ఐబీ కేంద్రంగా సాగిన ఆపరేషన్స్ గురించి మాత్రమే చెప్పారని తెలుస్తోంది. ప్రణీత్‌రావు కూడా కస్టడీలో ఉన్నప్పుడు ప్రభాకర్‌రావు చెప్పింది చేశామేతప్ప.. ఏమీ తెలియదని వివరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఫోన్ ట్యాపింగ్‌కు ఆదేశాలిచ్చిన గత ప్రభుత్వ పెద్ద ఎవరు? అనేది ప్రభాకర్‌రావు మాత్రమే చెప్పగలరని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఇక టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు అరెస్టు సందర్భంగా జరిపిన ప్రాథమిక విచారణలో బెదిరింపులు, నగదు తరలింపు అనే కొత్త కోణాలు వెలుగులోకి వచ్చాయి. అయితే.. ఆయనను కస్టడీకి తీసుకుని, విచారించినా.. ట్యాపింగ్ వెనక ఉన్నదెవరనేది తెలిసే అవకాశాలున్నట్లు దర్యాప్తు అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా.. భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. దీంతో వారిని చంచల్‌గూడ జైలుకు రిమాండ్ చేశారు. ఈ నెల 6 వరకు వీరిద్దరి రిమాండ్ కొనసాగనుంది. రాధాకిషన్‌రావు కస్టడీ పిటిషన్‌పై నాంపల్లి కోర్టు బుధవారానికి తీర్పును వాయిదా వేసినట్లు తెలిసింది. ఇక రాధాకిషన్ రిమాండ్ రిపోర్టులో కొత్తగా వెలుగులోకి వచ్చిన అదనపు ఎస్పీ వేణుగోపాల్‌రావును విచారించేందుకు పంజాగుట్ట పోలీసులు నోటీసులిచ్చినట్లు తెలిసింది. వేణుగోపాల్‌రావు ఉమ్మడి సైబరాబాద్‌లో ఎల్బీనగర్ ఏసీపీగా, పటాన్‌చెరు ఏసీపీగా, పలు ఠాణాల్లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. సైబరాబాద్‌పై మంచి పట్టు ఉండడం వల్లే.. ఎన్నికల సమయంలో ఆ కమిషనరేట్‌లో 'స్పెషల్ ఆపరేషన్స్ టీం'ను ఆయనకు అప్పగించినట్లు తెలుస్తోంది.

నా ఫోన్‌ను ట్యాప్ చేశారు: చీకోటి ప్రవీణ్

హైదరాబాద్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు అండ్ కో తన ఫోన్‌ను ట్యాప్ చేశారని.. డ్రగ్స్ కేసులు పెడతామంటూ బెదిరించారని బీజేపీ నేత చీకోటి ప్రభాకర్ ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం డీజీపీ రవిగుప్తాకు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అండతో రాధాకిషన్‌రావు రెచ్చిపోయారని, గజ్వేల్‌లో శివాజీ విగ్రహం వివాదం తలెత్తినప్పుడు తాను అక్కడికి వెళ్తే.. ఆయన ఫోన్‌చేసి, బెదిరించారని పేర్కొన్నారు. అమ్మవారి ఆలయానికి వెళ్తే.. తన అనుచరుల వద్ద మారణాయుధాలున్నాయంటూ రాధాకిషన్‌రావు కేసులు బనాయించారని ఆరోపించారు. తన ఫాంహౌస్‌పై దాడి చేసి, డ్రగ్స్ కేసులు పెడతామని బెదిరించారన్నారు. సినిమా హీరోయిన్ల ఫోన్లను ట్యాప్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని, ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు తెలిపారు.

కేటీఆర్.. కల్వకుంట్ల ట్యాపింగ్‌రావు!

కూతురి మద్యం స్కాం, కుమారుడి ఫోన్ ట్యాపింగ్‌తో ఆ దేవుడు కూడా తట్టుకోలేకపోయాడు

- అందుకే రాష్ట్రంలో వర్షాలు పడలేదు
- సికింద్రాబాద్‌లో 2 లక్షల ఆధిక్యంతో దానం గెలుపు: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా అరాచకాలే జరిగాయని...కేటీఆర్.. కల్వకుంట్ల ట్యాపింగ్ రావుగా మారిపోయారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. దేవుడి పేరుతో కట్టిన కాళేశ్వరంలో, దేవుని గుడి కట్టిన యాదగిరిగుట్టలో కేసీఆర్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో వర్షాలు పడకపోతే ఆ కరువును కాంగ్రెస్ పార్టీపై నెట్టి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కూతురు లిక్కర్ కుంభకోణం, కుమారుడు ట్యాపింగ్ చర్యలతో దేవుడు కూడా తట్టుకోలేకపోయాడని.. అందుకే గత వర్షాకాలం సరిపడా వర్షాలు పడలేదని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఉనికి పూర్తిగా కనుమరుగవుతుందని పేర్కొన్నారు. నాలుగు కోట్ల మంది ప్రజలను బీఆర్ఎస్ ముంచిందని, ఆ పార్టీలో కేసీఆర్ కుటుంబంలోని నలుగురే బాగుపడ్డారని ఆరోపించారు. కేసీఆర్, కుటుంబం రాజకీయాలు మానేసి.. ప్రజలకు క్షమాపణ చెప్పి.. కుటుంబాన్ని చూసుకొని బతకాల్సిందేనన్నారు. మంగళవారం సికింద్రాబాద్ పార్లమెంటరీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడారు. పార్టీ సీనియర్ నాయకుడు అంజన్ కుమార్ యాదవ్ ఇక్కడి నుంచి రెండు పర్యాయాలు విజయం సాధించారని.. ఈసారి అందరి సహకారంతో తమ అభ్యర్థి దానం నాగేందర్ రూ.2లక్షల మెజారిటీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. రానున్న పదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందన్నారు. 6న చరిత్రలో నిలిచిపోయేలా తుక్కుగూడ సభ నిర్వహిస్తామన్నారు. తుక్కుగూడ జనజాతర మహాసభకు ఒక ప్రత్యేకత ఉందని, ఇండియా కూటమి ఎన్నికల మేనిఫెస్టోను ఆ సభా వేదికగా పార్టీ అగ్రనేతలు రాహుల్, ఖర్గే విడుదల చేస్తారని వెల్లడించారు. వచ్చే లోకసభ ఎన్నికల్లో రాష్ట్రంలో 13 నుంచి 14 ఎంపీ సీట్లు గెలవడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యమన్నారు. కిషన్ రెడ్డి కేంద్రమంత్రిగా ఉన్నా సికింద్రాబాద్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. రూ.వేల కోట్ల నిధులతో నమామి గంగా అంటూ మోదీ గంగానదిని శుద్ధి చేసుకున్నారని.. పార్లమెంటులో తాను గతంలో మూసీ ప్రక్షాళన గురించి కోట్ చేస్తే.. పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి స్పందించలేదని విమర్శించారు. కిషన్‌రెడ్డి ఎప్పుడూ మతాలమధ్య ఘర్షణలు పెట్టి గెలుద్దామని అనుకుంటారని, ఈసారి అది పనిచేయదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో మూసీ నదిని రూ.40-50వేల కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన డీపీఆర్‌లు సైతం సిద్ధమయ్యాయన్నారు.


Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి | దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● బుధవారం 3 ఏప్రిల్ 2024

ఐసర్‌లో బీఎస్, ఎంఎస్

ఆప్టిట్యూడ్ టెస్ట్‌కు నోటిఫికేషన్

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్ సంస్థలు) అందిస్తున్న 'బీఎస్ ఎంఎస్' డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఉద్దేశించిన ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐసర్ ఏటీ)2024 నోటిఫికేషన్ వెలువడింది. ఈ పరీక్షని భోపాల్ ఐసర్ నిర్వహిస్తోంది. ఇందులో సాధించిన స్కోర్ ఆధారంగా తిరుపతి సహా భోపాల్, కోల్‌కతా, మొహాలీ, పుణె, తిరువనంతపురం, బెర్హంపూర్ క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. బీఎస్-ఎంఎస్(సైన్సెస్) ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. భోపాల్ క్యాంపస్‌లో నాలుగేళ్ల వ్యవధిగల బీఎస్(ఇంజనీరింగ్ సైన్సెస్/ఎకనామిక్ సైన్సెస్) డిగ్రీ ప్రోగ్రామ్ కూడా ఉంది. ఇవి పూర్తిగా రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లు. బెంగళూరు ఐఐఎస్సీ అందిస్తున్న బీఎస్(రీసెర్చ్), మద్రాస్ ఐఐటీ అందిస్తున్న బీఎస్(మెడికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కూడా ఐసర్ ఏటీ 2024 టెస్ట్ స్కోర్‌ను అనుమతిస్తారు.



విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, కంప్యూటర్ అండ్ డేటా సైన్సెస్, ఎర్త్ అండ్ క్లయిమేట్ సైన్సెస్/ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్, ఎకనామిక్ సైన్సెస్, ఇంజనీరింగ్ సైన్సెస్(కెమికల్ ఇంజనీరింగ్, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్), జియోలాజికల్ సైన్సెస్, ఇంటిగ్రేటెడ్ అండ్ ఇంటర్ డిసిప్లినరీ సైన్సెస్, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్

క్యాంపస్‌లు-సీట్లు: బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్‌నకు సంబంధించి తిరుపతిలో 275, తిరువనంతపురంలో 320, పుణెలో 288, మొహాలీలో 250, కోల్‌కతాలో 250, భోపాల్‌లో 255, బెర్హంపూర్‌లో 180 చొప్పున మొత్తం 1818 సీట్లు; భోపాల్ క్యాంపస్ అందిస్తున్న బీఎస్ ప్రోగ్రామ్‌లో ఇంజనీరింగ్ సైన్సెస్ 84, ఎకనామిక్ సైన్సెస్ 31 చొప్పున మొత్తం 115 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి 2022, 2023 సంవత్సరాల్లో ఎంపీసీ/బైపీసీ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు; మూడేళ్ల డిప్లొమా ప్రోగ్రామ్ పూర్తిచేసినవారు; 2024లో చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్ అభ్యర్థులకు ప్రథమశ్రేణి మార్కులు, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. చివరి సంవత్సర మార్కులను మాత్రమే పరిగణనలోకి తీసుకొంటారు. బీఎస్ ప్రోగ్రామ్‌నకు మాత్రం మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.

ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024: దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు. ఇందులో మొత్తం 60 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ అంశాలనుంచి ఒక్కోదానిలో 15 ప్రశ్నలు అడుగుతారు. పదకొండు, పన్నెండు తరగతులకు ఎన్‌సీఈఆర్‌టీ నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రశ్నలు ఇస్తారు. అన్ని సబ్జెక్ట్‌లకూ సమాన వెయిటేజీ ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. మొత్తం మార్కులు 240. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఈ టెస్ట్‌ను హిందీ, అంగ్ల మాధ్యమాల్లో నిర్వహిస్తారు. సంస్థ నిర్దేశించిన కటాఫ్ మేరకు ర్యాంక్‌లు ప్రకటిస్తారు. ఆప్టిట్యూడ్ టెస్ట్ సిలబస్, గత ప్రశ్నపత్రాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 13
- **కరక్షన్ విండో ఓపెన్:** మే 16, 17
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 1
- **ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ తేదీ:** జూన్ 9
- **ఫైనల్ కీ విడుదల:** జూన్ 21
- **ఐఏటీ ఫలితాలు విడుదల:** జూన్ 25
- **కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్:** జూన్ 26 నుంచి జూలై 1 వరకు
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** జూలై 2 నుంచి 5 వరకు
- **మొదటి రౌండ్ అడ్మిషన్స్ లిస్ట్ విడుదల:** జూలై 7
- **వెబ్‌సైట్:** iiseradmission.in

పరిశోధనలు



నైసర్

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్)- ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, నిర్దేశిత జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్‌లు, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

విభాగాలు: బయలాజికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్

అర్హత: బయలాజికల్ సైన్సెస్‌కు డిగ్రీ(బయాలజీ/లైఫ్ సైన్సెస్) లేదా బీఫార్మసీ/బీవీఎస్సీ/బీఎస్సీ అగ్రికల్చర్/ఎంబీబీఎస్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కెమికల్ సైన్సెస్‌కు డిగ్రీ(కెమికల్ సైన్సెస్) లేదా కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్ట్‌గా ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు; మేథమెటికల్ సైన్సెస్‌కు మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్‌కు ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. విభాగాన్ని అనుసరించి జామ్ 2024/గేట్ 2024/ఎన్‌బీహెచ్‌ఎం/జెస్ట్ 2024/సీఎస్ఐఆర్ నెట్/యూజీసీ నెట్ అర్హత పొంది ఉండాలి.

ఫెలోషిప్: మొదటి ఏడాది నెలకు రూ.21,000ల నగదు; బుక్ అలవెన్స్ కింద రూ.25000 చెల్లిస్తారు. తరవాత రెండేళ్ల నెలకు రూ.31000 ఇస్తారు. నాలుగో ఏడాది నుంచి ఏడో ఏడాది వరకు నెలకు రూ.35,000 చెల్లిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు లేదు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** మే 6 నుంచి 8 మధ్య
- **టెస్ట్‌లు, ఇంటర్వ్యూలు:** ఫిజికల్ సైన్సెస్‌కు జూన్ 6, 7; మేథమెటికల్ సైన్సెస్‌కు జూన్ 12 నుంచి 14 వరకు; బయలాజికల్ సైన్సెస్‌కు జూన్ 13, 14; కెమికల్ సైన్సెస్‌కు జూన్ 20 నుంచి 22 వరకు;
- **వెబ్‌సైట్:** www.niser.ac.in

ఐఐఎస్సీ

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)- బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(రీసెర్చ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. నాలుగో సెమిస్టర్‌లో స్పెషలైజేషన్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. చివరి ఏడాది రీసెర్చ్ ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది. మరో సంవత్సరం చదివి మాస్టర్ ఆఫ్ సైన్స్(ఎంఎస్) డిగ్రీని పొందే సౌకర్యం ఉంది. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ఇన్‌స్పయిర్/ఐఐఎస్సీ ప్రమోషనల్ స్కీం స్కాలర్‌షిప్‌లు ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: బయాలజీ, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెటీరియల్స్, మేథమెటిక్స్, ఫిజిక్స్


అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సును 2023లో పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అర్హులే. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ వర్గాలవారు పాసైతే చాలు. అభ్యర్థులు జేఈఈ మెయిన్ 2024/జేఈఈ అడ్వాన్స్ 2024/నీట్ యూజీ 2024/ఐసర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024 అర్హత పొంది ఉండాలి. ఈ స్కోర్ ద్వారానే అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 7
- **రిపోర్టింగ్ తేదీ:** జూలై 19
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** https://bs-ug.iisc.ac.in

ఐడీఆర్‌బీటీలో పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిర్వహిస్తున్న 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ(ఐడీఆర్‌బీటీ)'- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ టెక్నాలజీ (పీజీడీబీటీ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఏడాది వ్యవధి గల ఫుల్ టైమ్ రెగ్యులర్ ప్రోగ్రామ్. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సెక్టార్లలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అనుసరించాల్సిన అనలిటికల్ స్కిల్స్, టెక్నాలజీ ఇంప్లిమెంటేషన్, మేనేజ్‌మెంట్ అంశాలను ఈ ప్రోగ్రామ్‌లో వివరిస్తారు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. వీటిలో 10 సీట్లను స్పాన్సర్డ్ అభ్యర్థులకు ప్రత్యేకించారు. నిర్దేశిత జాతీయ పరీక్షలో సాధించిన స్కోర్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో టాపర్‌గా నిలిచిన అభ్యర్థికి డీ.ఏ.ఎస్ రామశాస్త్రి గోల్డ్‌మెడల్ ఆఫ్ ఎక్సలెన్స్ అందిస్తారు. అలాగే మెరిట్ సాధించిన అభ్యర్థులకు ప్రాజెక్ట్ సమయంలో స్టయిపెండ్ ఇస్తారు. ప్లేస్‌మెంట్స్ సౌకర్యం ఉంది.



ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో నాలుగు టర్మ్‌లు ఉంటాయి. మొదటి టర్మ్‌లో బ్యాంకింగ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, కంప్యూటర్ నెట్‌వర్క్స్, ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్, క్రిప్టోగ్రఫీ, మొబైల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్ సబ్జెక్టులు; రెండో టర్మ్‌లో ఏఐ అండ్ ఎంఎల్, ఫండమెంటల్స్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్ టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్, ఇంటర్నెట్ టెక్నాలజీస్, డిజిటల్ పేమెంట్ సిస్టమ్స్ అండ్ లెండింగ్ సబ్జెక్టులు; మూడో టర్మ్‌లో ఫైనాన్షియల్ అనలిటిక్స్, అడ్వాన్స్‌డ్ సైబర్ సెక్యూరిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, సాఫ్ట్‌వేర్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అండ్ డెవోప్స్, ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఫర్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్, బిగ్ డేటా అండ్ క్లౌడ్ సబ్జెక్టులు ఉంటాయి. నాలుగో టర్మ్‌లో ప్రాజెక్ట్ వర్క్, ప్రజంటేషన్ ఉంటాయి.

- ప్రోగ్రామ్‌లో భాగంగా ఐటీ ఇండస్ట్రీకి సంబంధించిన ప్రముఖులు, సీనియర్ బ్యాంకర్ల లెక్చర్స్ సెమినార్లు; ఇంటరాక్టివ్ సెషన్స్ ఉంటాయి. సంస్థకు చెందిన రీసెర్చ్ సెంటర్లలో ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటుంది.

రీసెర్చ్ సెంటర్లు

- సెంటర్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్
- సెంటర్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ అండ్ డేటా ప్రైవసీ
- సెంటర్ ఆఫ్ ఎమర్జింగ్ నెట్‌వర్క్స్ అండ్ క్లౌడ్ కంప్యూటింగ్
- సెంటర్ ఆఫ్ ఓపెన్ అండ్ డిజిటల్ బ్యాంకింగ్
- సెంటర్ ఆఫ్ క్వాంటమ్ కంప్యూటింగ్
- సెంటర్ ఆఫ్ డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్ అండ్ ఇన్నోవేషన్

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమశ్రేణి మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ లేదా ఏదేని స్పెషలైజేషన్‌తో పీజీ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యరులు గేట్/క్యాట్/జీమ్యాట్/జీఆర్ఈ/సీమ్యాట్/ ఎక్స్ఏటీ/మ్యాట్/ఏటీఎంఏ అర్హత పొంది ఉండాలి. బ్యాంక్‌లు, ఫైనాన్షియల్ సంస్థలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులకు ఈ స్కోర్ అవసరం లేదు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **తరగతులు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.idrbt.ac.in/pgdbt

SCHOLARSHIP ALERT

Goonj Setu Fellowship 2024-25

Description: Goonj Setu Fellowship 2024-25 is an opportunity offered by Goonj, a non-profit organisation to graduates aged between 21 to 30 years by 31st July 2024. This programme provides an opportunity to individuals to develop an understanding about themselves and the larger social ecosystem, the dynamics, innovations, and how small things can bring about significant changes.

Eligibility: Open to applicants between 21 and 30 years as on July 31, 2024, having graduated from a recognised institution by the same date. A basic understanding of English or Hindi and proficiency in Microsoft Office and other relevant computer tools are required.

Prizes & Rewards: A fixed monthly fellowship stipend ranging between 20,000 and 22,000 depending on the city.

Last Date to Apply: 22-04-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/GGSF1

Vardhman Foundation Shakun Oswal

Description: An initiative of Vardhman Textiles Limited that aims to support the educational needs of diploma/ITI students.

Eligibility:
Students studying in any year of diploma/ITI courses after Class 10 and/or 12 are eligible.

- Applicants must have secured at least 50% marks in their Class 10 and/or 12 examination.
- The annual family income of the applicants must be less than or equal to 6,00,000 from all sources.

Prizes & Rewards: 20,000

Last Date to Apply: 20-04-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SOSP1



The Cadence Scholarship Program

Description: Cadence Design Systems Private Limited & Concern India Foundation invites applications from students pursuing undergraduate or postgraduate courses in the Delhi NCR, Bangalore, Pune, or Ahmedabad regions to continue their education.

Eligibility: Open to applicants residing and studying in Delhi NCR, Bangalore, Pune, or Ahmedabad (Indian nationals only) pursuing undergraduate and postgraduate courses.

Prizes & Rewards: Financial support for key educational expenses

Last Date to Apply: 30-05-2024

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/TCSP4

buddy4study.com

లిటిల్స్



మీకు తెలుసా?

- నల్లగా, పొడవైన కొమ్ములు వెనక్కి తిరిగి ఉండే ఈ జింకను 'సాబుల్ యాంటెలోపే' అని పిలుస్తారు. ఇదో పెద్ద జింక.
- పొడవు 190 నుంచి 225 సెం.మీ. ఉంటాయి. ఎత్తు 117 నుంచి 140 సెం.మీ. వరకూ ఉంటాయి.
- వీటి బరువు 220 కేజీలనుంచి 235 కేజీలు.
- పగలు మాత్రమే చురుగ్గా ఉంటాయి. ఆకులు, హెర్బ్స్, గడ్డినే ఎక్కువ ఇష్టపడతాయి.





- బోట్స్‌వానా, నమీబియా, దక్షిణాఫ్రికా, కెన్యా, టాంజానియా దేశాల్లోని పచ్చిక మైదానాల్లో ఉంటాయి.
- ఇవి గుంపుగా ఉంటాయి. ఒక్కో గుంపులో 15 నుంచి 30 జంతువులు ఉంటాయి. వీటిలో ఆడ జంతువే లీడర్.
- గంటకు 70 కి.మీ. వేగంతో పరిగెత్తుతాయి.
- పులులు, సింహాలు, మనుషులతోనే వీటికి హాని జరుగుతుంది. అయితే వీటి పొడవైన కొమ్ముల వల్ల శత్రువులు ప్రాణాలు కూడా కోల్పోతుంటారు. అంత పదునుగా ఉంటాయి వీటి కొమ్ములు.
- ఇవి ఆఫ్రికాలోనే అతి పెద్ద జింకలు. ఇవి ఆకాశం వైపు చూస్తూ అరుస్తుంటే వాటి కొమ్ములు తోక దగ్గర టచ్ అవుతాయి. అంటే ఆ కొమ్ముల పొడవును అర్థం చేసుకోవచ్చు.
- దాదాపు 11 దేశాల్లో 50 వేలకు పైగా ఈ జంతువులు ఉన్నాయి.
- ఇవి 17 నుంచి 19 సంవత్సరాలు జీవిస్తాయి.

ఏవి ఎన్ని?



10 తేడాలు గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 271

		4	8					1
8		1		4			9	
	6			3				
		6	9					
	3	2				5	7	
					7	3		
				8			2	
	5			6		8		7
2					1	4		

సుడోకు - 270 సమాధానం

9	3	2	1	6	8	4	7	5
8	7	6	5	4	9	1	3	2
1	5	4	2	7	3	6	8	9
2	1	3	6	9	7	5	4	8
6	4	5	3	8	1	9	2	7
7	9	8	4	2	5	3	6	1
3	8	7	9	1	6	2	5	4
4	6	1	7	5	2	8	9	3
5	2	9	8	3	4	7	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.